ఆర్షవిద్యా తరంగిణి


Inspired by the teachings of

**SWAMI PARAMARTHANANDAJI**

# MUNDAKOPANISHAD

# ముండకోపనిషత్

## స్వామి పరమార్థానంద



ఏకం,నిత్యం,సారం,సత్యం - కారణం బ్రహ్మ

అనేకం, అనిత్యం, అసారం, అసత్యం - కార్యం జగత్తు

స్వామి పరమార్థానంద బోధనల స్ఫూర్తితో
వారి ఆశీస్సులతో

**తెలుగు సేత - మద్దూరి / కస్తూరి రాజ్యశ్రీ**

Book Title - MUNDAKOPANISHAD
Second edition - December 2020 1000 copies

For Copies
Arsha Vidya Tarangini
K V Raghava Rao
C - 804 Aparna Cyberzon
Nallagandla, Hyderabad 500019
Mobile: 9849092368
Email: raghavkasturi@gmail.com
for softcopy www.telugubhakti.com

Sanskrit Support: Desu Chaitanya Krishna

Printed at
Sai Sri Printers
8-3-945 # 21
Pancom Business Centre,
Ameerpet
Hyderabad --500073

e-mail : saisriprinters@yahoo.com
Ph.No.040-23730222,Cell:9985530222

Price Rs. 200 = 00

# కృతజ్ఞతలు

**శ్రీమతి కావలిపురపు సూర్యకుమారి గారి** నేతృత్వంలో **ఆర్ష ఆనంద్ కుటీర్** రూపు దిద్దుకుని ఆ సభ్యులందరూ వేదాంత శాస్త్రమైన భగవద్గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలలో అపరోక్షజ్ఞానం పొందేలా చేసింది.

**ఆర్ష ఆనంద్ కుటీర్ సభ్యులు** రోజూ ఒక కుటీరంలో ప్రశాంతంగా కూర్చుని, గడిచిన వారంలోని వేదాంత అంశాలను, **శ్రీపిరాట్ల వెంకట సుబ్రహ్మణ్య సత్యనారాయణ శాస్త్రి గారి** పర్యవేక్షణలో మననం చేసుకుంటూ ఎంతో ఉన్నతిని సాధించారు.

ఇక **శ్రీమతి ఉయ్యూరు సాయిలక్ష్మి గారు,** పురాణ గ్రంథాలకు వివరణ చెపుతూ కుటీర్ సభ్యులను సన్మార్గము వైపుకు నడిపించారు. మా వేదాంత తరగతులకు ఒక్కరోజు కూడా మానకుండా హాజరవుతారు.

**ఆర్ష ఆనంద్ కుటీర్ సభ్యులకు** వేదాంతము మీద మక్కువ ఎక్కువ, వీరు నిస్వార్థ సేవాతత్పరులు, మహాదాతలు

**ఆర్ష ఆనంద్ కుటీర్ సభ్యులు**

**ముండకోపనిషత్** (ద్వితీయ ముద్రణ) పుస్తకప్రచురణ అనే ఈ **బ్రహ్మయజ్ఞానికి** ఆర్థిక సహాయాన్ని అందించారు. **ఆర్ష ఆనంద కుటీర్ సభ్యులకు**, వారి కుటుంబ సభ్యులకు ఆయురారోగ్య ఐశ్వర్యాలు, జ్ఞానప్రాప్తి, బ్రహ్మనిష్ఠ కలగాలని ఈశ్వరుణ్ణి వేడుకుంటున్నాము.

**– రాఘవరావు, రాజ్యశ్రీ**

# శ్రీగణపతి ప్రార్థన

ఓం గణానాం త్వా గణపతిగ్ం హవామహే
కవిం కవీనాముపమశ్రవస్తమమ్।
జ్యేష్ఠరాజం బ్రహ్మణాం బ్రహ్మణస్పత ఆ నః
శృణ్వన్నూతిభిస్సీద సాదనమ్॥

ప్రణో దేవీ సరస్వతీ వాజేభిర్వాజినీవతీ ।
ధీనామవిత్ర్యవతు । గణేశాయనమః ।
సరస్వత్యైనమః । శ్రీ గురుభ్యోనమః ।
హరిః ఓమ్ ॥

ఓం శాంతిః శాంతిః శాంతిః॥



# ఋషి వైభవం

**'నాస్యాబ్రహ్మవిత్కులే భవతి,'** 'తన కులములో బ్రహ్మవిదులు కానివారు ఉండరు,' అని ఫలశ్రుతిని వినిపిస్తుంది ముండక శ్రుతి. ఏమిటా కులం? అదే గురుకులం... అధ్యాత్మ గురుకులం... బ్రహ్మవిద్యా గురుకులం. ప్రపంచవ్యాప్తంగా జిజ్ఞాసువుల ఆర్తిని తీర్చుతూ, ఈ ఆధునిక తరానికి తగ్గట్లు – ఆశ్రమజీవనం, సద్గురు సాన్నిధ్యం, సంప్రదాయ రీతిలో శాస్త్రీయ బోధ అనుగ్రహించే గురుకులాలను అనితరసాధ్యంగా, తమ విద్యాతపస్సుల సారంగా అందించిన ఏకైక ఆచార్యులు పరమపూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ దయానంద సరస్వతీ స్వామివారు. నేరుగా వారి ముఖపద్మం నుండి జాలు వారిన జ్ఞానగంగలో పునీతులై, ఆర్షవిద్యా గురుకులంలో సుశిక్షితులైన వందలాది ఆచార్యులు నేడు విశ్వమంతటా శాస్త్రీయంగా అధ్యాత్మవిద్యను ప్రచారం చేస్తున్నారు. వారిలో ఎంతో మన్ననలు పొందిన ఆచార్యులు పూజ్య శ్రీ పరమార్థానంద స్వామివారు. ముండకోపనిషత్తుపై పరమార్థానంద స్వామివారి ప్రవచనాలను శ్రీమతి రాజ్యశ్రీగారు తెలుగులో పుస్తకరూపంలో అందించడం సంతోషకరం.


మన మహర్షుల లోతైన జ్ఞానానికి, హృదయ సౌందర్యానికి, విశాలభావాలకు, అన్నింటికీ మించి సర్వాత్మభావానికి చక్కటి ప్రతిరూపం అథర్వణ వేదాంతర్గతమైన ముండకోపనిషత్తు. నేడు మనమూ బ్రహ్మవిద్యను అందుకోవడానికి ఆధారమైన ఈ గురు శిష్య పరంపరకు మూలాన్ని వివరిస్తూ మొదలవుతుంది ముండకం. ముండకమన్న పేరు సన్న్యాసాన్ని సూచిస్తూ ఉన్నా ఈ బోధ వెలువడింది మాత్రం ఒక గొప్ప గృహస్థుడైన (మహాశాలః) శౌనకుడి ప్రశ్నకు సమాధానంగా. సన్న్యాసం – కేవలమొక లౌకిక ఆచారంకాదు, లోకాన్ని గురించిన నిజాన్ని గుర్తించిన అంతర్యపు పరిపక్వత. 'ఏది తెలుసుకుంటే అంతా తెలుస్తుందో చెప్పు'మని అడిగిన శిష్యుడికి ఆ పరావిద్యతో పాటు అందరికీ అవసరమైన అపరా విద్యలను గురించి కూడా వివరిస్తాడు ఆచార్యుడు. లోకంలో వ్యక్తి చేయవలసింది చెప్పి,

కోరికలు తీర్చుకోవడానికి సరియైన దారి చూపేది అపరావిద్య కాగా, ఆ లోకము, వ్యక్తుల నిజస్వరూపాన్ని గురించి చెప్పేది పరావిద్య.

ఇలా పరావిద్య అయిన బ్రహ్మవిద్య ఇతర విద్యలకంటే ఎలా విభిన్నమైనదో చక్కగా చెప్పి, దానిని ఎవరు పొందగలరో, ఏం చేస్తే అది అందుతుందో, ఏం చేస్తే అందదో వివరాలతో విషయాన్ని సమగ్రంగా ముందుంచడం ఈ ముండకోపనిషత్తుకు ఒక ప్రత్యేకత. దీనితోపాటు లోతైన ఆ విషయాన్ని గుండెకు హత్తుకునేటట్లు, తేలిక మాటలతో, కవితాశైలిలో, ముచ్చటైన ఉపమానాలతో ముందుంచడం మరో ప్రత్యేకత. మచ్చుకు రెండవ ముండకం రెండవ ఖండంలో 'ఉపనిషత్తుల జ్ఞానమనే గొప్ప ధనుస్సుపై, ఉపాసనతో పదును పెట్టబడిన బాణాన్ని బ్రహ్మభావనతో ఎక్కు పెట్టి లాగి అక్షర తత్త్వమే లక్ష్యంగా భేదించు,' అంటాడు ఆచార్యుడు. ఇటువంటి స్ఫూర్తినిచ్చే సందేశాలు ఇందులో ఎన్నో ఉన్నాయి. ఇక మనం ఈనోటా, ఆనోటా వింటూ ఉండే **'సత్యమేవ జయతి,' 'బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి,'** వంటి మాటలు ఈ ఉపనిషత్తు ప్రసాదించినవే.

పూజ్యశ్రీ పరమార్థానంద స్వామి బోధలను అనువదించిన శ్రీమతి రాజ్యశ్రీ గారు కూడ పూజ్య గురుదేవుల బోధలను చక్కగా గ్రహించిన వారు కావడం వల్ల ఇంతటి గంభీరమైన విషయాన్ని కూడ తేలికైన మాటలతో చక్కగా అనువదించగలిగారు. వారిపై పూజ్యగురుదేవుల ఆశీస్సులు సంపూర్ణంగా వర్షించాలని ప్రార్థిస్తూ సాధకులందరూ ఈ పుస్తకంతో ఎంతో లబ్ధి పొందగలరని ఆశిస్తున్నాను.

**ఇతి శమ్**



**స్వామి పరిపూర్ణానంద**

# దయానందరూపం మదాచార్యమీడే

**చైతన్యః శాశ్వతః శాంతో వ్యోమాతీతో నిరంజనః।**
**బిందునాద కలాతీతః తస్మై శ్రీ గురవే నమః॥** – **శ్రీ గురుస్తోత్రమ్**

ఈ గురుస్తోత్రం తెలియని వారుండరు అనటంలో అతిశయోక్తి లేదు. కాని దీని వెనుకనున్న విశేషం ఎంతమందికి తెలుసన్నదే ప్రశ్న. ఎందరో స్వామీజీలను ఆచార్యులుగా తీర్చిదిద్ది, వారందరి మన్ననలందుకుంటూ, పూజ్యస్వామీజీగా కీర్తిగాంచిన శ్రీ దయానందస్వామి ఏర్చి, కూర్చి రాగం కట్టిన స్తోత్రం ఇది. వారు, ఆయన గురువుగారు చిన్మయానందగారి దగ్గర ఉండగా ఒక సందర్భంలో గురుగీత నుంచి తన గురువు మీద తన భక్తి చాటుకోవటానికి కొన్ని శ్లోకాలను ఎంపిక చేశారు. దీన్నిబట్టే మన సంప్రదాయం ఎలా గురు పరంపరగా వస్తోందో తెలుస్తోంది.

అద్వైత వేదాంతాన్ని ఒక మూడేళ్ళ కోర్సుగా తీర్చిదిద్ది, హృషీకేష్‌లోనూ, ఆనైకట్టి లోనూ ఎందరికో బోధించే ఏర్పాటు చేశారు. 'శంకరాచార్యులు తన శిష్యులకు బోధించటమే కాకుండా, తన భాష్యాల ద్వారా మన ఆధ్యాత్మిక గ్రంథాలను చిరస్థాయిగా నిలిచిపోయేలా చేశారు,' అన్నారు పూజ్య స్వామీజీ. శంకరాచార్యులు ఉపనిషత్తులకు ఇచ్చిన భాష్యాలు ఇప్పటికీ మనం నేర్చుకోగలుగుతున్నామంటే, దీనికి మూలపురుషులు శ్రీ దయానంద సరస్వతి స్వామీజీ. ఎన్నో పురాణ గ్రంథాలు, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాల మీద పూజ్యస్వామీజీ చేసిన బోధలు క్యాసెట్ల రూపంలోనూ, పుస్తక రూపంలోనూ అందుబాటులో ఉన్నాయి. పూజ్యస్వామీజీ బోధలోంచి కొన్ని అంశాలను ఈ గ్రంథంలో పొందుపరిచాను.

పూజ్యస్వామీజీ ఒక వ్యక్తి కాదు. ఒక విశ్వవిద్యాలయం. ఆయన నుంచి నేర్చుకోవాల్సింది ఎంతైనా ఉంది. ముందుగా ఆయన బోధ విషయానికి వస్తే, ఎంత బాగా చెప్పేవాళ్ళో చెప్పటానికి వీలుకాదు. అంత జటిలమైన ఆత్మజ్ఞానం గురించి నవ్వుతూ, కేరింతలతో చెప్పేవారు. ఆయనే కదిలిపోయి నవ్వేవారు. ఒక చిన్న కుండ, గులాబీ పువ్వు ఎప్పుడూ సిద్ధంగా ఉండేవి తమను ఆయన

దయానందరూపం మదాచార్యమీడే
దృష్టాంతంగా చూపటానికి వీలుగా. ఆయన చెప్పే కాన్సెప్ట్లు అలా మనసులో– దిగిపోవాల్సిందే.

రోడ్డు మీద రుమాలీరోటీ తయారుచేసే వ్యక్తి (అది చేతులతో అభినయం చేసేవాళ్ళు) చేసినట్లుగా దేవుడు మనను తయారుచేసి, పైనుంచి కిందకు పడేయడు అనే వారు. 'ఫేక్ ఇట్ అండ్ మేక్ ఇట్,' అనీ, 'యు ఆర్‌ది ప్రాబ్లమ్, యు ఆర్ ది సొల్యూషన్,' అనీ పదే పదే చెప్పేవారు. చేతిని పైకి లేపి, 'నా చెయ్యికూడా మాట్లాడుతుంది,' అన్నారు. అంతేకాదు, 'నా బుద్ధి, నా నోరు మాత్రమే పనిచేస్తున్నాయ,'ని ఒక సారి అన్నారు. నిజంగా ఆయన ఆరోగ్యం అంతంత మాత్రంగానే ఉన్నా, బుద్ధి ఎప్పుడూ పదునుగానే ఉండేది. ముందు క్లాసులో ఎక్కడ ఆపారో సరిగ్గా అక్కడ్నుంచే రెండో క్లాసులో చెప్పేవారు. ఏదీ తడుముకోవటం కానీ, మర్చిపోవటం కానీ లేదు. అనుకున్న రోజుకి, అనుకున్న అంశం చాలా చక్కగా ముగింపుకు వచ్చేది. జీవితమొక నాటక రంగం, అందులో మనమంతా పాత్రధారులం మాత్రమే అన్న సూత్రాన్ని బాగా రంగరించి పోయటమేకాక, మాకు దీనిలో పరీక్ష కూడా పెట్టారు.

రాత్రి సత్సంగం ఉండేది. మేము వేసే ప్రశ్నలకు ఆయన జవాబులు చెప్పేవారు. ఐదు నిముషాల ముందు ప్రశ్నలు ముగిసినా, ఆయన క్లాసు ముగిసేది కాదు. ఒక భజన అందుకుని, గొంతెత్తి పాడేవారు.

తన చివరి శ్వాస వరకూ బోధిస్తూనే ఉండాలన్నది తన కోరికగా చెప్పుకున్నారు. అలాగే ఆయన సిద్ధి పొందే ముందు మూడు రోజులు అక్కడ చేరిన ప్రముఖులకూ, శిష్య బృందానికీ ఉపదేశాలు చేశారట. ఆత్మజ్ఞానం పొందిన వ్యక్తి ముందు జీవన్ముక్తి, తరువాత విదేహముక్తి పొందుతాడు. పూజ్యస్వామీజీ తను తరించటమేకాక, వేలాది మందికి తను చేసిన జ్ఞానబోధ ద్వారా కర్మ ఫలాలనుండి బంధవిముక్తి కలగజేశారు.

**అనేకజన్మసంప్రాప్త కర్మబంధవిదాహినే।**
**ఆత్మజ్ఞానప్రదానేన తస్మై శ్రీ గురవే నమః॥**

**– మద్దూరి / కస్తూరి రాజ్యశ్రీ**

# శ్రోత్రియ బ్రహ్మనిష్ఠా గురువు- స్వామి పరమార్థానంద

**హిరణ్మయే పరే కోశే విరజం బ్రహ్మ నిష్కలమ్।**
**తచ్ఛుభ్రం జ్యోతిషాం జ్యోతిః తద్యదాత్మవిదో విదుః॥**

- ముండకం 2-2-10

ఆత్మ జ్యోతిషాం జ్యోతి! ఎలా? దీని గురించిన ప్రయాణం అంతర్ముఖంగా చేయాలి. అది గురుముఖతః చేయాలి. అనన్య గురువుకోసం గురుషాపింగ్ చేయమంటారు పరమార్థానందస్వామి. కాని ఈ పుస్తకం మీ చేతికి వస్తే మీకు పరోక్షంగా అనన్య గురువు దొరికినట్టే! ఆయన ఆంగ్లంలో చేసిన బోధను ఆధారంగా చేసుకుని తెలుగులో రాసిన ఈ గ్రంథంలో స్వామీజీ బోధ యథాతథంగా ఉంది.

పరమార్థానంద స్వామి స్వయంగా మన చేయి పట్టుకుని అద్వైత రంగంలో మనను ఒక్కొక్క మెట్టూ పైకెక్కిస్తూ, మనను కప్పిన అజ్ఞానపు పొరలను ఒక్కొక్కటీ తొలగిస్తూ, ఆత్మజ్ఞానం కలగజేస్తారు. ఉపనిషత్తు; కార్య, కారణ సంబంధం; పరావిద్య, అపరావిద్య; శుద్ధ చైతన్యం; సృష్టి ప్రకరణం లాంటి అనేక విషయాల గురించి ఒక్కొక్కటిగా చెప్పింది వింటూ ఆత్మ జ్యోతిషాం జ్యోతి అన్న ఈ మంత్రం దగ్గరికి వచ్చేసరికి, అది అర్థమయ్యాక మనకు కలిగే ఆనందం ఇంతా అంతా కాదు! ఒక్కసారిగా ఆత్మసాక్షాత్కారం అయినట్టుగా అనిపిస్తుంది. (ఆత్మసాక్షాత్కారం అయింది అనకూడదు. అది ఒక అనుభవం కాదు అని స్వామీజీ పదే పదే చెబుతారు) అంటే ఆత్మ అజ్ఞానం తొలగి ఆత్మజ్ఞానం కలుగుతుంది.

పరమార్థానంద స్వామి బోధ ఎందుకంత ప్రత్యేకతగా ఉంటుంది? దీనికి కొన్ని కారణాలు చూద్దాము.

1. ఉపనిషత్తు గురుశిష్యుల సంవాదంగా సాగుతుంది. స్వామీజీ కూడా అడుగడుగునా ప్రశ్నలు వేస్తూ, దీనికి జవాబులు చెప్తూ వస్తారు. పరమాత్మనుచూడటం ఎలా? ఇంద్రియాలు ఎలా పనిచేస్తున్నాయి?

2. అలా ప్రశ్నలు వేస్తున్నప్పుడు, మనలో రేగే సంశయాలను ఆయనే ఊహించుకుని చెపుతారు. ఒక్కోసారి ఇక్కడ మీకు అనుమానం రావాలి. రాకపోతే నేనే మీకు సంశయం కలిగిస్తా అని చెప్పి మరీ ప్రశ్నలు వేస్తారు.

3. ఒక విషయం చెప్తున్నప్పుడు, అది ఇలా చెప్పాలి, అలా చెప్పకూడదు అని చెబుతారు. కార్యం లేకపోతే కారణత్వం లేదు (కారణం లేదు అనకూడదు).

4. ఏవిద్య నేర్చుకోవాలన్నా కూడా శిష్యుడు నాకు తెలుసు అనుకోకూడదు. అలాగే గురువు శిష్యునికి తెలుసు అనుకోకూడదు. పరమార్థానంద స్వామి ఈ సూత్రానికి ప్రతీక. ఏదీ మనకు తెలుసులే అనుకుని వదిలేయరు. తస్మాత్ అంటే ఆయన్నుంచే, ఎవరి నుంచి అని అడిగి మరీ, ఆ పదం వచ్చిన ప్రతిసారీ చెబుతారు. అలాగే అథ అంటే తర్వాత, దేని తరువాత అని ప్రశ్న వేసి, జవాబు చెబుతారు.

5. సాధన చతుష్టయ సంపత్తి, కార్యకారణ సంబంధం, కాంతి – చేయిల విశ్లేషణ, కర్మసిద్ధాంతం, శుద్ధ చైతన్యం లక్షణాలు, కాన్సెప్టులు ఉపనిషత్తు పూర్తి అయ్యేలోపల పదే పదే వస్తాయి. అవి వచ్చినప్పుడల్లా మళ్ళీ మళ్ళీ విడమర్చి చెప్పేవారు. పైగా మీకు గుర్తుంటుందని నాకు తెలుసు, నేను గుర్తు తెచ్చుకుంటున్నానని అంటారు. దాని వెనుక అసలు కారణం వేరే ఉంది. ఉపనిషత్తు గురించి చెప్పేది ప్రసంగం కాదు. అది విలక్షణమైన బోధ. బోధలో విషయం లోతుగా అర్థమవటానికి పదే పదే చెప్పాల్సి ఉంటుంది. దీన్ని పునరుక్తి దోషంగా తీసుకోకూడదు.

6. ఒక విషయం గురించి 5, 6 అంశాలు చెప్పాల్సి ఉంటే ముందు వాటి పేర్లు చెప్పేసి, నేను మళ్ళీ వివరంగా చెప్తాను, ఖంగారు పడకండి అంటారు. మళ్ళీ 5, 6 విడమర్చి చెప్పేటప్పుడు మూడు అంశాలు చెప్పి, మళ్ళీ వెనక్కి వెళ్ళి మళ్ళీ ముందుకొచ్చి, అంతా అయ్యాక మళ్ళీ ఒకసారి చెప్తారు.

7. ముందు రోజు చెప్పిన పాఠాన్ని సరిగ్గా పదినిముషాల్లో మళ్ళీ టూకీగా చెపుతారు.

ఇలా చెప్పుకుంటూ పోతే, ఇంకా ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి.

ఒక్క ముక్కలో చెప్పాలంటే, సమర్థవంతమైన గురువు చెపితే మనం వద్దనుకున్నా అర్థమయిపోతుందని స్వామీజీ చెప్పిన మాట ఆయనకే అక్షరాలా సరిపోతుంది. ఆయన బోధే కాదు, వ్యక్తిత్వం కూడా విశేషమైనది. మేమిలా తెలుగులో ఉపనిషత్తులను ప్రచురిస్తున్నామని చెపితే (ఇది మూడో పుస్తకం) మనసారా అభినందించి, ప్రోత్సహించారు. ఇది చదివిన మీరు స్వయంగా స్వామీజీ బోధలనే వినాలని ఆశిస్తున్నాం. స్వామీజీ దీవెనల వల్ల ఇది పునర్ముద్రణకు వచ్చింది.

సబ్జెక్టు జటిలమైనది కాబట్టి, సరళమైన భాషలో రాయటం జరిగింది. స్వామీజీ బాణీలోనే, కొన్ని కాన్సెప్టులను మళ్ళీ మళ్ళీ చెప్పటమూ జరిగింది. వాటికి క్షంతవ్యులము. ఆయన బోధలు ఇలా తెలుగులోకి తీసుకురాగలిగినందుకు నా జన్మ ధన్యమైనట్టుగా భావిస్తున్నాను. మీక్కూడా నిశ్చయ జ్ఞానం కలుగుతుందని నేను ఖచ్చితంగా మరీ చెప్పగలను.

నమో నమః శ్రీ గురుపాదుకాభ్యామ్ ॥

**– మద్దూరి / కస్తూరి రాజ్యశ్రీ**

స్వామి పరమార్థానందగారు చెన్నైలో 30 ఏళ్ళకు పైగా అద్వైతబోధ చేస్తున్నారు. చెన్నైలో ఇంచుమించుగా రోజూ పొద్దున్న, సాయంత్రం నిర్ణీత ప్రదేశాలలో ప్రసంగాలు ఇస్తూనే ఉంటారు. ఏ రోజు ఎక్కడ ఏం చెప్తారన్నది ఆయన వెబ్ సైట్ లో వివరాలు ఉంటాయి. https://www.yogamalika.org తెలుగు భక్తి పేజీలు www.telugubhakti.com అద్వైత విభాగంలో స్వామీ పరమార్థానందగారి ఉపనిషత్ బోధలు – తెలుగులో లిఖిత పూర్వకంగా సాఫ్ట్‌కాపీలు వున్నాయి. ఇంగ్లీషులో కూడ కొన్ని డౌనులోడ్స్ వున్నాయి. ఇవన్నీ ఉచితంగా డౌనులోడు చేసుకోవచ్చు.

# ధన్యవాదములు

**మూకాశ్చ వాచస్పతితాం హి తాభ్యాం।**
**నమో నమః శ్రీ గురుపాదుకాభ్యామ్॥**

మూగవాడిని వాచస్పతి చేసిన గురువు పాదాలకు నమస్సులు! ఎంత అక్షర సత్యం! ఆర్షవిద్యా తరంగాలు – 3 పేరిట ముండకోపనిషత్తుకు అక్షర రూపం ఇవ్వగలిగానంటే ఎందరో స్వామీజీలు చేసిన బోధనల స్ఫూర్తి. ఇది ప్రధానంగా పరమార్థానంద స్వామి ఆంగ్లంలో చేసిన బోధ ఆధారంగా రాయటం జరిగింది. ఆయనకు నా ప్రత్యేక కృతజ్ఞతలు. అంతే కాకుండా, పూజ్య దయానంద సరస్వతి స్వామీజీ, శంకరభాష్యం ఆధారంగా చేసిన బోధ లోంచి కొన్ని అంశాలను ఈ పుస్తకంలో చొప్పించాను. అందుకు ఆ ఇద్దరు స్వామీజీలకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

ఆత్మలీనానంద స్వామిని, సత్యవ్రతానందస్వామిని, తత్త్వవిదానంద స్వామి, పరిపూర్ణానందస్వామి, మేధానందపురి స్వామి, సర్వప్రియానందస్వామిల బోధలు కూడా వింటుంటాము. వారందరికీ కూడా ధన్యవాదాలు చెప్పుకుంటున్నాను. అశేష జనాదరణ పొందుతున్న శ్రీశ్రీశ్రీ పరిపూర్ణానంద స్వామి మా విన్నపాన్ని మన్నించి ఈ గ్రంథానికి ముందు మాట రాసి ఇచ్చారు. ఆయనకు మా కృతజ్ఞతలు. ఈ స్వామికి మమ్మల్ని పరిచయం చేసిన మా మిత్రులు శ్రీపీఠం సంపాదకులు శ్రీకృష్ణారావుగారికి కృతజ్ఞతలు.

వీరందరితోపాటు నాకు ప్రత్యక్ష గురువు, మావారు శ్రీ రాఘవరావు. 'భావం నాది, భాష నీది' అని ఒకప్పుడు నా చేత కథలు రాయిస్తే, ఇప్పుడు తెలుగులో సులభశైలిలో ఉపనిషత్తులు రాస్తే అందరికీ అందుబాటులో ఉంటాయని, ఈ బ్రహ్మయజ్ఞానికి శ్రీకారం చుట్టించారు. రాయించటమేకాక, ఈ పుస్తకానికి సర్వాలంకరణ చేసినా, ప్రతిసారీ నా పేరెందుకు అనే మా శ్రీవారికి కృతజ్ఞతలు.

ధన్యవాదములు

సంస్కృత భాగంలో ఉన్న లోటుపాట్లను శ్రద్ధగా సంస్కరించి పెట్టిన శ్రీ ఏ.జీ. హరనాథబాబుగారికి, శ్రీ దేసు చైతన్యకృష్ణగారికి కృతజ్ఞతలు. మా ఆప్తమిత్రులు శ్రీమతి అరుణాయశోదగారు, శ్రీ విష్ణుప్రసాద్‌గారు, శ్రీ తిరుమలశెట్టి రామమోహనరావుగారు, శ్రీ గరికపాటి సత్యనారాయణమూర్తిగారు, శ్రీ వై.యస్. రావుగారు ఈ పుస్తకం మీద సద్విమర్శలు చేసి, కొన్ని సూచనలు ఇచ్చి, ముద్రారాక్షసాలు లేకుండా దిద్దిపెట్టినందుకు వారికి ధన్యవాదాలు చెప్పుకుంటున్నాను. మా ఆర్ష ఆనంద్ కుటీర్ సత్సంగ సభ్యుల్లో శ్రీ పి.వి.యస్.యస్ శాస్త్రిగారు కూడా ప్రూఫ్‌రీడింగ్ చేసి పెట్టారు. ఆయనకు కూడా ధన్యవాదాలు. మా శ్రేయోభిలాషి మా కాలేజీ సెక్రటరీ శ్రీమతి సూర్యకుమారిగారికి ధన్యవాదాలు. మేము బోధ చేస్తున్న దయాసత్సంగ్ సభ్యులకూ,ఆర్ష ఆనంద కుటీర్ సభ్యులకూ వారు మామీద చూపిన ఆదరాభిమానాలకు ధన్యవాదాలు. మాకు అనేక రకాలుగా సహాయం అందిస్తున్న శ్రీ శ్రీనివాసరాజుగారికి కృతజ్ఞతలు. దయా సత్సంగ్ సభ్యుల తరఫున మా మీద స్పందన రాసిన శ్రీమతి పొత్తపు జయలక్ష్మిగారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

ఇంతకు ముందు మాచే ప్రచురించబడిన అద్వైత వేదాంత పరిచయమును, ఉపనిషత్తులను, ప్రకరణాలను చదివి, అభినందించిన స్వామీజీలు, హితులు, మిత్రులు, శ్రేయోభిలాషులు అందరికీ కృతజ్ఞతలు. ప్రత్యేకంగా శ్రీ మొగిలి వెంకట సుబ్బయ్యగారికి కృతజ్ఞతలు. ఈ పుస్తకానికి డి.టి.పి. వర్క్ చేసిన శ్రీమతి శ్యామలగారికి, ప్రెస్ పనులుచేసిన శ్రీ కుర్రా రవిగారికి కృతజ్ఞతలు.

చాలా సరళమైన భాషలో జటిలమైన విషయం చెప్పావు అన్న మా అమ్మలాంటి అక్క మీనాకు, కస్తూరి వారి పేరు నిలబెదుతున్నావని మెచ్చుకున్న మా పిన్నత్తగారు శ్రీమతి కస్తూరి సత్యవతిగారికి ధన్యవాదాలు.

సర్వమ్ ఈశ్వరార్పణమస్తు

**మద్దూరి / కస్తూరి రాజ్యశ్రీ**

# దయాసత్సంగ్ సభ్యుల స్పందన

**సదాశివసమారమ్భామ్। శఙ్కరాచార్యమధ్యమామ్।**
**అస్మదాచార్యపర్యన్తామ్। వన్దే గురుపరమ్పరామ్॥**
**హరిః ఓం శ్రీ గురుభ్యోనమః హరిః ఓం**

మా దయాసత్సంగ్ సభ్యులకు దొరికిన డబుల్ ధమాకా ఏమిటంటే శ్రీరమామణి అమ్మగారు బ్రహ్మైక్యం చెందాక గురువులేని జీవితము ఎలాగా అని అనుకుంటూ తపన పడుతున్న సమయంలో, సుమిత్రగారికి యాదృచ్ఛికంగా, 'మీరు వేదాంత క్లాసులకి వెళతారట కదా, మేము వేదాంత క్లాసులు చెపుతున్నాము. ఇంటరెస్టు ఉన్నవారు రండి,' అని పూజ్య దయానందసరస్వతి స్వామీజీవారి గురుపరంపరలోని వారైన గురు దంపతులు శ్రీరాఘవరావుగారు, శ్రీమతి రాజ్యశ్రీ అమ్మ గార్లనుండి మాకు ఆహ్వానము రావటం మా అదృష్టము.

ఆత్మవిద్య నేర్చుకోవాలనే తపన ఉన్నవారికి గురువులు వారంత వారే లభిస్తారు అన్నదానికి ఇదే నిదర్శనం. రమామణి అమ్మగారు కూడా మీకు ముందు ముందు దయానంద సరస్వతి సంప్రదాయం లోని వారే గురువులుగా దొరుకుతారు అనేవారు. అలాగే మాకు ఈ గురుదంపతులు దొరికారు. మా సత్సంగం అమీర్‌పేటలో ఉంది. గురువులు ఇక్కడనుండి నల్లగండ్లకు మారిపోయినప్పుడు, అయ్యో అంతదూరం వెళిపోతున్నారు. మన క్లాసులు ఎలాగా అనుకుంటూంటే, మీరేమి భాదపడవద్దు మేమే వారానికి రెండు సార్లు వచ్చి క్లాసులు తీసుకుంటామని చెప్పారు.

అసంపూర్ణులుగా సత్సంగానికి వచ్చిన మమల్ని పరిపూర్ణులుగా తీర్చిదిద్దుతున్నారు. ప్రస్థానత్రయమైన భగవద్గీత (శంకరభాష్యం), ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు బోధిస్తున్నారు. బ్రహ్మసూత్రాలు పిహెచ్‌డి స్థాయివి అన్నారు. అమ్మగారు అలాంటి బ్రహ్మసూత్రాలు సులభతరంగా చేసి నేర్పించి, మాతో మళ్ళీ చెప్పించి, ఎంతో ఆనంద పడుతున్నారు.

గురుదంపతులకు గురువుగారైన పరమార్థానందవారి బోధలను, సరళంగా బోధించి, తెలుగులో అందరికీ అర్థమయ్యే వ్యవహార భాషలో పుస్తకరూపంగా కూడా మాకు అందజేస్తున్నారు.

దయాసత్సంగ్ సభ్యుల స్పందన

ప్రపంచమంతా కరోనాతో భయపడుతున్న విపత్కర పరిస్థితిల్లో కూడా ఎటువంటి అంతరాయము లేకుండా, నిరంతరంగా వారి వేదాంత బోధలు మాకు బోధించాలన్న తపనతో, వారానికి నాలుగు రోజులు ఎంతో శ్రద్ధతో, ఆన్‌లైన్ క్లాసులు జరుపుతున్నారు.

ఆన్‌లైన్ క్లాసులవల్ల, త్రివేణి సంగమంలాగ మూడు సత్సంగాలు సంగమం అయి, ఒకేసారి వినే అవకాశం ఏర్పడింది. ఇంతై ఇంతింతై వటుడింతై అన్నట్లు ఒకరి ద్వారా ఒకరు అలా ఆర్షవిద్యాతరంగాల గ్రూప్‌లో చేరే సభ్యుల సంఖ్య కూడా పెరిగింది. విదేశాల్లో ఉన్నవాళ్ళకు కూడా వేదాంతబోధలు వినే భాగ్యం కలుగజేస్తున్నారు. ఈ దంపతుల ప్రత్యేకత ఇదే. ఇటువంటి గురుదంపతులు దొరకటము, మేము ఏ జన్మలోనో చేసుకున్న పుణ్యఫలము.

ఋషుల అనుభవపూర్వకమైన సత్యాలే ఉపనిషత్తులు. ముండకోపనిషత్తు అథర్వణవేదమునందు చోటుచేసుకుంది. ముండకం అనేది ఒక శిరోవ్రతం. గురువు దగ్గరికి మండుతున్న పాత్ర తీసుకుని వెళ్ళాలి. అది శిష్యునిలో మండే కోరికకి ప్రతీక. అన్ని ఉపనిషత్తులకు ఆయువుపట్టు ఈ మంత్రం–

**పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో నిర్వేదమాయాన్నాస్త్యకృతః కృతేన।**
**తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్ సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్॥**

అనిత్యమైన కర్మల వల్ల నిత్యమైన మోక్షాన్ని పొందలేము. నిర్దోష పురుషార్థాన్ని ఎలా కనుక్కోవాలి? జ్ఞానమార్గం ద్వారా కనుక్కోవాలి. మనం స్వప్నంలో ఉన్నంతసేపూ అదే నిజమని అనుకుంటాము. స్వప్నం నుంచి బయటకి వచ్చాకే ఆ స్వప్న ప్రపంచాన్ని నేనే సృష్టించానని తెలుసుకుంటాము. అలాగే ఇప్పుడు జాగృద్ ప్రపంచంలో భ్రమలో ఉన్నాము. జీవుడు, జగత్, ఈశ్వరుడు వేరు అనుకుని జగత్తు మనను బాధిస్తోందనుకుని ఈశ్వరునికి మొరపెట్టుకుంటున్నాము. నేనే ఆ పరమాత్మను, నా అసలు స్వరూపాన్ని మర్చిపోయి నా జీవితాన్ని భారంగా చేసుకుంటున్నాను. ఏక, నిత్య, సార, సత్య కారణంబ్రహ్మ అనేక, అనిత్య, అసార, అసత్య, కార్యప్రపంచంలో భాసిల్లుతున్నాడు. ఈ మిథ్యాజగత్ నుంచి సత్య అధిష్ఠాన చైతన్యం వైపుకి దృష్టి మరల్చటమే జ్ఞాననిష్ఠ.

ఈ జ్ఞానయజ్ఞము మరెంతో వర్ధిలేటట్లు చేసే శక్తిని, ఆయురారోగ్యాలను మా గురుదంపతులిద్దరికి ప్రసాదించమని ఆ పరమేశ్వరుని ప్రార్థిస్తున్నాను.

దయాసత్సంగ్ సభ్యుల తరఫున–

**పొత్తపు జయలక్ష్మి**

# ముండకోపనిషత్ విషయసూచిక


| వరుస సంఖ్య | విషయము | పుట సంఖ్య |
|---|---|---|
| 1. | కృతజ్ఞతలు | 3 |
| 2. | ఋషి వైభవం | 5 |
| 3. | దయానందరూపం మదాచార్యమీడే | 7 |
| 4. | శ్రోత్రియ బ్రహ్మనిష్ఠా గురువు– స్వామిపరమార్థానంద | 9 |
| 5. | ధన్యవాదములు | 12 |
| 6. | దయాసత్సంగ్ సభ్యుల స్పందన | 14 |
| 7. | ఉపోద్ఘాతం | 17 |
| 8. | ముండకం – 01 ఖండం – 01 | 31 |
| 9. | ముండకం – 01 ఖండం – 02 | 65 |
| 10. | ముండకం – 02 ఖండం – 01 | 105 |
| 11. | ముండకం – 02 ఖండం – 02 | 135 |
| 12. | ముండకం – 03 ఖండం – 01 | 181 |
| 13. | ముండకం – 03 ఖండం – 02 | 215 |

# ముండకోపనిషత్

## ఉపోద్ఘాతం

**సదాశివసమారమ్భామ్। శఙ్కరాచార్యమధ్యమామ్।**
**అస్మదాచార్యపర్యన్తామ్। వన్దే గురుపరమ్పరామ్॥**

మన సంప్రదాయం, మన సిద్ధాంతం వేదం మీద ఆధారపడి ఉంది. వేదం మన ప్రాథమిక శాస్త్రం. దీని నుంచి వచ్చినవే స్మృతి గ్రంథాలు, పురాణాలు, ఇతిహాసాలు.

వేదాలు నాలుగు – ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణ వేదం. నాలుగు వేదాలూ కలిపి దాదాపు 20,000 మంత్రాలు ఉన్నాయి. వేదాలు అపౌరుషేయం. అంటే మనిషి రచించినవి కావు. స్వయంగా ఆ భగవానుని నుంచి వచ్చాయి. ఋషులు ఆ వేదమంత్రాలను అందుకుని, తక్కిన వారికి అంద జేసారు.

ఋషులు వారికున్న అసాధారణ సాత్త్విక మనసు వల్ల వాటిని అందుకోగలిగారు. డిష్ ఆంటినా లాగా వారు అందుకుని మనకు బోధించారు.

మన ధ్యాన శ్లోకం అర్థం ఇదే.

**సదాశివ సమారంభామ్** – ఆదిగురువయిన ఆ పరమశివుని నుంచి
**శంకరాచార్య మధ్యమామ్** – ఈ బ్రహ్మవిద్యను మధ్యలో అందుకున్న శంకరభగవద్పాదులు
**అస్మదాచార్య పర్యంతామ్** – మనకు అందజేసిన మన గురువులు శ్రీ దయానంద సరస్వతులవారు, శ్రీ పరమార్థానందులవారి వరకు
**వందే గురు పరంపరామ్** – ఈ గురుపరంపరకు మా నమస్కారములు.

వేదాలను రెండుగా విభజించవచ్చు. వేద పూర్వభాగం, వేద అంతభాగం. వేద పూర్వభాగాన్ని కర్మకాండ అని కూడా అంటారు. ఇందులో గృహస్థు చేయాల్సిన ఎన్నో యజ్ఞాలు, యాగాల వివరణ ఉంటుంది. ఉపాసన కూడా వేద పూర్వభాగంలోకే వస్తుంది. కర్మలు ఎలా చేయాలో చెప్తుంది కాబట్టి ఇది కర్మ ప్రధానంగా ఉంటుంది. వేద అంత భాగాన్ని జ్ఞానకాండ అని కూడా అంటారు.

ఇందులో ఆత్మ బోధ వస్తుంది. ఆత్మ గురించిన బోధ ఉంటుంది కాబట్టి ఇది జ్ఞాన ప్రధానంగా ఉంటుంది. రెండూ ముఖ్యమైనవే.

వేద అంతభాగంలోకి వెళ్ళేముందు కర్మకాండ గురించి కొన్ని ముఖ్యమైన అంశాలు చూద్దాము. కర్మకాండలో కర్మత్రయం, ఫలత్రయం, దోషత్రయం ఉంటాయి.

1. **కర్మత్రయం–** మనం వాడే కరణాల దృష్ట్యా మనం చేసే కర్మలు మూడు రకాలుగా ఉంటాయి. వాటిని త్రివిధం కర్మ అంటారు.

| | | |
|---|---|---|
| **ఎ) కాయిక కర్మ** | – శరీరంతో చేసేది – | పూజ, ప్రదక్షిణం, నమస్కారం, తీర్థయాత్ర, యజ్ఞం |
| **బి) వాచిక కర్మ** | – వాక్కుతో చేసేది – | పైకి చేసే జపం, పారాయణం |
| **సి) మానస కర్మ** | – మనసుతో చేసేది – | ధ్యానం |

2. **ఫలత్రయం** – ఏ కర్మ చేసినా, దానికి ఫలం ఉంటుంది. అది దృష్టఫలం కావచ్చు. అదృష్ట ఫలం కావచ్చు.అంటే కనపడే ఫలం, కనపడని ఫలం. ఆ ఫలం పుణ్యం కావచ్చు. పాపం కావచ్చు. ఉదాహరణకు ఆకలితో ఉన్న పేదవానికి అన్నం దానం చేస్తే పుణ్యం వస్తుంది. అది దృష్టఫలంగానూ, అదృష్టఫలంగానూ కూడా వస్తుంది. ఆకలి తీరిన ఆ పేదవాని ముఖంలో కలిగిన ఆనందం, అతను నోరారా మనను దీవించటం – దృష్టఫలం. ఈ మంచి కార్యం చేసినందుకు మన ఖాతాలో కొంత పుణ్యం వచ్చి చేరుతుంది. కాని అతను తినీ తినగానే, 'దుక్కలా ఉన్నావు, పనిచేసుకు బతకలేక, ఇలా ఊరిమీద పడి తింటావెందుకు?' లాంటి దుర్భాషలాడామనుకోండి. అప్పుడు అదృష్టఫలంగా పాపం కొంత వచ్చి చేరుతుంది. అలా ప్రతి కర్మకూ పుణ్యమో, పాపమో ఏదో ఒక ఫలం తెలిసో, తెలియకో చేరుతూ ఉంటుంది. ఆ ఫలాన్ని ఫలత్రయం అన్నారు. మనకు అది అర్థ లేదా కామ లేదా ధర్మ రూపంలో కలుగుతుంది. అంటే మనం చేసే కర్మలు ధర్మార్థకామమోక్షాలనే నాలుగు పురుషార్థాలలో మొదటి మూడింటినీ చేకూరుస్తాయి.

ఎ) **అర్థం –** ముందు కలిగే ఫలం అర్థం. అది ప్రాథమిక ఫలం. అర్థం అంటే అసలు అర్థం డబ్బు. కాని ఇక్కడ డబ్బు ఒక్కటే కాదు. డబ్బు, పదవి, అంతస్తు ఏదైనా కావచ్చు. అంటే భద్రతని చేకూర్చేదేదైనా వస్తుంది దానికింద. ఆవుకూడా ఎండగా ఉంటే భద్రత కోసం నీడని వెతుక్కుంటుంది.

బి) **కామం –** కామం అంటే కోరిక. కోరిక భద్రతనివ్వదు. ఆనందాన్ని కలుగజేస్తుంది. ఉదాహరణకు టీవీ భద్రతనివ్వదు. ఆనందాన్నిస్తుంది. డబ్బు వచ్చాక హోమ్ థియేటర్ కావాలనో, ఏ స్విట్జర్లాండ్‌కో వెళ్ళాలనో కోరుకుంటాము.

సి) **ధర్మం –** దీన్ని పుణ్యం అని కూడా అంటారు. మనం చేసే కర్మలు మనకు పుణ్యాన్నో, పాపాన్నో జమ చేస్తాయని అనుకున్నాం కదా! ఒక వయసు వచ్చాక ధర్మచింతన మొదలవుతుంది. ముందు అర్థ, కామాల వెంటపరుగులు తీసినా, మొదట్లో ధర్మపదంగా చేయాలన్న చింత లేకపోయినా, అంతర్వాణి ఎప్పుడో నిలదీయటం మొదలుపెడుతుంది. ధర్మపరంగా అర్థ, కామాలను సాధించమంటుంది.

ఎప్పుడూ మంచిపనులు చేస్తూ, మంచికి మారుపేరులా ఉండి దైవ చింతనతో కాలం గడుపుతూ, చీమకి కూడా హాని తలపెట్టని వ్యక్తేమో కష్టాల కడలిలో కూరుకుపోయి, దారిద్ర్యం అట్టడుగున ఉంటాడు. మంచి అంటే ఏమిటో తెలియని, దుర్మార్గానికి దుస్తులు తొడిగితే ఇలా ఉంటుందా అనిపించే వ్యక్తి మిలమిల మెరిసే బెంజ్‌కారులో ఊరేగుతూ, అష్టైశ్వర్యాలతో తులతూగుతూ ఉంటాడు. అలా ఎందుకు జరుగుతుంది?

దీనికి జవాబు చెప్పాలంటే, కర్మసిద్ధాంతం అంతా విప్పాల్సి ఉంటుంది. ఒక్కముక్కలో చెప్పాలంటే అది వారి పూర్వజన్మ సుకృతం లేదా దుష్కృతం. వారి ఖాతాలో ఉన్న పుణ్యం లేదా పాపం వారికలాంటి జీవితం ఇస్తుంది. అంతేగాని భగవానుడు తనకు తోచినట్టుగా మనకు పుణ్యమో, పాపమో హెలీకాప్టర్ లోంచి కొంత పడేయడు. ఇవాళ మనం హాయిగా ఉన్నామంటే, మనం పూర్వజన్మలో ఎంతో మంచి చేసుకున్నామన్నమాట.

అలా మనం చేసిన కర్మత్రయం మనకు ఫలత్రయం ఇస్తుంది. ఇది సానుకూలంగా చెప్పిన మాట. వ్యతిరేకంగా చూస్తే మన కర్మత్రయం మనకు ఇచ్చే ఫలత్రయంలో దోషత్రయం ఉంది.

3. **దోషత్రయం –** మూడు రకాల కర్మలు చేస్తే, మూడు రకాల పురుషార్థాలను పొందవచ్చు. అంటే కాయిక, వాచిక, మానసిక కర్మల ద్వారా ధర్మార్థకామాలనే పురుషార్థాలను పొందవచ్చు. ఇవి మనకు శాంతిని, ఆనందాన్ని, భద్రతని, ఇచ్చినట్టు కనబడతాయి. పైకి గులాబీలా అందంగా, ఆకర్షణీయంగా ఉంటాయి. కాని వాటి వెన్నంటే, గులాబీ ముళ్ళలాంటి దోషత్రయాన్ని వెన్నంటి తీసుకువస్తాయి. మూడు కర్మల ఫలాలు పొందినా వాటి వెనుక మూడు దోషాలు ఉన్నాయి.

ఎ) **దుఃఖమిశ్రితత్వం –** ఏ లక్ష్యం సాధించాలన్నా అది ప్రశాంత గోదావరి మీద సాఫీగా సాగే పడవ ప్రయాణం లాంటిది కాదు. ఎంతో ప్రయాసతో కూడింది. ఒకటి సాధించాలంటే ఎన్నో వదులుకోవాలి. ఆఖరికి ఒక స్కూల్లో సీటు సంపాదించాలన్నా, ముందురోజు రాత్రి వెళ్ళి ఆ స్కూలు గేటు ముందు, రోడ్డుమీద తల్లిదండ్రులు పడుకున్న రోజులున్నాయి. ఇంతా కష్టపడి సీటు సంపాదించినా, ఆ అబ్బాయిగానీ, అమ్మాయిగానీ చక్కగా చదివి పైకొస్తారా? ఏమో! పెరుగుట తరుగుట కొరకే అనీ, ఓడలు బళ్ళు అవుతాయనీ మన పెద్దలు అన్నారు.మనం కడుపు కట్టుకొని, కూడబెట్టిన ఆస్తి పదికాలాలు నిలుస్తుందా? నిలవదు! అందుకని ఆనందాన్ని అంటిబెట్టుకుని ఉంటుంది దుఃఖం. ఏ వస్తువూ, ఏ వ్యక్తీ పూర్తిగా ఆనందాన్నివ్వలేవు.

బి) **అతృప్తికరత్వం –** కోరికలు అనంతం అని ఆర్థికశాస్త్రంలో నేర్చుకుంటాము. మన పిల్లలు మనను పది కోరికలు కోరితే, మనం తొమ్మిది తీర్చామనుకోండి. వాళ్ళు దానికి తృప్తిపడతారా? లేదే! తీర్చని పదో కోరిక కోసం బాధపడతారు. పోనీ అని పదీ తీరిస్తే, ఇంకో కోరికతో సిద్ధంగా ఉంటారు.

సి) **బంధకత్వం –** ఒక వ్యక్తి మీద గాని, ఒక వస్తువు మీద గాని ప్రేమ ఉండాలి. నిజమే గానీ, ఆ ప్రేమ మనను కట్టిపడేయకూడదు. సెల్‌ఫోన్ మనకు ఒక పరికరం అంతే. అది మనను 24 గంటలూ దానికే

కట్టిపడేయకూడదు. పెళ్ళిపీటల మీదా, స్మశానంలోనూ సెల్‌ఫోన్ లేందే గడవదు. మనిషికి కావాలి, వద్దు అని చెప్పే స్వేచ్ఛ ఉంది. అది మనిషికి మాత్రమే ఉంది. కాని పూజ్యస్వామీజీ అంటారు మనిషికి వద్దు అనగలిగే స్వేచ్ఛ మొదటిసారి మాత్రమే ఉంది – దేని విషయంలోనైనా సరే. ఉదాహరణకు సిగరెట్టే తీసుకోండి. మొదటి సిగరెట్టు కాల్చనంతవరకూ వద్దు అనగలడు. ఒకసారి అవునంటే ఏమవుతుందిలే అనుకున్నాడో, అయిపోయింది అతని పని. ఎన్నటికీ వద్దు అనలేడు. దానికి బానిస అయిపోతాడు.

ఇంతవరకూ మనం కర్మత్రయం, ఫలత్రయం, దోషత్రయం చూసాము. మనం ఇంకా కర్మకాండలోనే ఉన్నాము. ఈ మూడు దోషాల వల్ల మన పరిస్థితి ఏమిటి? నిరంతరం ఖంగారు, ఆందోళన, ఒత్తిడి, భయం. డబ్బు సంపాదించాలన్న తపన, సంపాదించాక పోతుందేమోనన్న భయం. భయం, భయం. బ్రతుకు భయం. కొంతమందికి ఏ బెంగా లేకపోయినా, నాకు ఏ బెంగా లేదే అని బెంగపడతారు. కొంతమందికి మనసారా నవ్వాలన్నా భయమే. 'బాబోయ్ ఇంతచేటు నవ్వేస్తున్నాను. తరువాత బాగా ఏడవాల్సి వస్తుందేమో,' అని భయపడతారు. అంతచేటు నవ్వాక, కాస్త ఏడిస్తే మాత్రం ఏం? అది వేరే విషయం.

ఇంతకీ జీవితం ఇలా బాధతో, భయంతో, ఆందోళనతో నిండి ఉంది కదా! ఈ బాధ ఎందుకు వచ్చింది? కర్మ చేయటం వల్ల, కర్మచేస్తే కలిగే ఫలం వల్ల, ఆ ఫలం దోషభూయిష్టమైనది కావటం వల్ల. అందుకని కర్మ చేయటం ఎందుకు? బాధపడటం ఎందుకు? కర్మ మానేస్తే పోలా అనుకోకూడదు. లాభం లేదు. అదీ ఆనందాన్నివ్వదు. కర్మ మానేసి సన్యాసం స్వీకరించి హిమాలయాలనే చూసీ చూసీ విసుగుపుడ్తుంది కొందరికి. మనం మెరీనా బీచ్ నుంచి హిమాలయాల దగ్గరకి వెళితే వారు హిమాలయాల నుంచి మెరీనా బీచ్‌కి రావాలని ఉందని అంటారు. జీవితం విసుగ్గా ఉందనీ, పొద్దున్న చపాతీ, పప్పు తింటే, రాత్రి పప్పు, చపాతీ తింటామని చెప్తారు. విసుగుపుడితే వారికి సన్యాసాశ్రమం నుంచి వెనక్కి తిరిగి రావటానికి లేదు.

ఇప్పుడు కర్తగా ఉంటే జీవితం భారంగా ఉంది, అకర్తగా ఉంటే శూన్యంగా అనిపిస్తోంది. మరి ఏం చేయాలి? దానికి వేదాంతం ఒక్కటే జవాబు. వేదాంతం కూడా దానికి ఒక్కటే పరిష్కారం ఉంది అంటుంది. నిన్ను నువ్వు తెలుసుకో.

దీన్నే ఆత్మజ్ఞానం లేదా బ్రహ్మవిద్య అంటారు.

కర్మ చేస్తే భారంగా అనిపించటం, కర్మ చేయకపోతే శూన్యంగా అనిపించటం– ఈ రెండూ వెరసి సంసారం అంటారు. ఆత్మజ్ఞానం పొందితే అన్నది వృత్తి (ఆలోచన) మార్పు. ఆలోచన మార్పు ఇంతకు ముందు చూసిన ఫలదోషాలనుంచి విముక్తులను చేస్తుంది. దుఃఖం, బంధం, అశాశ్వతం అన్న దోషాలను పోగొడుతుంది. ఎప్పుడైతే నేను బంధ విముక్తుడిని అన్న జ్ఞానం కలుగుతుందో అదే మోక్షం. కర్తగా ఉన్నా బాధవేయదు. అకర్తగా మారినా శూన్యభావన కలుగదు.

**నైవ తస్య కృతేనార్థో నాకృతేనేహ కశ్చన।**
**న చాస్య సర్వభూతేషు కశ్చిదర్థవ్యపాశ్రయః॥ గీత: 3 – 18**

అట్టి మహాత్మునికి కర్మ చేసినా, చేయకపోయినా ఎట్టి ప్రయోజనమూ ఉండదు.

నారదులవారికి తెలియని విషయం లేదు. ఎన్నో శాస్త్రాలు నేర్చుకున్నారు. సిద్ధులు ఉన్నాయి, త్రికాలజ్ఞాని–కాని సనత్కుమారుల దగ్గరికి వెళ్ళి –

**తరతి శోకం ఆత్మవిత్ – ఛాందోగ్యం**

ఏ విద్య తెలుసుకుంటే శోకం పోతుందో ఆ విద్య నేర్పించు అని కోరారని ఛాందోగ్య ఉపనిషత్తులో వస్తుంది.

**జ్ఞానకాండ–** వేదంలో రెండవ భాగం లేదా వేద అంతభాగాన్ని వేదాంతం అనీ, జ్ఞానకాండ అనీ అంటారు. కర్మకాండ వల్ల అనేక కర్మలు, యజ్ఞాలు ఎలా చేయాలో నేర్చుకుని, దాన్నించి సంసారమనే చక్రంలో ఇరుక్కోకుండా జ్ఞానకాండకి వచ్చి మోక్షం పొందాలని శాస్త్రం ఉద్దేశ్యం. కర్మలు చేయటం వల్ల చిత్తశుద్ధి, ఉపాసన చేయటం వల్ల చిత్త ఏకాగ్రత ఏర్పడుతుంది. దానివల్ల సాధన చతుష్టయ సంపన్నుడయి జ్ఞానకాండకు అధికారి అవుతారు. సాధన చతుష్టయం అంటే వివేకం, వైరాగ్యం, శమదమాది షట్క సంపత్తి, ముముక్షుత్వం.

**గురుశిష్యుల సంవాదం** – ఆత్మజ్ఞానం గురుశిష్యుల సంవాదం ద్వారా బోధింపబడుతుంది. సంవాదం అంటే సంభాషణ. భగవద్గీతను కూడా శ్రీకృష్ణార్జునుల సంవాదం అంటారు. సంవాదం రూపంలోనే ఎందుకు?

ఉపోద్ఘాతం

1. అర్థం చేసుకోవటం తేలిక.
2. ఉపనిషత్తులను స్వయంగా అధ్యయనం చేయటానికి ప్రయత్నించకూడదు.
3. శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువుద్వారానే నేర్చుకోవాలని ఉపనిషత్తు చెప్తుంది. గురువులను గౌరవించేలా చేయాలని గురువులు చెప్పుకోలేదు. ఒక గురువుకు జ్ఞానం ఉన్నా కూడా అతను సంప్రదాయం పాటించకపోతే అతన్ని మూర్ఖునిలా పరిగణించి పట్టించుకోవద్దన్నారు శంకరాచార్యులు గీతాభాష్యంలో.
4. గురువు దగ్గరికి తానే వినమ్రుడై సమిధలు తీసుకుని వెళ్ళి, ప్రశ్నలు వేసి నేర్చుకోవాలి.

**తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్**
**సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్ - ముండకం 1-2-12**

**సంవాదం తీరుతెన్నులు**-ఈ సంవాదం ఒక గురువు-ఒక శిష్యుని మధ్య ఉండవచ్చు. ఉదా: ముండకం; ఒక గురువు-అనేక శిష్యుల మధ్య ఉండవచ్చు. ఉదా: ప్రశ్న; అనేక గురువులు-అనేక శిష్యుల మధ్య కూడా ఉండవచ్చు. ఉదా: బృహదారణ్యకం.

**శంకరభాష్యం-** వేదాలు ఉన్నవి నాలుగే అయినా ఉపనిషత్తులు 1180 ఉన్నాయి. వాటిలో కొన్ని కాలగర్భంలో కలిసిపోయి, 108 మాత్రమే మిగిలాయి. వాటిల్లో కూడా 10 ఉపనిషత్తులని ప్రధాన ఉపనిషత్తులని అంటారు.ఎందుకంటే ఈ 10 ఉపనిషత్తులకీ శంకరాచార్యులవారు భాష్యం చెప్పారు. వీటికి రాయటానికి కారణాలు రెండు -

1, ఈ పదీ చదివితే నాలుగు వేదాల సారాంశం వస్తుంది.
2. బ్రహ్మసూత్రాల్లో ఉపనిషత్తు వాక్యాలను తీసుకుని లోతుగా పూర్వాపరాలని విశ్లేషించారు వ్యాసమహర్షి. ఆ వాక్యాలు ఈ 10 ఉపనిషత్తులనుంచీ అధికశాతం ఉన్నాయి. అందుకని వాటినే తీసుకున్నారు.

ఈ పది ఉపనిషత్తులను ప్రధాన ఉపనిషత్తులనటంలో అర్థం తక్కినవి చిన్న బ్రహ్మ గురించి చెప్తాయని కాదు. బ్రహ్మ ఒక్కటే. ఈశావాస్య ఉపనిషత్తులో 18 మంత్రాల్లో వర్ణించినా, బృహదారణ్యక ఉపనిషత్తులో అరణ్యం అంత పెద్దదిగా

వర్ణించినా, రెండింటి సారాంశము ఒకటే. ఈ పదీ శంకరభాష్యం వల్ల ప్రాచుర్యం పొందాయి. వాటిని తేలిగ్గా గుర్తుంచుకోవటానికి చిన్న పద్య రూపంలో చెప్తారు.

**ఈశ కేన కఠ ప్రశ్న ముండ మాండూక్య తిత్తిరిః।**

**ఐతరేయం చ ఛాందోగ్యం బృహదారణ్యకం తథా॥**

ఈశావాస్య ఉపనిషత్తు పేరు ముందు వచ్చినా, దానితో ఉపనిషత్తు బోధ మొదలుపెడితే, అంతా అయోమయంగా తోస్తుంది. అది పూర్ణం, ఇది పూర్ణం, పూర్ణంలోంచి పూర్ణం తీసేసినా పూర్ణమే మిగులుతుంది అని అంటే ఒక్క అక్షరం ముక్క కూడా అర్థంకాదు. అలాగే, బృహదారణ్యకం చాలా పెద్దది. దయానంద సరస్వతి స్వామి హాస్యంగా ఒక మాట చెప్తారు. ఏదైనా మంత్రం ఎవరైనా చెప్పి, ఇది ఎందులోంచి అంటే బృహదారణ్యకం లోది అనాలిట. అవునా, కాదా అని ఎదుటి వ్యక్తి తేల్చటానికి తాతలు దిగివస్తారట. అదీకాక, అది నిజంగానే అందులోనే ఉండే అవకాశమూ ఉంది.

అందుకని ఉపనిషత్తు బోధ ముండకోపనిషత్తుతో మొదలుపెడతారు. శంకరాచార్యుల వారు 10 ఉపనిషత్తులకు వ్యాఖ్యానం చేసినా కనీసం ఆరు ఉపనిషత్తులనన్నా అధ్యయనం చేయాలనీ, అవి కూడా ఈ వరుసక్రమంలో చేస్తే మంచిదనీ పరమార్థానంద స్వామి చెప్పి, ఆయన అదే వరుసక్రమంలో బోధించారు కూడా. అది – ముండక, కేన, కఠ, కైవల్య (కైవల్యం ఈ పదిలో లేకపోయినా ముఖ్యమైనది) తైత్తిరీయ, మాండూక్య. అప్పుడు ఒక నిశ్చయ జ్ఞానం కలుగుతుందని చెబుతారు స్వామీజీ.

## ముండకోపనిషత్తు

ముండకోపనిషత్తుకి ఆ పేరు ఎందుకు వచ్చింది?
ఒక్కొక్క ఉపనిషత్తుకి ఒక్కొక్క పద్ధతిలో పేరు పెట్టారు.
అనేక ప్రశ్నలు ఉన్నాయి కాబట్టి ప్రశ్నోపనిషత్తు.
కేనేషితం అన్నపదంతో మొదలయినది కాబట్టి కేనోపనిషత్తు.
ఈశావాస్యమిదగ్ం సర్వంతో మొదలయినది కాబట్టి ఈశావాస్యోపనిషత్తు.
ముండక పదంతో మొదలయినది కాబట్టి ముండకోపనిషత్తు అనకూడదు. దీనికి కారణాలు వేరు. అవి –

ఉపోద్ఘాతం

1. ఇది ప్రాథమిక విద్య లేదా ముఖ్యవిద్యను బోధిస్తుంది. అనేక అంశాలను బోధిస్తుంది. ఇందులోని మంత్రాలని శంకరాచార్యులవారు అనేకసార్లు ఉటంకిస్తుంటారు.
2. ముండకం అనేది ఒక శిరోవ్రతం. గురువు దగ్గరికి మండుతున్న పాత్ర తీసుకుని వెళ్ళాలి. అది శిష్యునిలో మండే కోరికకి ప్రతీక.
3. సన్యాసులు శిరోముండనం చేసుకుంటారు. అంటే యజ్ఞయాగాదులు ఇంక చేయరు. వాళ్ళకు ఉపనిషత్తులను బోధిస్తారు. అంటే సన్యాసికుండే వైరాగ్యస్థితి  ఉండాలని దాని అర్థం. మనం సన్యాసం స్వీకరించాలని కాదు.

**ఉపనిషత్తు –** వేదాలు అపౌరుషేయం.ఏ మనిషీ లిఖించినవి కావు. అవి సాక్షాత్తూ పరమాత్మ చేత ఇవ్వబడ్డాయి. ఆ మాటకొస్తే ప్రతీదీ భగవదనుగ్రహమే. ఈ శరీరం, మనసు, ఇంద్రియాలు, శక్తి, వనరులు, జ్ఞానం, జ్ఞానం పొందే అవకాశం, జ్ఞానం పొందే సామర్థ్యం అన్నీ భగవానుని కృపే. ఆమాటకొస్తే అజ్ఞానం కూడా ఇవ్వబడిందే. జ్ఞానం పొందే అవకాశం ఉన్నచోట అజ్ఞానం, అపోహలు కూడా చోటు చేసుకుంటాయి. అపోహలు ఉన్నచోట అనేక సిద్ధాంతాలు బయలుదేరతాయి. ఆ అపోహలు ఒకరినుంచి ఇంకొకరికి అందజేయబడుతాయి. దాన్ని అంధపరంపర అంటారు పూజ్య స్వామీజీ. అంటే ఒక గుడ్డివాడు ఇంకో గుడ్డివాడికి దారి చూపినట్టు ఉంటుంది.

ఈ జ్ఞానాన్ని ఋషులు వారి సత్త్వగుణం చేత పరమాత్మ నుంచి అందుకుని పరంపరగా ముందుతరాల వారికి అందించారు. బ్రహ్మజ్ఞానానికి ప్రమాణం శ్రుతి. ఋషులు విని తెలుసుకున్నారు కాబట్టి వేదాలని శ్రుతులు అని కూడా అంటారు.

ఉపనిషత్తు పదాన్ని పదవిచ్ఛేదం చేస్తే ఉప+ని+షత్ అవుతుంది.

**షత్ –** షత్ అంటే నాశనం చేసేది. జ్ఞానాన్ని నాశనం చేసేది అనకూడదు. సంసారాన్ని నాశనం చేస్తుంది. అదికూడా దీనికి మూలకారణమైన అజ్ఞానాన్ని. మనం అజ్ఞానం వల్ల సంసారంలో పడి కొట్టుమిట్టాడుతున్నాము. అజ్ఞానం వల్ల అంతా నేనే చేస్తున్నానన్న 'అహం' పెరుగుతుంది. అహం వల్ల కోరిక పుడుతుంది.

కోరిక వల్ల కర్మలు చేస్తాము. వాటివల్ల సుఖదుఃఖాలు కలుగుతాయి. పుణ్యపాపాలను పెంచుకుంటాము. ఆ పుణ్యపాపాలను హరించుకోవటానికి పునరపి జననం, పునరపి మరణం అనే చక్రంలో పడిపోతుంటాము.

అజ్ఞానం–అహం–కోరిక–కర్మ–సుఖదుఃఖాలు–పుణ్యపాపాలు–పునర్జన్మ. ఈ ఏడు అడుగులు మనం అజ్ఞానం వల్ల వేస్తున్నాము. ఆ అజ్ఞానాన్ని పారద్రోలటం వల్ల మనకు దుఃఖ నాశనం కలిగి మోక్షప్రాప్తి కలుగుతుంది. అంటే ఆత్మవిద్య పొందటం వల్ల ఈ సంసార బంధం నుంచి విముక్తి పొందుతాము.

**ఉప –** ఆత్మజ్ఞానం కోసం ఆచార్యుని దగ్గరికి వెళ్ళి ప్రశ్నలు అడిగి,జ్ఞానాన్ని పొందాలి. గురువుని అడగందే బోధ చేయరు. అర్జునుడు శరణువేడి, మార్గం చూపమంటేనే గీతాబోధ వచ్చింది. అది కూడా వినయంగా అడగాలి.

**ని** – నిశ్చయజ్ఞానం. ఆచార్యుని నుంచి నిశ్చయజ్ఞానం పొందాలి. ఆచార్యుని దగ్గరకు వెళ్ళగానే ఎన్నాళ్ళు నేర్చుకోవాలి లేదా ఏదైనా క్రాష్‌కోర్సు ఉందా అనకూడదు. నిశ్చయ జ్ఞానం కలిగేదాకా వేదాంతం పదే పదే నేర్చుకోవాలి.

సంసార చక్రం నుంచి బయటపడి మన స్వభావం గురించి నిశ్చయజ్ఞానం కలగాలి. నేను శరీరాన్ని కాదు, మనసుకాదు, ఇంద్రియాలు కాదు, జీవాత్మ కాదు, పరమాత్మకి బానిసను కాదు. నేను ఏకాత్మను; నిత్య, ముక్త, శుద్ధ, పరిపూర్ణ బ్రహ్మను అని అర్థం చేసుకోవాలి.

అందువల్ల ఉపనిషత్తు అంటే ఆచార్యుని దగ్గరికి వెళ్ళి ఆత్మజ్ఞానం పొందితే సంసారాన్ని నాశనం చేసే నిశ్చయ జ్ఞానం కలిగిస్తుంది అని అర్థం.

ఉపనిషత్తుకు ఇంకొక అర్థం కూడా వస్తుంది. ఉప అంటే అత్యంత సమీపం. ని అంటే నిశ్చయజ్ఞానం. ఉపనిషత్తు అంటే అత్యంత సమీప విషయమైన బ్రహ్మ గురించిన నిశ్చయ జ్ఞానం పొందటం.

## శాంతిపాఠం

**ఓం భద్రం కర్ణేభిఃశృణుయామ దేవాః భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః।**
**స్థిరైరంగైస్తుష్టువాగ్ం సస్తనూభిర్వ్యశేమ దేవహితం యదాయుః।**
**స్వస్తి న ఇన్ద్రో వృద్ధశ్రవాః। స్వస్తి నః పూషా విశ్వవేదాః।**
**స్వస్తి నస్తార్క్ష్యో అరిష్టనేమిః। స్వస్తి నో బృహస్పతిర్దధాతు॥**
**ఓం శాంతిః శాంతిః శాంతిః॥**

ఒక పని విజయవంతమవ్వాలంటే దానికి మూడు అంశాలు తోడ్పడాలి. ప్రయత్నం– కాలం– దైవం. ప్రయత్నం అంటే మనం అనుకున్నపనిని వీడకుండా అంకితభావంతో ప్రయత్నం చేయటం. కొంతమందికి ఆరంభశూరత్వం ఉంటుంది. వాళ్ళు చాలా ఉత్సాహంతో మొదలు పెడతారు గాని, ఒక్క ఎదురుదెబ్బతగిలినా చతికిలపడిపోతారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా ముందుకు దూసుకుపోయేలా ఉండాలి. కాలం అంటే సమయం. ఏ పని కూడా రాత్రికి రాత్రి అయిపోదు. దానికి కొంత సమయం వెచ్చించాలి. ఫలితానికి కొంతకాలం వేచి ఉండాలి. మూడోది దైవానుకూలం. మనకు ఎదురయ్యే ఆటంకాలను మనం ఊహించ లేము. వాటిని అడ్డుకునే శక్తి లేదు. దీన్ని కర్మ అనీ, అదృష్టం అనీ, దైవానుగ్రహం అనీ అంటారు. ఈ దైవానుగ్రహం కోసం చేసే ప్రార్థన ఈ శాంతిపాఠం.

మానవ ప్రయత్నమూ, ఈశ్వరానుగ్రహమూ రెండూ ఉండాలి. ఈశ్వరానుగ్రహం లేకపోతే ఎంత ప్రయత్నం చేసినా విజయం పొందలేము. అలాగని ఈశ్వరానుగ్రహం చాలని వదిలేసినా చాలదు. ఈశ్వరానుగ్రహం సమృద్ధిగా ఉంది, సూర్యరశ్మి సమృద్ధిగా ఉన్నట్టుగా. అది కూడా మన చుట్టూ ఉంది. దాన్ని మనం తెలుసుకుని, వినియోగించుకోవాలి.

ప్రతి ఉపనిషత్తుకీ ముందు ఒక శాంతిపాఠం ఉంటుంది. ఆ శాంతిపాఠం వేదానికి సంబంధించింది. అంటే ఒకొక్క వేదానికి ఒకొక్క శాంతిపాఠం ఉంటుంది. ఉపనిషత్తు నేర్చుకునే విద్యార్థులు శాంతిపాఠం రెండు కారణాల కోసం పఠిస్తారు. అవి– శారీరక ఆరోగ్యం, ఆటంకాలు తొలగటం.

**1. శారీరక ఆరోగ్యం–** ఉపనిషత్తులు నేర్చుకోవటానికి కొన్ని సంవత్సరాలు పడుతుంది. అందుకని శారీరక ఆరోగ్యం కోసం ప్రార్థన చేస్తారు. ఎక్కడో జరిగే క్లాసుకు వెళ్ళాలి. గంట కూర్చోవాలి.

**మనసు–** మనసు బాగుండకపోతే శరీరం సహకరించినా గురువు బోధ ఎక్కదు.

**బుద్ధి –** ఉపనిషత్తు నేర్చుకోవటం అంటే మామూలు విషయం కాదు.దానికి సూక్ష్మబుద్ధి ఉండాలి. క్షురకుని కత్తి అంత పదునుగా ఉండాలని యమధర్మరాజే స్వయంగా చెప్తాడు. ఇందులో తర్కం చాలా ఉంటుంది. అది అర్థం కావాలి.

**ఇంద్రియాలు–** చెవులు బాగా పనిచేయాలి.గురువు చెప్పేది ఒకటి, మనం వినేది ఒకటి అయితే అర్థం మారిపోతుంది. గురువు నువ్వు ఇమ్మోర్టల్ (శాశ్వతం) అంటే నువ్వు ఇమ్మోరల్ (అనైతికం) అని వింటే ప్రమాదం.

అందుకని శరీరం,మనసు,బుద్ధి, ఇంద్రియాలు బాగుండాలని కోరుకుంటాము. మన ప్రారబ్ధకర్మని తొలగించమనటం లేదు.మనం ముండకోపనిషత్తు నేర్చుకునే ఆ గంటా మన బాధలను కొంచెం ఆపమని కోరుకుంటున్నాము.

**2.ఆటంకాలు –** మనకు కలిగే ఆటంకాలను త్రివిధ ప్రతిబంధకాలు అంటారు. వాటి నివృత్తి కోసం ప్రార్థన చేస్తున్నాము. అవి –

**ఆధిదైవిక** – ప్రకృతి వైపరీత్యాలు – వానలు, వరదలులాంటివి. వాటి మీద మనకేమీ అధికారం లేదు.

**ఆధిభౌతిక** – మన తోటి మనుష్యుల వల్ల కలిగే ఆటంకాలు. సరిగ్గా మనం ఉపనిషత్తు క్లాసుకి బయల్దేరేముందు ఏ చుట్టమో వస్తే వారిని కాదని వెళ్ళలేము కాని కొంతవరకూ మనం దీన్ని అదుపులో పెట్టగలము. మన ఇంటికి తరచుగా వచ్చే బంధువులకు నేను బుధ,గురువారాల్లో 10 నుంచి 12 వరకూ ఉండను, ఆధ్యాత్మిక ప్రసంగాలకు వెళతాను, దయచేసి ఆ సమయంలో తప్ప వేరే ఎప్పుడైనా రండి అని వారికి ముందే చెప్పుకోగలం.

**ఆధ్యాత్మికం–** మనకు మనమే పెద్ద ఆటంకం.మూడు అడుగులు ముందుకు వేద్దామనుకుంటే, ఆరు అడుగులు వెనక్కి లాగుతుంది మనసు. అమ్మో, ఆత్మవిద్యా! నాకేం వస్తుంది అనుకుంటాం. దీన్ని చాలామటుకు అదుపులో పెట్టగలం. మన మనసును మనమే నియంత్రించుకోవాలి.

ఇదీ శాంతిపాఠం సారాంశం. ఇప్పుడు ముండక ఉపనిషత్తుకు ఉన్న శాంతిపాఠాన్ని చూద్దాము.

**భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః –** భద్రం అంటే సర్వమంగళ స్వరూపం. బ్రహ్మ మంగళానాం మంగళం. ఆ బ్రహ్మ గురించి శ్రద్ధగా వినగల్గుగాక. ఒకచెవితో విని ఇంకో చెవితో వదిలేసేలా ఉండకూడదు. ఇది మోక్షాన్నిచ్చే శాస్త్రం. దేవాః అంటే మన ఇంద్రియాలకు అధిష్టాన దేవతలను ప్రార్థిస్తున్నాము. ఉదాహరణకు కన్ను అధిష్ఠానదేవత సూర్యుడు.

**భద్రం పశ్యేమ అక్షభిః యజత్రాః –** యజత్రా అన్నా కూడా దేవతే. ఆ మంగళ రూపాన్ని కంటితో చూడనీ. బ్రహ్మ నిజానికి ఇంద్రియ అగోచరం, కాని బ్రహ్మ గురించి చెప్పే ఆచార్యుని మీద దృష్టి నిలిపి, చెవితో శ్రద్ధగా వినాలి. అంటే కళ్ళు, చెవులు సహకరించాలని కోరుతున్నాము.

ఇంకా సూక్ష్మమైన అర్థం ఉంది. కన్ను చూసేదానికన్నా ఎక్కువగా బుద్ధితో అర్థం చేసుకునేలా చేయి. ఈశావాస్య మిదగ్ం సర్వం–అంతటా ఈశ్వరుడే ఉన్నాడు అన్న బుద్ధితో జగత్‌ని చూసేలాగా చేయి.

**స్థిరైః అంగైః తుష్టువాగ్ం సస్తనూభిః –** సస్తనూభిః అంటే దేవతలని అనేక సూక్తుల ద్వారా ప్రార్థించనీ. దేవతాప్రార్థన ద్వారా పుణ్యం పెరిగి, బ్రహ్మవిద్య బోధని పొందనీ. ఆ ప్రార్థన చేయటానికి ఆరోగ్యకరమైన అంగాలనియ్యి.

**దేవహితం యదాయుః వ్యశేమ–** దేవుడిచ్చిన పూర్ణాయుష్షుని అనుభవించనీ. అపమృత్యుపాలు పడకుండా చేయి. ఎందుకు? ఈ విద్య నేర్చుకోవటానికి ఎన్నో ఏళ్ళు కావాలి. శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారా నేర్చుకుంటాము. శ్రవణం అంటేనే ఎంతోకాలం, క్రమపద్ధతిలో, ఒక సమర్థవంతమైన గురువు దగ్గర నేర్చుకోవటం. కనీసం ఆరు ఉపనిషత్తులు నేర్చుకోవాలి. దేవుడిచ్చిన ఆయుష్షు అంటే ఆయనిష్ట ప్రకారం ఇచ్చినది అని కాదు అర్థం. మన కర్మఫలం వల్ల మనకు దేవుడు నిర్దేశించిన ఆయుష్షు. దాన్ని పరిపూర్ణంగా అనుభవించనీ.

**స్వస్తి నః ఇంద్రో వృద్ధశ్రవాః –** కొందరు శక్తివంతమైన దేవతలు ఉన్నారు. వారిలో వృద్ధశ్రవాః అంటే చాలా పేరున్న దేవత – ఇంద్రుడు. నః – ఆయన మాకు స్వస్తి – మేలు చేయుగాక.

**స్వస్తి నః పూషా విశ్వవేదాః –** పూషా అంటే సూర్యదేవత. మన పోషణ కర్త సూర్యుడు. పోషణకర్త ఎలా అయ్యాడు? సూర్యుడి కిరణజన్య సంయోగక్రియ

వల్ల చెట్లలో పిండిపదార్థాలు తయారవుతాయి. ఆ విధంగా ఆహారం ఉత్పత్తి అవుతోంది. అందుకే ఆయనకు సూర్య నమస్కారాలు చేయటం, ఆదిత్య హృదయం చదవటం చేస్తారు. ఆయన విశ్వస్య వేదా – ఆయన సర్వజ్ఞుడు. ఈశ్వరుణ్ణి సూర్యుని రూపంలో కొలుస్తున్నాము. అన్నీ తెలిసిన సూర్యుడిని కొలిస్తే మనకీ జ్ఞానం కలుగుతుందని ఆశ. ఈశ్వరుడిని అర్థం చేసుకునేలా బుద్ధి ప్రకాశం చేయి.

**స్వస్తి నః తార్క్ష్యః అరిష్టనేమిః –** తార్క్ష్యః – గరుత్మంతుడు. ఇప్పుడు ఈశ్వరుణ్ణి గరుత్మంతుని రూపంలో కొలుస్తున్నాము. అరిష్టనేమి – ఆయన కదిలికని ఎవరూ ఆపలేరు. నా ఆధ్యాత్మిక ప్రయాణం కూడా ఆటంకం లేకుండా చేయి.

**స్వస్తి నః బృహస్పతిః దధాతు–** నాలుగో దేవతగా బృహస్పతిని కొలుస్తున్నాము. ఇంద్రదేవుని ముందు కొలిచాము. ఆ ఇంద్రునికి గురువు బృహస్పతి. గురువులకే గురువు అయిన బృహస్పతిని వాక్పతి అని, బుద్ధికి బృహస్పతి అనీ అంటారు. అందుకని నా బుద్ధిని పదునుగా చేసి నేను అర్థం చేసుకునేలా చేయి.

**ఓం శాంతిః శాంతిః శాంతిః –** త్రివిధ ప్రతిబంధాల నుంచి నన్ను నివృత్తుని చేయి. ఆధిదైవిక, ఆధిభౌతిక, ఆధ్యాత్మిక ఆటంకాలను తొలగించు.

శాంతికి ఇంకో అర్థం కూడా ఉంది. మనం ప్రారబ్ధకర్మతో అవస్థపడుతున్నప్పుడు ప్రాయశ్చిత్త కర్మల ద్వారా దాని చెడు ఫలితాలని తగ్గించుకోవటానికి ప్రయత్నిస్తాము. దీన్ని శాంతి కర్మ అంటారు. అది కర్మ అవచ్చు, ప్రార్థన అవచ్చు. ఇక్కడ శాంతి ప్రార్థన ఆటంకాలని తొలగించటానికి చేస్తాము. శాంతిపాఠం అంటే గట్టిగా చదవాల్సి ఉంటుంది.

చిన్మయానంద స్వామి చలోక్తిగా ఈ ఓం శాంతిః శాంతిః శాంతిః మూడు రకాలుగా పలకాలని చెబుతారు. మొదటి శాంతి ఆధిదైవిక ఆటంక నివృత్తి కోసం కాబట్టి ఎక్కువ గట్టిగాను, రెండోది తోటిమానవులకు వర్తిస్తుంది కాబట్టి గట్టిగాను, మూడోది మన మనసుకు చెప్పేది కాబట్టి చాలా చిన్న గొంతుతోనూ చెప్పాలంటారు.

మనం శాంతిపాఠం పఠించి మన ప్రతిబంధకాలకు తాత్కాలికంగా స్టే ఆర్డర్ తెచ్చుకున్నాం. కాబట్టి ఇంక ఉపనిషత్తులోకి అడుగుపెడదాము.

# ప్రథమ ముండకం

## ప్రథమ ఖండం

ముండకోపనిషత్తులో 3 అధ్యాయాలున్నాయి. ఒక్కొక్క అధ్యాయంలోనూ రెండేసి సెక్షన్లు ఉన్నాయి. ఇందులో అధ్యాయాన్ని ముండకం అనీ, సెక్షన్‌ని ఖండం అనీ అంటారు. అంటే మొత్తం 3 ముండకాలు, 6 ఖండాలున్నాయి. 65 మంత్రాలున్నాయి. అంటే సగటున ఒక్కొక్క ఖండంలోనూ 11 మంత్రాలు ఉన్నట్టన్నమాట.

### మంత్రం - 1

**ఓం బ్రహ్మా దేవానాం ప్రథమః సంబభూవ**
**విశ్వస్య కర్తా భువనస్య గోప్తా।**
**స బ్రహ్మవిద్యాం సర్వవిద్యాప్రతిష్ఠామ్**
**అథర్వాయ జ్యేష్ఠపుత్రాయ ప్రాహ॥**

**ప్రతిపదార్థం:** బ్రహ్మా – బ్రహ్మదేవుడు; దేవానాం ప్రథమః సంభభూవ – దేవతలలో మొదట ఉద్భవించాడు; విశ్వస్యకర్తా –జగత్తుకు సృష్టికర్త; భువనస్య గోప్తా – ఆ సృష్టించబడ్డ జగత్తుకు రక్షకుడు; సః – ఆయన, సర్వవిద్యాప్రతిష్ఠామ్ – అన్ని జ్ఞానాలకూ ఆధారమైన; బ్రహ్మవిద్యామ్ – బ్రహ్మవిద్యను; జ్యేష్ఠపుత్రాయ – పెద్ద కుమారుడైన; అథర్వాయ – అథర్వునకు; ప్రాహ – బోధించాడు.

**తాత్పర్యం:–** ఓం! దేవతలలో బ్రహ్మదేవుడు మొదట ఉద్భవించాడు. ఆయన జగత్తుకు సృష్టికర్తా, స్థితికారకుడు. అన్ని జ్ఞానాలకు ఆధారమైన బ్రహ్మవిద్యను తన జ్యేష్ఠపుత్రుడైన అథర్వునకు బోధించాడు.

**వివరణ:–** మొదటి మూడు మంత్రాలలో ఆత్మజ్ఞానస్తుతి జరుగుతుంది. దాన్ని బ్రహ్మవిద్య అంటారని ఈ మంత్రంలో తెలుసుకుంటాము. ముందే దాని గొప్పతనం తెలిస్తే మనకు దానిమీద శ్రద్ధపుడుతుంది కదా! ఇదికూడా ఒక ప్రకటనలాంటిదే! కాని ఇది మనం రోజూ చూసే ప్రకటనలలాంటిది కాదు.

మన లౌకిక ప్రకటనలలో నిజం తక్కువా, అతిశయోక్తి ఎక్కువా ఉంటాయి.

కాని ఇక్కడ అతిశయోక్తి ఏమాత్రం లేదు. ఈ విద్య ఎందుకు గొప్పదంటే ఇది సాక్షాత్తూ ఆ భగవానుని నుంచి వచ్చింది. అపౌరుషేయం. మన ప్రార్థన శ్లోకంంలోనే ఉంది కదా! 'సదాశివ సమారంభాం' సాక్షాత్తూ భగవానుడే ఆది గురువు కాబట్టి, ఆయన సర్వజ్ఞుడు కాబట్టి అది నిర్దుష్ట ప్రమాణం, లోటుపాట్లు లేని విద్య, కాలానికి అతీతమైనది, నిశ్చయ ఫలప్రదమైనది.

ఇంకో కారణం ఇది బ్రహ్మవిద్య. బోధించేది నిత్య, ముక్త, శుద్ధ, సర్వవ్యాపక బ్రహ్మ గురించి. అందుకని కూడా అది గొప్పది.

కొన్ని ఉపనిషత్తులు కథ ద్వారా మొదలవుతాయి. ఉదాహరణకు కఠోపనిషత్తులో నచికేతుని కథ ఉంటుంది. ఆ కథ ద్వారా మనకు గురుస్తుతి, శిష్యస్తుతి, శాస్త్రస్తుతి వస్తాయి.మనం కథ నిజానిజాల లోతుల్లోకి వెళ్ళకుండా, ఈ మూడు అంశాలనీ గ్రహించాలి.

ఈ మూడు మంత్రాలలో గురుశిష్యుల పరంపరను చూస్తాము. ఈ మంత్రం ద్వారా ఇది దైవబోధ అనీ, సంప్రదాయ పద్ధతిలో గురువు నుంచి శిష్యులకు వచ్చిందనీ చెప్తోంది ఉపనిషత్తు. ఆదిగురువుమాట చెప్పలేదు.అది గ్రహించుకోవాలి. విష్ణుమూర్తి అన్నా శివుడు అన్నా ఆయన ప్రథమ గురువు. ఆయనతో కలిపి ఏడుగురు గురువుల పేర్లు వస్తాయి. వారి పేర్లు వరుసగా 1. భగవంతుడు 2. చతుర్ముఖబ్రహ్మ 3. అథర్వుడు 4. అంగిరుడు 5. భారద్వాజుడు 6. అంగిరసుడు (ముందు అంగిరుడు) 7. శౌనకుడు. ముండక ఉపనిషత్తు అంగిరసుడు, శౌనకుల మధ్య జరిగే సంవాదాన్ని చెప్తుంది. ప్రతి గురువూ శ్రేష్ఠమైన గురువని చెప్తోంది ఉపనిషత్తు.

**బ్రహ్మా దేవానాం ప్రథమః సంబభూవ–** ఆదిగురువు గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. రెండోగురువు బ్రహ్మదేవుడు. బ్రహ్మా అని దీర్ఘం తీస్తే బ్రహ్మదేవుడు లేదా చతుర్ముఖ బ్రహ్మ. బ్రహ్మ అంటే నిర్గుణ చైతన్యం. సచ్చిదానంద పరమాత్మ. బ్రహ్మదేవుడు దేవతలలో మొదట ఉద్భవించాడు. మన పురాణాల్లో ఆయన విష్ణుమూర్తి నాభి నుంచి ఉద్భవించినట్లు చూస్తాము కదా.

**యో బ్రహ్మాణం విదధాతి పూర్వం। – శాంతి మంత్రం**

విష్ణుమూర్తి బ్రహ్మదేవుడిని సృష్టించి, ఆయనకు సృష్టికార్యము అప్పచెప్పాడు.

**విశ్వస్య కర్తా, భువనస్య గోప్తా**–మనం బ్రహ్మ సృష్టికర్తా, విష్ణుమూర్తి స్థితికారకుడూ, శివుడు లయకారకుడూ అని వ్యవహరిస్తాము కానీ నిజానికి ముగ్గురూ ఒకటే. అందుకే ఇక్కడ బ్రహ్మను సృష్టికర్తా ఆయనే, స్థితికర్తా ఆయనే అన్నారు. లయకారకుడు కూడా ఆయనే అని కలుపుకోవాలి. ఆయన సర్వజ్ఞుడు కాకపోతే సృష్టికార్యం చేయలేడు. చతుర్ముఖబ్రహ్మ ఆయన. ఆయన నాలుగు ముఖాలూ నాలుగు వేదాలకు ప్రతీక.

**స బ్రహ్మవిద్యాం ప్రాహ –** ఈ బ్రహ్మ, బ్రహ్మవిద్యను బోధించాడు – ఆత్మజ్ఞానాన్ని బ్రహ్మవిద్య అని ఎందుకన్నారు? దానికి రెండు కారణాలు –

1. చతుర్ముఖ బ్రహ్మ బోధించాడు కాబట్టి
2. నిర్గుణ బ్రహ్మ గురించి బోధించాడు కాబట్టి

అంటే సగుణ బ్రహ్మ నిర్గుణ బ్రహ్మ గురించి బోధ చేసాడు.

**సర్వవిద్యాప్రతిష్ఠామ్ –** అన్ని జ్ఞానాలకూ ఆధారం ఈ బ్రహ్మ విద్య. సర్వవిద్యా ప్రతిష్ఠామ్ అన్నది బ్రహ్మవిద్యకు విశేషణం. తక్కిన విద్యలు మోక్షం ఇవ్వవు. ఇది ఒక్కటే ఇస్తుంది. తక్కిన విద్యలలో ఎంత ఎక్కువ తెలిస్తే, అంత తక్కువగా మనకు తెలుసని తెలుస్తుంది. ఒక విషయం పరిపూర్ణంగా తెలుసని చెప్పలేము.

మిగతా విద్యలు భాగాల్లో లభిస్తే, ఇది పరిపూర్ణ జ్ఞానం. లౌకిక విద్య మనకు తెలిసింది చాలా తక్కువ అనిపింపజేస్తే, ఆధ్యాత్మిక విద్య మనకు తెలిసింది చాలా ఎక్కువ అనిపింపజేయదు, మనం అనంతం అని బోధిస్తుంది.

**అథర్వాయ జ్యేష్ఠపుత్రాయ ప్రాహ –** ప్రాహ అంటే చెప్పి వదిలేయలేదు. అర్థమయ్యేవరకూ చెప్పాడు అని అర్థం వస్తుంది. అది కూడా ఎవరికి చెప్పాడు? తన పెద్దకొడుకైన అథర్వునికి చెప్పాడు. ఇలా తండ్రి తన కొడుకుకు విద్య బోధించటం మరికొన్ని ఉపనిషత్తులలో కూడా చూస్తాము. తైత్తిరీయ ఉపనిషత్తులో వరుణుడు తన పుత్రుడు భృగుమహర్షికి, ఛాందోగ్య ఉపనిషత్తులో ఉద్దాలకుడు తన పుత్రుడు శ్వేతకేతునకు చెప్తాడు. కొడుకుకు అదీ జ్యేష్ఠపుత్రునికి చెప్పాడంటే, ఆ విద్య పరిపూర్ణంగా చెప్పాడని అర్థం. మామూలుగా గురువు బోధిస్తే కొంత పక్షపాతం ఉండవచ్చు లేదా గురువుని మించిన శిష్యుడవకూడదని కొంత దాచుకుని చెప్పవచ్చు. కాని స్వయంగా తన పుత్రునికే చెపితే అలా జరగదు. మనకు ఒక విద్య తెలిసి చెప్పకపోతే బ్రహ్మరాక్షసులుగా పుడతాం అంటారు.

కాని ఇప్పుడు పిల్లలు చెప్పినా వినే పరిస్థితిలో లేరు. తండ్రిమీద మూడు దశల్లో మూడురకాల అభిప్రాయాలు ఏర్పరచుకుంటారు పిల్లలు. చాలా చిన్నవయసులో తండ్రికి అంతా తెలుసనుకుంటారు. టీనేజ్‌లోకి వచ్చేసరికి తండ్రికి కొన్ని తెలుసు, కొన్ని తెలియదు అనుకుంటారు. వారు మధ్య వయస్సులోకి వచ్చేసరికి తండ్రికేం తెలియదు, అంతా తమకే తెలుసనుకుంటారు. కాని ఎప్పటికైనా ప్రథమగురువు తండ్రే.

## మంత్రం - 2

**అథర్వణే యాం ప్రవదేత బ్రహ్మా**
**అథర్వా తాం పురోవాచాఙ్గిరే బ్రహ్మవిద్యామ్।**
**స భారద్వాజాయ సత్యవహాయ ప్రాహ**
**భారద్వాజోఽ ఙ్గిరసే పరావరామ్॥**

**ప్రతిపదార్థం:–** బ్రహ్మా – బ్రహ్మదేవుడు; యాం అథర్వణే – దేనిని అథర్వునికి; ప్రవదేత – చెప్పాడో; తాం బ్రహ్మవిద్యామ్ – ఆ బ్రహ్మవిద్యను; అథర్వా – అథర్వుడు; పురా – పూర్వం; అంగిరే ఉవాచ – అంగిరునికి చెప్పాడు; సః– అతడు; భారద్వాజాయ సత్యవహాయ ప్రాహ – భరద్వాజ గోత్రుడైన సత్యవహునికి చెప్పాడు; భారద్వాజోంగిరసే – భారద్వాజుడు అంగిరసునికి; పరావరామ్ – బోధించాడు (పరంపరగా)

**తాత్పర్యం:–** బ్రహ్మదేవుడు ఏ విద్యనైతే అథర్వునికి బోధించాడో ఆ బ్రహ్మవిద్యను అథర్వుడు పూర్వం అంగిరునికి చెప్పాడు; అంగిరుడు భారద్వాజ గోత్రానికి చెందిన సత్యవహునికి చెప్పాడు; భారద్వాజుడు అంగిరసునికి బోధించాడు.

**వివరణ:–** ఏడుగురు గురువులలో మొదటి ముగ్గురూ మొదటి మంత్రంలో వచ్చారు. వారు భగవంతుడు, బ్రహ్మ, అథర్వుడు. ఈ మంత్రంలో తక్కిన ముగ్గురూ వస్తారు. వారు అంగిరుడు, భారద్వాజుడు, అంగిరసుడు.

**యాం అథర్వణే బ్రహ్మా ప్రవదేత –** బ్రహ్మదేవుడు అథర్వణునికి ఎలా బోధిస్తే దాన్ని అథర్వణుడు ఎటువంటి మార్పు లేకుండా అంగిరునికి అందచేసాడు. **పురా–** ఎన్నో వందల ఏళ్ళ కిందట. ఉపనిషత్తులే ఎంతో ప్రాచీనమైనవి. అందులో అంతకుముందు చెప్పాడు అంటే మన శాస్త్రాలు ఎంత సనాతనమైనవో చూడండి! సాంప్రదాయ బద్ధంగా ఈ తరం వరకూ వస్తూనే ఉన్నాయి.

ఇప్పుడు కమ్యూనికేషన్ గ్యాప్ ఎక్కువైపోయింది. దాన్ని నిరూపించటానికి మానేజ్‌మెంట్ కోర్సులో ఒక ఆట ఆడిస్తారు. కొంతమందిని వృత్తాకారంలో కూర్చోబెట్టి, ఒకని చెవిలో, ఉదాహరణకు వినాయకుడు అన్నమాట చెప్పి దాన్ని ఒక్కొక్కరి చెవిలోనూ చెప్పుకురమ్మంటారు. చివరివ్యక్తి దగ్గరికి వచ్చేసరికి అది ఆంజనేయులుగా మారిపోవచ్చు.

కాని బ్రహ్మవిద్య మాత్రం అలాగే తరతరాలుగా వచ్చింది. ఉదాహరణలు మారవచ్చేమో గానీ, అసలు విద్యమారదు.

**స భారద్వాజాయ సత్యవహాయ ప్రాహ –** అతను, అంటే అంగిరుదు భారద్వాజకు చెప్పాడు – భారద్వాజ వేరూ, సత్యవహాయ వేరూ కాదు – భారద్వాజ గోత్రానికి చెందిన సత్యవహునికి చెప్పాడు.

**భారద్వాజోఽఙ్గిరసే పరావరామ్–** భారద్వాజ అంగిరసునికి చెప్పాడు. పరావరామ్ అంటే పరస్మాత్. పరస్మాత్ అవరేణ శిష్యేణ ప్రాప్తా ఇతి పరావరామ్ అంటే గురువుపైన కూర్చుంటే అతన్నుంచి కింద కూర్చున్న శిష్యునికి ప్రవహించేది.ఏమిటది? బ్రహ్మవిద్య. బ్రహ్మవిద్య బోధించాడు అని మళ్ళీ చెప్పకుండా ఇక్కడ పరావరామ్ అన్న మాట వాడింది ఉపనిషత్తు.

బ్రహ్మవిద్యకూ, గంగకూ పోలికలున్నాయి.

1. రెండూ శివుని నుంచి ఆరంభమయ్యాయి.
2. రెండూ పైనుంచి కిందకి ప్రవహిస్తున్నాయి. కిందకి ప్రవహించినంత మాత్రాన వాటి విలువ చెక్కుచెదరదు. ఉపనిషత్తు విషయంలో గురువు నేర్చుకున్నాక శిష్యుడికి చెప్తాడు కాబట్టి కాలయాపన అవుతుంది తప్ప నాణ్యత తగ్గుతుందని కాదు అంటారు పూజ్యస్వామీజీ.
3. గంగని జీవనది అంటారు. అలాగే బ్రహ్మవిద్యని పరావిద్య అంటారు. ఇప్పుడు గురువుకి శిష్యులు తగ్గుతారేమో కానీ, విద్యమాత్రం ఇంకా ఉంది.
4. గంగలో స్నానం చేయాలంటే, మెట్లు ఉన్నచోటు చూసుకుని, రెయిలింగ్‌ని పట్టుకుని చేయాలి. దాని లోతెంతో తెలీదు. ప్రవాహం ఎంత ఉధృతంగా ఉంటుందో తెలీదు. రెయిలింగ్‌ని పట్టుకోకుండా దిగితే, టికెట్టు లేకుండా ఫ్రీగా కలకత్తాకి కొట్టుకుపోవచ్చు. అలాగే ఉపనిషత్తు లోతెంతో, దాన్ని అర్థం చేసుకోవటం ఎంత కష్టమో మనకు తెలియదు. సరియైన పద్ధతిలో

గురువు అనే రెయిలింగ్ పట్టుకుని ఉపనిషత్తులలో స్నానం చేస్తే ఫలితం తేలిగ్గా వస్తుంది.

పరావరమ్‌కి ఇంకో అర్థం కూడా ఉంది. పరావిద్య, అపరావిద్య అని రెండు విద్యలు ఉన్నాయి. వాటి గురించి తరువాత మంత్రాల్లో వస్తుంది. పరావిద్య అంటే కారణవిద్య, అపరావిద్య అంటే కార్యవిద్య. కార్యకారణాలు రెండూ బ్రహ్మే. అందుకే బ్రహ్మకు ఇంకో పేరు పరావరం. ముండకంలోనే తరువాత వస్తుంది.

**క్షీయన్తే చాస్యకర్మాణి తస్మిన్ దృష్టే పరావరే - ముండకం 2-2-8**

## మంత్రం - 3

**శౌనకో హ వై మహాశాలోఽఙ్గిరసం విధివదుపసన్నః పప్రచ్ఛ।**

**కస్మిన్ను భగవో విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతీతి॥**

**ప్రతిపదార్థం:** హ వై మహాశాలః - మహా గృహస్థుడు; శౌనకః - శౌనకుడు; అంగిరసమ్ - అంగిరసుని; విధివత్ ఉపసన్నః–శాస్త్రోక్తరీత్యా; సమీపించి; పప్రచ్ఛ– ప్రశ్నించాడు. కస్మిన్నువిజ్ఞాతే– దేనిని తెలుసుకుంటే; భగవః– భగవంతుడు; ఇదం సర్వమ్ - ఈ సమస్తమూ; విజ్ఞాతం భవతి– తెలుసుకోబడుతుంది; ఇతి–అని

**తాత్పర్యం:** మహా గృహస్థుడైన శౌనకుడు శాస్త్రోక్తరీత్యా అంగిరసుని సమీపించి అడిగాడు, 'ఓ భగవంతుడా! ఏ ఒక్కదానిని గురించి తెలుసుకుంటే ఈ సమస్తమూ తెలుసుకోబడుతుంది?' అని అడిగాడు.

**వివరణ:** ఇంతవరకూ పరంపర ఏర్పడింది. ఇప్పుడు శిష్యుడు గురువు దగ్గరికి ఎలా వెళ్ళాలి అన్నది తెలుస్తుంది. ఈ వివరణ ద్వారా కొన్ని సత్యాలు చెప్పకనే చెప్తుంది ఉపనిషత్తు.

**అంగిరసం ఉపపన్నః–** వేదాంతం స్వంతంగా చదవకూడదు. గురువు ముఖతః నేర్చుకోవాలి. పురాణాల్లో కూడా అంతరార్థం ఉంటుంది. రాముడు ఎవరో అన్న మాటని పట్టుకుని సీతని అడవుల్లో వదిలేయటమేమిటి, భార్యమీద ప్రేమ లేదా అనుకుంటాం. రాముడు సీతను వదిలేసిన ఘట్టంలో రాముడిని రాజుగా చూడాలి. అతనిలోని భర్తను చూడాలంటే అరణ్యకాండకి వెళ్ళాలి. చెట్టుకీ, పుట్టకీ చెప్పుకుని విలవిలా ఏడ్చిన రాముడు అక్కడ కనబడుతాడు. ధర్మశాస్త్రాన్ని ఎలా అర్థం చేసుకోవాలో చెప్పేందుకు మీమాంస శాస్త్రం

ఉంది. బ్రహ్మసూత్రాల్లో 4 అధ్యాయాలు ఉంటే ధర్మసూత్రాల్లో 12 అధ్యాయాలు ఉన్నాయి. జైమిని మహర్షి రచించారు దాన్ని. అందుకే గురువు ఆవశ్యకత ఉందని ముండకం ముందే చెప్తోంది.

**విధివత్ –** శిష్యుడు ఎంత గొప్పవాడైనా సరే తానే గురువు దగ్గరకి వెళ్ళాలి. 'విధివత్' అన్నమాట దాన్ని సూచిస్తుంది. తరువాత మంత్రాల్లో సమిధలు చేతపుచ్చుకుని వెళ్ళాలని, సాష్టాంగ నమస్కారం చెయ్యాలని, ప్రశ్నలు వేసి విద్యను పొందాలని వస్తుంది.

**ఉపసన్న–** అతను గురువు దగ్గరికి తానే వెళ్ళాడు. వాహనం పంపిస్తాను రమ్మనలేదు. అది కూడా 'విధివత్' వెళ్ళాడు. శాస్త్ర నియమం ప్రకారం వెళ్ళాడు. గురువు, దైవం, రాజుల దగ్గరికి రిక్తహస్తాలతో వెళ్ళకూడదంటారు. గురువు దగ్గరికి సమిధలు తీసుకుని వెళ్ళాలి. సమిధలు ఎందుకంటే ఆ గురువు యజ్ఞం చేసేవాడయితే, సమిధలు వెతుక్కోవటం కోసం సమయం వృధాపరచుకోనవసరం లేదు. అందులో గూడార్థాలు కూడా ఉన్నాయి.

నేను కావలసినన్ని యజ్ఞాలు చేసాను. ఇప్పుడు జ్ఞానకాండకి సిద్ధం. సమిధ అంటే ఎండుపుల్ల. అది నిప్పురవ్వ తగలగానే భగ్గున మండుతుంది. నేను వైరాగ్యంలో ఉన్నాను. జ్ఞాన అగ్ని రగిలిస్తే, వెంటనే పట్టుకుంటాను.

తరువాత సాష్టాంగ నమస్కారం చేయాలి. అంటే గురువు బోధని సంపూర్ణంగా స్వీకరించటానికి సిద్ధంగా ఉన్నట్టు. ఒక సూఫీ గురువు దగ్గరికి ఒక వ్యక్తి వెళ్ళి మీరు నాకు విద్య బోధించాలి అని చెప్పి, తనకు తెలిసిన మిడిమిడి జ్ఞానం ప్రదర్శించుకుంటూ పోతున్నాడు. గురువు అతన్ని ఆపి, ముందు కాఫీ తాగుదామంటాడు. ఆయన కప్పు నిండిపోయినా, కాఫీ పోస్తుంటే శిష్యుడు ఆశ్చర్యపోయి, అడ్డం పడతాడు. అప్పుడు గురువు చెప్తాడు, 'నాయనా, నీ మనసు ముందే ఈ కప్పులాగా నిండిపోయి ఉంది. నేను చెప్పేది నీనుంచి బయటికి వస్తుంది కాని లోపలికి దూరదు.'

**శౌనకోహవై మహాశాలః –**వెళ్ళిన శిష్యుడెవరు? శౌనక ఋషి. నైమిశారణ్యంలో శుకమహాముని దగ్గర శౌనకాదిఋషులు భాగవతకథలు, పురాణాలు శ్రవణం చేస్తారు. అతనికి మహాశాల అన్న విశేషణం వాడింది. మహాశాల

అంటే పెద్ద యజ్ఞశాల లేదా అన్నశాల ఉందని అర్థం. అంటే అతను ఎన్నో యజ్ఞయాగాదులు చేసాడు. అంటే కర్మయోగం చేసాడు. గృహస్థుగా తన ధర్మం నెరవేర్చి, గోదానం, భూదానం, ధనదానం, అన్నదానం లాంటి దానాలు చేసాడు. అంటే పంచమహాయజ్ఞాలు చేసాడన్నమాట. ఋషియజ్ఞం, దేవయజ్ఞం, పితృయజ్ఞం, మనుష్యయజ్ఞం, భూతయజ్ఞం, ఈ ఐదింటినీ కలిపి పంచమహాయజ్ఞాలంటారు. అంటే ఋషులు ఇచ్చిన వేదాలను గౌరవించటం, దేవుడిని పూజించటం, పితృదేవతలకు తర్పణాలొదలటం, తోటి మానవులకు దానాలు చేయటం, జంతువులను దయగా చూడటం. ఇవి చేయటం వల్ల సాధన చతుష్టయ సంపన్నుడయి చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత పొంది జ్ఞానమార్గానికి అర్హుడయ్యాడని ఈ ఒక్కమాట చెప్తోంది. హ వై అన్నపదాలు నొక్కి చెప్తున్నాయి ఈ మాటని.

**కస్మిన్ను భగవో విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతీతి। –**

ప్రశ్న అడగాలి. ఇక్కడ అతను అడిగిన ప్రశ్న చూసేముందు మనకొక ప్రశ్న రావచ్చు. అందుకని దానికి పూజ్యస్వామీజీ జవాబు చెబుతారు. శౌనకుడు గురుపరంపరలో ఏడవ వ్యక్తి. అతని గురించి చెప్పినప్పుడు 'విధివత్' అన్నది కదా ఉపనిషత్తు. అంటే తక్కినవారు వెళ్ళలేదా?

దీనికి జవాబుని దేహలిదీప న్యాయం అంటారు. దేహలి అంటే గుమ్మం. బయట గుమ్మం మీద పెట్టిన దీపకాంతి ఇటు ఇంటిలోపలికీ, అటు ఇంటి బయటకీ ప్రసరిస్తుంది. అలాగే శౌనకుడు శాస్త్రప్రకారం వెళ్ళాడంటే ఆ ముందు వారు వెళ్ళారు, తక్కినవాళ్ళూ అలా వెళ్ళాలి అని అర్థం.

మొదటి రెండు మంత్రాలు గురుపరంపర సాంప్రదాయాన్ని నొక్కివక్కాణిస్తే ఈ మంత్రం శిష్యుని లక్షణాలను చెప్తుంది.

**హే భగవంతుడా! ఏ విషయము తెలిసినట్లైతే, ఇక్కడ సర్వమూ అవగతమౌతుందో, అది తెలియజేయండి.**

ఈ ప్రశ్న చాలా ముఖ్యం. ప్రశ్నని బట్టి జవాబు వస్తుంది. పూజ్యస్వామీజీ అడుగడుగునా ఈ ప్రశ్నని గుర్తుచేస్తూ ఉంటారు. మనం కనీసం ముండకోపనిషత్తు ముగించేవరకన్నా దీన్ని గుర్తు పెట్టుకోవాలి.

**భవతీతి –** ఇతి అంటే అని అడిగాడు. వేదాన్ని శ్రుతి అంటారు. విని నేర్చుకున్నది అది. అందుకని రాసినప్పుడు వాడే కామాలు, ఫుల్‌స్టాప్‌లు, ఇన్వర్టెడ్ కామాలు ఉండవు.

భగవః అంటే భగవాన్. గురువు మీద ఉండాల్సిన గౌరవం ఈ సంబోధనలోనే తెలుస్తోంది. ప్రశ్న అర్థం ఏమిటి? ఏ ఒక్క కారణజ్ఞానం పొందితే, సర్వకార్యజ్ఞానం పొందుతాము అని అర్థం. టూకీగా మొత్తం జగత్తుకు (కార్యానికి) మూలకారణం ఏమిటి?

ఎందుకు ఈ ప్రశ్న? ఒకటి తెలిస్తే అన్నీ తెలియవు. ఒకటే తెలుస్తుంది. అదీ పూర్తిగా తెలియదు. ఇది లౌకిక జ్ఞాన విషయంలో. కాని అతను మహాశాల కాబట్టి ఒకటి తెలిస్తే, అన్నీ తెలుస్తాయి అని విని ఉంటాడు. ఉదాహరణకు–

**బ్రహ్మవిద్ ఆప్నోతి పరమ్ – తైత్తిరీయం – 2-1-1**

బ్రహ్మను తెలుసుకున్నవాడు పరమాన్ని పొందుతాడు అని విని ఉంటారు.

ఇంకోకారణం – మనం లోకంలో చూస్తున్నాము. ఒక కారణమే అనేక కార్యాలుగా కనిపిస్తోంది. ఉదాహరణకు ఒక బంగారుముద్దలోంచి అనేక నామ, రూపాలున్న నగలను పొందుతాము. ఒక మట్టి ముద్ద నుంచి అనేక నామరూపాలున్న వస్తువులు వస్తాయి. ఒక దోశెపిండి నుంచి దోశె, ఇడ్లీ, ఊతప్పం, పుణుకులు, మైసూరుబజ్జీలాంటివి అనేకం వస్తాయి. అందువల్ల శౌనకునికి ఒక కారణం నుంచి అనేక కార్యాలు వస్తాయన్న ప్రాథమిక సిద్ధాంతం తెలుసు. అతనికి ఈ ప్రాథమిక సిద్ధాంతం తెలుసని మనం తెలుసుకోవాలి.

బ్రహ్మజ్ఞానం పొందితే సర్వజ్ఞుడెలా అవుతాడు? దీనికి పూజ్యస్వామీజీ చక్కగా వివరణ ఇచ్చారు. బ్రహ్మ గురించి తెలుసుకుంటే మనకు ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్ వంటి విద్యలు తెలిసిపోతాయని కాదు. సత్యం ఏదో, మిథ్య ఏదో తెలుసుకోవటం వల్ల సర్వజ్ఞులమవుతాము.

ఇంకో కారణం, ఉన్న సత్యం ఒకటే, రెండో సత్యం లేదు. కాబట్టి అంతా తెలిసినట్లే. ఇందువల్ల కూడా సర్వజ్ఞులవుతాము. నేను అజ్ఞానిని అన్నమాట పోతుంది, ఈ జ్ఞానం పొందటం వల్ల. లౌకిక విషయాల్లో ఒక విషయం లోతులు కొలిచినకొద్దీ మనకెంత తెలియదో తెలుస్తుంది. అందువల్ల నేను అజ్ఞానిని

అన్న భావన ఉంటూనే ఉంటుంది. బ్రహ్మవిద్యలో సర్వజ్ఞుడని ఎందుకంటారంటే, అది పొందిన జ్ఞాని 'ఇక్కడున్నదంతా బ్రహ్మే, నేను ఆ బ్రహ్మను,' అని తెలుసుకుంటాడు.

### కార్యకారణ సంబంధం

అంగిరసుడు శౌనకఋషి ప్రశ్నకి ఇచ్చిన జవాబు చూచేముందు మనం కార్యకారణ సంబంధం చూద్దాము.

**ఒక ఆభరణం యొక్క సత్యం బంగారం**
**ఒక చెక్క కుర్చీ యొక్క సత్యం చెక్క**
**ఒక కుండ యొక్క సత్యం మట్టి**
**అంటే ఒక కార్యం యొక్క సత్యం దాని కారణం.**

జగత్తు అనే కార్యానికి సత్యం దాని కారణం అని చెప్పాలనుకుంటున్నాడు అంగిరసుడు. ఏమిటాకారణం? అది బ్రహ్మ తప్ప ఏదీ కాదు. ఇక్కడ బ్రహ్మని అక్షరం బ్రహ్మగా వ్యవహరిస్తారు. అక్షరం బ్రహ్మ జగత్‌కారణం. ఇది జగత్తు యొక్క సత్యం. అక్షరం బ్రహ్మ గురించి తెలుసుకుంటే అంతా తెలుసుకున్నట్లే. బ్రహ్మకారణం, జగత్ కార్యం.

కారణం నిత్యం, కార్యం మిథ్య. ఎందుకు? కనబడే కార్యలక్షణాల ద్వారా కనబడని కారణం లక్షణాలని తెలుసుకోవచ్చు. లౌకిక ఉదాహరణ తీసుకుందాం– మట్టి, కుండ.

### కార్యకారణాల ముఖ్య లక్షణాలు

1. **కారణం ఏకం–** మట్టి ఒకటే. దాన్నించి అనేక నామరూపాలు వస్తాయి. కుండ, కూజా, ప్రమిద, తులసికోట, వగైరా అంటే కారణం ఏకం, కార్యం అనేకం.
2. **కారణం నిత్యం**–మట్టి ముద్ద నుంచి కుండ ఏర్పడగానే, దానికొక పుట్టినరోజు ఉంటుంది. మనం మందులు కొన్నప్పుడు చూస్తే వాటి మీద డేట్ ఆఫ్ మాన్యుఫాక్చర్, డేట్ ఆఫ్ ఎక్స్‌పైరీ ఉంటాయి. డేట్ ఆఫ్ ఎక్స్‌పైరీ చూడకుండా మనం మందులు వేసుకుంటే, మనం ఎక్స్‌పైర్ అయ్యే ప్రమాదం ఉంది. అలా కుండ కూడా విరిగిపోయే ప్రమాదం ఉంది.

కాని మట్టి చూస్తే కుండ పుట్టకముందూ ఉంది, కుండలోనూ ఉంది, కుండ విరిగిపోయాకా ఉంటుంది. అంటే మూడు కాలాల్లోనూ ఉంటుంది. అంటే కారణం నిత్యం, కార్యం అనిత్యం.

3. **కారణం సారం –** కుండ బరువెంత? అది చూడ్డానికి బరువుగా కనిపించినా నిజానికి ఆ బరువు దానిది కాదు. మరి దేనిది? అది తయారవటానికి మూలకారణమయిన మట్టిది. మన బంగారు గాజులు కొనుక్కొని ఎవరికైనా చూపిస్తే వాళ్ళేం అడుగుతారు? ఎంత బంగారం పడింది, అంటే బంగారం బరువెంత అంటారు. అంటే కుండలో అంతటా ఉన్నది మట్టే. గాజులో అంతటా ఉన్నది బంగారమే. దాన్నే సారం అంటారు. అందుకని నామ, రూపాలు మాత్రమే కార్యానికి ఉన్నాయి కాని సారం లేదు. అంటే కారణం సారం, కార్యం అసారం.

4. **కారణం సత్యం–** కుండ ఉంది అంటే దాని ఉనికి దేనిది? మట్టిది. గాజులు ఉన్నాయి అంటే వాటి ఉనికి దేనిది? బంగారంది. మట్టి లేకపోతే, కుండ లేదు. బంగారం లేకపోతే గాజులు లేవు. కాని ఇటు నుంచి చూస్తే కుండలేకపోయినా మట్టి ఉంది, గాజులు లేకపోయినా బంగారం ఉంది. అంటే కారణం లేకపోతే కార్యం లేదు, కాని కార్యం లేకపోయినా కారణం ఉంది. అలా దేనికి విడిగా ఉనికి ఉంటుందో దాన్ని సత్యం అనీ, స్వతంత్రంగా ఉనికి లేని దాన్ని మిథ్య అనీ అంటారు. ఇక్కడ అసత్యం అందాం. నిత్యం అంటే మూడుకాలాల్లోనూ ఉండేది. **త్రికాలేపి తిష్ఠతి.** అంటే కారణం సత్యం, కార్యం అసత్యం. సత్యం అంటే స్వతంత్రంగా ఉనికి ఉన్నది.

ఇప్పుడు పై వివరణని క్రోడీకరించి చూస్తే –

**కారణం – ఏకం, నిత్యం, సారం, సత్యం**

**కార్యం – అనేకం, అనిత్యం, అసారం, అసత్యం.**

ఈ లక్షణాలు బాగా గుర్తుపెట్టుకోవాలి. ఇప్పుడు వీటిని జగత్తుకు, బ్రహ్మకు అన్వయిద్దాము.

| **జగత్తు** | **బ్రహ్మ** |
|---|---|
| అనేకం – అనేక నామరూపాల ప్రపంచం | ఏకం |
| అనిత్యం – ఆ నామ రూపాలకు జనన, మరణాలు ఉన్నాయి | నిత్యం |

| | |
|---|---|
| అసారం – ప్రపంచం సారం లేనిది | సారం |
| అసత్యం – విడిగా ఉనికి లేదు | సత్యం |

ఈ బాహ్యప్రపంచం మనకు ఆనందం ఇస్తుంది అనుకుంటాము. కాని అది అసారం. దీనికి ఆధారం బ్రహ్మ. ప్రపంచం అసత్యం. బ్రహ్మ లేకుండా దానికి ఉనికి లేదు.

ప్రపంచం అందంగా ఉండవచ్చు. నూతనంగా ఉండవచ్చు. అనేకరకాల వస్తువులతో నిండి ఉండవచ్చు కాని దానికి శాశ్వతత్వం లేదు. శాశ్వతత్వం లేనిచోట భద్రత లేదు. ఈ రెండూ లేనిచోట శాంతి లేదు. శాంతి లేని చోట ఆనందం లేదు. మనం తాపత్రయపడేది మూడింటికోసం. **శాంతి, ఆనందం, భద్రత.** వాటిని టూకీగా పిహెచ్ఎస్ ( పీస్, హ్యాపీనెస్, సెక్యూరిటీ) అందాము.

ఈ పిహెచ్ఎస్ కావాలంటే బ్రహ్మవిద్య పొందాలి. అది పొందితే ప్రపంచాన్ని ఆటవస్తువుగా భావించి దానితో ఆడుకుంటాము. కాని పిహెచ్ఎస్ ప్రపంచం నుంచి కోరము. ఇదీ ముండకోపనిషత్తు సారాంశం.

## మంత్రం – 4

**తస్మై స హోవాచ। ద్వే విద్యే వేదితవ్యే ఇతి హ స్మ యద్**

**బ్రహ్మవిదో వదన్తి పరా చైవాపరా చ॥**

**ప్రతిపదార్థం:** తస్మై స ఉవాచ – అతనితో అతను చెప్పాడు; ద్వేవిద్యే – రెండు జ్ఞానాలు; వేదితవ్యే – తెలుసుకోవలసినవి; ఇతి – అని, హ యత్ – అవి; పరా చ ఏవ అపరా చ – పరావిద్య, అపరావిద్య; బ్రహ్మవిదః – మహాత్ములు; వదన్తి స్మ – చెబుతారు.

**తాత్పర్యం –** అంగిరసుడు శౌనకునితో చెప్పాడు, 'పరావిద్య, అపరావిద్య అని రెండు రకాల విజ్ఞానాలు ఉన్నాయి. రెండింటినీ తెలుసుకోవాలని మహాత్ములు చెపుతారు.'

**వివరణ:–** ముందు మంత్రంలో శౌనకుడు ప్రశ్న అడిగాడు. 'కస్మిన్ను భగవో విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతి' అన్నాడు. దానికి పరావిద్య నేర్చుకుంటే సర్వం తెలుస్తుందన్నది జవాబు. కాని అంత టూకీగా చెపితే అర్థమయ్యేది కాదు బ్రహ్మవిద్య. దానికి ముందు మనసుని సిద్ధం చేయాలి. స్థూలబుద్ధి నుంచి

సూక్ష్మబుద్ధికి తీసుకురావాలి గురువు. వెలుతురులోంచి చీకటిలోకి హఠాత్తుగా వస్తే కంటికేమీ కనబడదు. కొంచెంసేపు ఆ పరిసరాలకు అలవాటయ్యాక, ఆ చీకట్లో ఉన్న వస్తువులు కనబడతాయి. అది ఏ విద్యకన్నా వర్తిస్తుంది. మన లౌకిక విద్యలో కూడా చిన్న వయసులోనే అన్నీ చెప్పేయరు గదా! అథమపక్షం 18 ఏళ్ళు చదివితే కొంతమేరకు విద్యావంతుడయ్యాడు అంటారు. ఆఖరికి అన్నం కూడా హఠాత్తుగా పెట్టేయరు. అన్నప్రాసన రోజే ఆవకాయా నానుడి ఉంది.

అందుకని బుద్ధికి పదును పెట్టటానికి ఒక్కొక్కరూ ఒక్కొక్క పద్ధతిలో ఉపోద్ఘాతం చెపుతారు. ఇక్కడ గురువు రెండు విద్యల గురించి చెబుతాడు. అదికాక ఇంకో కారణం కూడా ఉంది. వేదాన్ని నమ్మని వారిని నాస్తికులనీ, వేదాన్ని నమ్మేవారిని ఆస్తికులనీ అంటారు. మనకు 6 నాస్తిక దర్శనాలూ, 6 ఆస్తిక దర్శనాలూ ఉన్నాయి. మనం నాస్తిక దర్శనాలను పట్టించుకోము. ఉపనిషత్తుల్లో బోధించిన అద్వైత సిద్ధాంతాన్ని నమ్మే మనను సిద్ధాంతులు లేదా ఉత్తర మీమాంసకులు అంటారు. తక్కిన ఐదు దర్శనాలూ వేదపూర్వభాగం లేదా కర్మకాండని అనుసరించి ఏర్పడినవి. వాటన్నింటినీ కలిపి పూర్వమీమాంస అనీ వారిని పూర్వపక్షులనీ అంటారు.

గురువు వేదాంతం బోధించేటప్పుడు ఈ పూర్వపక్షుల తప్పుడు అభిప్రాయాలని ఖండించాలి. వాటిని ఎంతఎక్కువగా ఖండిస్తే, అంత దగ్గరగా వెళతారు సత్యానికి. ఆ ఖండన ఎలా ఉంటుందో తరువాత మంత్రంలో చూద్దాము.

ఇప్పుడు మంత్రంలోకి వస్తే –

**తస్మై స హోవాచ –** అంగిరసుడు గురువు. శౌనకుడు శిష్యుడు. అంగిరసుడు శౌనకుడితో చెప్పాడు.

**ద్వే విద్యే వేదితవ్యే –** అతను ఒక విద్య గురించి అడిగాడు. కాని నువ్వు రెండు విద్యల గురించి తెలుసుకోవాలి అంటున్నాడు. అంగిరసుడు ప్రత్యేకించి చెప్పటం లేదు. ఇది పరంపరగా వస్తోంది.

**బ్రహ్మవిదః వదన్తి –** పూర్వ ఆచార్యులు చెప్పారు. తను కూడా చెబుతున్నాడు ఏమిటవి?

**పరా చైవ అపరా చ –** పరావిద్య, అపరావిద్య. కారణం బ్రహ్మగురించి చెప్పేది పరావిద్య. కార్యం జగత్తు గురించి చెప్పేది అపరావిద్య. వాటి వివరాలు ముందు మంత్రాల్లో వస్తాయి. ఇక్కడ పరావిద్య, అపరావిద్య అని రెండు విద్యలు

నేర్చుకోవాలని చెప్పినా, తర్వాత అపరావిద్యని అవిద్య అన్నారు. పరావిద్య కానిది అపరావిద్య.

పూజ్యస్వామీజీ వీటి రెండింటి తేడా చక్కగా చెప్పారు. పరావిద్య అనంతమైన బ్రహ్మ గురించి చెప్తుంది. అపరావిద్య కూడా అనంతమే. అపరావిద్యలో విద్య అనంతం. కాని దాని గురించిన మన జ్ఞానం అత్యల్పం. పరావిద్య అనంతమైన బ్రహ్మ గురించి చెప్పి, ఆ బ్రహ్మ నువ్వే అంటుంది. అందువల్ల మన జ్ఞానం అనంతం, సంపూర్ణం. అపరావిద్యని ఖండించటానికి దాని గురించి చెప్పినా, అది పరావిద్య అంత ముఖ్యమైనది. ఎందుకంటే పరావిద్యని పొందటానికి అది తోడ్పడుతుంది. అపరావిద్య వివేకాన్ని, చిత్తశుద్ధిని ఇస్తుంది. అందువల్ల పరావిద్యను పొందటానికి అపరావిద్య ద్వారంలోంచే వెళ్ళాలి. పరావిద్య పరమాత్మకు సంబంధించిన విద్య, శ్రేష్ఠమైన విద్య.

## మంత్రం - 5

**తత్రాపరా ఋగ్వేదో యజుర్వేదః సామవేదోఽ థర్వవేదః శిక్షా కల్పో**
**వ్యాకరణం నిరుక్తం ఛన్దో జ్యోతిషమితి। అథ పరా యయా**
**తదక్షరమధిగమ్యతే॥**

**ప్రతిపదార్థం:** తత్రాపరా – వాటిలో అపరావిద్య; ఋగ్వేదః – ఋగ్వేదం; యజుర్వేదః – యజుర్వేదం, సామవేదః – సామవేదం; అథర్వవేదః – అథర్వణ వేదం; శిక్షా – శబ్దశాస్త్రం; కల్పః – కర్మకాండలు; వ్యాకరణమ్ – వ్యాకరణం, నిరుక్తమ్ – నిఘంటువు; ఛన్దః – ఛందస్సు; జ్యోతిషమ్ – ఖగోళశాస్త్రం; జ్యోతిష్యం; ఇతి – ఇవి; అథ – ఇక; యయా – దేనిచేత; తత్ అక్షరం బ్రహ్మ – ఆ అక్షరం బ్రహ్మ; అధిగమ్యతే – పొందుతారో; పరా – పరావిద్య.

**తాత్పర్యం:** ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణవేదం, శిక్షా, కల్పం, వ్యాకరణం,నిరుక్తం, ఛందస్సు, జ్యోతిష్యమూ అపరావిద్యలోకి వస్తాయి. అక్షరం బ్రహ్మని ఏ జ్ఞానం చేత పొందుతారో అది పరావిద్య.

**వివరణ:** ఆచార్యుడు చెపుతున్నాడు వేద పూర్వభాగం అపరావిద్య, అంతభాగం పరావిద్య అని. వేద పూర్వభాగంలో కర్మకాండం, ఉపాసనాకాండం వస్తాయి. కర్మయోగం జ్ఞానాన్ని నిలబెట్టుకునే ఏకాగ్రతనిస్తుంది. కొంతమంది ఎంత త్వరగా అర్థం చేసుకుంటారో, అంత చటుక్కున మర్చిపోతారు. ఈ విషయం ఏ తల్లిని

కదిలించినా చెప్తుంది. ఇంట్లో తల్లి పరీక్ష పెడితే, అన్ని జవాబులూ సరిగ్గా రాసి నూటికి నూరు మార్కులు తెచ్చుకుంటారు పిల్లలు. కాని అసలు పరీక్షలో కొన్ని మర్చిపోతారు. రెండూ ఉన్నవారిని ఉత్తమ అధికారి అంటారు.

**తత్రాపరా –** ఈ రెండు విద్యల్లో ముందు అపరావిద్య గురించి చెప్తున్నాడు. నాలుగువేదాలు అందులోకి వస్తాయి. అక్కడ వేద పూర్వభాగం కలుపుకోవాలి.

**ఋగ్వేదమ్ –** పద్యరూప మంత్రాలు ఎక్కువగా ఉంటాయి.

**యజుర్వేదమ్ –** గద్యరూప మంత్రాలు ఎక్కువగా ఉంటాయి.

**సామవేదమ్ –** గీతరూప మంత్రాలు ఎక్కువగా ఉంటాయి. అందుకే సామగానం అంటారు.

**అథర్వణవేదమ్ –** అథర్వణ ఋషి, అంగిరస ఋషి దీనిని దర్శించారు.

నాలుగు వేదాలతో పాటు ఆరు అంగాలు కూడా అపరావిద్యలో వస్తాయి. వేదాలని అంగీలని, తక్కినవాటిని అంగాలని అంటారు. అవి –

1. **శిక్షా –** వేద మంత్రాల ఉచ్చారణ– ఫోనటిక్స్
   స్వరాలకు అనుదాత్త, ఉదాత్త, స్వరిత, దీర్ఘస్వరితలు ఉంటాయి.
   ఉదా: బ్రాహ్మణోస్య ముఖమాసీత్
   బాహూ రాజన్యః కృతః – పురుషసూక్తం
2. **కల్పః –** యజ్ఞాల వివరాలు, కర్మకాండలు – రిచ్యువలిస్టిక్ నో హౌ. ఒక యజ్ఞం చేయాలంటే హోమగుండం ఎలా ఉండాలి, ఆవుని అదుపులో పెట్టటానికి వాడే కర్రని చెట్టు నుంచి కోసేటప్పుడు ఏ మంత్రం చదవాలీ వగైరా.
3. **వ్యాకరణమ్ –** వ్యాకరణం – గ్రామర్.
   ఉదా – వేదః అంటే – నామవాచకం – వేదాలు
   వేద అంటే క్రియ – తెలుసుకోవటం.
4. **నిరుక్తమ్ –** నిఘంటువు – ఎటిమాలజీ
   ఒక పదం ఏ ధాతువు నుంచి వచ్చిందో తెలుస్తుంది. వేద, విద్ ధాతువు నుంచి వచ్చింది.
5. **ఛన్దః –** ఛందస్సు – మీటర్.

గాయత్రి, అనుష్టుప్, త్రిష్టుప్, ఇవన్నీ ఛందస్సులు. నిజానికి గాయత్రీ మంత్రం, గాయత్రీ దేవిని కొలిచేది కాదు. ఆ మంత్రం అసలు పేరు సావిత్రి మంత్రం. 3. పాదాల్లో, ఒక్కొక్క పాదంలో 8 అక్షరాలు ఉంటే, అంటే మొత్తం 24 అక్షరాలుంటే గాయత్రి అంటారు.

(మనకు తెలుగులో ఛందస్సుని గుర్తుపెట్టుకోవటానికి ఒక సూక్ష్మం ఉంది. (అది – యమాతారాజభానస)

6. **జ్యోతిషమ్ –** జ్యోతిష్యం ముఖ్యంగా ఖగోళ శాస్త్రం. జ్యోతిష్యశాస్త్రం తరువాత వస్తుంది. వేదకాలంలో జ్యోతిష్యం వాడేది మన జాతకం చూడటానికి కాదు, యజ్ఞయాగాదులు చేయటానికి లేదా విత్తనాలు నాటటానికి అనువైన సమయం చూడటానికి వాడేవారు.

జ్యోతిష్యశాస్త్రంలో– పంచ అంగాలు ఉంటాయి. తిథి,వార,నక్షత్ర, యోగ,కరణం. ఉదాహరణకు సెప్టెంబర్ 29, 2016 చూద్దాము – తిథి – కృష్ణ చతుర్దశి; వారం – గురువారం; నక్షత్రం – పూర్వఫల్గుణి; యోగం – శుభం; కరణం – విశిష్ట కరణం; ఈ ఐదింటినీ కలిపి పంచాంగం అంటారు.

ఇంతవరకూ చెప్పింది అపరావిద్య గురించి.

4 వేదాలు + 6 అంగాలు = అపరావిద్య.

మరి పరావిద్య ఏమిటి?

**యయా –** ఆ జ్ఞానం వల్ల,

**తత్ అక్షరమ్ అధిగమ్యతే –** అక్షరం బ్రహ్మను పొందుతాడు. బ్రహ్మని పొందుతాడు అంటే అదేదో వస్తువు, దాన్ని పొందుతాడు అని కాదు అర్థం. బ్రహ్మను గురించిన జ్ఞానం పొందుతాడు. ఆత్మ అజ్ఞానం తొలగటమే ఆత్మజ్ఞానం.

**ఏక, నిత్య, సార, సత్య వస్తువు గురించి చెప్పేది బ్రహ్మవిద్య.**

**ప్రత్యేక విశ్లేషణ:–** ఈ మంత్రం నాలుగు వేదాలు అపరావిద్యలోకి వస్తాయని చెప్పింది.

తత్రాపరా ఋగ్వేదో యజుర్వేద సామవేదోథర్వవేదః అంటే వేదాలు అపరా విద్య అయితే, పరావిద్య వేదాల బయట ఉందా? అప్పుడు దాన్ని వేద ప్రమాణంగా ఎలా భావిస్తాము? అప్పుడు పరావిద్య మోక్షాన్నెలా ఇస్తుంది అన్నది పూర్వపక్షుల

వాదన. ఉపనిషత్తు కూడా వేదంలో భాగమే, వేదాన్ని ప్రమాణంగా స్వీకరిస్తే వేద అంతభాగమైన ఉపనిషత్తులను కూడా ప్రమాణంగా తీసుకోవాలి అంటాడు సిద్ధాంతి. దాన్ని పూర్వపక్షులు పరిహసిస్తారు. వేదంలో ఒక భాగం అపరా విద్య, ఇంకో భాగం పరావిద్య అంటే అది ఎలా ఉందంటే సగం గుడ్డును పొదగాలి, సగం గుడ్డుతో ఆమ్లెట్ వేసుకోవాలి అన్నట్టు ఉంటుంది అంటారు.

శంకరాచార్యులు పరావిద్య అంటే ఏమిటో వివరిస్తారు. ఉదాహరణకు తైత్తిరీయ ఉపనిషత్తులోని 'సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ,' అన్న వాక్యాన్ని కృష్ణయజుర్వేదం అధ్యయనం చేసే విద్యార్థి కేవలం పఠిస్తే చాలదు. అలాంటి మంత్రాలను చదవటం, అపరావిద్య. యజ్ఞాల గురించి తెలుసుకుని, మంత్రాలను చదవటం, అపరావిద్య. యజ్ఞాల గురించి తెలుసుకుని, దాన్ని ఆచరణలో పెట్టటం కూడా అపరావిద్యే.

పరావిద్య అంటే అక్షరం బ్రహ్మను అర్థం చేసుకోవటం. ఈ జ్ఞానం బుద్ధిలో జరుగుతుంది. ఇది వృత్తి (ఆలోచన) జ్ఞానం. అంటే కేవలం ఉపనిషత్తు వాక్యాలను తెలుసుకుంటే చాలదు. వాటి అర్థం తెలుసుకోవటానికి గురువు దగ్గరికి వెళ్ళి, అహం బ్రహ్మాస్మి అని నేర్చుకోవటం. అందువల్ల అపరావిద్య పరావిద్యను నేర్చుకోవటానికి తోడ్పడుతుంది. అదీ ఈ రెండింటికీ మధ్య సంబంధం.

ఇక్కడ మళ్ళీ ఒక సందేహం కలుగుతుంది. వేదాంత అధ్యయనం చేసి జ్ఞానం పొందితే పరావిద్య అన్నారు. అలాగే కర్మకాండలోని అనేక యజ్ఞాల గురించి, అగ్నిహోత్రం లాంటిది, నేర్చుకుని అర్థం చేసుకుంటే అది పరావిద్య అవుతుందా? కాదు. అది కూడా అపరావిద్యే. ఎందుకంటే దాని ఫలితాన్ని పొందాలంటే అది చేయాలి. యోగాసనాల గురించి అంతా నేర్చుకుని, ఆసనాలు వేయకపోతే, వాటి ఫలితం వచ్చేస్తుందా? రాదు. ఇదీ అంతే. కర్మఫలం పొందాలంటే కర్మ చేయాలి.

## మంత్రం - 6

**యత్ తదద్రేశ్యమ్ అగ్రాహ్యమ్ అగోత్రమ్ అవర్ణమ్**
**అచక్షుః శ్రోత్రం తదపాణిపాదమ్।**
**నిత్యం విభుం సర్వగతం సుసూక్ష్మం**
**తదవ్యయం యద్భూతయోనిం పరిపశ్యన్తి ధీరాః॥**

**ప్రతిపదార్థం:** యత్ – ఏది; తత్ – అది; అద్రేశ్యమ్ – జ్ఞానేంద్రియానికి అందనిది; అగ్రాహ్యమ్ – కర్మేంద్రియాలకు అందనిది; అగోత్రమ్ – పుట్టుకలేనిది; అవర్ణమ్ – రంగు లేనిది; అచక్షుః శ్రోత్రం – కనులు చెవులు లేనిది; తదపాణిపాదం – చేతులు కాళ్ళు లేనిది; నిత్యం – చావులేనిది; సర్వగతం – సర్వ వ్యాపకమైనది; సుసూక్ష్మం – తేలిగ్గా అర్థం కానిది; అవ్యయం – నశించనిది; భూతయోనిం – జగత్‌కారణం; విభుం – అనేక రూపాలలో ప్రకటింపబడేది; పరిపశ్యన్తి – అలాంటిదానిని సర్వత్రా చూడగలరు; ధీరా – సాధనచతుష్టయ సంపన్నుడు.

**తాత్పర్యం:** బ్రహ్మ జ్ఞానేంద్రియాలకు, కర్మేంద్రియాలకు అందదు. చావు పుట్టుకలు లేవు. తనకి జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలులేవు. శాశ్వతం. సర్వవ్యాపకం. అర్థం చేసుకోవటం కష్టం. బ్రహ్మ నుంచే సర్వజగత్తు ఉద్భవించి, అనేక నామరూపాలతో భాసిల్లుతోంది. ఈ విషయాలు సాధన చతుష్టయ సంపన్నుడు తెలుసుకోగలడు.

**వివరణ:** పరావిద్య అక్షరంబ్రహ్మ అయితే, ఏమిటాబ్రహ్మ? ఈ మంత్రం బ్రహ్మ లక్షణాలను వివరిస్తుంది. చాలా సూక్ష్మమైన బ్రహ్మ గురించిన సూక్ష్మమైన వర్ణన. అంత తేలిగ్గా అర్థం కాదు. అయినా ముందు కష్టంగా ఉన్నా, ముందు ముందు స్పష్టంగా ఉంటుంది. వీలున్నంత తేలిగ్గా చూద్దాము.

**బ్రహ్మ అంటే సత్యం, జ్ఞానం, అనంతం బ్రహ్మ.**

ఒక్కొక్క ఉపనిషత్తు ఒక్కొక్క దాని గురించి వివరంగా చెపుతుంది. ఇక్కడ **సత్యం** తీసుకుంది. సత్యం అంటే సత్తా లేదా సత్. అంటే ఉనికి. ఇంగ్లీషులో ఎక్సిస్టెన్స్. వస్తువులను చూసినప్పుడు మనం – దేర్ ఈజ్ ఏ వాల్, దేర్ ఈజ్ ఏ మ్యాన్, దేర్ ఈజ్ ఏ బుక్ అంటాము. అలా అన్నింటికీ సమానంగా దేర్ ఈజ్ వాడతాము కాని ఈజ్‌ని పట్టించుకోము. ఆ ఈజ్ దాని ఉనికిని లేదా సత్తాని తెలుపుతుంది. ఉదాహరణకు ఈ గదిలో ఏముంది అని అడిగితే కుర్చీ ఉంది, బల్ల ఉంది, పుస్తకం ఉంది అంటూ ఎన్నో చెప్పుకుపోతాము కాని కాంతి ఉంది అని చెప్పము. కాంతి మనమీద పడుతున్నా మనం పట్టించుకోము.

వేదాంతం ఒక ప్రశ్న అడుగుతుంది.ఒక వస్తువు ఉంది అని అంటే ఆ వస్తువుకీ– ఉనికికీ ఏమిటి సంబంధం? విషయంలోకి ఎలా వెళ్ళామో చూసారా? దేర్ ఈజ్ తో మొదలుపెట్టాలి. తర్వాత అన్నింటికీ సమానంగా ఉన్న ఆ ఈజ్ ఏమిటి?

ఆ ఈజ్ ఏమిటి? వస్తువులో ఒక భాగమా, ఒక లక్షణమా, దాన్నించి ఉత్పత్తి అయిందా? కాదు.ఇది బాగా అర్థం చేసుకోవాలి. అద్వైత వేదాంత పరిచయం పుస్తకంలో ఈ విషయం వివరంగా ఉంది. చైతన్యం గురించి చెప్పేముందు, దాన్ని కాంతితో పోలుస్తాము.

ఒక పుస్తకాన్ని చేతిలో పట్టుకుని చూపిస్తున్నామనుకోండి. అప్పుడు మనకు కాంతి లక్షణాలు 5 తెలుస్తాయి. అవి –

1. కాంతి పుస్తకంలో ఒక భాగం గాని, లక్షణం గాని, దాన్నించి ఉత్పత్తి చెందింది కాని కాదు.
2. కాంతి స్వతంత్రం. అది పుస్తకం అంతటా వ్యాపించి, దాన్ని ప్రకాశింపజేస్తుంది.
3. కాంతి పుస్తకం సరిహద్దులకే పరిమితమవలేదు.
4. కాంతి పుస్తకం నాశనమయితే నాశనమవదు. అలా పుస్తకం పతనం చెందాక కూడా కాంతి ఉంటుంది.
5. కాంతి పుస్తకం తీసినా ఉంటుంది కాని కనపడదు. దాన్ని ప్రతిబింబింపజేసే మాధ్యమం లేదు కాబట్టి అది కనిపించదు. అంతమాత్రాన కాంతి లేనట్టు కాదు.

ఇప్పుడు ఇవే సూత్రాలను చైతన్యానికి అంటే సత్‌కి అన్వయిస్తూ తిరిగి చెప్పవచ్చు.

1. చైతన్యం శరీరంలో ఒక భాగం కాని, లక్షణం కాని దాన్నించి ఉత్పత్తి చెందింది కాని కాదు.
2. చైతన్యం స్వతంత్రం. అది శరీరం అంతటా వ్యాపించి, దాన్ని ప్రకాశింపజేస్తుంది.
3. చైతన్యం శరీరం సరిహద్దులకే పరిమితమవలేదు.
4. చైతన్యం శరీరం నాశనమయితే నాశనమవదు. అలా శరీరం పతనం చెందాక కూడా చైతన్యం ఉంటుంది.
5. చైతన్యం శరీరం లేకపోయినా ఉంటుంది. కాని కనబడదు. దాన్ని ప్రతిబింబింపచేసే శరీరం లేదు కాబట్టి అది కనిపించదు. అంతమాత్రాన చైతన్యం లేనట్టు కాదు.

అందువల్ల నిత్య, శుద్ధ, నిర్గుణ, సర్వవ్యాపక చిత్ రూపమే అక్షర బ్రహ్మ. ఎక్కడుంది అక్షరం బ్రహ్మ అంటే మనం దానికి జవాబు చెప్పకూడదు. ఎక్కడ

లేదు అని ఎదురుప్రశ్న వేయాలి. ఈజ్‌నెస్ రూపంలో ఉంది. అందుకే ఎవరో చాలా తేలిగ్గా దేవుడిని నిర్వచించారు. వాట్ ఈజ్ గాడ్? వాట్ ఈజ్ – ఈజ్ గాడ్ అంటే ఉన్నదే దేవుడు.ఆ ఈజ్‌నెస్ బ్రహ్మ.

ఇప్పుడు మంత్రంలోకి వెళ్దాము.

**అద్రేశ్యమ్ –** బ్రహ్మ అంతటా ఉంది కాని జ్ఞానేంద్రియాలకు దొరకదు. అద్రేశ్యమ్ అంటే కంటికి కనపడదు అని అర్థం. కాని ఇక్కడ అద్రేశ్యమ్ అంటే అన్ని జ్ఞానేంద్రియాలనీ పరిగణనలోకి తీసుకోవాలి. కఠోపనిషత్తులో ఈ విషయం వివరంగా వస్తుంది.

**అశబ్దమస్పర్శమరూపమవ్యయం**
**తథా రసం నిత్యమగన్ధవచ్చ యత్।** **కఠ 1-3-15**

ఎందుకు? బ్రహ్మ చూసే వస్తువుకాదు. చూడబడే నేను. ఉదాహరణకు మనం ఒక ఫోన్ చూపించి, ఇక్కడ ఏం ఉంది అని అడిగామనుకోండి. ఫోన్ ఉంది అంటారే కాని ఫోన్+సత్ ఉంది అనరు. అలా కనబడే జగత్తు బ్రహ్మ కాదు. జగత్తు బ్రహ్మ మీద ఆధారపడి ఉంది. కాని బ్రహ్మ జగత్తు మీద ఆధారపడి లేదు. ఉదాహరణకు మట్టి లేందే కుండ లేదు. కాని, కుండ ఉన్నా లేకపోయినా మట్టి ఉంది. అందుకని బ్రహ్మ జ్ఞానేంద్రియ అగోచరం.

**అగ్రాహ్యమ్ –** ఫోనుని కంటితో చూస్తే అది దృశ్యం. చేత్తో పట్టుకుంటే గ్రాహ్యమ్– బ్రహ్మ అగ్రాహ్యం అంటే కర్మేంద్రియ అగోచరం.

**అగోత్రమ్ –** గోత్రం అన్నది పుట్టుకతో వస్తుంది. ముండకం లోనే భారద్వాజాయ సత్యవహాయ అన్న గురువు వచ్చాడు. భారద్వాజ గోత్రానికి చెందిన వ్యక్తి. బ్రహ్మకు పుట్టుకే లేదు. బ్రహ్మ కార్యం కాదు కారణం.

**అవర్ణమ్ –** వర్ణంకి ఎన్నో అర్థాలున్నాయి. ఇక్కడ శంకరులు మూడు అర్థాలు చెపుతారు.

1. **రంగు –** మనిషి రంగుని తెలుపు, గోధుమ వర్ణం, నలుపు అంటాము. బ్రహ్మకు రంగు లేదు.
2. **వర్ణమ్ –** మనిషికి నాలుగు వర్ణాలున్నాయి. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర. బ్రహ్మకు జాతిబేధం లేదు.
3. **లక్షణమ్ –** మనిషికి కొన్ని లక్షణాలున్నాయి. పొడుగు, లావు, గుణాలలాంటివి బ్రహ్మకు లేవు. బ్రహ్మ నిర్గుణం.

**అచక్షుః శ్రోత్రమ్ –** అంతకు ముందేమన్నాం? అద్రేశ్యం. బ్రహ్మ జ్ఞానేంద్రియ అగోచరం. ఇప్పుడు అంతటా వ్యాపించి ఉన్న బ్రహ్మకు జ్ఞానేంద్రియాలు లేవు. కళ్ళు, చెవులు లేవు. ఇంద్రియాలు సూక్ష్మశరీరానికి చెందినవి. బ్రహ్మకు శరీరమే లేదు కాబట్టి జ్ఞానేంద్రియాలు లేవు.

**అపాణిపాదమ్ –** అంతకు ముందేమన్నాం? అగ్రాహ్యం. చేతితో పట్టుకోలేము. ఇప్పుడు బ్రహ్మకు కాళ్ళు, చేతులూ లేవు. అంటే కర్మ చేయలేదు. కర్మ చేయలేదు కాబట్టి కర్మఫలం కూడా అంటదు. అంటే అకర్తా, అభోక్తా.

ఎందుకు శాస్త్రం ఇది కాదు. అది కాదు అని అన్నీ వ్యతిరేక పదాలు చెప్పుకుంటూ పోతోంది? ఎందుకంటే మనం ఎవరు అంటే శరీరం లేదా ఇంద్రియాలు లేదా మనసు లేదా బుద్ధి అనుకుంటున్నాం. ఇవేవీ నువ్వు కాదు సుమా అని చూపించటానికి నేతి,నేతి (కాదు,కాదు) పద్ధతి ఎన్నుకుంది.

**నిత్యమ్ –** శాశ్వతం. అన్నీ నాశనమయినా అది ఉంటుంది. అగోత్రం అంటే పుట్టుకలేదు. నిత్యం అంటే చావు లేదు. ఉదాహరణ నా గాఢనిద్ర. నేను గాఢనిద్రలో ఉన్నప్పుడు శరీరం పనిచేయదు. ఇంద్రియాలు పనిచేయవు. మనసు పనిచేయదు. బుద్ధి పనిచేయదు. ఇవేవీ పనిచేయకపోయినా, నేను ఉన్నాను సత్ రూపంలో. అందువల్ల నిద్రలో అందరూ బ్రహ్మే. నిద్ర లేస్తేనే నామరూపాలూ, కర్మలూ, కర్మఫలాలూ వస్తాయి. నిత్యం అంటే చావు లేదు.

**విభుమ్ –** తరువాత చూద్దాము.

**సర్వగతమ్ –** ఆకాశంలాగా అంతటా వ్యాపించి ఉంది. బ్రహ్మ దేశకాలాలకు అతీతం. నిత్యం అంటే కాలపరిమితి లేదు. సర్వగతం అంటే దేశపరిమితి లేదు.

**సుసూక్ష్మమ్ –** అర్థం చేసుకోవటం చాలా కష్టం. బ్రహ్మ అంతటా ఉంటే నేనెందుకు చూడలేను? అంతటిలో నేనూ ఉన్నాను. నేను విడిగా ఉంటే చూడగలను. మనం ఇంతవరకూ నేర్చుకున్న లౌకిక విద్యలో చూసే వ్యక్తి వేరు, చూడబడే వస్తువు వేరు. దీన్ని డైకాటమీ అంటారు. మనం పొందే జ్ఞానం బాహ్యవస్తువు గురించి. కాని ఇక్కడ చూసే వ్యక్తి, చూడబడే వస్తువు, పొందే జ్ఞానం అన్నీ ఒకటే. అదే బ్రహ్మ. అదే నేను. ఇది అర్థం చేసుకోవటానికి ప్రయత్నించాలి.

అంతటా ఉన్న బ్రహ్మను వెతకటంలో అర్థం లేదు. అందులో నేను లేకపోతే బ్రహ్మ అంతటా ఉన్నట్లు కాదు. అందుకని బ్రహ్మ వస్తువుగా కనబడదు. అంటే నిర్గుణ బ్రహ్మ.

**అవ్యయమ్–** వ్యయం అంటే మార్పు. అవ్యయం అంటే మార్పు లేదు. బ్రహ్మ నిర్గుణ బ్రహ్మ కాబట్టి శరీరానికి ఉండే షడ్వికారాలు లేవు. అవయవాలు లేవు. కాబట్టి అవ్యయం. చక్షుశ్రోత్రం తదపాణిపాదం అని ముందు వచ్చింది కదా. అవ్యయం అంటే నిర్వికారం అనికూడా వస్తుంది.

**భూతయోనిమ్ –** యోని అంటే కారణం. భూమి తన నుంచి ఉద్భవించిన చెట్టు చేమలకు కారణం. భూమి చేతన, అచేతన వస్తువులకు కారణం. భూత అంటే పంచభూతాలు – ఆకాశం, వాయువు, అగ్ని, నీరు, భూమి. అలాగే పాంచభౌతిక శరీరాలు. అంటే బ్రహ్మ జగత్కారణం.

**విభుమ్ –** దీన్ని ఇక్కడ భూతయోనితో కలిపి చదవాలి. వివిధం భాతి ఇతి విభుః వివిధం అంటే అనేకంగా కనబడేది. ఉదాహరణకు మట్టి ఒకటే అది అనేకంగా అంటే కుండలా, కూజాలా, తులసికోటలా, ప్రమిదలా భాసిస్తోంది. బ్రహ్మ తెలిస్తే జగత్తు తెలిసినట్టు. ఎందుకు?

**కస్మిన్ను భగవో విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతి?**

ఏ ఒక్కటి తెలిస్తే సర్వమూ తెలుస్తుంది అన్నది ప్రశ్న. ఒక కుండ యొక్క పుట్టుక గురించి క్షుణ్ణంగా తెలిస్తే మట్టి ప్రపంచంలోని సమస్త వస్తువుల పుట్టుపూర్వోత్తరాల గురించి తెలిసినట్టే. అలాగే ఒక ఆభరణం గురించి తెలిస్తే బంగారు ప్రపంచంలోని సమస్త వస్తువుల పుట్టుపూర్వోత్తరాల గురించి తెలిసినట్టే.

బంగారం ఒక చిన్న ముక్కుపుడక నుంచి ఒక పెద్ద వడ్డాణం దాకా అన్నిటిలోనూ వివిధంగా ప్రకాశిస్తుంది. ఈ క్రింది హిందీ భజనను చూడండి

**హర్ దేశ్ మే తూ, హర వేష్ మే తూ,**
**తేరానామ్ అనేక్, తు ఏక్ హి హై.**

ఇందులో ఎంత గొప్ప అద్వైత సిద్ధాంతం ఉందో చూడండి.

ఏక, నిత్య, సార, సత్య కారణంబ్రహ్మ అనేక, అనిత్య, అసార, అసత్య, కార్యప్రపంచంలో భాసిల్లుతున్నాడు.

విభుమ్ అంటే అనేకంగా ప్రకాశించటం.

**ధీరాః –** ధైర్యశాలి అని కాదు. ఉపనిషత్తులలో ధీరః శబ్దం తరచు వస్తుంది. కఠోపనిషత్తులో అనేకసార్లు వస్తుంది. ధీరుడంటే సాధనచతుష్టయ సంపన్నుడు. వివేకంతో కూడిన వైరాగ్యం ఉన్నవాడు అని అర్థం. అంటే సన్యాసికుండే

ముముక్షుత్వం ఉంటుంది. అలాంటి వ్యక్తిలో అహింస, భూతదయ మెండుగా ఉంటాయి. ఇవి రెండూ నాణేనికి రెండు వైపులు.

ధీరాః కి ఇంకో అర్థం సూక్ష్మబుద్ధి, క్షురకత్తికుండే పదునైన సూక్ష్మబుద్ధి ఉండాలి. శాస్త్రాన్ని అర్థం చేసుకోవటానికి, దీన్ని పెంపొందించుకోవటానికి వేదాంతం ఆకాశ ధ్యానం సూచిస్తుంది. సగుణ బ్రహ్మ ఉపాసన తేలిక. మన ఇష్ట దేవతని ఊహించుకుని ధ్యానం చేయవచ్చు. కాని నిర్గుణ బ్రహ్మ ఉపాసన కష్టం. అందుకని నెమ్మదిగా ఆకాశ ధ్యానం నేర్చుకోవాలి. ధీరాః అంటే సూక్ష్మబుద్ధిగల అధికారి.
**పరిపశ్యన్తి –** బ్రహ్మని అంతటా చూసాడు. తను రోజు వాడే ఫోన్‌లో కూడా. పరిపశ్యంతి అంటే సర్వత్రా చూడటం.

## మంత్రం – 7

**యథోర్ణనాభిః సృజతే గృహ్ణతే చ**
**యథా పృథివ్యామ్ ఓషధయః సంభవన్తి।**
**యథా సతః పురుషాత్ కేశలోమాని**
**తథాఽ_క్షరాత్ సంభవతీహ విశ్వమ్॥**

**ప్రతిపదార్థం:** యథా – ఏ విధంగా, ఊర్ణనాభిః – సాలెపురుగు, సృజతే – బయటకు తీస్తుందో; గృహ్ణతే చ – లోపలికి తీసుకుంటుందో; యథా – ఎలా, పృథివ్యాం – భూమిలోంచి; ఓషధయ సంభవన్తి – చెట్టుచేమలు ఉద్భవిస్తాయో; యథా – ఎలా, సతః పురుషాత్ – సజీవ మనిషి నుంచి; కేశలోమాని – వెంట్రుకలు; తథా –ఆ విధంగా, అక్షరాత్ – నాశనంలేని బ్రహ్మ నుంచి; ఇహ – ఇక్కడ; విశ్వమ్ – జగత్తు; సంభవతి – ఉద్భవిస్తుంది.

**తాత్పర్యం –** ఎలా సాలెపురుగు తనలోంచి దారాలను బయటకు తీసి, మళ్ళీ తనలోకే తీసుకుంటుందో, ఎలా భూమిలోనుంచి చెట్టుచేమలు ఉద్భవిస్తాయో, ఎలా జీవమున్న మనిషినుంచి జీవం లేని వెంట్రుకలు పెరుగుతాయో, అలా నాశనం లేని బ్రహ్మ నుంచి ఈ జగత్తు ఉద్భవిస్తుంది.

**వివరణ:** ఈ మంత్రంలోకి వెళ్ళేముందు మనం కొన్ని సాంకేతిక పదాలని తెలుసుకొంటే ఇది అర్థం అవటం తేలిక. అవి ఉపాదాన కారణం, నిమిత్త కారణం, వివర్త ఉపాదానకారణం, పరిణామి ఉపాదాన కారణం.

**ఉపాదానకారణం –** ఏదైనా వస్తువును తయారుచేయటానికి వాడే ముడిపదార్థం ఉపాదానకారణం. ఒక నగకి ఉపాదానకారణం బంగారం. ఒక కుండకి ఉపాదాన కారణం మట్టి. దీన్ని ఇంగ్లీషులో మెటీరియల్ కాజ్ అంటారు.

**నిమిత్తకారణం –** ఏదైనా వస్తువును తయారుచేసే వ్యక్తి నిమిత్త కారణం. నగకు నిమిత్తకారణం కంసాలి. కుండకు నిమిత్త కారణం కుమ్మరి. దీన్ని ఇంగ్లీషులో ఇంటిలిజెంట్ కాజ్ అంటారు. పూజ్య స్వామీజీ నిమిత్తకారణం, ఉపాదాన కారణాలను ఇంగ్లీషులో మేకర్ అండ్ మెటీరియల్ అంటారు.

ఉపాదాన కారణం రెండు రకాలుగా ఉంటుంది.

**పరిణామి ఉపాదాన కారణం –** ఏదైనా వస్తువును తయారుచేయటానికి వాడే ముడిపదార్థం పరిణామం చెందితే దాన్ని పరిణామి ఉపాదాన కారణం అంటారు. ఉదాహరణ పాలు. పాలను పెరుగుతో తోడిపెట్టినప్పుడు, పాలు పెరుగుగా పరిణామం చెందుతుంది.

**వివర్త ఉపాదాన కారణం –** ఏదైనా వస్తువును తయారుచేయటానికి వాడే ముడిపదార్థం పరిణామం చెందకుండా అలాగే ఉంటే దాన్ని వివర్త ఉపాదాన కారణం అంటారు. ఉదాహరణ స్వప్నం చూసే నేను. నేను స్వప్నం చూస్తున్నా కూడా నేను పరిణామం చెందకుండా అలాగే ఉన్నాను.

ముందు మంత్రంలో రెండు ముఖ్యమైన పదాలున్నాయి. భూతయోనిం, విభుం. మామూలుగా అయితే ఉపాదాన కారణం జడం. నిమిత్తకారణం చేతనం. ఉదాహరణకు కుండ విషయం తీసుకుంటే ఉపాదాన కారణమైన మట్టి జడం. నిమిత్త కారణమైన కుమ్మరి చేతనం. ఈ రెండూ వేరు. కుండ అమెరికా వెళ్ళినా, కుమ్మరి ఎక్కడో తన కుగ్రామంలో మిగిలిపోతాడు. అందువల్ల అతను సర్వవ్యాపకం కాదు. కుండ ఎక్కడికి వెళితే మట్టి అక్కడికి వెళుతుంది. ఎందుకంటే కారణం లేకుండా కార్యం లేదు.

కాని బ్రహ్మ విషయంలో నిమిత్త, ఉపాదాన కారణాలు రెండూ బ్రహ్మే.
**భూతయోనిం –** నిమిత్తకారణం. కారణం అనేకం చేసింది.
**విభుం –** ఉపాదాన కారణం. కారణం అనేకం అయింది. రెండు కారణాలు వేరైతే, ఏ ఒక్కటి తెలుసుకుంటే సర్వం తెలుస్తుందో అన్న ప్రశ్నకి జవాబు రాదు. కార్యకారణ విలక్షణంగా చూస్తే మిగిలేది శుద్ధచైతన్యం.

7,8,9 మంత్రాలలో భూతయోనిం, విభుం పదాల వివరణ వస్తుంది. జగత్కారణం బ్రహ్మ గురించి తెలుస్తుంది.

కారణం కార్యంగా కనిపిస్తుంది అని చూశాము. బంగారం ముద్ద కారణం.అందులో అవ్యక్తరూపంలో నామరూపాలు ఉన్నాయి. అలాగే బ్రహ్మలో నామరూపాల జగత్తు అవ్యక్తంగా ఉంది. అవ్యక్త నామరూపాన్ని మాయాశక్తి అంటారు. బ్రహ్మ, మాయాశక్తి కలిసి జగత్ కారణ ఈశ్వరుడు. కేవలం బ్రహ్మ ఈశ్వరుడు కాదు, కేవలం నామరూపాలుకూడా ఈశ్వరుడు కాదు.

**బ్రహ్మ + మాయ = ఈశ్వరుడు.**

**బ్రహ్మాశ్రయా సత్త్వరజస్తమో గుణాత్మకా మాయా అస్తి – తత్త్వబోధ**

బ్రహ్మను ఆశ్రయించుకుని, సత్త్వ, రజో, తమో గుణములు గల మాయ ఉంది. అందువల్ల జగత్కారణం మాయాసహిత బ్రహ్మ అంటే ఈశ్వరుడు.

ఈశ్వరుడు నిమిత్తకారణమా, ఉపాదాన కారణమా? సృష్టికిముందు ఈశ్వరుడు ఒక్కడే ఉన్నాడు.

**సదేవ సౌమ్య ఇదమగ్ర ఆసీత్ ఏకమేవాద్వితీయం – ఛాందోగ్యం 6-2-1**

అయితే మరి సమస్య ఏమిటి? సృష్టికి నిమిత్త, ఉపాదాన కారణాలు రెండూ కావాలి. ఉపనిషత్తు దానికి జవాబు ఇస్తోంది. ముందు దాన్ని చూద్దాము. సాధారణంగా రెండూ వేరే అయినా, అరుదుగా రెండు కారణాలూ ఒకటే అయినది ఉంటుంది. దానికోసం ఎక్కడికి వెళ్ళాలి? హిమాలయాలకు వెళ్ళనవసరం లేదు. మన ఇంట్లోనే ఉంది, మనం టీవీనే తదేక ధ్యాన్యంతో రెండు కళ్ళూ అప్పచెప్పి చూస్తాం కాని, టీవీ వెనకనే మన కళ్ళు కప్పి గూడుకట్టుకున్న సాలెపురుగుని చూడము. సాలెపురుగే ఉపాదాన కారణం. నిమిత్త కారణం. అలాగే ఈశ్వరుడే రెండు కారణాలూ.

ఇప్పుడు మంత్రంలోకి వెళ్దాము.

**యథోర్ణనాభిః సృజతే గృహ్ణతే చ –** ఊర్ణనాభి అంటే సాలెపురుగు. ఉపనిషత్తు సరియైన పేరుని ఎన్నుకుంది. ఊర్ణా అంటే దారం. నాభి అంటే ఉదరం. ఊర్ణానాభే యశ్యత్ః ఊర్ణనాభిః సృజతే – తనలోంచే దారం తీసుకుని తన గూడుని కట్టుకుంటుంది. గృహ్ణతే చ – పై నుంచి దాన్ని కిందికి వదులుతుంది,

ఒక పురుగుని పట్టుకోవటానికి. మధ్యలో ఏదైనా ఇబ్బంది వస్తే చటుక్కున ఆ దారాన్ని తనలోకి లాగేసుకుంటుంది. అంటే అదే ఉపాదాన కారణం, నిమిత్తకారణం కూడా. యథా – అలాగే ఈశ్వరుడు కూడా.

దృష్టాంతాన్ని ఎంతవరకో, అంతవరకే తీసుకోవాలి. దాన్ని సాగదీయకూడదు. మరీ సాలె పురుగుతో పోల్చారా ఈశ్వరుడిని అనుకోకూడదు. దీనిద్వారా ఉపాదాన కారణం, నిమిత్త కారణం రెండూ ఈశ్వరుడే అన్న విషయాన్ని నిరూపించింది.

**యథా పృథివ్యామ్ ఓషధయః సంభవన్తి –** భూమి నుంచి అనేక చెట్లు, పొదలు, చిన్నమొక్కలు ఉద్భవించినట్లుగా, ఈశ్వరుని నుంచి అనేక రకాలు ఉద్భవించాయి. పిపీలికం నుంచి చతుర్ముఖ బ్రహ్మ వరకూ సృష్టిచేయబడ్డాయి. ఈ దృష్టాంతం ఎందుకు? మనిషి నుంచి మనిషి, ఆవు నుంచి ఆవు అలా దేనికి సంబంధించినవి అవి పుడతాయి కదా. మరి ఈశ్వరుని నుంచి ఇన్ని రకాలు ఎలా అన్న సందేహనివృత్తి కోసం ఈ ఉదాహరణ. భూమి నుంచి వృక్ష సముదాయాలు అనేకం పుట్టినట్టు, ఈశ్వరుని నుంచి అనేక నామ,రూపాలున్న జగత్తు ఉద్భవించింది.

**ఏకస్మాత్ కారణాత్ అనేక కార్య ఉత్పత్తిః**

జగత్తు బ్రహ్మకు భిన్నంగా లేదు. కాని బ్రహ్మ నుంచి వచ్చింది.

**యథా సతః పురుషాత్ కేశలోమాని–** ఏమి పరిశీలన! మనం జీవమున్న వారము. మన నుంచి పెరిగే జుట్టు, గోళ్ళు, జడం. చేతనమైన మన నుంచి అచేతనమైన జుట్టు, గోళ్ళు పెరుగుతున్నాయి. అవి అచేతనమని ఏమిటి నమ్మకం? అవి చేతనమైతే,బ్యూటీ పార్లర్లలో వాటిని కట్ చేస్తున్నప్పుడు అరుపులు ఉండేవి. సతః అంటే చేతన శరీరాలు, పురుషాత్ అంటే శరీరం; కేశలోమాని అంటే జుట్టు. అంటే చేతన శరీరం నుంచి అచేతనమైన వెంట్రుకలు ఎలా పెరుగుతున్నాయో అలాచేతన బ్రహ్మ నుంచి అచేతన జగత్తు ఉద్భవించింది.

ఈ మంత్రంలో మూడు ఉదాహరణలు ఇవ్వబడ్డాయి.వాటిని ఎంతమేరకు అవసరమో అంతమేరకే తీసుకోవాలి.

1. సాలెపురుగు నిమిత్త ఉపాదాన కారణం అయినట్టు, బ్రహ్మ నిమిత్త, ఉపాదాన కారణం.

2. పృథివి నుంచి వృక్ష సముదాయం పుట్టినట్టు, బ్రహ్మ నుంచి అనేక నామ,రూపాలు ఉద్భవించాయి.

3. జీవమున్న శరీరం నుంచి జడమైన కేశాలు పెరిగినట్టు, చేతన బ్రహ్మ నుంచి జడమైన కొండలు, రాళ్ళు కూడా ఉద్భవించాయి.

**తథాక్షరాత్ సంభవతీహ విశ్వమ్ –** ఆ విధంగా, అక్షరబ్రహ్మ నుంచి జగత్తు ఉద్భవిస్తుంది. అక్షరాత్ అంటే అక్షర బ్రహ్మ, మాయాసహిత బ్రహ్మ.

**ప్రత్యేక విశ్లేషణ –** సాంఖ్యశాస్త్రంలో ప్రకృతిని ఉపాదాన కారణం అనీ, అదే సర్వవ్యాపకం అనీ అంటారు.

వారు ఉపాదాన కారణం, నిమిత్త కారణం రెండూ ఒకటే అనరు. కాని శ్రుతి ప్రమాణాన్ని చూపిస్తే కాదనలేరు. అందుకని వారి తర్కంతో వారిని కొట్టవచ్చు. వారేమో కుమ్మరి తన నుంచి కుండని చేయడు అంటారు. కాని సాలెపురుగు చేస్తుంది అని మనం చెప్పవచ్చు.ఈ మంత్రాన్ని ఉదాహరణగా చూపవచ్చు. దీనితో సాంఖ్య తర్కం వీగిపోతుంది.

కొంతమంది సత్యాన్ని ఎలాగన్నా చేరవచ్చు అంటారు.వారు దానికి ఉదాహరణగా కొండమీద ఉన్న గుడిని చెబుతారు. ఆ గుడికి మనం ఎలాగన్నా వెళ్ళవచ్చు. కాలిబాటన లేదా బస్సులో లేదా హెలీకాప్టర్‌లో. నిజమే. కాని, గుడిలోకి అడుగుబెట్టాలంటే, ఉన్నది ఒకటే ద్వారం. ఈ ఒక్కవాక్యంతో మనం ప్రతివాదిని పడగొట్టవచ్చు.

ఒకచోట పిల్లి బెడద తప్పించుకోవటానికి ఎలుకలన్నీ సమావేశమయి, రకరకాల ఆలోచనలు చేస్తాయి.చివరికి వాటికొక అద్భుతమైన ఆలోచన కలిగింది. 'పిల్లి మెడలో గంటకట్టాలి,' చాలా భేషుగ్గా ఉందని మురిసి ముక్కలయిపోయాయి. ఒక ముసలి ఎలుక, కాని 'పిల్లి మెడలో ఎవరు గంట కడతారు?' అంది. ఈ ఒక్కవాక్యంతో చప్పబడిపోయాయి. అలాగే, తర్కంతో ఎంత పెద్దవాదన చేసినా, మనం ఒక్క సరియైన వాక్యం చెపితే చాలు. మొత్తం కూకటివేళ్ళతో సహా రాలిపోతుంది. మిగిలేది సిద్ధాంతం మాత్రమే.

సాంఖ్యశాస్త్రం తర్కప్రమాణంగా ఉంటే శాస్త్రం శ్రుతిప్రమాణంగా ఉంటుంది. శ్రుతి చెప్పింది వేదం.దాన్ని మనం తర్కంతో నిరూపించనఖ్ఖరలేదు. బ్రహ్మే ఉపాదాన, నిమిత్త కారణం అంటోంది శ్రుతి. ఇది తార్కికంగా లేదనటానికి

వీల్లేకుండా, ఊర్ణనాభి ఉదాహరణతో ఇచ్చింది శ్రుతి. బ్రహ్మ ముందు ఏమీ లేకపోతే ఉపాదాన కారణం ఎక్కడ్నుంచి వస్తుంది?

అందువల్ల **బ్రహ్మే మెటీరియల్ కాజ్, మేకర్ కూడా.**

చెట్లు భూమి నుంచి భిన్నంగా లేవు. భూమి నుంచి వచ్చాయి అన్న ఉదాహరణ ద్వారా ఇంకో సందేహనివృత్తి చేస్తోంది ఉపనిషత్తు. సాలెపురుగు నుంచి గూడు వచ్చాక, సాలెపురుగూ, గూడూ భిన్నంగా కన్పిస్తున్నాయి. అలా బ్రహ్మ నుంచి వచ్చిన జగత్తు బ్రహ్మకు భిన్నంగా ఉందా? అచేతనకార్యం అంతటా, చేతన బ్రహ్మ ఉంది. బ్రహ్మ లేకుండా జగత్తు లేదు. కాని జగత్తు లేకుండా బ్రహ్మ ఉంది. బ్రహ్మ మార్పు కూడా చెందటం లేదు. అందుకే బ్రహ్మ వివర్త ఉపాదాన కారణం.

జగత్తు బ్రహ్మ+నామరూపాలు అయితే, ఇవి ఎక్కడ్నుంచి వచ్చాయి? ఎక్కడ్నుంచో రాలేదు. బ్రహ్మ కాక వేరే ఏం లేదు. అవి అవ్యక్తంలో ఉన్నాయి. దీన్ని మాయ అంటారు. బ్రహ్మ = సత్, మాయ = అవ్యక్త నామరూపాలు. బ్రహ్మ+మాయ = ఈశ్వరుడు (భగవానుడు). విత్తనంలో చెట్టు అవ్యక్తంగా ఉన్నట్టు జగత్తు కూడా అవ్యక్తంగా ఉంది. అందుకని జగత్తు సృష్టించబడింది అని కాకుండా, వ్యక్తమయింది అనాలి.

## మంత్రం - 8

**తపసా చీయతే బ్రహ్మ తతోఽన్నమభిజాయతే।**

**అన్నాత్ప్రాణో మనః సత్యం లోకాః కర్మసు చామృతమ్॥**

**ప్రతిపదార్థం:-** తపసా చీయతే బ్రహ్మ – ఈశ్వరుడు, సంకల్పంతో సిద్ధంగా ఉన్నాడు; తతోఽన్నమభిజాయతే – దాన్నించి కారణావస్థ ఉద్భవించింది; అన్నాత్ప్రాణో మనః – అన్నం నుంచి ప్రాణం, మనసు; సత్యమ్ – పంచభూతాలు; లోకః – 14 లోకాలు; కర్మసు–కర్మలు; అమృతమ్ చ – కర్మఫలాలు పుట్టాయి.

**తాత్పర్యం:-** ఈశ్వరుడు సంకల్పంతో సిద్ధంగా ఉన్నాడు. దాన్నించి కారణావస్థ ఉద్భవించింది. దాన్నించి ప్రాణం, మనసు, పంచభూతాలు, 14 లోకాలు, కర్మలు, కర్మఫలాలు పుట్టాయి.

**వివరణ–** సాలెపురుగు ఉదాహరణ ఇచ్చినా, బ్రహ్మ నిమిత్త కారణం అని స్పష్టంగా లేదు. ఈ మంత్రంలో అది స్పష్టంగా తెలుస్తుంది. 8,9 మంత్రాల్లో జగత్తు ఈశ్వరుడినుంచి పుట్టినా అది ఉన్నట్టుండి ఉద్భవించలేదు అని తెలుస్తుంది. జగత్తు క్రమంగా వచ్చింది. ఉదాహరణకు ఒక విత్తనాన్ని తీసుకుని నానబెడితే, అది ముందు బాగా ఉబ్బుతుంది. దాని తరువాత చిన్న మొలకలు వస్తాయి. దాని తర్వాత మొక్కగా పెరిగి, కొంచెం చెట్టుగా పెరిగి, తర్వాత పెద్ద వృక్షమవుతుంది. మనం కూడా అంతే కదా. తల్లిగర్భంలో ఉండగా 80 కేజీలు లేము కదా!

అలా ఈశ్వరుని నుంచి ప్రపంచం 4 దశల్లో ఉద్భవిస్తుంది.

1. పూర్తి అవ్యక్త దశ. ఉదాహరణ – గాఢనిద్ర అవస్థ.
2. వ్యక్తంలోకి రావటానికి సిద్ధంగా ఉన్న దశ – ఉదాహరణ – క్రీడాకారులు పరుగుపందెంలో పరుగెత్తేముందు సగం వంగి సిద్ధంగా ఉన్న అవస్థ.
3. జగత్తు సూక్ష్మంగా వ్యక్తమయిన దశ– సమష్టి సూక్ష్మప్రపంచం– హిరణ్యగర్భ.
4. జగత్తు స్థూలంగా వ్యక్తమయిన దశ– సమష్టి స్థూలప్రపంచం – విరాట్.

ఈ నాలుగు దశలని ఇలా చెప్పవచ్చు

1. కారణావస్థ – ఒకటి
2. కారణావస్థ – రెండు
3. సూక్ష్మావస్థ
4. స్థూలావస్థ

ఈ నాలుగు దశలను వేదాంత పరిభాషలో ఈ మంత్రంలో చూస్తాము. **తపసా చీయతే బ్రహ్మ –** ఇక్కడ బ్రహ్మ అంటే ఈశ్వరుడు, మాయాసహిత బ్రహ్మ. తపసా చీయతే – తపసు వల్ల ఉబ్బాడు. అంటే సృష్టిచేయటానికి సిద్ధంగా ఉన్నాడు. దానికి సాంకేతిక పదం తపస్సు.

ఈ పదం తరువాత వచ్చే మంత్రంలో స్పష్టంగా వస్తుంది. ఇప్పుడు సిద్ధంగా ఉన్నాడు అని తెలుసుకుంటే చాలు. పరుగుపందెంలో పరిగెత్తేముందు వారివారి స్థానాల్లో సంసిద్ధంగా నిల్చుంటారు. తరువాత ఒక కాలు గీత మీద, ఒక చేయి నేల మీద పెట్టుకుంటారు. అంటే వారు విశ్రాంతిగానూ లేరు, పరుగు పెట్టడమూ లేదు, మధ్యదశలో ఉన్నారు.

అలాగే ప్రళయంలో భగవాన్ పూర్తి విశ్రాంతిలో ఉన్నాడు. సరిగ్గా సృష్టి చేసేముందు భగవంతుడు కూడా క్రీడాకారునిలా సిద్ధంగా ఉన్నాడు. ఎంత విశాలమైన సృష్టి! సూర్యమండలం,నక్షత్రాలు, భూమి, నదులు, కొండలు, జంతువులు, ఏకకణ జీవులు, అనేక కణాలున్న జీవులు, ఉభయచరాలు, కోతులు, మనుష్యులు! దీనికంతా ఎవరి సంసిద్ధత? భగవానుడిది. ఎంత అద్భుతం?

మన ప్రాజెక్ట్ ఎక్కడో తుస్సుమంటుంది. కాని భగవానుడిది అలా కాదు. మనమే ఆ భగవంతుడు అని తరువాత తెలుసుకుంటాము. ఇక్కడ గమనించాల్సిన విషయం తపసు అంటే సంసిద్ధత. బ్రహ్మ ఉబ్బుతున్నట్లుగా ఊహించుకోవాలి. ఇది కారణావస్థ ఒకటి నుంచి కారణావస్థ రెండు.

**తతోఽ న్నమభిజాయతే –** కారణావస్థ రెండులో ఈశ్వరుణ్ణి అన్నం అంటుంది ఉపనిషత్తు. అది సాంకేతికపదం. నిఘంటువులో దొరికే అర్థం కాదు. అన్నం అంటే సృష్టికి ముందు ఈశ్వరుడు. బ్రహ్మ నుంచి ఈశ్వరుడు. తరువాత ఏమి అవుతుంది?

**అన్నాత్ ప్రాణోమనః చ –** ప్రాణః అంటే సమష్టి ప్రాణశక్తి. మనః అంటే సమష్టి మనశ్శక్తి. అంటే ఒక్కముక్కలో చెప్పాలంటే సమష్టి సూక్ష్మ అవస్థ పుట్టింది. ప్రాణం, మనస్సు సూక్ష్మావస్థని సూచిస్తున్నాయి. అవే సూక్ష్మంగా గోచరిస్తున్నాయి.

వీటినే ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి అంటారు. ఈ మూడు శక్తులు ఉద్భవించాయి. వాటి నుంచి ఏం వచ్చాయి?

**సత్యం లోకాః –** సత్యం అంటే పంచభూతాలు అని అర్థం ఇక్కడ. అందుకే వీటిని వేదాంత పరిభాష అన్నారు. నిఘంటువు అర్థాలు వేరు. ఎందుకు పంచభూతాలను సత్యం అన్నారు? దీనికి వివరణ బృహదారణ్యకంలో దొరుకుతుంది. 2వఅధ్యాయంలో, 3వ ఖండం పేరు మూర్తామూర్త బ్రాహ్మణం. దానిలో సత్యం అన్న పదాన్ని వివరించారు.

**సత్ –** మూడు కనబడే భూతాలు– మూర్తభూతాని – అగ్ని, జలం, పృథ్వి

**త్యమ్ –** రెండు కనబడని భూతాలు– అమూర్తభూతాని – ఆకాశం, వాయువు.

**సత్+త్యమ్ –** మూర్తామూర్త భూతాని– పూర్తిగా పంచభూతాలు.

లోకాః అంటే 14 లోకాలు. ఇది స్థూల అవస్థ. చివరి దశ.

ఇప్పుడు టూకీగా చూస్తే–

| | |
|---|---|
| బ్రహ్మ | – కారణ అవస్థ ఒకటి. |
| అన్నం – ఈశ్వరుడు | – కారణ అవస్థ రెండు. |
| ప్రాణం, మనస్సు | – సూక్ష్మ అవస్థ. |
| సత్యం, లోకః | – స్థూల అవస్థ. |

దీనితో లోకసృష్టి అయింది. ఈశ్వర నుంచి హిరణ్యగర్భ, హిరణ్యగర్భ నుంచి విరాట్ సృష్టి జరిగింది. (అద్వైత వేదాంత పరిచయంలో సృష్టిక్రమం వివరంగా వస్తుంది.) తరువాత తక్కినవి. మనిషి పుట్టాకే సృష్టి పూర్తి అవుతుంది.

మనిషితో పాటు కర్మలు పుట్టాయి.

**కర్మసు–** జంతువులకు, వృక్షాలకు కావాలని చేసే కర్మలు లేవు. జంతువులకు ప్రణాళికలు లేవు. మనిషికే ఫ్రీవిల్ ఉంది. దానివల్ల ధర్మార్థకామమోక్షాలనే పురుషార్థాల వెంట పరుగులు తీస్తాడు. అందుకే కర్మసు.

**అమృతం–** కర్మ వల్ల ఏమవుతుంది? కర్మఫలం వస్తుంది. అమృతం పదానికి ఒక ప్రత్యేక అర్థం ఉంది. ప్రతిపదానికి ఒక ప్రత్యేక అర్థం ఉంది. అమృతం ఎందుకు? కర్మ ఫలం అశాశ్వతమే అయినా, దాన్ని అనుభవించే వరకూ అది ముగింపుకురాదు. అందుకని అమృతం. కర్మఫలంలో పుణ్యం, పాపం రెండూ ఉంటాయి. ప్రళయంలో కారణ అవస్థలోకి అంటే అవ్యక్తంలోకి వెళ్ళిపోతాడు మనిషి. క్షయమవని పుణ్యపాపంతో పునరపి జననం, పునరపి మరణం పొందుతూనే ఉంటాడు. ఈ సృష్టికి ఆది, తుది లేదు. ఇది ఒక చక్రం. అందుకని మొదటి జన్మ అని గాని, మొదటి సృష్టి అని కానీ లేదు. ఇది ఒక వృత్తంలో అవ్యక్తంలోంచి వ్యక్తంలోకి, వ్యక్తంలోంచి అవ్యక్తంలోకి తిరుగుతూ ఉంటుంది.

## మంత్రం – 9

**యః సర్వజ్ఞః సర్వవిద్యస్య జ్ఞానమయం తపః।**
**తస్మాదేతద్ బ్రహ్మ నామ రూపమన్నం చ జాయతే॥**

**ప్రతిపదార్థం:–** యః –ఎవరు; సర్వజ్ఞః – పరావిద్య తెలిసిన, సర్వవిత్ – అపరావిద్య తెలిసిన; జ్ఞానమయం తపః – తన తపశ్శక్తి చేత సంకల్పించాడు; తస్మాత్– మాయాశక్తి నుంచి; ఏతద్బ్రహ్మ – హిరణ్యగర్భ; నామరూపమ్ – నామరూపాలున్న స్థూలప్రపంచం; అన్నం చ – ఆహారం; జాయతే – పుట్టాయి.

**తాత్పర్యం –** పరావిద్య, అపరావిద్య తెలిసిన ఆ బ్రహ్మ తన తపశ్శక్తిచేత సంకల్పించాడు. ఆయనకున్న మాయా శక్తి నుంచి హిరణ్యగర్భ, నామరూపాలు, ఆహారం పుట్టాయి.

**వివరణ –** ముందు మంత్రంలో తపసు అన్న పదం వచ్చింది. తపసు అంటే సంసిద్ధత అని చూసాం. సంసిద్ధత ద్వారా అన్నం అవుతాడు అని కూడా చూసాము. ఇక్కడ సంసిద్ధత అంటే ఏమిటో మంత్రం మొదటి భాగంలో వస్తుంది. రెండవభాగం ఇంచుమించుగా ముందు మంత్రమే.

**సర్వజ్ఞః సర్వవిత్ –** భగవానుడు సృష్టికర్త కాబట్టి ఆయన జ్ఞానం అనంతంగా ఉండాలి. సర్వజ్ఞుడు అంటే పరావిద్య తెలిసిన వాడు. సర్వవిత్ అంటే అపరావిద్య తెలిసినవాడు. సర్వజ్ఞ అంటే సర్వమ్ జానాతి ఇతి సర్వజ్ఞః. సర్వవిత్ అంటే సర్వమ్‌వేత్తి ఇతి సర్వవిద్. ఒక విషయం గురించి తెలిసిన వాడు అని అర్థం. ఈశ్వరుడు సర్వజ్ఞ, సర్వవిత్ రెండూ. జ్ఞాని సర్వజ్ఞ మాత్రమే.అతనికి బ్రహ్మసత్యం జగత్‌మిథ్య అని తెలుసు. ఈశ్వరునిలాగా జగత్‌సృష్టికి కావాల్సిన జ్ఞానం లేదు. ఉదాహరణకు మన స్వప్నం మన జ్ఞానం నుంచి వచ్చింది. కోతిని చూడకపోతే అది మన కలలో రాదు. ఆయన సర్వవిత్ కాబట్టి అంతా తెలుసు.

**జ్ఞానమయం తపః –** ఒక వక్త తను మాట్లాడబోయే ముందు ఏం మాట్లాడాలో ఊహించు కున్నట్లుగా, ఒక గృహిణి వంట చేసే ముందు ఏం చేయాలో ఊహించుకున్నట్లుగా భగవంతుడు సృష్టి చేసేముందు దాన్ని ఊహించుకుంటాడు. దీన్నే సంకల్పం అంటారు. ఈ సంకల్పమే తపస్సు.

ఈ సంకల్పం చేయటానికి మనసు కావాలి. ఈశ్వరుని మనసు మాయాశక్తి. మాయా సంకల్పం చేత ఊహిస్తే;

**తస్మాత్ –** దాన్నించి (ఆ సంకల్పం నుంచి);

**జాయతే –** విశ్వం పుట్టింది,

**ఏతద్ బ్రహ్మ –** సూక్ష్మ అవస్థ – హిరణ్యగర్భ – సమష్టి ప్రాణశక్తి, ఇచ్ఛాశక్తి;

**నామరూపమ్ –** అనేక నామరూపాలున్న జగత్తు పుట్టాయి. రెండవ అధ్యాయంలో వివరంగా వస్తుంది.

**అన్నం చ –** అన్నం ముఖ్యం. ఇక్కడ అన్నం అంటే అన్నమే. అంటే ఆహారం. ముందు మంత్రంలో అన్నం అంటే కారణావస్థ అని చూసాము. ఎందుకిలా అనేక అర్థాలు? భాష్యకారులు సందర్భాన్ని బట్టి వ్యాకరణం, తర్కం, మీమాంసలు

ఉపయోగించి సరియైన అర్థాలు ఇస్తారు. బ్రహ్మసూత్రాల్లో ఈ తర్కం వివరంగా వస్తుంది. ఇక్కడ మనం ఓం ప్రథమంగా నేర్చుకుంటున్నాము కాబట్టి అర్థం మాత్రమే తెలుసుకుంటే చాలు.

రాబోయే ఖండంలో అపరావిద్య, పరావిద్య వివరణ బాగా వస్తుంది. ఇది సారాంశం లాంటిది.

**ప్రత్యేక విశ్లేషణ:-** సృష్టి ఎందుకు అన్ని ఉపనిషత్తులలోనూ ఒక్కలాగా లేదు.

**తైత్తిరీయం- ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః। ఆకాశాద్వాయుః। వాయోరగ్నిః। అగ్నిరాపః - అద్భ్య పృథివీ। పృథివ్యా ఓషధయ। ఓషధీభ్యోన్నమ్ ।అన్నా త్పురుషః।।**

ఆత్మ నుంచి ఆకాశం, ఆకాశం నుంచి వాయువు, వాయువు నుంచి అగ్ని, అగ్ని నుంచి జలం, జలం నుంచి పృథివి, పృథివి నుంచి చెట్లు, చెట్ల నుంచి అన్నం, అన్నం నుంచి పురుషుడు ఉద్భవించాడు.

**స మిథునముత్పాదయతే. రయిం చ ప్రాణం చేతి। - ప్రశ్న 1-4**

| | |
|---|---|
| మిథునం పుట్టాయి | - రయి, ప్రాణం జంటగా పుట్టాయి. |
| తర్వాత | - సూర్య, చంద్రులు |
| సంవత్సరం | - దక్షిణాయనం, ఉత్తరాయణం |
| మాసం | - శుక్లపక్షం, కృష్ణపక్షం |

అలా సాగుతుంది.

ఇలా భిన్నంగా ఎందుకు ఉంది? బ్రహ్మను కార్యకారణ విలక్షణ బ్రహ్మ అని నాలుగు దశల్లో తరువాత నిరూపిస్తాము కాబట్టి.

1. జగత్తుని కార్యంగా చూస్తాము.
2. ఆ కార్యాన్ని సృష్టించినది కారణం బ్రహ్మ అని తెలుసుకుంటాము.
3. కారణం బ్రహ్మను కార్యం జగత్తు నుంచి విడిగా తీయలేము. కారణం లేనిదే కార్యానికి ఉనికి లేదు అంటే కార్యం మిథ్య అవుతుంది.
4. కార్యం లేనిదే కారణత్వం లేదు. (కారణం లేదు అనకూడదు. కారణత్వ హెూదా ఉండదు.) మిగిలింది స్వచ్ఛమైన, శుద్ధమైన బ్రహ్మ.

అలా బ్రహ్మసత్యం, జగత్ మిథ్య అని నిరూపించబోయేటప్పుడు ఆ జగత్తు సృష్టి ఎలా వివరించినా ఒకటే. మిథ్యా వివరాలు ఎందుకు?

**దీన్ని అధ్యారోప అపవాదం అంటారు.**

**అంగిరసుని కథ**

చతుర్ముఖ బ్రహ్మ అంగిరసుణ్ణి తన బుద్ధిలోంచి ఉద్భవింపజేసాడు. అతనిని లోకక్షేమం కోసం వినియోగించాడు. అతనికి, మొదటే తేజస్సు ఉంది. తపస్సు చేసి ఇంకా తేజోవంతుడయ్యాడు. అతనికి అనేక శక్తులు, విభూతులు, లోకాలూ వశమయి కూడా తపస్సులో ఉండి వాటిని చూడలేదు.

కర్థమ ప్రజాపతికున్న తొమ్మిది మంది కుమార్తెలలో శ్రద్ధ అన్న ఆమెను వివాహం చేసుకున్నాడు. గృహస్థ జీవనం కూడా తపస్సులా చేశాడు.

అథర్వణ వేదాన్ని అథర్వాంగిర వేదం అనీ, అథర్వాంగిరసం అని కూడా అంటారు.

ఒకసారి అగ్నిహోత్రుడు అలిగితే, అంగిరసుడు అగ్నిస్వరూపుడై ప్రజ్వలించాడు. మళ్ళీ అగ్ని దేవుడు తప్పు తెలుసుకుని తిరిగివచ్చాక, అగ్నిదేవునికే ప్రథమస్థానం ఇచ్చి, తాను రెండో అగ్నిగా ఉన్నాడు. అనేకచోట్ల అగ్నికి 'అంగిర,' శబ్దం వస్తుంది.

అంగిరసుడు, ఒకసారి చిత్రకేతు మహారాజుకు పుత్రులు లేరని తెలిసి, ఆ రాజుచేత పుత్రకామేష్టియాగం చేయించాడు. అప్పుడు రాజుకు ఒక పుత్రుడు పుట్టాడు. ఆ పుత్రుడు చనిపోతే, అతన్ని నారదుని చేత బ్రతికించి, అంగిరసుడు రాజుకు తత్త్వబోధ చేసాడు.

# ప్రథమ ముండకం

## ద్వితీయ ఖండం

**ఉపోద్ఘాతం:** మొదటి ముండకంలోని మొదటి ఖండంలో, రెండురకాల విద్యలు ఉన్నాయని చూసాము. ఒకటి అపరావిద్య, రెండు పరావిద్య. ఈ ఖండంలో అపరావిద్య గురించి 1-11 మంత్రాలవరకూ ఉంది. వేదపూర్వభాగం లేదా కర్మకాండ గురించి బోధించేదాన్ని అపరావిద్య అంటారు. అది చాలా పెద్దభాగం. దాన్ని ఈ ఉపనిషత్తు 11 మంత్రాల్లో కుదించి, దాని సారాంశం మనకు అందజేసింది.

అపరావిద్య కేవలం లౌకిక విద్యమాత్రమే కాదు. ఆధ్యాత్మిక జీవనం కూడా. అందులో వేదాధ్యయనం, శిక్షా, కల్పా లాంటి విద్యలు కూడా ఉంటాయి. యజ్ఞయాగాదులకు కావాల్సిన విధివిధానాలు వివరంగా ఉంటాయి. అంటే ఒక వ్యక్తి తను చేయాల్సిన కర్మల గురించి వివరంగా తెలుసుకుని, ఆధ్యాత్మిక జీవనం గడుపుతాడు. ఒక గృహస్థు ఎన్నో యజ్ఞాలు చేయాలి. వాటిగురించి ఎక్కువగా మూడు వేదాల్లో వస్తుంది. ఋగ్వేదం మంత్రాలని ఇస్తే, యజుర్వేదం యజ్ఞాలు ఎలా చేయాలో నిర్దేశిస్తుంది. సామవేదం ఋగ్మంత్రాలని, ఈశ్వరుణ్ణి స్తుతి చేస్తూ గానం చేస్తుంది. ఈ యజ్ఞాలు చేయటం వల్ల యజమానికి దృష్టఫలం, అదృష్టఫలం కలుగుతాయి. అంటే ఇహలోక, పరలోక సుఖాలు కలుగుతాయి. కర్మకాండ చాలా శ్రమతో కూడుకున్నది.

కర్మలు సరిగ్గా చేస్తే ఏ ఫలం పొందుతారో వివరంగా చెబుతుంది. అలాగే అవి సరిగ్గా చేయకపోతే, ఏమవుతుందో కూడా చెబుతుంది. కొన్ని యజ్ఞాలు సరిగ్గా చేయకపోతే, పాపం రాకపోవచ్చేమో కాని, ఆశించిన ఫలితం రాదు. వారు సరిగ్గా చేసి, ఆశించిన ఫలితం పొందారే అనుకుందాం. అప్పుడు కూడా అది శాశ్వత ఫలం కాదు. వారు వెళ్ళేది అనిత్యలోకాలకు. ఎందుకంటే ఆ ఫలం పొందింది అనిత్య కర్మ చేసి. ఈ వివరాలు చెప్పే ఉద్దేశ్యం, సాధకునిలో వివేకం పెంపొందించి, తద్వారా వైరాగ్యం పెంచటానికి, అతను జ్ఞానమార్గంలోకి రావటానికి, అతన్ని అధికారిని చేయటానికి.

కర్మను యోగంగా మలచుకోవచ్చు. చిత్తశుద్ధి ఏర్పరచుకోవటానికి అనుగుణంగా చేసుకోవచ్చు. కర్మమీద వైరాగ్యం పెంచుకుంటే అది బద్ధకం, కర్మఫలం మీద వైరాగ్యం పెంచుకుంటే అది పరిపక్వత అని వివరిస్తున్నారు పూజ్య స్వామీజీ. కర్మఫలం మీద సంగత్వం లేకుండా కర్మ చేస్తే మనకు అంతఃకరణ శుద్ధి జరిగి, చిత్తశుద్ధి కలుగుతుంది. కర్మకాండ ఉద్దేశం ఇది. గీతలో కర్మయోగం మీద శ్రీకృష్ణభగవానుడు చెప్పిన బోధకి ఇదీ ఆధారం. ఆయన భగవానుడు కాబట్టి ఆయనకి ఆధారం అవసరము లేదు, కాని ఇది గీతకు ఆధారం అంటున్నారు పూజ్యస్వామీజీ.

కర్మకాండ గురించి టూకీగా –

మంత్రాల వివరణలోకి వెళ్ళేముందు మనంచేసే కర్మల గురించి కొన్ని వివరాలు తెలుసుకుంటే మంచిది. మనం చేసే కర్మలను మూడు తెగలుగా విభజించవచ్చు.

1. **కామ్యకర్మలు –** లౌకికపరమైన కోరికలు తీర్చుకోవటానికి చేసేకర్మలను కామ్యకర్మాణి లేదా సకామ కర్మాణి అంటారు. ఇవి మన ఆరోగ్యం కోసం, మనశ్శాంతి కోసం, బుద్ధి వికాసం కోసం చేసే కర్మలు. అంతేకాదు కుటుంబ సంక్షేమం కోసం, పరిసరాల వృద్ధికోసం, దేశాభివృద్ధి కోసం కూడా వీటిని చేస్తారు. ఒక్కముక్కలో చెప్పాలంటే ఈ కర్మలు సుఖప్రాప్తి కోసం.

2. **ప్రాయశ్చితకర్మలు –** ఏదైనా సమస్య వచ్చినప్పుడో, ఏదైనా బాధ కలిగినప్పుడో, కష్టకాలంలోనో చేసే కర్మలను ప్రాయశ్చిత్త కర్మలు లేదా పరిహార కర్మలు అంటారు. ఈ కర్మలు ఏదో పొందటానికి కాదు. ఏదో పోగొట్టుకోవటానికి చేసే కర్మలు. కామ్యకర్మలు, పుణ్యప్రాప్తి కోసం చేస్తే, ప్రాయశ్చిత్తకర్మలు పాప నివృత్తి కోసం చేసారు. ఒక్కముక్కలో చెప్పాలంటే ఈ కర్మలు దుఃఖనివృత్తి కోసం. ఈ రెండూ వ్యక్తిని బట్టి, అతని కోరికని బట్టి లేదా అతని సమస్యని బట్టి ఒక్కొక్కరికి ఒక్కొక్కలా ఉంటాయి. ఉదాహరణకు దశరథ మహారాజు పిల్లల కోసం పుత్రకామేష్టి యాగం చేసాడు. అదే యజ్ఞాన్ని కుచేలుడు చేస్తాడా? చేయడు. అందుకని ఈ కర్మలు అందరికి వర్తించవు.

ఈ కర్మలను త్రివిధ కర్మలు అంటారు. కాయిక, వాచిక, మానసిక కర్మలు. అంటే శరీరం, వాక్కు, మనసులతో చేస్తారు.

3. **విహిత కర్మలు–** ఇవి చాలా ముఖ్యమైన కర్మలు. కామ్య, పరిహార కర్మలు అందరికీ వర్తించవు అని చూసాము. ఈ కర్మలు అలా కాదు. అందరూ చేసి తీరాలి. వీటిని నియత కర్మాణి అని కూడా అంటారు. గీత 3వ అధ్యాయంలో వివరంగా వస్తుంది దీని గురించి.

వీటిని పంచమహాయజ్ఞాలు అంటారు. ఇవన్నీ గౌరవపూర్వకంగా చేయాలి. గౌరవపూర్వకంగా అన్నది గుర్తుంచుకోవాలి.

ఏ. **దేవయజ్ఞం –** దేవునికి చేసే పూజ. ఈశ్వర ఆరాధనం.లఘువుగా చేయవచ్చు. లేదా వివరంగా చేయవచ్చు. నామజపం, పారాయణం, ధ్యానం, సహస్రనామస్తోత్రం ఇవన్నీ వస్తాయి ఇందులో. శాస్త్రం ఎప్పుడూ ఇంత చేయి అని చెప్పదు.

పత్రం, పుష్పం, ఫలం, తోయం ఇస్తే చాలు అంటుంది. అది కూడా ఇవన్నీ అవటం లేదు. వీటిలో ఏదైనా చాలు అంటోంది. భక్తి ముఖ్యం. చాలామంది మానవసేవయే మాధవసేవ, అందుకని మాధవసేవ చేయనక్ఖరలేదు అనుకుంటారు. కాని అదొక అపోహ. వారు ఈక్వేషన్‌కి రెండోవైపు చూడటం లేదు. మానవసేవ = మాధవసేవ అయితే, మాధవసేవ = మానవసేవ అవ్వాలి కదా. దేవునికి అర్పించింది, ఇంకా రెట్టింపయి మానవాళికి అందుతుంది.

బి. **పితృయజ్ఞం –** తల్లిదండ్రుల మీద వారు జీవించి ఉండగా భక్తిశ్రద్ధలతో మెలగటం, వారు మరణించాక, వారికి శ్రాద్ధకర్మలు చేయటం. వారు ముక్తి పొందినా, పొందకపోయినా చేయాలి. వారు ఇక్కడ ఉండగా అంత గొప్పవారు (ప్రవర్తనాపరంగా) కాకపోయినా, పితృదేవతలు అయ్యాక వారికి శక్తి పెరిగి, మనను దీవిస్తారు. వారి అండదండలు మనకు లభిస్తాయి. ఇదికాక శ్రాద్ధకర్మలు పెట్టేటప్పుడు, ఒక మంత్రం శ్రాద్ధకర్మలు పొందనివారికి కూడా చెందాలని వస్తుంది. అలా పితృదేవతలను తృప్తిపరచినట్టవుతుంది.

సి. **ఋషియజ్ఞం–** మన ఆచార్యులు సనాతన ధర్మం కోసం ఎంతో పాటుపడ్డారు. శౌనక, అంగిరస ఋషులు లేకపోతే ముండక ఉపనిషత్తు

మనకు ఉండేది కాదు. అందుకని ఉపనిషత్తులను నేర్చుకోవటం (ఉపనిషత్తు క్లాసుకి వెళ్లటం) ఆచార్యులను స్తుతించటం, గీతాపారాయణం చేయటం ఋషియజ్ఞంలోకి వస్తుంది. మనం స్వాధ్యాయనం ప్రతిరోజూ చేయాలని శాస్త్రం నిర్దేశిస్తుంది. అది – రుద్రం(నమకం, చమకం), పురుషసూక్తం, విష్ణుసహస్రనామం, భగవద్గీత పారాయణం (రోజుకో అధ్యాయం), తైత్తిరీయ ఉపనిషత్తు (రోజుకో వల్లీ) చదవాలి. అలా రోజూ చదివితే అనూహ్యమైన మార్పు కలుగుతుందని ఆచార్యులు చెబుతారు.

డి. **మనుష్యయజ్ఞం–** ఇందాక చూసిన మానవసేవ. అది కూడా లక్షలు లక్షలు గుమ్మరించమనో, వెట్టిచాకిరీ చేయమనో చెప్పదు వేదం. ఏమీ చేయలేకపోయినా మన నిత్యపూజ తరువాత భక్తిగా కళ్ళు మూసుకుని సర్వేభవంతు సుఖినః అని మనస్ఫూర్తిగా కోరుకున్నా చాలు.

ఇ. **భూతయజ్ఞం–** ప్రకృతి ఆరాధన. పశుపక్ష్యాదులను, చెట్లు, చేమలను గౌరవపూర్వకంగా చూడటం. అందుకే మన సాంప్రదాయంలో ఆవుని, చెట్టుని పూజించటం ఉంది. ఈ రెండూ పశువులకు, వృక్షాలకు ప్రతీకలు. వాటిని హింసించకుండా, ఆరాధించాలి.

ఈ విహిత లేదా నియతకర్మలు ఎందుకు చేయాలో వివరిస్తూ గీతలో 4 కారణాలు వస్తాయి.

ఎ. **క్షేమం –** మనం కామ్యకర్మ, పరిహార కర్మలు చేస్తూ కోరుకునే ఆరోగ్యం, కుటుంబ క్షేమంలాంటి కోరికలు ఈ విహిత కర్మలు చేస్తే తీరతాయి. అక్కడ కోరికలు తీరినా తీరకపోయినా ఇక్కడ మనం కోరకుండానే ఆరోగ్యం, కుటుంబ క్షేమం లాంటి మంచి ఫలితాలు కలుగుతాయి.

బి. **ఆధ్యాత్మిక ఎదుగుదల –** చిత్తశుద్ధి ఏర్పడి, ఆధ్యాత్మికంగా ఎదుగుతాము. సాధన చతుష్టయ సంపత్తి పొందుతాము.

సి. **ఖచ్చితమైన ఫలం –** కామ్య, ప్రాయశ్చిత్త కర్మలు చేసినా ఫలాలు మనం చేసే విహిత కర్మల మీద ఆధారపడి ఉంటాయి. కామ్య, ప్రాయశ్చిత్త కర్మలు చేస్తూ విహితకర్మలు కూడా చేస్తే వున్నతమైన ఫలం దక్కుతుంది. విహితకర్మలు తక్కువ చేస్తే ఫలం కూడా ఆ స్థాయిలోనే ఉంటుంది. అసలు చేయకపోతే, ఆశించిన ఫలితం రాదు. అప్పుడు యజ్ఞం తప్పుగా చేయలేదు, కాని దానికి కావాల్సిన షరతులు పాటించలేదని అర్థం.

**డి. సమత్వం –** మనసు ఉన్నతంగా మారుతుంది. జీవితమే ఒక పాఠశాల అనుకుని, ప్రతి అనుభవం నుంచీ ఒక పాఠం నేర్చుకుంటాము. ప్రతి అనుభవమూ నేర్పి తీరుతుందని కాదు. నేర్చుకునే ఉద్దేశం ఉంటే నేర్పే అవకాశం ఉంది. లౌకిక సుఖాలు శాశ్వతం కాదు. మోక్షమే ముఖ్యం అని నేర్చుకోవాలి.

అది ఈ విహిత కర్మలు నేర్పుతాయి. గీతలో కృష్ణపరమాత్మ కర్మయోగాన్ని వివరిస్తున్నప్పుడు వాడిన నిర్వేదం అనే పదం **'నిర్వేదమాయాత్,'** అన్న ముండక మంత్రంలోంచి వచ్చింది. నిర్వేదం అంటే వైరాగ్యం, పరిపక్వత, ఆధ్యాత్మిక జీవన విలువ తెలియటం. కొంత మంది ఆధ్యాత్మిక ప్రసంగాలకు వెళ్ళరు. ఆ గంటలో ఏదైనా పని చేసి డబ్బు సంపాదించవచ్చు అనుకుంటారు. దానికి వెళ్ళాలంటే కొంత పరిపక్వత రావాలి.

అందువల్ల నియతకర్మ లేదా విహిత కర్మ చాలా ముఖ్యం. కామ్య, ప్రాయశ్చిత్త కర్మలు నియతకర్మ చేయకుండా చేస్తే, నిష్ప్రయోజనం. ఈ రెండూ చేయకపోయినా నియతకర్మ చేస్తే, ఫలితం అమోఘం. ఈ వివరాలను దృష్టిలో పెట్టుకుని, అపరావిద్యను బోధించే ఈ క్రింది మంత్రాలలోకి వెళ్దాము.

## మంత్రం – 1

**తదేతత్ సత్యమ్**
**మన్త్రేషు కర్మాణి కవయో యాన్యపశ్యన్**
**తాని త్రేతాయాం బహుధా సన్తతాని।**
**తాన్యాచరథ నియతం సత్యకామాః**
**ఏష వః పన్థాః సుకృతస్య లోకే॥**

**ప్రతిపదార్థం:–** తత్ – అది; ఏతత్ – ఇది; సత్యమ్ – నిజం; కవయః – ఋషులు; కర్మాణి – అనేక కర్మలను; మన్త్రేషు – మంత్రాలలో; యాని – వేటిని; అపశ్యన్ – దర్శించారు; తాని – వాటిని; త్రేతాయం – మూడు వేదాలలో; బహుధా సన్తతాని– అనేక విధాలుగా ప్రశంసించబడ్డాయి; తాని – వాటిని; ఆచరథ – ఆచరించండి; నియతం – జీవితాంతం; సత్యకామా – కర్మఫలం మీద కోరిక ఉన్న మనుషుల్లారా; ఏషః – ఇది, వః – మీ, పన్థా – దారి; సుకృతస్య – పుణ్యకర్మల; లోకే – ఫలం పొందటానికి.

**తాత్పర్యం –** మంత్రాలలో ఋషులు అనేక కర్మలను దర్శించారు. వాటిని మూడు వేదాలలో అనేక విధాలుగా ప్రశంసించారు.కర్మఫలం మీద కోరిక ఉన్న ఓ మనుష్యుల్లారా! మీరు ఈ మార్గాన్ని అనుసరించి కర్మఫలం పొందండి. ఇది సత్యం.

**వివరణ:– మన్త్రేషు కర్మాణి కవయో యాన్యపశ్యన్ –** కవయః అంటే కవులు కాదు. ఇక్కడ వేదఋషులు. వీరు శాస్త్రాన్ని ఔపోసన పట్టినవారు. సరిగ్గా తెలుసుకోగలిగినవారు. రేడియో తరంగాలను అందుకున్నట్లుగా వీరు తమ తపశ్శక్తితో భగవంతుని నుంచి శాస్త్రాన్ని అందుకున్నారు. అందుకే వీరిని మంత్రద్రష్టాః అంటారు. ఈ మంత్రాలు ఎందులో ఉన్నాయి?

**త్రేతాయం బహుధా సంతతాని –** త్రేతాయం అంటే త్రేతాయుగం కాదు. మూడు వేదాలలో ప్రశంసించబడ్డాయి. అవి ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం. అథర్వణ వేదంలో కర్మలు ఎక్కువగా లేవు.

**బహుధా సన్తతాని–** వేద పూర్వభాగంలో అంతటా వెదజల్లబడి ఉన్నాయి. అనేక యజ్ఞాలు– అగ్నిహోత్రం నుంచి అశ్వమేధయాగం వరకు ఉన్నాయి. ఏ టు జడ్ ఉన్నాయి అనటానికి ఇదొక పద్ధతి. యజ్ఞాలే యజ్ఞాలు వాటి నిండా.

**తాన్యాచరథ నియతం సత్యకామాః –** సత్యకామా అంటే కర్మఫలం మీద కోరిక ఉన్న మనుష్యుల్లారా – తాని ఆచరథ – వేదంలో చెప్పినట్టుగా చేయండి. ఒక వ్యాధి నయమవ్వాలంటే డాక్టరు చెప్పినట్టుగా మందులు వేసుకోవాలి. కర్మ చేయకుండా కర్మ ఫలం రాదు. వేదపారాయణం చేస్తే వాక్‌శుద్ధి వస్తుంది. అర్థం తెలిసినా తెలియకపోయినా, కామ్య, పరిహార కర్మలు కూడా ఫలం ఇచ్చే ప్రార్థనలు. కాని వీటికి కర్మ చేస్తేనే కర్మ ఫలం వస్తుంది. ముద్రల పుస్తకం కొనుక్కొని, తలకింద పెట్టుకుని పడుకుంటే ఆరోగ్యం బాగుపడదు. అందులో చెప్పినట్టుగా ముద్రలు వేయాలి.

కర్మలు కూడా మనకు తోచినట్టు చేయకూడదు. నియతం – వేదం నియమించిన ప్రకారం చేయాలి. ఉదాహరణకు డాక్టరుగారు రోజుకొక మాత్ర చొప్పున 5 రోజులు మందు వేసుకోమంటే, ఐదు రోజుల మాత్రలూ ఒకేసారి వేసేసుకుంటే పనిచేయదు. అలాగే ఉదాహరణకు అగ్నిహోత్రం తీసుకుంటే, అది రోజుకి రెండుసార్లు చేయాలి.

**సూర్యాయ స్వాహా, ప్రజాపతయే స్వాహా, ఇతి ప్రాతః – పొద్దున్న**

**అగ్నయే స్వాహా, ప్రజాపతయే స్వాహా, ఇతి సాయం– సాయంకాలం**

అగ్నిహోత్రం అన్ని కర్మలకు ప్రాథమిక కర్మ. అది చేయటానికి గృహస్థుడై ఉండాలి. కొన్నేళ్ళు అగ్నిహోత్రం చేసి, ఇంకా నల్లజుట్టు (కృష్ణకేశ) ఉండి, పుత్రుడు (జాతపుత్ర) ఉంటే, వేదాలు సూచించే మరికొన్ని కర్మలు చేయటానికి అధికారి అవుతాడు. దాన్ని అధికృతస్య అధికారః అంటారు. ఉదాహరణకు ఎమ్మే చేయాలంటే బియ్యే పాసయి ఉండాలి. ఇదికాక వయసు, మార్కులు లాంటి షరతులు ఏమైనా ఉంటే దాన్ని అధికృతస్య అధికారః అంటారు. ముందే ఉన్న అధికారానికి మరి కొన్ని అదనపు షరతులన్నమాట. అగ్నిహోత్రం చేస్తే దర్శపౌర్ణమాస యజ్ఞాలు చేయటానికి అధికారం వస్తుంది.

**ఏష వః పన్థాః సుకృతస్య లోకే–** కర్మఫలాలు పొందటానికి ఇదే మార్గం. ఇక్కడ లోకే అంటే కర్మఫలం. ఆ కర్మఫలంలో శాస్త్రం చెప్పే 14 లోకాలూ వస్తాయి. కర్మఫలం పొందటానికి కర్మ చేయటమే మార్గం అంటుంది శాస్త్రం.

కర్మలు చేస్తే కర్మఫలం యివ్వటమే కాక, ధర్మం పాటించేలా చేస్తాయి. ప్రతికర్మలోనూ ఈశ్వర ప్రార్థన ఉంటుంది. అలా అది అధ్యాత్మికం అవుతుంది. మంత్రాలు, కర్మలు, కర్మఫలాలు అన్నీ అపరావిద్య కిందకి వస్తాయి.

పుణ్యకర్మలు చేస్తే పుణ్యలోకాలకు వెళ్తామని గ్యారంటీ ఉందా? మనం ఏది కొన్నా దానికొక గ్యారంటీ కార్డు కావాలి. వేదంలో కూడా వెతుకుతాము. వేదం నుంచి కూడా కావాలి. వేదం ఈ హామీ ఈ విషయం చెప్పకముందే ఇస్తోంది. **తదేతత్ సత్యమ్–** శ్రద్ధాభక్తులతో చేయండి,ఫలితం పొంది తీరుతారు అంటోంది. పుర్వకాలంలో మాటలే నమ్మకం. ప్రామిసరీ నోటులు లేవు. ఇప్పుడు అవి ఉన్నా వాటికి విలువలేదు.

తత్ అంటే అది. ఏతత్ అంటే ఇది. అంటే ఉపనిషత్తు మనసులో ఉన్నది, కాని ఇంకా దాని గురించి చెప్పలేదు. ఉదాహరణకు మీరు నేను చెన్నై వెళ్ళినప్పుడు, ఈ వ్యక్తిని కలిసాను అంటారు. 'ఈ వ్యక్తి,' ఎవరో మీరు ఇంకా చెప్పలేదు, మీ మనసులో ఉంది. అలాగే ఉపనిషత్తు చెప్పబోయేది సత్యం అని ముందే హామీ ఇస్తోంది.

## మంత్రం - 2

**యదా లేలాయతే హ్యర్చిః సమిద్ధే హవ్యవాహనే।**
**తదాజ్యభాగావన్తరేణ ఆహుతీః ప్రతిపాదయేత్॥**

**ప్రతిపదార్థం:** యదా - ఎప్పుడు; సమిద్ధే - జ్వలిస్తూ ఉన్న, హవ్యవాహనే- అగ్నిలో; అర్చిః - జ్వాలలు, లేలాయతే హి తదా - ఎగిసిపడుతున్నప్పుడు; ఆజ్యభాగౌ అంతరేణ - రెండు పక్కలకు మధ్య; ఆహుతీః ప్రతిపాదయేత్ - ఆహూతులను సమర్పించాలి.

**తాత్పర్యం:-** జ్వలిస్తూ ఉన్న అగ్నిజ్వాలలు పైకి లేచినప్పుడు రెండు పక్కలకు మధ్య ఆహుతులను సమర్పించాలి.

**వివరణ -** అగ్నిహోత్రం ద్వారా కర్మవివరాలు చెప్తోంది ఉపనిషత్తు. అగ్నిజ్వాలలు బాగా ఎగిసిపడాలి. అలా అగ్ని ఎగిసిపడాలంటే, దానికి చాలా శ్రమపడాలి. వానాకాలంలో వాతావరణం తడిగా ఉన్నప్పుడు, కేవలం పొగ వస్తుంది.

ఈ మంత్రంలో ఉదాహరణగా అగ్నిహోత్రాన్ని చూపిస్తున్నారు. కర్మకాండలో ఎన్నో యజ్ఞాలుంటాయి. ఎక్కువగా అగ్నిహోత్రంతో కూడుకున్నవి అవి. కొన్ని మంత్రజపం చేసే కర్మలు కూడా ఉంటాయి. ఇక్కడ అగ్నిహోత్రం కర్మ. ఇది ప్రత్యేకమైనది. దీనికి రెండు హోదాలున్నాయి. నియతకర్మ, కామ్యకర్మ. దేనికి వాడితే అది అవుతుంది. ఎలా తెలుస్తుంది? సంకల్పంలో మార్చాలి. సంకల్పంలో- మమోపాత్త సమస్త దురిత క్షయద్వారా అని చెప్తున్నప్పుడు ఏదైనా కోరిక కోరితే అది కామ్యకర్మ అవుతుంది. శ్రీ పరమేశ్వర ప్రీత్యర్థం అగ్నిహోత్రం కరిష్యే అంటే నియతకర్మ అవుతుంది. నియత కర్మ చేస్తే ఆధ్యాత్మిక పుణ్యం - సాధన చతుష్టయ సంపత్తి పెరుగుతుంది.

అగ్నిహోత్రం చేసే వ్యక్తిని అగ్నిహోత్రి అంటారు. అగ్నిహోత్రం ఎలా, ఎప్పుడు చేయాలి, ఆహుతులు ఎప్పుడు, ఎక్కడ, ఏం వేయాలి లాంటి వివరాలన్నీ వేదమే చెప్తుంది.

**హవ్యవాహనే సమిద్ధే -** ముందు అగ్ని బాగా ప్రజ్వలించాలి. దానిలో ఆహుతులు వేయాలి. అవి కూడా ఇష్టమొచ్చినట్టు వేయకూడదు.

**లేలాయతే అర్చిః -** అగ్నిజ్వాలలు పైకి ఎగసిపడుతున్నప్పుడు;

**అజ్యభాగౌ అంతరేణ ఆహుతీః ప్రతిపాదయేత్-** ఆహుతులను మధ్యలో వేయాలి.

అజ్యభాగం అంటే అగ్నికి ఎడమవైపు లేదా కుడివైపు. అగ్నిహోత్రంలో ఆహుతిని కుడి, ఎడమల మధ్యభాగంలో వేయాలి.అగ్నిహోత్రి, అవహనీయ అగ్నిగుండం ముందు, తూర్పుతిరిగి కూర్చుని, ఉత్తర దక్షిణ దిశల మధ్యలోనున్న జ్వాలల్లో ఆహుతులను వేస్తాడు.

ఏ ఆహుతులు వేయాలో కూడా వేదమే చెప్తుంది. అగ్నిహోత్రి చేసే యజ్ఞాన్ని బట్టి అగ్నికి ఆహుతులు ఉంటాయి. వాహన అంటే తీసుకువెళ్ళేవాడు. అగ్ని కొరియర్ సర్వీసులాగా మనం ఎవరికి యజ్ఞం చేస్తే వారికి తీసుకువెళతాడు. వరుణాయ స్వాహా అంటే వరుణదేవునికి తీసుకువెళతాడు.

అగ్నికి ఉన్న ఇంకోపేరు హుతాసన. హుత అంటే ఆహుతిని ఆసన అంటే స్వీకరించేవాడు. తనకి వేసిన ఆహుతులను స్వీకరించేవాడు అని అర్థం.

ఇంతకు ముందు చూపినట్టుగా అగ్నిహోత్రాన్ని కామ్యకర్మగా చేయవచ్చు, నియత కర్మగా చేయవచ్చు.కామ్యకర్మగా చేస్తే ఇహలోక సుఖాలు, స్వర్గలోక ప్రాప్తి కలుగుతాయి. ఈ ఫలాలు కలిగినా ఇవి శాశ్వతం కాదు సుమా అని ఉపనిషత్తు ముందు, ముందు చెప్తుంది. అది తెలిస్తే కామ్యాగ్ని హోత్రాన్ని నిత్యాగ్నిహోత్రంగా మలచుకుని, సంకల్పం మారుస్తాడన్న ఉద్దేశం. కామ్యకర్మలను పూర్తిగా నిందించటం లేదు. ముందు వాటి గురించి సానుకూలంగా చెప్పి తరువాత వాటి లోటుపాట్లు ఎత్తి చూపుతుంది. కామ్యకర్మగా చేస్తే ఆ యజ్ఞాన్ని సరియైన పద్ధతిలో చేయాలి. ఆహూతులు సరిగ్గా వేయాలి. అగ్నిపైకి సరిగా లేవాలి. పొగలో చేస్తే కర్మ భస్మహోమం అవుతుంది. సరియైన ఫలితం రాకపోగా, వేరే ఫలితం రావచ్చు. ఫలితం గొప్పదే అయినా రిస్కుతో కూడుకున్నది. అదే చిత్తశుద్ధికోసం చేస్తే యజ్ఞం సరిగ్గా చేయకపోయినా (కావాలని నిర్లక్ష్యం చేయకూడదు. పొరపాటున పొరపాట్లు దొర్లినా) మంచి ఫలితం దక్కుతుంది.

## మంత్రం - 3

**యస్యాగ్నిహోత్రమ్ అదర్శమ్ అపౌర్ణమాసం**
**అచాతుర్మాస్యమ్ అనాగ్రయణమ్ అతిథివర్జితం చ।**
**అహుతమ్ అవైశ్వదేవమ్ అవిధినా హుతం**
**ఆసప్తమాంస్తస్య లోకాన్ హినస్తి॥**

**ప్రతిపదార్థం–** యస్య – ఎవరి; అగ్నిహోత్రమ్ – అగ్నిహోత్రం; అదర్శమ్ – అమావాస్య కాకుండా; పౌర్ణమాసమ్ – పౌర్ణమాసం లేకుండా; అచాతుర్మాస్యమ్ – చాతుర్మాస్యం లేకుండా; అనాగ్రయణమ్ – ఆగ్రయణం లేకుండా; అతిథివర్జితమ్ – అతిథిపూజ్యం లేకుండా; అహుతమ్ – సరియైన సమయంలో కాకుండా; అవైశ్వదేవమ్ – వైశ్వదేవ కర్మ లేకుండా; అవిధినా హుతమ్– విధిప్రకారం కాకుండా; తస్య – అతనికి; అపస్తమామ్– ఏడు; లోకాన్ – లోకాలను; హినస్తి – లేకుండా చేస్తుంది.

**తాత్పర్యం–** ఎవరైతే దర్శమ్, పూర్ణమాసమ్, చాతుర్మాస్యమ్ ఆగ్రయణమ్, అతిథిపూజ్యమ్, వైశ్వదేవ కర్మలు చేయరో, ఎవరు అగ్నిహోత్రం సరియైన సమయంలో, సరియైన పద్ధతిలో చేయరో, అతనికి ఏడు లోకాలనూ లేకుండా చేస్తుంది అగ్నిహోత్రం. యజ్ఞఫలం దక్కదు.

**వివరణ:–** కర్మఫలం పొందటానికి అనేక నియమాలున్నాయి. ముందుగా అగ్నిహోత్రం ప్రతిరోజూ చేయాలి. అదికూడా జీవితాంతం చేయాలి. ఇదికాక 8 షరతులు వర్తిస్తాయి. అగ్నిహోత్రంతోపాటు ఆరువైదిక యజ్ఞాలు చేయాలి. అవి ప్రధాన యజ్ఞానికి ఉపగ్రహాల లాంటివి.

1. **దర్శమ్ –** నెలకొకసారి అమావాస్య రోజు చేయాలి.
2. **పౌర్ణమాసమ్ –** నెలకొకసారి పౌర్ణమినాడు చేయాలి.
3. **చాతుర్మాస్యమ్ –** నాలుగు నెలలకి ఒకసారి చేయాలి. అంటే ఏడాదిలో మూడుసార్లు. సన్యాసులు చేసే చాతుర్మాస్య దీక్ష కాదు. దానికి వారు నాలుగు నెలలపాటు ఒకేచోట ఉంటారు.
4. **ఆగ్రయణమ్ –** పంటనూర్పులప్పుడు చేయాలి. ఏడాదికి రెండుసార్లు కొత్త పంటతో వంటచేసి, దాన్ని అగ్నికి ఆహుతి చేయాలి.
5. **అతిథిపూజ్యమ్ –** ప్రతిరోజూ అతిధికి భోజనం పెట్టాలి. అతిథి అంటే అనుకోకుండా వచ్చే వ్యక్తి. భోజనానికి కూర్చునేముందు, ఎవరైనా భిక్షకోసం వచ్చారా అని చూసి వారికి భోజనం పెట్టాలి.
6. **వైశ్వదేవమ్ –** ఇది కూడా ప్రతిరోజూ చేయాలి. వైశ్వదేవతలు పదిమంది ఉంటారు. వాళ్ళకు మనం భోజనం చేసే ముందు ఆహారాన్ని సమర్పించాలి. అలా చేయటం వల్ల అన్నశుద్ధి కలుగుతుంది. దాన్ని భూతయజ్ఞంగా చేయవచ్చు. అగ్నిహోత్రం మంచి ఫలితం సాధించాలంటే ఇంకో రెండు షరతులు వర్తిస్తాయి.

7. **హుతమ్‌–** అగ్నిహోత్రం రోజుకు రెండుసార్లు చేయాలి. పొద్దున్న, సాయంకాలం.

8. **విధి–** అగ్నిహోత్రం చేయటానికి ఒక క్రమపద్ధతి ఉంటుంది. ఏ ఆహుతి ఎప్పుడు, ఎలా వేయాలి అనే నియమాలు ఉంటాయి. అలా చేయాలి.

ఈ ఎనిమిది షరతులూ పాటిస్తేనే కామ్యాగ్ని హోత్రం విజయవంతంగా సాగి, మరణం తర్వాత స్వర్గానికి తీసుకునిపోతుంది. అలా చేయకపోతే స్వర్గానికి పోకపోగా కింద లోకాల్లో పడవచ్చు.

దర్శం, పౌర్ణమాసం, చాతుర్మాస్యం, అగ్రయణం, అతిథిపూజ్యం, వైశ్వదేవం చేయని వ్యక్తికి, ఆహుతులను వేదం విధించిన పద్ధతిలో సమర్పించని వ్యక్తికి ఏం జరుగుతుంది?

**ఆ సప్తమాంస్తస్య లోకాన్‌ హినస్తి–**సాధకుడిని నాశనం చేసి, ఏడు తరాల వరకూ అతని వంశాన్ని నాశనం చేస్తుంది. ఏడు తరాలు నాశనం అవుతాయి. అంటే, ఏడు తరాల వరకూ ఎవరూ పిండం పెట్టరు. శ్రాద్ధకర్మలుచేయరు అని శంకరాచార్యుల వారు చెప్తున్నారు.

ఏడు లోకాలు పొందరు అన్నది ఇంకో అర్థం. ఆ ఏడులోకాలు ఏమిటి? భూ, భువ, సువ, మహ, జన, తప, సత్యలోకం. అవి పొందరు. దాని బదులుగా వచ్చేది ఏమిటి? ఆయాసం, ఎండ, వేడి, పొగ,కన్నీళ్ళు.

## మంత్రం - 4

**కాలీ కరాలీ చ మనోజవా చ సులోహితా యా చ సుధూమ్రవర్ణా।**

**స్ఫులింగినీ విశ్వరుచీ చ దేవీ లేలాయమానా ఇతి సప్తజిహ్వాః॥**

**ప్రతిపదార్థం:–** యా – ఎవరు; కాలీ – ముదురునీలంగా; కరాలీ – భీతిగొల్పేదిగా; మనోజవా – మనోవేగం గలది; సులోహితా – ముదురు ఎరుపులో; సుధూమ్రవర్ణ – పొగ రంగులో; స్ఫులింగినీ – చిటపట లాడుతూ, విశ్వరుచీ – అనేక రంగులతో; దేవీ – మెరిసే; లేలాయమానాః – అంతటా కదిలే; సప్తజిహ్వాః – ఏడు నాలుకలు; ఇతి – అవుతాయి.

**తాత్పర్యం–** కాలీ, కరాలీ, మనోజవా, సులోహితా, సుధూమ్రవర్ణా, స్ఫులింగినీ, విశ్వరుచీ అనే ఏడూ పైకెగసి ప్రకాశంతో మండే అగ్ని యొక్క ఏడునాలుకలు అవుతాయి.

**వివరణ–** అగ్ని జ్వాలలు పైకి ఎగసినప్పుడు ఆహూతులను వేయాలని ఇంతకుముందు మంత్రాలలో వచ్చింది. 'లేలాయతే,' అన్న విశేషణాన్ని వాడింది. ఇందులో 'దేవీ,' అంటోంది. ఎందుకు అగ్నిజ్వాలలు పైకి లేవాలో ఇందులో చెప్తోంది. సరియైన ఫలితం పొందని యజ్ఞం బూడిదలో పోసిన ఆహుతి అవుతుంది.

బాగా ఎగసిపడే అగ్నికి సప్తజిహ్వలు– ఏడు నాలుకలు ఉంటాయి. ఎప్పుడూ మంచులోనే ఉండే ఎస్కిమోలు మంచుకి అనేకపేర్లు పెట్టుకున్నట్టుగా ఎప్పుడూ ఎగిసిపడే అగ్నిజ్వాలలనే తదేక దీక్షతో చూసే ఋత్విక్కులు అగ్నిజ్వాలల్లో ఏడు రకాలున్నాయని పేర్కొన్నారు.

**లేలాయమానా ఇతి సప్తజిహ్వా–** ఏడు జ్వాలలు. ఆ ఏడు జ్వాలలూ బాగా కనపడాలి. అప్పుడే అగ్ని ఆహుతులను స్వీకరించగలదు. అంటే ఆహుతులను స్వీకరించేందుకు నోరు బాగా తెరవాలి. చిన్నపిల్లవాడు నోరు బాగా తెరిస్తే తినగలిగినట్టుగా.

ఆ ఏడు నాలుకలూ–

1. **కాలీ–** పొగమధ్యలో కనబడే ముదురునీలం మంట. సమిధల్లో కొంచెం తడి ఉన్నప్పుడు వస్తుందిలా.
2. **కరాలీ–** భీతిగొల్పేది. అది ఒక్కసారిగా ఎంత భీకరంగా ఎగిసిపడుతుందంటే, మనం ఉలిక్కిపడి వెనక్కి వంగుతాము.
3. **మనోజవా–** మనోవేగంతో ఉండేది. మనసులోని ఆలోచనలు కదిలినంత వేగంగా, ఈ జ్వాలలు వచ్చీ, మాయమవుతాయి.
4. **సులోహితా–** చిక్కటి, ఎఱ్ఱటి జ్వాల. అందులో ఎక్కువగా కార్బన్ ఉండటం వల్ల ఆ ఎఱుపు రంగును సంతరించుకుంటుంది.
5. **సుధూమ్ర వర్ణా–** పొగ రంగులో ఉంటుంది.
6. **స్ఫులింగినీ–** చిటపటలాడుతుంది. దీపావళి టపాకాయలాగా, చిన్న చిన్న పొడి సమిధలు ఎక్కువ ఉంటే అవుతుందిలా.
7. **విశ్వరుచీ–** అనేక రంగుల జ్వాల. రుచీ అంటే రంగు. ఒక్కజ్వాలలోనే అనేక రంగులు గోచరిస్తాయి. లేదా అన్నివైపులకు ఎగిసిపడుతుంది.

**దేవీ–** ప్రజ్వలించేది;

**లేలాయమానా –** అన్నది ఎలా జ్వాలకి విశేషణమో, అలా దేవీ అన్నది ఒక్కొక్క జ్వాలకీ విశేషణం. అగ్నిదేవత అంటాము.

**సప్తజిహ్వాః–** ఏడు నాలుకలూ, ఏడు దేవతలు. ఇలా ఏడుజ్వాలలతో నోరు తెరిచిన అగ్నికి ఆహుతులు వేయాలి. అంటే అది చాలా శ్రమతో కూడిన పని.

## మంత్రం – 5

**ఏతేషు యశ్చరతే భ్రాజమానేషు యథాకాలం**
**చాహుతయో హ్యాదదాయన్।**
**తం నయన్త్యేతాః సూర్యస్య రశ్మయో**
**యత్ర దేవానాం పతిరేకోఽధివాసః॥**

**ప్రతిపదార్థం–** ఏతేషు భ్రాజమానేషు – ప్రజ్వలిస్తున్న అగ్నిలో; యథాకాలమ్ – సరియైన సమయంలో; యః చరతే –ఆహుతులు ఎవరు వేస్తారో; తమ్ – అతనిని; ఆదదాయన్ – ఆహుతిపొందిన; ఏతా ఆహుతయః – ఆహుతి దేవతలు; కర్మదేవతలు; సూర్యశ్యరశ్మయః– సూర్యుని కిరణాల ద్వారా; యత్ర – ఎక్కడ; దేవానాం పతిః – దేవతల నాయకుడు; ఏకః –ఒక్కడే అయినవాడు; అధివాసః – నివసిస్తాడో; నయన్తి – అక్కడికి తీసుకుపోతాయి.

**తాత్పర్యం –** ఎవరు ప్రజ్వలిస్తున్నఅగ్నిలో సరియైన సమయంలో ఆహుతులు వేస్తారో, వారిని ఆయా దేవతలు సూర్యమార్గం ద్వారా స్వర్గలోకానికి తీసుకువెళ్తాయి.

**వివరణ–** ఈ మంత్రంలో సానుకూల ఫలితం ఏమిటో చెప్తుంది ఉపనిషత్తు. సరియైన సమయంలో, సరియైన ఆహుతులను ఇస్తే వారికి స్వర్గలోక ప్రాప్తి కలుగుతుందన్నది టూకీగా ఈ మంత్రం అర్థం.ఏవి?

**యః చరతే –** అంటే ఏ ఆహుతులు ఇవ్వాలో అవి ఇవ్వాలి, ఇష్టం వచ్చినవి కావు.ఎప్పుడు?

**యథాకాలం –** అంటే ఎప్పుడు చేయాలో అప్పుడు చేయాలి. అంతకు ముందు చూసాం అగ్నిహోత్రం – ఉదయం, సాయంకాలం – రెండుసార్లు చేయాలని. ఎంతోసేపు పట్టదు దానికి. కాని అది నియమించిన సమయంలో కాకుండా, అందరికీ వీలని పుట్టినరోజు వేడుకలను ఆదివారం చేసినట్టు, పదకొండు గంటలకు లేచి, అప్పుడు చేయకూడదు.ఎక్కడ?

**ఏతేషు భ్రాజమానేషు–** ప్రజ్వరిల్లుతున్న అగ్నిలో వేయాలి. ఏమవుతుంది?

**దేవానాం పతిరేకో అధివాసః** –స్వర్గలోకానికి వెళ్తాడు. దేవతలకు అధిపతి ఇంద్రుడు ఉంటాడు. అక్కడ ఏకః – అతనొక్కడే అధిపతి. స్వర్గలోకంలో ఒక పౌరుడుగా ఉండాలి తప్పితే ఇంద్రపదవి రాదు.ఎవరు?

**ఆహుతయ–** కర్మదేవతలు లేదా ఆహుతి దేవతలు తీసుకువెళతారు.ఎలా?

**సూర్యస్యరశ్మయః–** భూమిని, స్వర్గాన్ని కలిపే సూర్యకిరణాల ద్వారా తీసుకువెళతారు.

ఈ మంత్రంలో ఏలోకం, ఏ గతి అన్నది ముఖ్యం కాదు. అందుకని సాధారణ అర్థం తీసుకోవాలి.కేవల కర్మ చేసిన వ్యక్తి కృష్ణగతి ద్వారా ఊర్ధ్వలోకం వెళతాడు. కర్మ చేస్తే కలిగే పుణ్యాన్ని అపూర్వం అంటారు. ఉపగ్రహ కర్మలతో కలిపి చేస్తే వచ్చే కర్మఫలాన్ని ఉత్పత్తి అపూర్వఫలం అంటారు.

స్వర్గంలో రాచమర్యాదలు జరుగుతాయా? ఆ సందేహం అక్ఖరలేదంటోంది ఉపనిషత్తు. తరువాత మంత్రంలో ఎలా స్వర్గంలో ఆహ్వానిస్తారో, ఎలా కీర్తిస్తారో, వివరంగా వస్తుంది. కాని మనను ఇవేమీ ప్రలోభపెట్టలేవు. ఎందుకంటే మనం జ్ఞానమార్గంలో ఉన్నాము కదా. జ్ఞానికి ప్రయాణం లేదు. ఇక్కడే ఇప్పుడే జీవన్ముక్తి, మరణించాక విదేహముక్తి కలుగుతాయి.

వేదంలో నిర్దేశించిన అగ్నిహోత్రంలాంటి కర్మను ఇప్పుడు కాలానుగుణంగా మార్చుకోవచ్చును. కర్మ అంటేనే వికల్పం చెందేది. ప్రత్యామ్నాయాలు ఉండేది అని అర్థం. కలియుగంలో నామపారాయణ చేస్తేనే చాలని అంటారు కదా. శ్రద్ధగా పూజ, పారాయణ, కీర్తన, జపం, ధ్యానం ఏదైనా చేయవచ్చు.

**కలౌ కల్మష చిత్తానాం పాపద్రవ్యోపజీవనాం**

**విధిక్రియా విహీనానాం హరేర్నామైవ కేవలం**

అంటే కలియుగంలో కేవలం హరినామ స్మరణ చేస్తేనే యజ్ఞం చేసినంత ఫలం దక్కుతుంది.

**హరేరామ హరేరామ రామరామ హరేహరే।**

**హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణకృష్ణ హరేహరే॥ – కలిసంతరణోపనిషత్తు**

అన్న జపం ఈ కలిసంతరణోపనిషత్తు లోనిదే.

**ప్రత్యేక విశ్లేషణ:–** కృష్ణగతి ద్వారా స్వర్గలోకానికి వెళ్ళేది ఎవరు? మరణం తరువాత ఏమవుతుంది? దీనికి జవాబు కఠోపనిషత్తులో వివరంగా వస్తుంది. ఇక్కడ టూకీగా చూద్దాము.

ప్రతివ్యక్తిలో 5 అంశాలుంటాయి. స్థూలశరీరం, సూక్ష్మశరీరం, కారణశరీరం, బింబ చైతన్యం, ప్రతిబింబచైతన్యం.

| | |
|---|---|
| **స్థూలశరీరం** | – బాహ్యంగా, కనబడే శరీరం. |
| **సూక్ష్మశరీరం** | – మనసు ప్రధానంగా ఉన్న శరీరం. |
| **కారణశరీరం** | – సూక్ష్మ, స్థూల శరీరాల బీజం |
| **బింబ చైతన్యం** | – సర్వవ్యాపకమైన శుద్ధ చైతన్యం. |
| **ప్రతిబింబ చైతన్యం** | – శుద్ధచైతన్యప్రతిబింబం, ఇది మనసనే మాధ్యమం ద్వారా ప్రతిబింబించబడుతుంది. |

ఇప్పుడు ఒక వ్యక్తి మరణించినప్పుడు ఏమవుతుంది? అతని స్థూలశరీరాన్ని ఇక్కడ కాల్చివేస్తారు. అది ఇక్కడ పడిపోతుంది. బింబచైతన్యం సర్వవ్యాపకం కాబట్టి అది ఎక్కడికీ వెళ్ళదు. కాకపోతే దాన్ని ప్రతిబింబించే మనసనే మాధ్యమం ఉండదు కాబట్టి దాని గురించి తెలియదు. ఇక మిగతావి సూక్ష్మశరీరం, కారణశరీరం, ప్రతిబింబ చైతన్యం. ఈ మూడూ కలిసి జీవాత్మ అవుతుంది. దీన్నే జీవుడు అనికూడా అంటారు. ఈ మూడూ శుక్లగతి ద్వారానో, కృష్ణగతి ద్వారానో, వేరే మార్గాల్లోనో ఆయా వ్యక్తి కర్మఫలానుసారం 14 లోకాల్లో ఏదో ఒక లోకానికి ప్రయాణం చేస్తాయి. ఆయా లోకాలకు తగ్గ స్థూలశరీరాన్ని పొంది, అక్కడ కర్మఫలాలను అనుభవిస్తాయి.

## మంత్రం – 6

**ఏహ్యేహీతి తమాహుతయః సువర్చసః**
**సూర్యస్య రశ్మిభిర్యజమానం వహన్తి।**
**ప్రియాం వాచమభివదన్త్యో౽ర్చయన్త్యః**
**ఏష వః పుణ్యః సుకృతో బ్రహ్మలోకః॥**

**ప్రతిపదార్థం–** సువర్చసః ఆహుతయ – ప్రకాశించే దేవతలు; తం యజమానం వహన్తి – ఆ యజమానిని ఆహ్వానిస్తారు; ఏహి ఏహి ఇతి – రండి, రండి అని; ప్రియాం వాచమ్ – ప్రియవచనాలు; అభివదన్త్యః – మాట్లాడుతూ; అర్చయన్త్యః–

గౌరవిస్తూ; ఏషః బ్రహ్మలోకః – ఈ స్వర్గలోకం; వః పుణ్యః సుకృతః – మీరు మంచికర్మలు చేసి పొందారు. సూర్యస్యరశ్మిభిః – సూర్యకిరణాల ద్వారా దేవతలు; వహన్తి – తీసుకువెళతారు.

**తాత్పర్యం –** ప్రకాశించే కర్మదేవతలు ఆ యజమానిని 'రండి, రండి,' అని ఆహ్వానించి, ' ఈ స్వర్గం మీరు చేసుకున్న సత్కర్మల ఫలితంగా లభించింది,' అని ప్రియవచనాలు పలికి, సూర్యుని కిరణాల ద్వారా తీసుకువెళతారు.

**వివరణ –** ఈ మంత్రంలో యజ్ఞాలు చేసిన యజమానికి స్వర్గలోకంలో ఎలా స్వాగతవచనాలు పలుకుతారో చూస్తాము. అంటే ఇక్కడ యజమాని తను చేయాల్సిన కర్మలను సవ్యంగా చేసి, అన్ని షరతులనూ పాటించి, మరణించాక తను కోరుకున్న స్వర్గఫలం పొందినట్టన్నమాట. అలాంటి ఫలం పొందితే ఎలా ఉంటుందో చూపిస్తోంది ఉపనిషత్తు.

ఉపనిషత్తు మనం కామ్య, పరిహార కర్మల నుంచి బయటకి రావాలని కోరుకుంటుంది. పరిహార కర్మలను లౌకిక సుఖాల కోసం చేసేవారిని ఆపకండి. వాళ్ళను నిరుత్సాహ పరచకండి. కాని మీరు పైకి ఎదగండి. అక్కడే ఆగిపోకండి. ఇది మీలాంటి ప్రత్యేక వ్యక్తులకు ప్రత్యేక సలహా. ఏమిటది? కామ్య, పరిహార కర్మలను తగ్గించి, విహిత కర్మలకు రండి. విహిత కర్మలు కూడా కామ్యకర్మగా చేయవచ్చు. నిష్కామకర్మగా చేయవచ్చు. కామ్యకర్మగా కాకుండా నిష్కామకర్మగా రోజూ చేయండి. 'లోకాస్సమస్తా సుఖినోభవన్తు,' అనుకోండి. కామ్యకర్మగా చేస్తే సరిగ్గా చేస్తేనే ఫలితం వచ్చే అవకాశం ఉంటుంది. కాని నిష్కామ కర్మగా చేస్తే మీరు కోరకుండానే ఆధ్యాత్మిక ఎదుగుదల కలుగుతుంది.

## మంత్రం – 7

**ప్లవా హ్యేతే అదృఢా యజ్ఞరూపాః**
**అష్టాదశోక్తమవరం యేషు కర్మ।**
**ఏతచ్ఛ్రేయో యేఽభినన్దన్తి మూఢాః**
**జరామృత్యుం తే పునరేవాపి యన్తి॥**

**ప్రతిపదార్థం:** అష్టాదశ ఉక్తమ్ – 18 మంది నిర్వర్తించే; ఏతే– ఈ; యజ్ఞరూపాః – యాగాలు; అదృఢాః హి – నిలకడలేని; ప్లవా – తెప్పలు; ఏషు – ఇవి; అవరం కర్మ – తక్కువరకం కర్మలు; ఏతత్ – ఇది; శ్రేయః – మేలైనది; యే

అభినన్దన్తి – ఎవరు ఆనందిస్తున్నారో; మూఢాః – వారు మూఢులు; జరా – వార్ధక్యం; మృత్యుం – మరణం; తే – వారు పునరేవాపి యన్తి – మళ్ళీ మళ్ళీ పుడతారు.

**తాత్పర్యం:** 18 మంది నిర్వర్తించే ఈ యాగాలు నిలకడలేని తెప్పలు. ఇవి తక్కువరకం కర్మలు. వీటిని మేలైనవి అని ఎవరు ఆనందిస్తున్నారో వారు మూఢులు. వార్ధక్యం, మరణం అనుభవిస్తూ పునరపి జననం, పునరపి మరణం పొందుతారు.

**వివరణ:** ఇప్పటిదాకా కర్మలను పొగిడి, ఇప్పుడు వాటిని విమర్శిస్తోంది ఉపనిషత్తు. ఇది శ్రుతి పద్ధతి. తెలియనివారు ఉపనిషత్తు పరస్పర విరుద్ధమైన భావాలను చెప్తోందనుకుంటారు. కాని ఇది బలమైన వాదనని నిలబెట్టటానికి వాడే మంచి పద్ధతి. ముందే నీ వాదన తప్పు అని ఎదుటివారిని ఖండిస్తే వారు రెచ్చిపోయి, మన వాదనను చెవినబెట్టరు. అందుకని ముందు వారి వాదనని అవునని ఒప్పుకుంటూ నెమ్మదిగా అందులోని లోటుపాట్లని ఎత్తిచూపాలి. ఈ పద్ధతి మనకు ఉపనిషత్తు ఏనాడో ఇచ్చింది.

7–10 మంత్రాలవరకూ కర్మలను తీవ్రంగా ఖండిస్తోంది ఉపనిషత్తు. కర్మలు చేసే వారిని మూఢులని అంటోంది. ఎందుకు? ముందే కొన్ని దోషాలను చూసాము.

1. యజ్ఞాలు చేయటం అన్నది ఆషామాషీ వ్యవహారం కాదు. దానికి ఎన్నో నియమ నిబంధనలుంటాయి. ఎన్నో షరతులు వర్తిస్తాయి. చాలా వ్యయప్రయాసలకోర్చి చేయాలి.
2. ఇంత కష్టపడి చేసినా, ఆశించిన ఫలితం వస్తుందన్న నమ్మకం లేదు. ఒక్కోసారి అది వికటించవచ్చు.
3. అన్ని కష్టాలు భరించి, శ్రద్ధాభక్తులతో పూజ చేసి, ఆశించిన ఫలితం పొందారనుకుందాం. అయినా ఫలం వచ్చినా దానికి మూడు దోషాలుంటాయి. వాటిని మనం ఈ ఉపనిషత్తు ఉపోద్ఘాతంలో చూసాము. అవి –

ఎ) **దుఃఖమిశ్రితత్వం –** చేయటానికి ఎంతో కష్టపడాలి. చేసి కర్మఫలాన్ని పొందాక దాన్ని నిలబెట్టుకోవటానికి కూడా ఎంతో కష్టపడాలి. ఎంత

గొప్ప కర్మ ఫలం అయినా దానికొక కాలపరిమితి ఉంటుంది. కర్మ చేసే వ్యక్తి శాశ్వతం కాదు. అతను చేసే కర్మ శాశ్వతం కాదు. అలాంటప్పుడు అతను పొందే ఫలం కూడా శాశ్వతం కాదు. ఇదే వివరణ ఈ మంత్రంలో వస్తుంది.

బి) **అతృప్తికరత్వం –** ఎంత పొందినా ఇంకా కావాలనిపిస్తుంది. కారు కొంటే మనదానికన్నా పెద్దకారు ఇంకొకళ్ళు కొనుక్కుంటే మనకు అసంతృప్తి.

సి) **బంధకత్వం –** మనుష్యులకు, వస్తువులకు, కోరికలకు బానిసలయిపోయి, వాటిమీద బంధాలు పెంచుకుంటున్నాము. పిల్లలు దూరంగా ఉంటే, వారి మీద బంధం కొద్దీ బాధపడుతుంటాము.

ఉపనిషత్తు ఈ లోపాలను ఎత్తిచూపటంలో ఉద్దేశం కర్మలను మానమని కాదు. కామ్యకర్మలను మానండి, సంకల్పం మార్చుకోండి, చిత్తశుద్ధి కోసం చేయండి అంటుంది. స్వర్గం, ఆఖరికి బ్రహ్మలోకం కూడా శాశ్వతం కాదు. ఒక లోకానికి చేరాము అంటేనే అది కాలానికి అతీతమైనది కాదు అని అర్థం.

పరావిద్యకు, అపరావిద్యకు మధ్య గొప్ప భేదం ఉంది. పరావిద్యలో కలిగే ఫలం జ్ఞానం వల్ల. అది శాశ్వతఫలం. అపరావిద్యలో కలిగే ఫలం పుణ్యం వల్ల. పుణ్యం కరిగిపోతే, ఫలం కూడా కరిగిపోతుంది కాబట్టి అది అశాశ్వత ఫలం. ఈ విషయాన్ని బోధిస్తుంది కాబట్టి ఈ మంత్రం చాలా ముఖ్యమైన మంత్రం.

**అష్టాదశ ఉక్తమ్ –** 18 వ్యక్తులు చేసే యజ్ఞం. ఒక్కొక్క వేదానికీ నలుగురు ఋత్వికులు ఉండాలి. 4×4 = 16 ఋత్వికులు అవుతారు. వారికి వేదానికి సంబంధించిన పేర్లు ఉన్నాయి.

| | | |
|---|---|---|
| **ఋగ్వేదం ఋత్విక్కులు** | **–** | **హోతృగణం** |
| **యజుర్వేదం ఋత్విక్కులు** | **–** | **అధ్వర్యుగణం** |
| **సామవేదం ఋత్విక్కులు** | **–** | **ఉద్గాతృగణం** |
| **అథర్వణవేదం ఋత్విక్కులు** | **–** | **బ్రహ్మగణం** |

యజ్ఞం చేసే యజమాని, అతని పత్ని (భార్య) కలిసి 18 అవుతారు.

యజ్ఞాలు చేయటానికి భార్యతోడు ఉండాలి. యజ్ఞానికి కావాల్సిన ఏర్పాట్లలో చాలామటుకు ఆమె తోడ్పడుతుంది. అందుకే భర్త చేసే పుణ్యంలో ఆమెకు సగం వస్తుంది. భర్త పాపంచేస్తే మాత్రం మొత్తం ఆయనకే వెళుతుంది కాని, భార్యకి

అంటదు. కాని భార్య ఏదైనా పాపం చేస్తే అందులో సగం భర్తకు వెళుతుంది. అంగీకరించలేని విషయం కదా! కాని శాస్త్రం అలాగే చెప్తోంది. ఇది పక్షపాతం చూపినట్టుగా ఉంది కాని, వైదిక జీవనంలో స్త్రీకి పెద్దపీటే వేసారు. అయినా భారతదేశంలో స్త్రీలు అవస్థ పడుతున్నారంటే, దానికి కారణం, తక్కిన సంప్రదాయాల ప్రభావం.

పత్ని లేకపోతే యజ్ఞం లేదు. పతి అంటే దేవుడు. భర్తకు చెందిన పదం. 'పతి', 'పత్ని' రెండు పదాలకీ ధాతువు ఒకటే. అందువల్ల ఇద్దరూ సమానమే. యజ్ఞం వల్ల వాళ్ళిద్దరూ భార్యాభర్తలవుతారు. అందువల్ల యజ్ఞాల్లో భార్యకు ప్రముఖస్థానం ఉంటుంది. పతి, పత్ని, ఋత్విక్కులు, యజ్ఞవస్తువులు. యజ్ఞం – అన్నీ పరిమితి ఉన్నవే.

ఇలాంటి పరిమితి చెందిన వారు చేసే కర్మలు ఎలా ఉన్నాయి?
**హ్యేతే అదృఢ ప్లవా –** దృఢం కాని తెప్పలులాగా ఉన్నాయి. ఆ తెప్పలను చేపలు పట్టటానికి వాడతారు. అవి దృఢంగా ఉండవు. చేపలు పట్టటం లాంటి చిన్న తెప్పలతో సముద్రం దాటగలమా? దాటలేము. ఈ పూజలు ఇలాంటి తెప్పలు. వాటితో సంసార సాగరాన్ని దాటలేము. కేవల కర్మతో తాత్కాలికంగా దుఃఖనివృత్తి కలుగుతుంది. అథోయోనిలో పడకుండా, నరకానికి పోకుండా చేస్తుంది అది. కాని ఈ ఫలం తాత్కాలికం. వీటిని 'అవరం కర్మ,' అంది ఉపనిషత్తు. అంటే తక్కువ స్థాయి కర్మలు. ఉపాసనతో సముచ్ఛయం చెందక, కేవలం కర్మ మాత్రమే ఉంది కాబట్టి అవరం కర్మ అయింది. ఇది స్వర్గలోకం వరకే తీసుకువెళుతుంది. మోక్షాన్ని ఇవ్వదు. భూమిమీద కష్టాలతో పోలిస్తే స్వర్గలోకంలో కష్టం చాలా, చాలా తక్కువ ఉంటుంది.
**మూఢాః –**ఉపనిషత్తు వీళ్ళని మూఢులంటోంది. మూఢాః అంటే వెర్రివాడని అర్థం. వీళ్ళు బొత్తిగా వెర్రివారు కాదు. తెలివైనవారు కూడా కొన్నింట్లో అజ్ఞాని.వీరు శాస్త్రం చదివి, కర్మ చేస్తున్న పండితులు. కాని పురుషార్థాల విషయంలో మూఢులు.
**ఏతచ్ఛ్రేయో యేఽభి నన్దని మూఢాః –** కాని వారు అలా అనుకోవటం లేదు. కర్మ చేయటమే శ్రేయమైన మార్గం అనుకుంటున్నారు. మోక్షాన్నిచ్చే మార్గం శ్రేయోమార్గం. కాని వారు యజ్ఞాలే మోక్షసాధనలు అనుకుంటున్నారు.

**జరా మృత్యుం తే పునరేవాపి యన్తి –** వారు మళ్ళీ మళ్ళీ సంసార చక్రంలో పడతారు. వారు చేసిన పుణ్యం వల్ల స్వర్గానికి వెళతారు. అంటే మోక్షం వచ్చేస్తుందనుకుంటారు. అక్కడ వృద్ధాప్యం, మృత్యువు ఉండదు. యమధర్మరాజు అక్కడికి వెళ్ళడు. ఎందుకు? వెళ్ళాల్సిన అవసరం లేదు. 'క్షీణేపుణ్యే మర్త్యలోకం విశంతి,' అని కృష్ణభగవానుడు చెప్పాడు. ఎప్పుడు వారి పుణ్యం కరిగిపోతుందో, అప్పుడే వాళ్ళు అక్కడినుంచి భూలోకంలోనో, ఇంకా కిందలోకాలలోనో పడతారు.

ఇలాంటి మూఢులు వాళ్ళ గురించి మాత్రమే అలా అనుకుంటే కొంతమేరకు ఫర్వాలేదు. కాని వారు నాయకులు అయి తక్కిన వాళ్ళను ప్రభావితం చేస్తారు. దాని గురించి వచ్చే మంత్రంలో చెప్తుంది శ్రుతి.

## మంత్రం – 8

**అవిద్యాయామన్తరే వర్తమానాః స్వయం ధీరాః పణ్డితం మన్యమానాః।**

**జంఘన్యమానాః పరియన్తి మూఢాః అన్ధేనైవ నీయమానా యథాఽన్ధాః॥**

**ప్రతిపదార్థం:** అవిద్యాయామ్ – యజ్ఞాలు; అన్తరే– మధ్యలో; వర్తమానాః – జీవించేవారు; స్వయమ్ – తామే, ధీరాః – తెలివైనవాళ్లం; పణ్డితమ్ – పండితులం; మన్యమానాః– భావించేవారు; మూఢాః – మూర్ఖులు, జంఘన్యమానాః – వార్ధక్యంలో, మరణంలో కొట్టుమిట్టాడే వారు; అన్ధేవ – గుడ్డివాడితో, నీయామానా– దారి చూపించబడే; అన్ధాః యథా ఇవ – గుడ్డివాడిలాగా; పరియన్తి – తిరుగుతుంటారు.

**తాత్పర్యం: –** యజ్ఞాలు, పూజలే ముఖ్యమనుకుని జీవించేవారు, తమను తాము తెలివైనవారిమనీ, పండితులమనీ కీర్తించుకుంటారు. కాని వారు మూర్ఖులు. వార్ధక్యంలో, మరణంలో కొట్టుమిట్టాడుతుంటారు. గుడ్డివానిచేత దారి చూపించబడే ఇంకో గుడ్డివాడిలా జననమరణ వృత్తంలో పడి తిరుగుతుంటారు.

**వివరణ–** కర్మఫలాన్ని సాపేక్షికంగా చూపిస్తోంది ఇక్కడ. ఈ కర్మఫలం మోక్షంతో చూస్తే తక్కువే. అసలేమీ చేయకుండా ఉండేవ్యక్తి కన్నా, కర్మలు చేసేవ్యక్తి నయమే. ఇలాంటి వారు మతాన్ని వ్యవహారానికి వాడుతున్నారు. ఆధ్యాత్మికంగా వాడితే వాళ్ళు సాధనచతుష్టయ సంపన్నులవుతారు. కేవలం వ్యవహారానికి వాడితే మంచి గంధం చెక్కని తీసుకువచ్చి వంటకు వాడినట్లవుతుంది.

**అవిద్యాయామన్తరే వర్తమానాః-** అంతకుముందు అపరావిద్యగా పేర్కొన్న కర్మకాండను ఇప్పుడు అవిద్య అంటోంది ఉపనిషత్తు. ఇంతకుముందు కూడా చూసాం. అవిద్య అంటే ఆత్మ అజ్ఞానం. ఆత్మ గురించి సరియైన జ్ఞానం లేక మనం కర్త, భోక్తా అనుకుని, కర్మలు చేస్తూ పుణ్యపాపాలు పొందుతూ, జనన మరణ చక్రంలో పడి కొట్టుమిట్టాడుతుంటాం.

ఉపనిషత్తు మోక్షం గురించి చెప్తోంది.అందుకని కర్మఫలంతో ఆపకూడదు. మోక్షానికి వివేక, వైరాగ్యాలు కావాలి. స్వర్గలోక ప్రాప్తి కూడా అనిత్యఫలమేనని వివేకం ద్వారా తెలుసుకోవాలి. మన నెల జీతం ఎలా నిత్యఫలం కాదో అలాగే ఏ కర్మఫలమన్నా అనిత్యమే. కర్మఫలం వల్ల పొందిన మన శరీరమే శాశ్వతం కానప్పుడు, ఆ శరీరంతో కొంతకాలం చేసిన కర్మ వల్ల పొందే స్వర్గలోక ప్రాప్తి అనే కర్మఫలం ఎలా శాశ్వతమవుతుంది? ఈ వివేకం పెంపొందించుకుంటే వైరాగ్యం ఏర్పడుతుంది. ఎవరో బలవంతంగా చెప్తేనో, మనకు మనం నిర్ణయించుకుంటేనో ఏర్పడే వైరాగ్యం శాశ్వతం కాదు. నిత్యానిత్య వస్తు వివేకం చేసి, ఏది నిత్యమో తెలుసుకుని, అనిత్యవస్తువు మీద మోహం వలదని తెలుసుకుంటే దానంతట అదే వైరాగ్యం ఏర్పడుతుంది. ఈ మంత్రం ఉద్దేశం అదే.

వీరు అజ్ఞానంలో కూరుకుపోతారు. అపరావిద్యే మోక్షాన్నిస్తుంది అనుకుంటున్నారు అంటుంది. అజ్ఞానంలో ఉంటే పాపం కాదు. ఇది సహజం. మనం ఈ పెట్టుబడితో పుట్టాం. కాని దాన్ని పెంపొందించుకుంటే పాపం. శాస్త్రాన్ని అధ్యయనం చేసేముందు దాని ఉద్దేశం ఏమిటో తెలుసుకోవాలి. శాస్త్రం చదివాక శాంతి, ఆనందం ఇచ్చే బదులు భయాందోళనలు కలుగుతాయి కొంతమందికి. ఇలాంటివారు నాస్తికులకన్నా అవస్థపడతారంటారు. మనకు ఎన్నో శంకలు, అనుమానాలు. దేవుడిని ఎటువైపు పెట్టాలి? ఏ దేవుడిని పెట్టాలి? ఎవరో వచ్చి ఇంట్లో శివలింగం ఉండకూడదంటారు. ఇంకెవరో వచ్చి ఇంకేదో చెబుతారు. అక్కడ్నుంచి ఆ దేవుడిని ఎలా తీసేయాలని ఖంగారుపడతాము.

**స్వయంధీరాః పణ్డితం మన్యమానాః** ఇలా మిడిమిడి జ్ఞానంతో వాళ్ళే పండితులు అనుకుంటారు. 'మన్యమానా,' – ఎవరి ముందూ తలవంచరు. అజ్ఞానం ఉన్నచోట నేర్చుకోవటానికి సిద్ధపడాలి. కాని వాళ్ళే జ్ఞానులు అనుకుంటారు కదా! వారు తమను తాము విదిత వేదితవ్య అనుకుంటారని శంకరాచార్యులు అంటారు. వాళ్ళు శాస్త్రాన్ని అధ్యయనం చేసారు, కాని తప్పుగా అర్థం చేసుకున్నారు. కర్మలు చేసి మోక్షం పొందవచ్చనుకుంటారు.

**జంఘన్యమానాః పరియన్తి మూఢాః**– ఉపనిషత్తు వారిని మూఢాః అంటుంది. వీరికి వృద్ధాప్యం, మరణం వస్తుంది. ఏదో సాధించామనుకుంటారు గానీ, అక్కడ్నుంచి ఇంకోచోటుకి కదలాలి. వాళ్ళకిష్టమున్నా లేకపోయినా, అశాశ్వతమైన కర్మఫలం వారిని ఇంకోచోటికి తోసేస్తుంది. మళ్ళీ మళ్ళీ పుడుతూ ఉంటారు.
**అన్ధే నైవ నీయమానా యథాన్ధా –** వాళ్ళ అజ్ఞానంలో వారు కొట్టుమిట్టాడుతుంటే ఫర్వాలేదు. వారు ఆధ్యాత్మిక నాయకులై, మరికొంతమందిని వారి వాదనతో ప్రభావితం చేస్తారు.

శాంతి, భద్రత, ఆనందాల కోసం వీళ్ళు వెతుకుతూ ఉంటారు. ఈ ప్రపంచంలో అందం ఉంది. కొత్తదనం ఉంది. వైవిధ్యం ఉంది. కాని వీళ్ళు వెతికే శాంతిభద్రతలు దొరకవని తెలియదు. అందుకని అనేక ఎగుడు దిగుళ్ళు అనుభవిస్తూ ఉంటారు. వారు గుడ్డివారు.

ఒక గుడ్డివాడు, ఇంకో గుడ్డివాడిని నడిపిస్తే, ఇద్దరూ పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇద్దరూ కలిసి సంసారమనే చక్రంలో పడతారు. మామూలుగా బుద్ధి చాలా ప్రకాశవంతమైనది. కాని ఆత్మతత్త్వం విషయానికి వచ్చేసరికి, మత్తు మందు తీసుకున్నట్లు అయిపోతుంది. అందుకని మన నాయకుడు మనను సరిగ్గా తీసుకెళుతున్నాడా అన్నది మనం చూసుకోవాలి.

**ప్రత్యేక విశ్లేషణ: –** కర్మలు చేయవద్దు అనటం లేదు ఉపనిషత్తు. కాని దాన్ని తెలివిగా వాడమంటుంది. పంచ మహా యజ్ఞాలు తప్పనిసరిగా చేయమంటుంది. సకామకర్మ చేస్తే ఇహలోక, పరలోక సుఖాలు రావచ్చు. కాని నిష్కామకర్మ చేస్తే ఆధ్యాత్మిక పుణ్యం వస్తుంది. ఎదుగుదల వేగంగా వస్తుంది. అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయి. ఆటంకాలు వాటికవే తొలగిపోతాయి. అదికాక మనం కోరకపోయినా ఇహలోక, పరలోక సుఖాలు కలుగుతాయి

నిష్కామంగా చేసే ప్రార్థన, అర్థం ఇలా ఉంటుంది. దుర్జనులు సజ్జనులుగా మారాలి. సజ్జనులు శాంతి పొందాలి. శాంతి పొందిన వారికి ఆధ్యాత్మిక జ్ఞానానికి అవకాశాలు కలగాలి. మోక్షం పొందినవారు, పొందనివారిని ముక్తి పొందేలా చేయాలి. మోక్షమనే అత్యున్నత ఫలం మనకు అందుబాటులో ఉంటే స్వర్గలోక ప్రాప్తి కోరటమెందుకు?

## మంత్రం - 9

**అవిద్యాయాం బహుధా వర్తమానాః**
**వయం కృతార్థా ఇత్యభిమన్యన్తి బాలాః।**
**యత్ కర్మిణో న ప్రవేదయన్తి రాగాత్**
**తేనాతురాః క్షీణలోకాశ్చ్యవన్తే॥**

**ప్రతిపదార్థం–** అవిద్యాయామ్ – అజ్ఞానంలో ఉన్నవారు; బహుధా వర్తమానా – అనేక అపోహల్లో ఉన్నారు; వయంకృతార్థా – తాము లక్ష్యాన్ని సాధించాము; ఇతి – అని; అభిమన్యన్తి – భావిస్తుంటారు; బాలాః – పరిపక్వత లేదు; యత్కర్మిణః – సకామ కర్మిష్టులు, న ప్రవేదయన్తి – మోక్షం ఉందని తెలుసుకోలేరు; రాగాత్ – మోహంతో, తేనాతురాః – దుఃఖితులు; క్షీణలోకాశ్చ్యవన్తే – పుణ్యం తీరాక, కిందకి పడిపోతారు.

**తాత్పర్యం –** అజ్ఞానంలో ఉన్నవారు ఆత్మ గురించి అనేక అపోహల్లో ఉన్నారు. తాము లక్ష్యాన్ని సాధించామని భావిస్తుంటారు. కాని వారికి పరిపక్వత లేదు. ఈ సకామ కర్మిష్టులు మోక్షం ఉందని తెలుసుకోలేరు. మోహంలో పడ్డ ఈ దుఃఖితులు వారి పుణ్యఫలం తీరాక కిందకి పడిపోతారు.

**వివరణ –** ఒక గుడ్డివాడు ఇంకో వ్యక్తి చేయిపట్టుకున్నప్పుడు అతనికి కళ్ళున్నాయో లేదో ఎలా తెలుస్తుంది? అలాగే మనం పట్టుకున్న గురువు తెలివైన వ్యక్తా కాదా అని మనకెలా తెలుస్తుంది? ఇది అందరినీ వేధించే ప్రశ్న! దానికి ఈశ్వరకృప కావాలి. సరియైన సమయం వచ్చినప్పుడు గురువే వెతుక్కుంటూ వస్తాడని చాలామంది అనుకుంటారు. ఒక్కొక్కసారి అది ఇబ్బంది పెట్టవచ్చు. శాస్త్రాన్ని ప్రమాణంగా స్వీకరించిన కొంతమంది గురువుల ఉపన్యాసాలు వినాలి. వారిలో మనకు ఎవరి బోధ అర్థమౌతోందో వారిని మన గురువుగా చేసుకోవచ్చు.

ఈ సందర్భంలో మనం ఒక విషయం తెలుసుకోవాలి. మన శాస్త్రం బోధించేది అద్వైత వేదాంతం. 'తత్ త్వం అసి,' అని చెప్తుంది. నువ్వే ఆ బ్రహ్మవి అంటుంది . దాన్ని శాస్త్రం అనేకవిధాలుగా నిరూపిస్తుంది. శాస్త్రమే గురువు ఎలా ఉండాలో కూడా చెప్తుంది. అతను శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయి ఉండాలి. (ఈ ఉపనిషత్తులోనే వస్తుంది ఆ విషయం) బ్రహ్మనిష్ఠ అంటే బ్రహ్మలో రమించేవాడు. శ్రోత్రియ అంటే తనకి తెలిసిన ఆ సత్యాన్ని చక్కగా

బోధించగలిగినవాడు. అటువంటి గురువును వెతికి పట్టుకోవాలి. (స్వామి పరమార్థానంద గారు శ్రోత్రియ బ్రహ్మనిష్ఠకి ప్రతిరూపం). గురువే వస్తాడని ఎదురుచూడకుండా, గురువుకోసం ప్రయత్నించాలి.

ఉపనిషత్తుల ముందు చదివే శాంతిపాఠంలో వస్తుంది. నాకు మంచి గురువును చూపించు. ఆ గురువు సరిగ్గా చెప్పలేకపోతే, ఆయన సరిగ్గా చెప్పగలిగేటట్టు చేయి.

**అవిద్యాయాం బహుధా వర్తమానా**–అజ్ఞానం ఒక్కటే. కాని అపోహలు అనేకం. నేను కర్త, భోక్తా అనుకుంటారు కొందరు. నేను కర్తని కాని భోక్తని కాదు అనుకుంటారు మరికొందరు. ఆత్మ ఒక్కటి కాదు, అనేక ఆత్మలు ఉన్నాయి అనుకుంటారు కొందరు. ఇలాంటి అపోహలతో జీవిస్తారు చాలామంది.

**బాలాః**– వారు ఎంత ఎదిగినా వారిని బాలురు అంటుంది ఉపనిషత్తు. పరిపక్వత లేదు వారికి. అర్థ, కామ పురుషార్థాలే ముఖ్యం అనుకుంటారు కాని మోక్షం అనేది ఒకటుందని తెలుసుకోలేరు. లోకాలు శాశ్వతం కాదని తెలుసుకోలేరు. ఎందుకు?

**రాగాత్ న ప్రవేదయన్తి** – తక్కిన లక్ష్యాలమీద వారికున్న మక్కువ వల్ల. శుద్ధ చైతన్యమైన బ్రహ్మకూ, వైవిధ్యంగా కనబడే మాయా జగత్తుకూ మధ్య ఫ్యాషన్‌షో పెడితే మాయే గెలుస్తుంది. మాయ ఉండాలి గాని, అది శాశ్వతం కాదని తెలుసుకోవాలి. మాయ అంటే దృశ్యప్రపంచం. ఎంత మిరుమిట్లు గొలిపినా, మాయమయిపోతుంది అని తెలుసుకోలేక పుణ్యం తీరాక కిందకి పడతారు.

## మంత్రం - 10

**ఇష్టాపూర్తం మన్యమానా వరిష్ఠం నాన్యచ్ఛ్రేయో వేదయన్తే ప్రమూఢాః ।**
**నాకస్య పృష్ఠే తే సుకృతేఽనుభూత్వా ఇమం లోకం హీనతరం వా విశన్తి॥**

**ప్రతిపదార్థం:** ఇష్టా – అనేక యజ్ఞాలు; పూర్తమ్– అనేక పుణ్యకార్యాలు; వరిష్ఠం మన్యమానా – ఇవే గొప్పవి అనుకుంటారు; నాన్యచ్ఛ్రేయో వేదయన్తే – తక్కిన శ్రేష్ఠమైనవి తెలుసుకోవటం లేదు; ప్రమూఢాః – పరమ మూర్ఖులు; తే – వారు; నాకస్య – స్వర్గంలో; పృష్ఠే – పై లోకాలు; సుకృతే – పుణ్యఫలం; అనుభూత్వా – అనుభవించాక; ఇమం లోకం విశన్తి – ఈ భూలోకంలో పుడతారు; హీనతరం వా విశన్తి – లేదా ఇంకా హీనమైన లోకాల్లో పుడతారు.

**తాత్పర్యం:–** కొందరు పరమ మూర్ఖులు అనేక యజ్ఞాలు, అనేక పుణ్యకార్యాలు చేసి ఇవే గొప్పవి అనుకుంటారు. తక్కిన శ్రేష్ఠమైనవి ఉన్నట్టు తెలుసుకోవటం లేదు. వారు స్వర్గంలోనూ, అంతకన్నా పై లోకాల్లోనూ (కాని బ్రహ్మలోకం కాదు) పుణ్యఫలం అనుభవిస్తారు. అది అనుభవించాక, పుణ్యఫలం తీరగానే భూలోకంలోనో, ఇంకా నికృష్టమైన లోకాల్లోనో పుడతారు.

**వివరణ:–** విమర్శ ఇంకా సాగుతోంది. ఇంతకుముందు కర్మలే శ్రేష్ఠం అనుకునే వారిని మూఢాః అంది.

**ప్రమూఢాః –** ఇప్పుడు ప్రమూఢ అంటోంది. ఎందుకు?

**నాన్యచ్ఛ్రేయో వేదయన్తే –** ఇంతకన్నా శ్రేష్ఠమైనది ఇంకోటి ఉందని తెలియదు.

**ఇష్టాపూర్తం–** ఇష్టం అంటే ఇష్టమైనవి అని కాదు అర్థం. అది 'యజ్,' ధాతువు నుంచి వచ్చింది. యజ్ అంటే యజ్ఞాలు, పూజలు. ఇష్టకర్మలు అంటే వేదం విధించిన కర్మలు. వాటిని శ్రౌతకర్మలు అంటారు. అగ్నిహోత్రం, తపస్సు, వేదాధ్యయనం, వేదమంత్రాల పారాయణం లాంటివన్నీ వస్తాయి ఇందులో. పూర్తం అంటే దానధర్మాలు చేయటం. పూర్వకాలంలో బావులు తవ్వించటం, అన్నదాన సత్రాలు కట్టించటం లాంటి సేవలు చేసేవారు. వాటిని స్మార్తకర్మలు అంటారు.

ఈ సేవాభావం పూర్వం ఎంతగా ఉండేదో చెప్తూ పూజ్యస్వామీజీ ఒక ఉదాహరణ ఇస్తారు. వారి ఊరిలో ఒకామె తన కూతురుకు ఒక సంబంధం ఒప్పుకోలేదట. ఎందుకని ఆరా తీస్తే ఆ అబ్బాయి తండ్రికి హొటల్ ఉందిట. ఆహారాన్ని అమ్మి సొమ్ముచేసుకునే వారికి నా పిల్లనివ్వనందిట. అది మహాపాపం కింద జమకట్టేవాళ్ళు అప్పుడు.

ఈ సేవలు ఎందుకు చేస్తారు? పేరు కోసమో, పదిమంది మెప్పుకోసమో, హొదా కోసమో చేయవచ్చు. అసలు ఏమీ సేవ చేయకపోయేదానికన్నా ఇలా దేనికోసమో చేయటం మంచిదే. కాని వారు ఇదే శ్రేష్ఠం, ఇదే మోక్షం అనుకుంటారు. వారు సకామ కర్మను నిష్కామకర్మగా మలచుకోవాలి. ఇష్టాపూర్తం చేసి మోక్షం కోరకపోతే వంటచేసి భోజనం చేయనట్టు అంటున్నారు పూజ్యస్వామీజీ.

ఇప్పుడు పూర్తం కింద మనం నేర్చుకున్న పంచమహాయజ్ఞాలను చేర్చుకోవచ్చు. వీటిని నిష్కామంగా చేస్తే చిత్త ఏకాగ్రత, చిత్త శుద్ధి కలుగుతాయి. మోక్షప్రాప్తికి

అర్హులవుతాము. నిజానికి మనమేదో సేవ చేస్తున్నామనుకుంటాము కాని, మన జీవితం ఎందరి సేవమీదో ఆధారపడి ఉంటుందంటున్నారు పూజ్య స్వామీజీ. మన కంచంలో ఆహారం అమరిందంటే, దాని వెనుక ఎందరి కృషి ఉండి ఉండాలి! అంటే ఇది ఇచ్చి పుచ్చుకునేది. అంతేకాని మనమేదో ఎదుటివారి మేలు కోసం చేస్తున్నదికాదు.

కొంతమంది కర్మలు చేసి, దాన్నించి చిత్తశుద్ధి పొంది, మోక్షం కోసం ప్రయత్నించక, చిన్ని చిన్ని ఫలాలతో తృప్తిపడుతున్నారు. కర్మని యోగంగా మలచుకోకపోవటం వల్ల నష్టపోతున్నారు. అనంతమైన బ్రహ్మను తెలుసుకోకపోవటం వల్ల వారి నష్టం అనంతం. ఇలాంటి వారి పరిస్థితి ఏంటి? **తే నాకస్య పృష్ఠే –** నాకం అంటే సుఖం ఉండే ప్రదేశం. స్వర్గం. కం అంటే సుఖం. అకం అంటే దుఃఖం. కాబట్టి నాకం అంటే సుఖం ఉండే ప్రదేశం. వారు స్వర్గానికో, అంతకన్నా పై లోకాలకో వెళతారు. కాని బ్రహ్మలోకం చేరలేరు. ఎందుకు? వారు కేవలకర్మలను చేసినవారు కాబట్టి. చిన్న కర్మలు చేస్తే పొందే ఫలితాలు కూడా చిన్న ఫలితాలే ఉంటాయి. అవి పోయాక ఏమవుతుంది? **ఇమం లోకం హీనతరం వా విశన్తి–** భూలోకం లోనో, ఇంకా హీన లోకాల లోనో పుడతారు. అది వారి ప్రారబ్ధకర్మలను బట్టి ఉంటుంది.

**ప్రత్యేకవిశ్లేషణ: –** అన్ని యజ్ఞయాగాదులు చేసి, స్వర్గలోకం చేరాక, మళ్ళీ భూలోకం లోనో, ఇంకా హీన లోకాల లోనో ఎలా పుడతారు? శంకరాచార్యులు దానికి ఇక్కడ సమాధానం ఇస్తున్నారు. ముందు జన్మల పుణ్యపాపాల వల్ల సంచిత కర్మలను పోగుచేసుకుని వస్తాడు మనిషి. అందులోంచి కొంత ప్రారబ్ధకర్మగా మారి ఈ మనుష్యజన్మను అనుభవించి యజ్ఞయాగాదులు చేసిన వ్యక్తి ఇలా స్వర్గానికి వెళతాడు. మనుష్యునిగా ఉన్నప్పుడు కొత్తగా చేసినకర్మ ఫలాలను ఆగామి కర్మలు అంటారు. అందులో కొన్ని అనుభవిస్తాడు. కొన్ని మళ్ళీ సంచిత కర్మలో ప్రోగుపడతాయి. అందువల్ల స్వర్గంలో అనుభవించే కాలం ముగిసాక, ఇంకా మిగిలి ఉన్న సంచిత కర్మల్లోంచి (సంచితకర్మ ఎంతో ఉంటుంది) మళ్ళీ కొంత ప్రారబ్ధ కర్మగా మారి, తదనుగుణమైన జన్మ వస్తుంది. ఎప్పుడూ మనిషిగానే పుడతాడన్న నమ్మకం లేదు.

**అథైకయోర్ధ్వ ఉదానః పుణ్యేన పుణ్యం లోకం నయతి ।**
**పాపేన పాపముభాభ్యామేవ మనుష్యలోకమ్ ॥ ప్రశ్న 3–7**

అందువల్ల ఏం చేయాలి? సంచిత కర్మలను దగ్ధం చేసే జ్ఞానం పొందాలి. దానికి వేదాంతమే ప్రమాణం.

## మంత్రం - 11

**తపః శ్రద్ధే యే హ్యుపవసన్త్యరణ్యే**
**శాన్తా విద్వాంసో భైక్ష్యచర్యాం చరన్తః।**
**సూర్యద్వారేణ తే విరజాః ప్రయాన్తి**
**యత్రామృతః స పురుషో హ్యవ్యయాత్మా॥**

**ప్రతిపదార్థం–** శాన్తాః– మనసు శాంతంగా ఉండి; విద్వాంసః –ఉపాసకులు; తపః – వానప్రస్థ ధర్మం; శ్రద్ధః – (ఇక్కడ) ఉపాసన; యే ఉపవసంతి – ఎవరు సగుణ ఈశ్వర ఉపాసన చేస్తారో; అరణ్యే – అరణ్యంలో ఉండి; భైక్ష్యచర్యాం – భిక్షాటన చేస్తారో, తే – వారు; విరజాః – పుణ్యం పొంది; సూర్యద్వారేణ ప్రయాన్తి – శుక్లగతి ద్వారా ప్రయాణం చేస్తారు; యత్ర – ఆ (బ్రహ్మలోకంలో); అమృతాః – మరణరహితమైన; సః – ఆ, అవ్యయాత్మా– నాశనం లేని; పురుషః – హిరణ్యగర్భ / బ్రహ్మ.

**తాత్పర్యం–** ఏ ఉపాసకుడు శాంతచిత్తంతో, అరణ్యంలోఉండి, వానప్రస్థ ధర్మాన్ని అనుసరిస్తూ, సగుణ ఈశ్వర ఉపాసన చేస్తాడో, అతను ఎంతో పుణ్యం పొంది, శుక్లగతి ద్వారా నాశనం లేని బ్రహ్మ లేదా హిరణ్యగర్భ ఉన్న బ్రహ్మలోకానికి వెళ్తాడు.

**వివరణ–** 10వ మంత్రం వరకూ అపరావిద్యని కర్మపరంగా చెప్పింది ఉపనిషత్తు. ఇప్పుడు ఉపాసన పరంగా చెప్తోంది. ఉపాసన కూడా కర్మనే. కాకపోతే భేదం ఎక్కడ ఉందంటే, ఉపాసనలో కాయిక, వాచిక కర్మలు ఉండవు. అంతా మానసకర్మే ఉంటుంది. షోడశ ఉపచారాలు కూడా మనసులోనే ఇస్తాము.

ఉదా:– శివ మానస పూజ. కాయికపూజకు అన్నిటికన్నా తక్కువ ఫలం ఉంటుంది. వాచిక పూజకు కొంచెం ఎక్కువ, మానసపూజకు ఇంకా ఎక్కువ ఫలం ఉంటుంది. మూడుకలిపితే ఇంకా గొప్ప ఫలితం వస్తుంది. ఉదాహరణకు విష్ణుసహస్రనామం చదివేముందు ధ్యానశ్లోకాలు వస్తాయి. అదికూడా మనం పైకి చదివేస్తాము. కాని మనసులో విష్ణుమూర్తిని నిలుపుకుని అప్పుడు చదవాలి.

మనకు నాలుగు ఆశ్రమ ధర్మాలున్నాయి. బ్రహ్మచర్యం, గృహస్థాశ్రమం, వానప్రస్థాశ్రమం, సన్యాసాశ్రమం. బ్రహ్మచర్యంలో వైదిక జ్ఞానం పొందుతాడు. అప్పుడేమీ కర్మలు చేయడు. విద్యనభ్యసించటం ముగిసాక అతన్ని స్నాతః అంటారు. గురువుకి గురుదక్షిణ ఇచ్చాక గృహస్థు అవ్వచ్చు. గృహస్థుగా ఉంటే, నిత్య నైమిత్తిక కర్మలను చేయాలి. తరువాత వానప్రస్థం. అందులో తన బాధ్యతని ఎవరికైనా అప్పచెప్పి అడవిలోకి వెళ్ళాలి. అతన్ని వనిన్ అంటారు. అడవి అంటే నిజంగా అడవికి వెళ్ళనఖ్ఖరలేదు. పోర్ట్ రిడక్షన్ చేస్తే చాలు. పి అంటే ఆస్తిపాస్తులు (పొసెషన్స్) ఓ అంటే మొహమాటం (ఆబ్లిగేషన్స్) ఆర్ అంటే అనుబంధాలు (రిలేషన్స్) టి అంటే వ్యవహారాలు (ట్రాన్సాక్షన్స్). వీటన్నింటినీ వీలున్నంత తగ్గించుకుని సగుణ ఈశ్వర ఉపాసన మీద శ్రద్ధపెట్టాలి. నాలుగోది సన్యాసాశ్రమం. సన్యాసాశ్రమానికి బ్రహ్మచర్యం నుంచీ లేదా గృహస్థాశ్రమం నుంచి రావచ్చు.

ఈ మంత్రంలో మూడో ఆశ్రమ ధర్మం పాటించే వానప్రస్థుని గురించి వివరిస్తోంది ఉపనిషత్తు. సగుణ ఈశ్వర ఉపాసన చేసిన ఉపాసకులు శుక్లగతి ద్వారా బ్రహ్మలోకానికి వెళతారు. ఇదీ సారాంశం.

**విద్వాంసః–** వీరికి శాస్త్రం తెలుసు. కాని వేదాంతం తెలియదు. వీరు ఉపాసన చేస్తున్నారంటే ఇంకా కర్మకాండలోనే ఉన్నారు.

**అరణ్యే ఉపవసన్తి–** అడవిలో ఉంటారు. ఇందాక చెప్పినట్టుగా అడవికే వెళ్ళనక్కరలేదు. ప్రశాంతమైన ప్రదేశంలో ఉంటారు.

**శాన్తాః –** అందువల్ల శాంతంగా ఉంటారు. బాధ్యతలు అప్పచెప్పారు. గృహస్థుకుండే బాధ్యతలు లేవు. యజ్ఞాలు లేవు. భిక్షాటనచేసి జీవిస్తారు.

**తపః శ్రద్ధే –** తపః అంటే వానప్రస్థ ధర్మాలను పాటిస్తారు. ఉపాసనకు పూజాసామాగ్రి అవసరం లేదు. శ్రద్ధ అంటే ఇక్కడ ఉపాసన అని అర్థం. ఉపవసంతి అన్న పదం వల్ల వారు సగుణ ఈశ్వరఉపాసన చేస్తారని అర్థం. అంటే విరాట్ ఉపాసన లేదా హిరణ్యగర్భ ఉపాసన. తైత్తిరీయ ఉపనిషత్తు, కేన ఉపనిషత్తులలో ఈ ఉపాసనల గురించి ఎక్కువగా ఉన్నాయి. ఈ ఉపాసన మరణించే వరకూ చేయాలి. మరణంలో కూడా ఇష్టదేవతా ప్రార్థన చేయాలి. భీష్ముడు తను మరణించే ముందు అందర్నీ పొమ్మని శ్రీకృష్ణ భగవానుని రమ్మన్నాడు. అలా ఉపాసన చేస్తే ఏమవుతుంది?

**విరజాః –** అంతులేని పుణ్యం పొందుతారు. రజస్ అంటే మట్టి లేదా పాపం. విరజా అంటే పాపం లేనిది అని. అంటే పాపం క్షయమయి పుణ్యం పొందుతారు.
**తే సూర్యద్వారేణ ప్రయాన్తి–** వారు సూర్యమండలం ద్వారా, అంటే శుక్లగతి ద్వారా ప్రయాణం చేసి బ్రహ్మలోకం చేరుతారు.
**యత్ర స పురుషో హ్యవ్యయాత్మా। –** అక్కడ సృష్టికర్త, బ్రహ్మదేవుడు ఉంటాడు. అవ్యయః అంటే దాదాపు శాశ్వతం. చాలా చాలా చాలా దీర్ఘకాలం. అది కూడా బాధాకరమైన జీవితం కాదు. అంతా సుఖమే సుఖం.

ఏమిటి దీనిలో ఉన్న లోటుపాటు? బ్రహ్మలోకం కూడా శాశ్వతం కాదు. ఒక చెక్కుమీద కోటి రూపాయలు అని వ్రాసినా కూడా ఓన్లీ అన్న పదం కలుపుతాము. అలా బ్రహ్మలోకంలో అనేక కోట్ల సంవత్సరాలున్నా కూడా అది శాశ్వత అమరత్వాన్ని ఇవ్వదు. సాపేక్షిక అమరత్వాన్నిస్తుంది.

చాల మంది దీనికే తృప్తి చెందుతారు. కొందరే ఇదికూడా శాశ్వతం కాదు అని తెలుసుకుని జ్ఞానమార్గంలోకి అడుగుపెడ్తారు.

**ప్రత్యేక విశ్లేషణ:–** ఇప్పుడు ఒకసారి కర్మయోగం ఫలితాలలో ఉన్న తారతమ్యాలనూ, వాటి విశేషాలనూ చూద్దాము.

అసలు ఏ కర్మా చేయని వ్యక్తి గురించి శాస్త్రం పట్టించుకోవడం లేదు. కేవలం కర్మ, అదీ సకామ కర్మ, చేసిన వ్యక్తి కృష్ణగతి ద్వారా స్వర్గలోకానికి వెళతాడు.

**తద్యే హ వై తదిష్టాపూర్తే కృతమిత్యుపాసతే।**
**తే చాన్ద్రమసమేవ లోకమభిజయన్తే।।** **ప్రశ్న– 1– 9**

వారు చంద్రలోకానికి (స్వర్గలోకానికి) వెళతారు. ఉపాసనచేసిన వ్యక్తి శుక్లగతి ద్వారా బ్రహ్మలోకానికి వెళతాడు.

**ఏతద్ వై ప్రాణానామ్ ఆయతనమ్ ఏతదమృతమ్।**
**అభయమేతత్ పరాయణమేతస్మాన్న పునరావర్తన్త।। ప్రశ్న 1–10**

ఇదీ పద్ధతి. ఇందులో కూడా కండిషన్స్ అప్లై.

స్వర్గలోకానికి వెళ్ళాలంటే ఇష్టాపూర్తం చేయాలి. అనేక కర్మలు చేయాలి. సత్ప్రవర్తన కలిగి ఉండాలి. అన్నీ కుదిరి ఒకవేళ వెళ్ళటం అంటూ అయితే కేవలం స్వర్గలోకానికే (మూడవలోకం) వెళతారు. బ్రహ్మలోకానికి వెళ్ళే అర్హత లేదు.

**తే పునరావర్తన్తే –** శాస్త్రం చెప్తోంది వారు తిరిగివస్తారని.

**హీనతరం వా విశన్తి –** ఇంకా హీనమైన జన్మకూడా పొందవచ్చు.

సరే స్వర్గలోకం వద్దు, బ్రహ్మలోకానికి వెళతాను. ఉపాసన చేస్తాను అనుకోవచ్చు. కాని బ్రహ్మలోకం వెళ్ళటం అంత తేలిక కాదు. బాగా డబ్బున్న వాళ్ళని బిలియనీర్ అంటారు. బిలియన్ అంటే ఒకటి తర్వాత తొమ్మిది సున్నాలు. ట్రిలియన్ అంటే ఒకటి తరువాత పన్నెండు సున్నాలు. క్వింటిలియన్ అంటే ఒకటి తర్వాత పద్దెనిమిది సున్నాలు. జిలియన్ అంటే ఇంకా ఎన్నో సున్నాలు. భూమ్మీద అలాంటి జిలియనీర్ అవటం చాలా కష్టం. పూజ్యస్వామీజీ అంటున్నారు, అలాంటి జిలియనీర్ అవటమన్నా తేలికేమో కాని, బ్రహ్మలోకం వెళ్ళటం అంత తేలిక కాదు.

అన్నీ అధిగమించి వెళ్ళారే అనుకోండి. అప్పుడు కూడా మోక్షం వచ్చేయదు. అక్కడ బ్రహ్మదేవుడు చెప్పే బోధ వినాలి. పూజ్యస్వామీజీ హాస్యంగా చెబుతారు, 'అరే అక్కడ మా భూమ్మీద దయానంద సరస్వతీ స్వామి చెప్పిందే మీరు చెపుతున్నారే, ఆయన చెప్తుంటే పట్టించుకోలేదు. ఇక్కడికి వచ్చినా తప్పలేదా,' అని అంటారట. అక్కడ ఆత్మజ్ఞానం చెప్పేది సాక్షాత్తూ ఆ బ్రహ్మదేవుడు. మనమూ భూలోకంలో ఉండే కష్టసుఖాలకు అతీతంగా ఉంటాము. మెదడు కూడా చాలా పదునుగా ఉంటుంది. ఠక్కున అర్థమవుతుంది. కాని ఏమిటి సమస్య? వెళ్ళటమే సమస్య.

మామూలుగా జ్ఞానయోగం అనగానే అమ్మో అదెక్కడ కొరుకుడు పడుతుంది, ఆ జ్ఞానమేదో తలమీంచి వెళ్ళిపోతుంది అనో; ఆ నాకెందుకు అది, హాయిగా రామనామం చేసుకుంటూ మా రాముడి కాళ్ళు పట్టుకు కూర్చుంటాను అనో అంటూ ఉంటారు అందరూ. కాని అది కర్మకాండతో పోలిస్తే అంత కష్టమేమీ కాదు. కర్మకాండకు ఎంతో కాయిక, వాచిక, మానసిక తపస్సు చేయాలి. ఎన్నో వ్యయప్రయాసలకోర్వాలి. ఇంతా చేస్తే మిగిలేది శ్రమా, ఖర్చూ తప్ప ఫలితం వస్తుందన్న నమ్మకం లేదు.

జ్ఞానకాండ అలాంటిది కాదు. సీటు గ్యారంటీ కోర్సు అది. గ్యారంటీ ఏమిటి? సీటు ఇచ్చేసింది. మోక్షం సాధ్య వస్తువు కాదు. సిద్ధ వస్తువు అంటోంది. నువ్వు మోక్షం కోరనక్ఖరలేదు. ఇప్పటికే నువ్వు ముక్తపురుషుడవని అంటోంది. దాని కోసం నువ్వు ఏమీ కష్టపడనక్ఖరలేదు. నీ కళ్ళకు కప్పుకున్న అజ్ఞానపు పొరను తొలగించు, నువ్వు బ్రహ్మావి అని తెలుసుకోమంటోంది. మనం అల్పులం అని నమ్ముతాం గానీ, మనం బ్రహ్మ అంటే నమ్మం. అందుకే దీని జోలికి రావటానికి భయపడతాం. కాని ఇప్పటికన్నా మీలో పాతుకుపోయిన తప్పుడు అభిప్రాయాలను పారద్రోలి, శాస్త్రం మీద శ్రద్ధాభక్తి పెంచుకోండి. శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేసి ఆత్మజ్ఞానం పెంచుకోండి. ఇక్కడే, ఇప్పుడే మోక్షం పొందుతారు, ముక్తపురుషులమని గ్రహిస్తారు అంటోంది శాస్త్రం. అందుకని కష్టమైన కర్మకాండను వదిలి, కొంచెం కష్టమైనా మోక్షం గురించి చెప్పే జ్ఞానకాండలోకి అడుగుపెడదాము.

కొంతమంది బ్రహ్మలోకానికి అంటే వైకుంఠానికో, కైలాసానికో వెళ్ళటమే మోక్షం అనుకుంటారు. కాని శంకరాచార్యులు ఈ ఉపనిషత్తే రెండుచోట్ల ఆ భావనని ఖండిస్తోంది అని చెపుతున్నారు.

**పర్యాప్తకామస్య కృతాత్మనస్తు**
**ఇహైవ సర్వే ప్రవిలీయన్తి కామాః ముండకం 3-2-2**

కోర్కెలు నెరవేరిన ఆత్మజ్ఞానికి ఇక్కడే అన్ని కోర్కెలూ సమసిపోతాయి.

**తే సర్వగం సర్వతః ప్రాప్య ధీరాః**
**యుక్తాత్మానః సర్వమేవాఽవిశన్తి ముండకం 3-2-5**

సర్వవ్యాపకమైన ఆత్మను పొంది అందులోనే లీనమవుతారు.

అంటే బ్రహ్మలోకం వెళ్ళటం మోక్షం కాదు.

శంకరాచార్యులు ఇంకా ఇలా వాదిస్తున్నారు. ఇక్కడ సందర్భం అపరావిద్య. మనం ఇంకా పరావిద్యలోకి అడుగుపెట్టలేదు. ఉన్నట్టుండి మోక్షం గురించి మాట్లాడలేదు శ్రుతి. ఒకవేళ అపరావిద్య వల్లే మోక్షం వచ్చేటట్లయితే పరావిద్య ఎందుకు?

కర్మల వల్ల లోకప్రాప్తి కలుగుతుందంటే కర్మలే శాశ్వతం కానప్పుడు, కర్మ చేసే వ్యక్తి అసలే శాశ్వతం కానప్పుడు, లోకప్రాప్తి ఎలా శాశ్వతమవుతుంది? ఒక విత్తనం నాటితే ఒక మొక్క రావచ్చు. అది కూడా అదృష్టం బాగుంటే. అపరావిద్యనుంచి పరావిద్యకి, వైరాగ్యం అనే తలుపు ద్వారా వెళ్ళాలి.

**కర్మయోగం పూర్తికాకుండా జ్ఞానయోగం అసంభవం**

**జ్ఞానయోగం లేకుండా కర్మయోగం అసంపూర్ణం**

**మంత్రం – 12**

**పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో**
**నిర్వేదమాయాన్నాస్త్యకృతః కృతేన।**
**తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్**
**సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్॥**

**ప్రతిపదార్థం –** బ్రాహ్మణాః – మహనీయులు; కర్మచితాన్ – కర్మల ఫలంగా పొందిన; లోకాన్ – లోకానుభవాన్ని; పరీక్ష్య – విచారించి; కృతేన – కర్మలు చేస్తే; అకృతః – నిర్దోష మోక్ష పురుషార్థాం; న అస్తి – రాదు; నిర్వేదమాయాత్ – వైరాగ్యం పొంది; తద్విజ్ఞానార్థమ్ – ఆ బ్రహ్మ జ్ఞానం కోసం; సః – అతడు, సమిత్పాణి – చేతిలో సమిధలు పట్టుకొని; శ్రోత్రియమ్ – శ్రుతి చెప్పగలిగిన; బ్రహ్మనిష్ఠమ్ – బ్రహ్మనిష్ఠలో ఉన్న; గురుం ఏవ – గురువును మాత్రమే; అభిగచ్ఛేత్ – ఆశ్రయించాలి.

**తాత్పర్యం –** మహనీయులు కర్మల ఫలంగా పొందిన లోకానుభవాన్ని విచారించి, కర్మలు గాని, ఉపాసనగానీ చేస్తే నిర్దోష మోక్ష పురుషార్థం రాదని తెలుసుకుని, వైరాగ్యం చెంది, చేతిలో సమిధలు పుచ్చుకుని శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువును ఆ బ్రహ్మవిద్య నేర్పమని కోరాలి.

వివరణ – ఈ మంత్రంలో కర్మయోగం నుంచి జ్ఞానయోగానికి, అపరావిద్య నుంచి పరావిద్యకి, ధర్మార్థకామాలనుంచి మోక్ష పురుషార్థానికి, ప్రేయోమార్గం నుంచి శ్రేయో మార్గానికి మారటం వస్తుంది.

అపరావిద్యకు పరిమితులు ఉన్నా అపరావిద్య చాలా ముఖ్యం. అదే గమ్యం అనుకుంటే ఓటమి తప్పదు. దాన్నే మార్గంగా మలచుకుంటే జ్ఞానమనే గమ్యం చేరుకుంటారు.

## పరావిద్యకు రానిదే అపరావిద్య పూర్తికాదు
## అపరావిద్య లేనిదే పరావిద్య సాధ్యం కాదు

అపరావిద్యలోకి వెళ్ళి దాన్నించి ఎదగాలి. మనం పోల్ వాల్టర్ ఎగిరినట్టు ఎగరాలి. పోల్ వాల్టర్ కర్ర పట్టుకుని పరుగెత్తుకు వచ్చి, బాగా ఎత్తుకు ఎగిరి, కర్రను వదిలేసి అవతలకు దూకుతాడు. ఎలాగూ వదిలేసేదాన్ని పట్టుకోవటమెందుకూ అనకూడదు. అది పట్టుకోలేదో ఎగరలేడు. ఇంతదూరం నేను పట్టుకొని పరిగెత్తాను కదా, ఇప్పుడు ఎందుకు వదిలేయటమూ అనకూడదు. వదలందే దూకలేడు. అంటే దాన్ని పట్టుకోవాలి, సరియైన సమయంలో వదలాలి. అపరావిద్య కూడా అంతే–సాధన చతుష్టయ సంపత్తి వచ్చేదాకా దాన్ని పట్టుకోవాలి. మనసుకు ఉన్న సహజగుణమే రాగం పెంచుకోవటం. వరసగా పదిరోజులు ఒక ప్రసంగానికి వెళ్ళినా, అక్కడ ఒకేచోట, ఒకే కుర్చీలో కూర్చుంటాము. ఎవరైనా అక్కడ కూర్చుంటే వారితో పోట్లాడి, వారిని లేపుతాము.

కర్మయోగం అంటే ఈ రాగద్వేషాలను వదుల్చుకోవటమే. అది ఎలా చేయాలి? ఉపనిషత్తు ఈ విషయం చెప్పదు. సాధారణంగా భగవద్గీత నేర్చుకున్నాక ఉపనిషత్తుకి వస్తారు ఎవరైనా. అందుకని అందులో చదివారని అనుకుంటుంది. అందులో రెండు అంశాలున్నాయి. వాటిని ముందు చూద్దాము. అవి–

1. **సరియైన భావన –** నేను కర్త అనుకుంటే నేను చేసే కర్మ నాకు నచ్చదు. అలాగే నేను భోక్త అనుకుంటే నాకు వచ్చిన కర్మఫలం నాకు తృప్తినివ్వదు. ఈ అసంతృప్తిని ఎలా అధిగమించాలి? ఈ రెండింటినీ ఈశ్వరునితో కలపాలి. కర్మను ఈశ్వరునికి అర్పించాలి, ఫలాన్ని ఈశ్వరుడు ఇచ్చిన ప్రసాదంగా స్వీకరించాలి. అంటే ఈశ్వరార్పణ భావనతో కర్మలు చేయాలి, ఈశ్వర ప్రసాద భావనతో కర్మఫలాలను స్వీకరించాలి. దానివల్ల మనసు ప్రశాంతంగా ఉంటుంది. ప్రతిపనికీ బాధపడే మనసు ఏమీ నేర్చుకోదు. పైగా ప్రతిదాన్నీ భూతద్దంలోంచి చూస్తుంది.
   మనం ఒక వేలు చూపి ఎవరినైనా నిందిస్తే, తక్కిన నాలుగువేళ్ళు మనవైపే చూపిస్తున్నాయని తెలుసుకోవాలి. ఈ ప్రపంచంలో మార్చగలిగిన ప్రదేశం ఒక్కటే ఉందిట. అది ఏమిటి? మనమే. మనం మననే మార్చుకోవాలి. **సమస్య నువ్వే, పరిష్కారం నువ్వే అంటారు పూజ్యస్వామీజీ.**

2. **సరియైన కర్మలు:-** నిషిద్ధ కర్మలు, కామ్యకర్మలు, పరిహార కర్మలను తగ్గించమని శాస్త్రం చెబుతుంది. విహిత కర్మలు లేదా పంచమహా యజ్ఞాలను ఎక్కువ చేయమంటుంది.

**కర్మయోగం = సరియైనభావన+సరియైన కర్మ**

కర్మయోగం అంటే సరియైన భావన కలిగి ఉండటం, సరియైన కర్మలు చేయటం. జ్ఞానయోగానికి వచ్చేముందు కర్మయోగిగా మారాలి. రాగద్వేషాలు పెంచుకునే బదులు ఈశ్వరార్పణ భావనతో చేసి, ఈశ్వరప్రసాదంగా స్వీకరిస్తే, ఏ బాధా ఉండదు. నేను చెప్పినట్టు వాడు వినాలనే భావనా, వినకపోతే పడే బాధా రెండూ ఉండవు. ఒక పనిచేస్తే అనేకరకాల ఫలం రావచ్చు. ఏదొచ్చినా మన మంచికే అని స్వీకరిస్తే అప్పుడు ఏ బాధా ఉండదు.

ఇలా కర్మయోగిగా మారినతను బ్రాహ్మణుడు. బ్రాహ్మణ అంటే వర్ణం ప్రకారం బ్రాహ్మణుడు కాదు. గుణ బ్రాహ్మణుడు.

**పరీక్ష్యలోకాన్ –** పరీక్ష ఎలా చేయాలి? బుద్ధిని ఉపయోగించి. మన పూర్వజన్మల కర్మఫలంగా ఈ శరీరం వస్తుంది. ప్రారబ్ధకర్మ ఉన్నంతవరకు అది ఉంటుంది. తరువాత? రాలిపోతుంది.

**కర్మచితాన్ –** ఈ కట్టె శాశ్వతం కాదు. అది ఉండగా చేసిన కర్మలకు వచ్చిన ఫలాలు – కర్మ, కర్మఫలం; ఉసాసన. ఉపాసన ఫలం. ఈ నాలుగింటినీ పరీక్షించి చూస్తే వాటివల్ల వచ్చే ఫలాలకు మూడు దోషాలుంటాయని తెలుసుకుంటాం. అవి దుఃఖమిశ్రితత్వం, బంధకత్వం, అతృప్తికరత్వం. ప్రత్యక్షప్రమాణం వల్ల, శాస్త్రం చెప్పటం వల్ల పరీక్ష చేసాము.

**నిర్వేదమాయాత్–** అనుభవం నుంచి నేర్చుకోవాలి. కర్మఫలంలో మూడు దోషాలున్నాయని తెలుసుకుంటే, త్రివిధ ఫలాలనిచ్చే కర్మలను తగ్గించుకుని, ధర్మార్థకామాలు కాకుండా వేరే ఏదైనా పురుషార్థం ఉందా అన్న తపన పుట్టాలి.

చాలామంది ధర్మార్థకామ పరిమితులు తెలుసుకుంటారు గాని, వేరే ఏదైనా పురుషార్థం ఉందా అని చూడరు. తెలియని విషయాల జోలికి వెళ్ళే సాహసం చేయరు. చాలా కొద్దిమందిలోనే వివేకం వస్తుంది. నిత్యానిత్య వస్తు వివేకం చేసే ముందు ముముక్షుత్వం ఏర్పడుతుంది.

**నాస్త్యకృతః కృతేన** – మనిషి ధర్మార్థ కామాలతో కూడిన కర్మలు చేసీ చేసీ అవి సదోష పురుషార్థాలని తెలుసుకుంటాడు. దానివల్ల నిర్దోష మోక్ష పురుషార్థం రాదని గ్రహిస్తాడు. అకృతః అంటే మోక్షం. బ్రహ్మ, నిర్దోష పురుషార్థం. అంటే ధర్మార్థకామాలు పనికిరావనా అర్థం? కాదు. వాటివల్లే ఒక వ్యక్తిలో ఆధ్యాత్మికంగా ఎదగాలి అన్న తపన పుడుతుంది.

బొమ్మలతో ఆడుకుంటున్న పిల్లవాడికి బలవంతంగా అన్నం పెడితే వాడు నోరు తెరవడు. వాడికి ఆకలి వేసినప్పుడు బొమ్మలు వదలి వస్తాడు. అలాగే ముముక్షువు ధర్మార్థకామాలనే బొమ్మలను వదిలి, మోక్షమనే ఆహారం కోసం వస్తాడు. నాకిప్పుడు నిర్వేదం వచ్చింది. ఏం చేయాలి అంటాడు శాస్త్రంతో. శాస్త్రం నీ ప్రశ్న తప్పు అంటుంది. ఏదైనా చేయటం అంటే అది కర్మ అవుతుంది, దానికి ఫలం వస్తుంది, అది సదోష పురుషార్థం అవుతుంది.

మరి నిర్దోష పురుషార్థాన్ని ఎలా కనుక్కోవాలి? జ్ఞానమార్గం ద్వారా కనుక్కోవాలి అంటుంది శాస్త్రం. ఇది కర్మలోకి రాదు. శంకరాచార్యుల వారు సందర్భం దొరికినప్పుడల్లా జ్ఞానమార్గం వేరు కర్మమార్గం వేరు, రెంటికీ పొంతన కుదరదు, రెండింటినీ సముచ్చయం (కలపటం) చేయలేము అని చెప్తూనే ఉంటారు.

ఉదాహరణకు కర్మకీ, జ్ఞానానికీ ఫలబేధం ఉండటం వల్ల ఈ రెండింటినీ కలపలేము. జ్ఞానం ఏమీ ఫలాన్ని ఇవ్వకపోతే జ్ఞానం వల్ల లాభమేమిటి? చతుర్విధ కర్మ ఫల విలక్షణ ఫలం జ్ఞానానిది. అజ్ఞానం వల్ల మోహం పుడుతుంది. అజ్ఞాన నివృత్తి కలగటమే జ్ఞానం.

ముముక్షువు జ్ఞానమార్గానికి వచ్చాడు. బాగానే ఉంది. జ్ఞానం ఎలా పొందాలి? ఏ మాల్‌లో దొరుకుతుంది? మోక్షా షాప్ ఏదైనా ఉందా? ఉపనిషత్తు, అది ఎక్కడో లేదు. అది నువ్వే అంటుంది. **తత్త్వమసి** అంటుంది. సచ్చిదానంద ఆత్మవు నువ్వే అంటుంది. దానికి అతని మొట్టమొదటి ప్రతిస్పందన ఏమిటి? ఇవాళ ఏప్రిల్ ఒకటి కూడా కాదే, నేనేమిటి ఆనంద స్వరూపమేమిటి? నేను దుఃఖానికి ప్రతీకగా ఉన్నాను అనుకుంటాడు.

శాస్త్రాన్ని కాదనలేడు, అది ప్రమాణం కాబట్టి. అలాగే శాస్త్రాన్ని అవుననీ అనలేడు, అనుభవం వేరేగా ఉంది కాబట్టి. ఇంతకూ నేను అసంసారీ పరమాత్మనా,

సంసారీ జీవాత్మనా అనుకుంటాడు. అలా ఆత్మ విచారణ మొదలవుతుంది. నా అనుభవం తప్పని నిరూపించబడితే నాకు ఆనందమే అనుకుంటాడు. ఎందుకు? '**అహం ఆనంద స్వరూపః,**' అంటోంది శాస్త్రం.

అయితే ఆత్మవిచారణ ఎలా చేయాలి? ఉపనిషత్తు నువ్వు స్వంతంగా చేయలేవు. నీ ఇంద్రియాలు బయట ప్రపంచాన్ని తెలుసుకోవటానికే ఉన్నాయి తప్ప నిన్ను తెలుసుకోలేవు అంటోంది.

**తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్ –** ఆ బ్రహ్మజ్ఞానం కోసం సరియైన గురువు దగ్గరికి వెళ్ళు అంటోంది. ఆ గురువు ఎలా ఉండాలి? శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయి ఉండాలి. బ్రహ్మనిష్ఠ అంటే బ్రహ్మలో రమించాలి. శ్రోత్రియ అంటే శ్రుతిని ప్రమాణంగా స్వీకరించి తను పొందిన బ్రహ్మవిద్యను చక్కగా బోధించగలిగే నేర్పు ఉండాలి. ఎందుకంటే ఇన్నాళ్ళూ మనం నేర్చుకున్న విద్య ఒక ఎత్తు, ఇప్పుడు నేర్చుకోబోయేది ఇంకో ఎత్తు.

మనం ఇన్నాళ్ళూ నేర్చుకున్నది బాహ్యావస్తువు గురించి. ఉదాహరణకు తాజ్‌మహల్ గురించి నేర్చుకున్నాము, నేర్చుకున్నాక దాని అందాన్ని ఆస్వాదించాలి అంటే వెళ్ళి చూడాలి. అదే పద్ధతి ఇక్కడ కూడా ఉపయోగిస్తాము. ఆత్మసాక్షాత్కారం అంటే ఏదో జ్యోతిలా వచ్చేది అనుకుంటాము. అలా స్థూలంగా అనుభవం లోకి రాదు అని తెలియాలి.

చూస్తున్న నువ్వే ఆత్మవు చూడబడే వస్తువు కాదు. మన స్వామీజీలాంటి శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువు దొరకాలి.

**అభిగచ్ఛేత్ –** అలాంటి గురువు దగ్గరకు మనమే వెళ్ళాలి. ఎందుకు?

**తద్విజ్ఞానార్థం –** బ్రహ్మ విద్య పొందటానికి. ఎలా?

**సమిత్పాణిః –** సమిధలు తీసుకుని వెళ్ళాలి. చెప్పే గురువు మీద శ్రద్ధ, భక్తి ఉండాలి. అది చూపించే చిహ్నం సమిధలు తీసుకువెళ్ళడం. సమిధ అంటే ఎండు పుల్లలు. వాటిని కాల్చగానే తేలికగా మండుతాయి. అలా శిష్యుడు నేను కర్మకాండ చేసి, సాధన చతుష్టయ సంపన్నుడనయ్యాను, జ్ఞానం పొందటానికి సంసిద్ధుడిగా ఉన్నాను అని చెప్పటం అన్నమాట.

**ప్రత్యేక విశ్లేషణ:–** పూజ్యస్వామీజీ నిత్యానిత్యవస్తు వివేకం ఎలా చేయాలో చెపుతారు. ఒక స్త్రీ తన ఉంగరం పోగొట్టుకుని, దానికోసం వెతుకుతోందిట.

ఎవరో వచ్చి ఏం వెతుకుతున్నావు అంటే విషయం చెప్పిందిట. ఎక్కడ పోగొట్టుకున్నావంటే, ఇంట్లో అందిట. మరి రోడ్డుమీద ఎందుకు వెతుకుతోంది? అక్కడ చీకటిగా ఉంది, ఇక్కడైతే వెలుతురుగా ఉంది అందిట. ఏదైనా వస్తువు ఎక్కడ పోగొట్టుకుంటే అక్కడే వెతకాలి.

మనం ఎంత పొందినా మనకు తృప్తి కలగటం లేదు. ఇంకా ఏదో కావాలని అనిపిస్తోంది. తృప్తి వస్తువులో ఉందనుకుని వెతుకుతున్నాము. కాని తృప్తి వస్తువులో లేదు. మనలో ఉంది.

**నాస్త్యకృతః కృతేన –** ఈ వాక్యం అనేక విషయాలను సూచిస్తోంది.

- ఎ) కర్మకాండ మొత్తాన్ని విశ్లేషించి దాన్ని అనిత్యం అంటోంది.
- బి) చిన్న సూత్రంలో వైరాగ్యాన్ని సూచిస్తోంది
- సి) ముముక్షువు, ఎలా జిజ్ఞాసిగా మారాడో సూచిస్తోంది.
- డి) కర్మ వల్ల మోక్షం రాదని సూచిస్తోంది.

వైరాగ్యం పొందటానికి మార్గం వివేకం. పరీక్ష చేయటం వల్ల వివేకం, వైరాగ్యం రెండూ వస్తాయి. పరీక్ష ఫలితం ఏమిటి? ఏ కర్మ చేసినా దాని ఫలంగా మోక్షం రాదు.

ఇక్కడ పరీక్ష చేయాలన్న విషయం నొక్కి చెప్తోంది. కర్మఫలాన్ని పరీక్ష చేయమంటుంది. అది స్వయంగా చేసినా సరే, శాస్త్రపరంగా చేసినా సరే లేదా గురుముఖతా నేర్చుకున్నా సరే. అలా పరీక్ష చేయటం వల్ల మనం కోరేది కర్మఫలం కాదు, ప్రమాణఫలం అని తెలుస్తుంది.

**శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్–** శ్రోత్రియ అంటే వేదాలను, వేదాంతాన్ని అధ్యయనం చేసి, సంప్రదాయం తెలిసిన వ్యక్తి అని అర్థం. మనం నేర్చుకునేదేమిటో కూడా ఈ పదంలో తెలుస్తుంది. గురువు తను బోధించేది స్వంతంగా చెప్పడు. శ్రుతి ఏం చెప్పిందో దాన్నే బోధిస్తాడు.

బ్రహ్మనిష్ఠ అంటే తానే బ్రహ్మ అని తెలుసుకుని, బ్రహ్మలో రమించే వ్యక్తి. అతను బ్రహ్మనిష్ఠుడు అని తెలుసుకోవటమెలా? బ్రహ్మ తప్ప వేరే దేని గురించీ తపనలేని వ్యక్తిని బ్రహ్మనిష్ఠ అని చెప్పవచ్చు. గురువు శ్రోత్రియుడు అయి ఉండవచ్చు కాని బ్రహ్మలో రమించకపోవచ్చు. బ్రహ్మనిష్ఠ అంటే సన్యాస జీవితానికి సరిపోలినదిగా ఉంటుంది. బ్రహ్మనిష్ఠలో ఉన్న గురువు చెప్పి తీరాలని లేదు. అతనికి విధి, నిషేధాలు లేవు. శ్రోత్రియ గురువు చెప్పవచ్చు, చెప్పకపోవచ్చు.

అతని ప్రారబ్ధకర్మ వల్ల, తన స్వభావం వల్ల చెప్పవచ్చు, అతను చెప్పకుండా ఉండటానికి కారణం లేదు. అతను చెబితే కొందరికి జ్ఞానం రావచ్చు.

సంప్రదాయంలో ఒక రాయని నియమం ఉంది. ఎవరైనా తన జ్ఞానం స్పష్టం అవటానికి చెప్పాలి. బోధచేస్తే అది మరింత స్పష్టతని ఇస్తుంది. అది మెరుగైన సాధన. దాన్ని బ్రహ్మాభ్యాసం అంటారు. జ్ఞానాన్ని శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారా పొందాలి.

ఉపనిషత్తు బోధ చేస్తే, అది శిష్యునికి శ్రవణం, గురువుకి నిదిధ్యాసనం అవుతుంది. నా అంతఃకరణ శుద్ధికి, నా స్పష్టతకి రాస్తున్నాను అంటారు కొందరు. 'నేను అర్థం చేసుకున్నదాంట్లో స్పష్టత ఉందా లేదా తెలుసుకోవటానికి రాస్తున్నాను,' అంటారు సురేశ్వరాచార్యులు. మన స్వామీజీ కూడా బ్రహ్మసూత్రాలు బోధించేటప్పుడు అలాగే చెబుతారు.తన జ్ఞానాన్ని మెరుగుపరచుకోవటానికి చెబుతున్నానంటారు. బోధ చేసేటప్పుడు, ఒక్కొక్క పదాన్నీ, ఒక్కొక్క వాక్యాన్నీ విశ్లేషించి చెప్పాలి. అప్పుడు చెప్పేవారికి కూడా మరింత స్పష్టత ఏర్పడుతుంది.

## మంత్రం - 13

**తస్మై స విద్వానుపసన్నాయ సమ్యక్, ప్రశాన్తచిత్తాయ శమాన్వితాయ।**
**యేనాక్షరం పురుషం వేద సత్యం, ప్రోవాచ తాం తత్త్వతో బ్రహ్మవిద్యామ్॥**

**ప్రతిపదార్థం:-** సః-ఆ; విద్వాన్- గురువు; సమ్యక్ ఉపసన్నాయ- చక్కగా సమీపించిన; ప్రశాన్తచిత్తాయ- ప్రశాంతమైన మనసుతో ఉన్న; శమాన్వితాయ- (ఇక్కడ) శమ అంటే ఇంద్రియ నిగ్రహం గల; తస్మై - అతనికి; యేన- బ్రహ్మవిద్య; సత్యమ్ - సత్యం; అక్షరమ్ - అక్షరం బ్రహ్మ; పురుషమ్ - సర్వవ్యాపకం; వేద- తెలుసుకునేలాగా; తాం తత్త్వతః - ఆ బ్రహ్మను నేను అని అర్థం చేసుకునేలాగా; బ్రహ్మవిద్యామ్ - బ్రహ్మవిద్యని; ప్రోవాచ- సరిగ్గా చెప్పాలి.

**తాత్పర్యం-** ప్రశాంత చిత్తం, ఇంద్రియ నిగ్రహం గల విద్యార్థి గురువును చక్కగా సమీపించినప్పుడు, ఆ గురువు సత్యం, అక్షరం బ్రహ్మ,సర్వవ్యాపియైన బ్రహ్మ నువ్వే అని అతనికి అర్థమయ్యే రీతిలో చెప్పాలి.

**వివరణ-** శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువు దగ్గరికి శిష్యుడు వెళ్తే ముందు ఆ వ్యక్తికి ఏం కావాలో గురువు తెలుసుకోవాలి. అతను ఆ జ్ఞానం పొందటానికి సిద్ధంగా ఉన్నాడా, సూక్ష్మబుద్ధి ఉందా అని తెలుసుకోవాలి.

**సమ్యక్ ఉపసన్నాయ** – ఈ జ్ఞానం పొందటానికి అతను సిద్ధంగా ఉన్నట్టు అర్థం.

జ్ఞానయోగానికి వచ్చే శిష్యుడు సాధన చతుష్టయ సంపన్నుడై ఉండాలని చూసాము ముందు మంత్రంలో–

**పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో**
**నిర్వేదమాయాత్ నాస్త్యకృతః కృతేన ।ముండకం 1–2–12**

సాధన చతుష్టయంలోని రెండు లక్షణాలు వచ్చాయి.

వివేకం, వైరాగ్యం. ఇప్పుడు శమదమాది షట్కసంపత్తి, ముముక్షుత్వం గురించి వస్తుంది. అవి –

| | | |
|---|---|---|
| శమ | – | మనోనిగ్రహం |
| దమ | – | ఇంద్రియ నిగ్రహం |
| ఉపరతి | – | లౌకిక విషయాల మీద నిరాసక్తి |
| తితీక్ష | – | మానసిక స్థైర్యం |
| శ్రద్ధ | – | శాస్త్రం మీద, గురువు మీద నమ్మకం |
| సమాధానమ్ | – | ఏకాగ్రత |

సమ్యక్ ఉపసన్నాయ అంటే శ్రద్ధాభక్తులతో వెళ్ళాడు.

**ప్రశాంత చిత్తాయ–** మనో నిగ్రహం ఉంది. వివేకం వల్ల మనసు ప్రశాంతంగా ఉంది.

**శమాన్వితాయ–** ఇక్కడ శమ అంటే ఇంద్రియనిగ్రహం. గురువు చెప్పింది వినాలంటే కుదురుగా కూర్చోవాలి. షట్క సంపత్తిలోని తక్కినవి కూడా కలుపుకోవాలి.

గురువు దగ్గరికి వెళ్ళాడంటే మోక్షం కోసం జిజ్ఞాస ఏర్పడినట్టు. 'సః ఉపసన్నాయ,' జిజ్ఞాసని సూచిస్తుంది.అంటే ముముక్షుత్వం ఉన్నట్టు అర్థం.

అటువంటి శిష్యునికి గురువు బోధించాలి. అలా మొదలవుతుంది సంప్రదాయం. ఇందులో గురువు అంగిరసుడు, శిష్యుడు శౌనకునికి బోధిస్తున్నాడు. శిష్యుడు తను నేర్చుకున్నాక, వెళ్ళి ఇతరులకు నేర్పిస్తాడు. అలా ఒక విధిని నిర్దేశిస్తోంది శాస్త్రం. అందుకే ఏ గురువు బోధ చేసినా, తన గురువు ఇలా చెప్పాడని మధ్య మధ్యలో చెపుతూ ఉంటాడు.

**ప్రోవాచ–** ప్రోవాచ అంటే సరిగ్గా చెప్పాలి. దేన్ని?

**యేనాక్షరం పురుషం వేద సత్యం–** ఆ బ్రహ్మవిద్యను, సత్యం, అక్షరం, పురుషం– బ్రహ్మకు నిర్వచనాలు ఇవి.

**నిత్యం విభుం సర్వగతం సుసూక్ష్మం – ముండకం – 1–1–6**

అందులో కొన్ని నిర్వచనాలు చూసాం.

**సత్యం–** మూడుకాలాల్లోనూ ఉండేది. మార్పులేనిది. అన్నిటికీ కారణమైనది అని అర్థం.

**అక్షరం–**క్షయం కానిది, నిత్యం అని అర్థం.

**పురుషం–** సర్వవ్యాపకం అంటే సర్వగతం.

**ఏకం, సారం, నిత్యం, సత్యం–** అంతకుముందు కార్య, కారణాల గురించి తెలుసుకున్నప్పుడు బ్రహ్మ – ఏకం, సారం, నిత్యం,సత్యం అని నేర్చుకున్నాము.

**తాం తత్త్వతో బ్రహ్మవిద్యామ్ –** ఆ బ్రహ్మ నువ్వే అని చెప్తాడు గురువు. మొదట్లో నమ్మలేము. కొన్నాళ్ళు పోయాక ఆ బ్రహ్మ గురువు అవచ్చేమో కానీ నేను కాదు అనుకుంటాము. వినగా వినగా నమ్మకం ఏర్పడుతుంది. స్వాప్నికుడు తను స్వప్నం నుంచి లేచాక, స్వప్నప్రపంచం తనలోనే ఉంది అని అర్థం చేసుకుంటాడు. ఇప్పుడు మనం కలలో ఉన్నాము. నేను సృష్టి, స్థితి లయకారకుడినని, స్వప్నం నుంచి లేచాక (అజ్ఞానం తొలిగాక) అర్థం చేసుకుంటాము. ముందు ముందు బ్రహ్మ  గురించి ఇంకా వివరంగా వస్తుంది.

# ద్వితీయ ముండకం

## ప్రథమ ఖండం

ఇక్కడ్నుంచి జ్ఞానబోధ మొదలవుతుంది. శిష్యుడు గురువు దగ్గరికి శ్రద్ధాభక్తులతో వెళ్ళాలి . సమిధలు తీసుకువెళ్ళడంలో అంతరార్థం అది. అలాంటి శిష్యుడు దొరికితే గురువుకి కూడా ఆనందమే. అది విన్ విన్ సిట్యుయేషన్ లాంటిది. శిష్యునికి అది శ్రవణం అయితే, గురువుకి నిదిధ్యాసనం అవుతుంది. ఇంక లోతైన జ్ఞానంలోకి అడుగుపెడుతున్నాం.మొదట్లో కష్టంగా అనిపించినా బోధ సూక్ష్మంగా ఉన్నా కంగారు పడవద్దు, అదే విషయం అనేక కోణాల్లోంచి పదే పదే వస్తుంది. అప్పుడు తేలిగ్గా అర్థమవుతుంది. అంతేకాదు వేదాంతిక్ డైవింగ్‌ను మీరు బాగా ఆస్వాదిస్తారని హామీ ఇస్తున్నాను. అది నిజమని ముందు ముందు మీకే తెలుస్తుంది.

**మంత్రం - 1**

**తదేతత్ సత్యమ్ - యథా సుదీప్తాత్ పావకాత్,**
**విస్ఫులింగాః సహస్రశః ప్రభవన్తే సరూపాః।**
**తథాక్షరాద్వివిధాః సోమ్య భావాః,**
**ప్రజాయన్తే తత్ర చైవాపియన్తి॥**

**ప్రతిపదార్థం -** తదేతత్ సత్యమ్ - ఇది సత్యం; యథా -ఎలా, సుదీప్తాత్ - పావకాద్ - జ్వలించే అగ్ని; విస్ఫులింగాః - నిప్పు రవ్వలు; సహస్రశః - వేలాది రవ్వలు; సరూపాః - అదే స్వభావం గల; ప్రభవన్తే - ఉద్భవిస్తాయో; తథా - ఆ విధంగా, సోమ్యః - సోమ్యుడా; అక్షరాత్ - ఆ అక్షరం బ్రహ్మనుంచి; వివిధాః భావాః - అనేకరకాలైన జీవులు, ప్రజాయన్తే - ఉద్భవిస్తున్నాయి; తత్రచైవాపియన్తి - అందులోనే లయమవుతున్నాయి.

**తాత్పర్యం-** ఓ సౌమ్యుడా! ఇది నిజం. జ్వలిస్తున్న అగ్ని నుండి అదే స్వభావం గల వేలాది నిప్పురవ్వలు ఏ విధంగా ఉద్భవిస్తాయో అలాగే అక్షరం బ్రహ్మనుంచి

అనేక రకాలైన జీవాలు ఉద్భవించి అందులోనే లయమవుతున్నాయి.

**వివరణ–** ఇక్కడ్నుంచీ పరావిద్యలోకి అడుగుపెడుతున్నాము. మొదటి అధ్యాయంలో బ్రహ్మ లక్షణం టూకీగా చెప్పి వదిలేసారు.

**యత్ తదద్రేశ్యమ్ అగ్రాహ్యమ్ అగోత్రమ్ అవర్ణమ్**
**అచక్షుః శ్రోత్రం తదపాణిపాదమ్।**
**నిత్యం విభుం సర్వగతం సుసూక్ష్మం**
**తదవ్యయం యద్భూతయోనిం పరిపశ్యన్తి ధీరాః॥ ముండకం 1–1–6**

శుద్ధ చైతన్యం బ్రహ్మ గురించిన వర్ణన ఇది. చాలా ముఖ్యమైన మంత్రం. మనం ఎప్పటికీ గుర్తుంచుకోవాల్సింది. శుద్ధ చైతన్య బ్రహ్మ కార్యకారణ విలక్షణ బ్రహ్మ. శుద్ధ చైతన్యాన్ని 5 లక్షణాలతో వివరిస్తామని అంతకుముందు చూసాం. అవి ఇప్పుడు మళ్ళీ చూద్దాం.

1. చైతన్యం శరీరంలో ఒక భాగం కాని, లక్షణం కాని, దాన్నించి ఉత్పత్తి చెందింది కాని కాదు.
2. చైతన్యం స్వతంత్రం. అది శరీరం అంతటా వ్యాపించి దాన్ని ప్రకాశింప చేస్తుంది.
3. చైతన్యం శరీరం సరిహద్దులకే పరిమితమవలేదు.
4. చైతన్యం శరీరం నాశనమయితే నాశనమవదు. అలా శరీరం పతనం చెందాక కూడా చైతన్యం ఉంటుంది.
5. చైతన్యం శరీరం లేకపోయినా ఉంటుంది. కాని కనబడదు. దాన్ని ప్రతిబింబింపజేసే శరీరం లేదు కాబట్టి అది కనిపించదు. అంత మాత్రాన చైతన్యం లేనట్టు కాదు.

ఇలా చైతన్యం లక్షణాలను వివరిస్తే దాన్ని స్వరూప లక్షణం అంటారు. ఈ మంత్రంలో తటస్థ లక్షణం చెప్తోంది ఉపనిషత్తు. శాస్త్రం ఈ రెండింటి మధ్య భేదాన్ని చూపటానికి ఈ ఉదాహరణనిస్తుంది. దేవదత్తుని ఇల్లు ఎక్కడ అని అడిగితే, తెల్లగా ఉన్నది, రెండంతస్థులు ఉన్నది, నల్ల ద్వారం ఉన్నది లాంటి వివరణలు ఇస్తే అది స్వరూప లక్షణం. కాకి వాలిన ఇల్లు అని చెపితే అది తటస్థ లక్షణం. కాసేపయ్యాక కాకి ఎగిరిపోవచ్చు.

బ్రహ్మను జగత్‌కారణం బ్రహ్మ అని నిర్వచించటం తటస్థ లక్షణం. ఎందుకంటే తరువాత జగత్ మిథ్య అని నిరూపించేసరికి బ్రహ్మ కార్యకారణ విలక్షణంగా అవుతుంది.

జగత్‌కారణం బ్రహ్మ అన్నప్పుడు, నిమిత్తకారణం, ఉపాదాన కారణం రెండూ కూడా బ్రహ్మే అని చూశాం. నిమిత్త కారణం అంటే ఇంటిలిజెంట్ కాజ్, ఉపాదాన కారణం అంటే మెటీరియల్ కాజ్. మొదటి దాంట్లో బ్రహ్మ జగత్తుని సృష్టించాడు. రెండో దాంట్లో బ్రహ్మ తానే జగత్తు అయ్యాడు.

**నిర్గుణ బ్రహ్మ + సగుణ మాయా శక్తి = జగత్కారణ ఈశ్వరుడు**

ఇప్పుడు మనం బ్రహ్మను ఉపాదాన కారణంగా చూడబోతున్నాము. అంటే తానే జగత్తు అయ్యాడు అన్న విషయాన్ని. అంతకు ముందు ఉపాదాన కారణంలో రెండు రకాలు చూశాము.

**పరిణామి ఉపాదాన కారణం –** ఏదైనా వస్తువును తయారుచేయటానికి వాడే ముడిపదార్థం పరిణామం చెందితే దాన్ని పరిణామి ఉపాదాన కారణం అంటారు. ఉదాహరణకు పాలు. పాలను పెరుగుతో తోడిపెట్టినప్పుడు పాలు పెరుగుగా పరిణామం చెందుతుంది.

**వివర్త ఉపాదాన కారణం–** ఏదైనా వస్తువును తయారుచేయటానికి వాడే ముడిపదార్థం పరిణామం చెందకుండా, అలాగే ఉంటే దాన్ని వివర్త ఉపాదాన కారణం అంటారు. ఉదాహరణ స్వప్నం చూసే నేను. నేను స్వప్నం చూస్తున్నా కూడా నేను పరిణామం చెందకుండా అలాగే ఉన్నాను.

ఈ మంత్రంలో మనం బ్రహ్మను వివర్త ఉపాదాన కారణంగా చూస్తున్నాము. మన స్వప్నం మనం సృష్టించింది. ఈ జగత్తు ఈశ్వరుని స్వప్నం. మన మనఃశక్తి మన స్వప్నాన్ని సృష్టిస్తే, ఈశ్వరుని స్వప్నమైన ఈ జగత్తును ఈశ్వరుని మాయాశక్తి సృష్టించింది. పడుకున్నది చాలు మాయ నుంచి మేలుకోండి అంటోంది శాస్త్రం. ఇదీ మనం నేర్చుకోబోయేది. ఇప్పుడు మంత్రంలోకి వెళ్దాము.

**తదేతత్ సత్యమ్–** మంత్రం 1-1-6లో చెప్పబడిన బ్రహ్మ సత్యం. ఆ సత్యమైన బ్రహ్మ నుంచి స్వప్నం లాంటి జగత్తు వచ్చింది. ఇది సత్యం.

అపరావిద్య గురించి చెప్పినప్పుడు కూడా తదేతత్ సత్యమ్ అంది ఉపనిషత్తు. అక్కడ కర్మఫలం గురించి చెప్తూ వాడిందీమాట. ఏదైనా కర్మ చేస్తే దానికి ఫలితం రాకుండా ఉండదు. మూడు రకాల సత్యాలున్నాయి.

**వ్యావహారిక సత్యం –** ఇది లౌకిక సత్యం. కర్మఫలం గురించి చెప్పేది వ్యావహారిక సత్యం. మెలుకువగా ఉన్నప్పుడున్నదంతా వ్యావహారిక సత్యం.

**ప్రాతిభాసిక సత్యం –** స్వప్న సమయంలో కనిపించే స్వప్న జగత్తు ప్రాతిభాసిక సత్యం.

**పారమార్థిక సత్యం–** పరావిద్య గురించి చెప్పే సత్యం. ఇది మూడు కాలాల్లోనూ సత్యంగా ఉండేది. బ్రహ్మ గురించిన సత్యం పారమార్థిక సత్యం.
**సుదీప్తాత్ పావకాద్ విస్ఫులింగాః సహస్రశః ప్రభవన్తే–** పావకః అన్నది అగ్నికి ఒక పేరు. అది శుద్ధి చేస్తుంది కాబట్టి ఆ పేరు. జ్వలించే అగ్ని నుంచి అనేక నిప్పురవ్వలు ఉద్భవిస్తాయి.

**కారణం – ఏకం, సత్యం, సారం, నిత్యం బ్రహ్మ**

**కార్యం – అనేకం, అసత్యం, అసారం, అనిత్యం జగత్తు**

ఈ ఉదాహరణ ఎందుకు? ఒకటే అగ్ని. అనేక నిప్పురవ్వలు. అలాగే ఒకటే బ్రహ్మ, అనేక ఉపాధులు – మనుష్య, దేవ, గంధర్వ వగైరా. వీటికి అనేక నామరూపాలు. జీవ, ఈశ్వరుల మధ్య భేదం బుద్ధి వల్ల వస్తోంది.

**సరూపాః –** ఈ పదం ముఖ్యం. కారణం లక్షణాలు కార్యంలోకి వస్తాయి. ఉదాహరణకు పిల్లలు పుట్టగానే తల్లి పోలికా, తండ్రి పోలికా అని అడుగుతాము. అగ్నికీ, నిప్పు రవ్వలకీ మధ్య ఉన్న పోలికలు రెండు – ఉష్ణం, ప్రకాశం. ఒక్క నిప్పురవ్వ మనమీద పడినా, చురుక్కుమంటుంది. అలాగే అది కూడా ప్రకాశిస్తుంది.

అలాగే కారణం బ్రహ్మకు కార్యం మనకు మధ్య ఉన్న పోలికలు– సత్, చిత్, ఆనందం.

**సత్–** ఉనికి. మనం ఉన్నామని మనకు ఇంకొకరు చెప్పనక్ఖరలేదు.

**చిత్ –** చైతన్యం. మనలో చైతన్యం లేనిదే మనం వ్యవహారాల్ని నడపలేము.

**ఆనందం –** పరమానందం. ఇదే మనకు తెలియటం లేదు. ఎప్పుడూ దుఃఖంలో మునిగి ఉండే మనం పరమానందంలో ఎలా ఉంటాము అనుకుంటాము. సుషుప్తిలో ఆనందాన్ని అనుభవిస్తాము. కాని అది లేచాక కాని తెలియదు.

హే సౌమ్య– శిష్యుడిని సంబోధించి చెప్తున్నాడు.

ఆ అక్షరం బ్రహ్మ నుంచి అనేక జీవాలు ఉద్భవిస్తాయి.

బ్రహ్మకు మూడు విశేషణాలు వాడాడు. అవి–

| | | |
|---|---|---|
| సత్యమ్ | – | మూడు కాలాల్లోనూ ఉండేది. |
| అక్షరమ్ | – | నాశనం లేనిది. |
| పురుషః | – | సర్వవ్యాపకమైనది. |

**తథాక్షరాద్వివిధాః సోమ్య భావాః ప్రజాయన్తే –** ఆ అక్షరం బ్రహ్మ నుంచే అన్నీ పుట్టి అందులోనే మళ్ళీ అన్నీ లయమవుతున్నాయి.

**తత్ర చైవాపి యన్తి –** మన స్వప్నప్రపంచం మనలోంచి పుట్టి, మనం నిద్ర లేవగానే మనలో లయమవుతుంది. మన స్వప్నం మన మనసులో ఉన్న వాసనలను బట్టి వస్తుంది. జగత్తు మన సంచిత కర్మలను బట్టి మాయ నుంచి వస్తుంది. మళ్ళీ ప్రళయకాలంలో మాయలో లయమవుతుంది. అంటే అవ్యక్తంలోకి వెళ్ళిపోతుంది. మాయ బ్రహ్మలో లయమవుతుంది. ఉన్నది ఒక్కటే నిరుపాధిక బ్రహ్మ.

## మంత్రం – 2

**దివ్యో హ్యమూర్తః పురుషః సబాహ్యాభ్యన్తరో హ్యజః।**

**అప్రాణో హ్యమనాః శుభ్రః హ్యక్షరాత్పరతః పరః॥**

**ప్రతిపదార్థం: –** దివ్యః – చైతన్య స్వరూపం; అమూర్తః – నిరాకారం; పురుషః – సర్వవ్యాపకం; సబాహ్యాభ్యన్తరః – శరీరం బయటా, లోపలా ఉంటుంది; అజః – పుట్టుకలేనిది; అప్రాణః అమనః – ప్రాణం లేదు, మనసు లేదు, శుభ్రః – శుద్ధం; అక్షరాత్ – మాయా శక్తికంటే, పరతఃపరః – శ్రేష్ఠం.

**తాత్పర్యం –** బ్రహ్మ లక్షణాలు – చైతన్య స్వరూపం, నిరాకారం, సర్వవ్యాపకం, శరీరం బయటా లోపలా ఉంటుంది. పుట్టుక లేనిది, ప్రాణం కాదు, మనసు కాదు. శుద్ధం. అటువంటి బ్రహ్మ మాయాశక్తి కంటే శ్రేష్ఠమైనది.

**వివరణ–** ఇది చాలా ముఖ్యమైన మంత్రం. ఇందులో దివ్యం, అమూర్తం లాంటి పదాలు బ్రహ్మ స్వరూపాన్ని వివరిస్తాయి. బ్రహ్మ ఉపాదాన కారణమయితే అక్షరం బ్రహ్మ ఎలా అవుతుంది? ఈ మంత్రంలో అది వివర్త ఉపాదాన కారణం అని తెలుస్తుంది. మాయాశక్తితో కలిసి అదే అనేక జీవాలుగా ఉత్పత్తి చెందుతుంది. కాని తాను మారదు. ఇది అమూర్తం, శుద్ధం.

దీనికి ఒక ఉదాహరణ స్వప్నం. మనం కల కంటున్నప్పుడు, మనం కూడా ఒక స్వప్న శరీరాన్ని తీసుకుని ఆ కలలో ఉంటాము. కాని ఇదంతా జరుగుతున్నప్పుడు అసలు మనం ఎక్కడుంటాము? మంచం మీదే ఉంటాము. అంగుళం కూడా కదలము. స్వప్నంలో మనను ఎవరైనా పొడిచి, మనకు రక్తం చిందితే లేచి చూసాక రక్తం ఉంటుందా మన శరీరం మీద? ఉండదు.

ఇంకో ఉదాహరణ – సినిమా తెర. తెర మీద వర్షం కురిసినా తెర తడవదు. అగ్నిజ్వాలలు లేచినా తెర కాలదు.

**అచ్ఛేద్యోఽ యమదాహ్యోఽ యమ్ అక్లేద్యోఽ శోష్య ఏవ చ।**

**నిత్యః సర్వగతః స్థాణుః అచలోఽ యం సనాతనః॥ గీత 2–24**

అలాగే బ్రహ్మ అనేక రూపాలుగా గోచరమైనా తన స్వరూపం మారదు.

**పురుషః –** సర్వవ్యాపకం. జాగ్రదావస్థలో ఉన్న మనమే పడుకున్నప్పుడు మొత్తం స్వప్నప్రపంచాన్ని సృష్టిస్తాము. మనం నిద్రలేస్తే స్వప్నానికి ఆధారం లేదు. అలాగే సర్వవ్యాపకమైన బ్రహ్మ ఈ కనబడే జగత్తుకి ఆధారం. అందుకే పరమాత్మ ఎక్కడ అని ఎవరైనా అడిగితే, ఎక్కడ లేదు అని ఎదురు ప్రశ్నవేయాలి.

**గాడ్ ఈజ్ నోవేర్ ని మారిస్తే గాడ్ ఈజ్ నౌ హియర్ అవుతుంది.**

అలాగే వాట్ ఈజ్ గాడ్? దేవుడు ఏమిటి? వాట్ ఈజ్ – ఈజ్ గాడ్. ఏది ఉందో అది దేవుడు.

స్వప్నప్రపంచం జాగ్రదావస్థలోని మనం లేనిదే ఎలా లేదో, బ్రహ్మ లేనిదే జగత్తు అలా లేదు. బ్రహ్మ రూపం ఏమిటి?

**అమూర్తః –** మూర్తం అంటే రూపం. అమూర్తం అంటే రూపం లేదు. రూపం లేదు కాబట్టే సర్వవ్యాపకుడు. రూపం ఉంటే హద్దులు ఉంటాయి.

**దివ్యః –** చైతన్యస్వరూపం, శుద్ధచైతన్యం. దేనివల్ల మనకు అన్నీ తెలుస్తున్నాయో అదే చైతన్యం. ఎవరైనా 'నేను ధ్యానంలో నీలం రంగులో ఉన్న చైతన్యాన్ని చూశాను,' అని అంటే అది బ్రహ్మ కాదు. బ్రహ్మ కాంతి వల్లే ఇంకో కాంతిని చూడగలుగుతున్నారు. దానికి రంగు, రూపు లేదు. అందుకే అది దివ్యం. దివ్యం అంటే అలౌకికం. కనబడేది లౌకికం. ఇది స్వయం ప్రకాశక ఆత్మ. కనిపింపజేసేది పురుషః

**సబాహ్యాభ్యన్తరః –** సర్వవ్యాపకం కాబట్టి శరీరం బయటా, లోపలా ఉంది. ఉదాహరణ కుండ. ముందు కుండలో ఆకాశం ఉంది అంటాము. తరువాత కుండ బయట కూడా ఆకాశం ఉంది అంటాము. ఇంకా లోతుగా వెళితే ఆకాశంలో కుండలన్నీ ఉన్నాయి అంటాము.

అలాగే బ్రహ్మ లోపల ఉంది అంటాము. తరువాత బ్రహ్మ బయటా ఉంది, లోపలా ఉంది అంటాము.ఇంకా లోతుగా వెళితే అన్నీ బ్రహ్మలోనే ఉన్నాయి అంటాము. స్వప్నం కనే వ్యక్తి లేనిదే స్వప్నప్రపంచం లేదు. అలాగే ఈ జగత్తు ఈశ్వర స్వప్నం కాబట్టి ఈశ్వరుడు లేనిదే జగత్తు లేదు.

**అజః –** పుట్టుక లేదు. జగత్ పుట్టుకకి కారణమయిన బ్రహ్మకు పుట్టుక లేదు. బ్రహ్మ సత్యం కాబట్టి, అన్ని కాలాల్లోనూ ఉంటుంది కాబట్టి, పుట్టుక లేదు. అజ అన్న పదం వాడి, దానికి వృద్ధాప్యం, మరణం లాంటి షడ్వికారాలు లేవు అని శ్రుతి చెప్తోంది. బ్రహ్మ నిత్యం.

**అప్రాణో హ్యమనాః–** ప్రాణం లేదు, మనసు లేదు. ప్రాణం, మనసులు తరువాత సృష్టించబడతాయి. జగత్ సృష్టికి ముందు ప్రాణం, మనసులు లేవు. మనసు లేకపోతే ఎలా సంకల్పించింది? మాయ బ్రహ్మ యొక్క మనసు. ప్రాణ శక్తి, ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి – అన్నీ మాయాశక్తి. బ్రహ్మకు పుట్టుక లేదు కాబట్టి ప్రాణం లేదు. ప్రాణం, మనసులు బ్రహ్మ లక్షణాలు కావు. ప్రాణం బ్రహ్మ కాని, బ్రహ్మ ప్రాణం మాత్రమే కాదు.

రూపం లేనిది అనేక రూపాలుగా, గుణం లేనిది సద్గుణంగా కనిపిస్తోంది. విష్ణుసహస్రనామం తీసుకుంటే కొన్ని నామాలు నిర్గుణ బ్రహ్మను సూచిస్తే, కొన్ని నామాలు సగుణ బ్రహ్మను సూచిస్తాయి. నిర్గుణ బ్రహ్మకు ఉదాహరణ నిరవయవ, సగుణ బ్రహ్మకు ఉదాహరణ గిరిధారి. నిర్గుణ బ్రహ్మకు గుణాలు ఉండవు.

**శుభ్రః –** శుద్ధం. మలినాలు లేవు. మలినాలు జగత్తుకి చెందినవి. శరీరం, మనసులకు మలినాలు అంటుతాయి. రూపం లేని, మనసు లేని శుద్ధమైన బ్రహ్మకు ఇవేవీ అంటవు. కలలో మనకు రక్తం కారితే, ఇలలో ఎలా నిజంగా రక్తం కారదో, అలాగే జగత్తులో మలినాలు బ్రహ్మకు అంటవు. ఈ బ్రహ్మ ఎటువంటిది?

**అక్షరాత్పరతః పరః–** అక్షరాత్ అంటే ఇక్కడ మాయ. మాయాశక్తికన్నా శ్రేష్ఠం. ఎందుకు? మాయ కూడా అచేతనం, జడం. బ్రహ్మ చేతన శక్తి. నేను చేతన శక్తిని, స్వప్నాన్ని కనే నా మనసు అచేతనం. నేను మనసుని చేతనం చేస్తాను. బ్రహ్మ చైతన్యంతో మాయ సృష్టిస్తుంది. సృష్టి ముందు మాయలేని నిర్గుణబ్రహ్మ ఉంది. మాయ మారుతున్న జడ వస్తువు. మాయలో అవ్యక్త రూపంలో జగత్తు ఉంది. మాయ నుంచి జగత్తు వస్తుంది. ప్రళయం అప్పుడు అన్నీ మాయలో లయం అవుతాయి. అందుకని మాయ పరం – శ్రేష్ఠం. కాని మాయ బ్రహ్మ మీద ఆధారపడి ఉంది. అందుకని బ్రహ్మ పరతఃపరం. శ్రేష్ఠమైన మాయకన్నా శ్రేష్ఠం. మాయ బ్రహ్మ యొక్క కల్పిత ఉపాధి. అది మిథ్య. అందువల్ల మాయకి బ్రహ్మ అధిష్ఠానం.

## మంత్రం – 3

**ఏతస్మాజ్జాయతే ప్రాణో మనః సర్వేన్ద్రియాణి చ।**
**ఖం వాయుర్జ్యోతిరాపః పృథివీ విశ్వస్య ధారిణీ॥**

**ప్రతిపదార్థం–** ఏతస్మాత్ – ఈశ్వరుని నుంచి; ప్రాణః – పంచప్రాణాలు, మనః– నాలుగు అంతఃకరణాలు; సర్వేన్ద్రియాణి చ– పంచ జ్ఞానేంద్రియాలు; పంచ కర్మేంద్రియాలు; ఖం – ఆకాశం, వాయుః – గాలి; జ్యోతిః – అగ్ని; ఆపః– నీరు; విశ్వస్య ధారిణీ–అన్నింటినీ భరిస్తున్న; పృథివీ– భూమి, జాయతే – ఉద్భవించాయి.

**తాత్పర్యం–** ఆ ఈశ్వరుని నుంచే పంచప్రాణాలు, నాలుగు అంతఃకరణాలు, దశేంద్రియాలు; పంచభూతాలయిన ఆకాశం, గాలి, అగ్ని, నీరు, భూమి ఉద్భవించాయి.

**వివరణ–** ఈ మంత్రం నుంచి సృష్టి ప్రకరణం మొదలవుతుంది. మొత్తం సృష్టికాదు. ముఖ్యమైనవి మాత్రం చెప్పబడ్డాయి. సృష్టి చేసినది బ్రహ్మ+మాయ అయిన ఈశ్వరుడు అన్న విషయం గుర్తుంచుకోవాలి. సృష్టిని స్వప్న ప్రపంచంతో పోలుస్తుంది

శాస్త్రం. చేతనమైన మనం, అచేతనమైన మన మనసుతో స్వప్నప్రపంచాన్ని సృష్టిస్తాము. అలాగే చేతనమైన బ్రహ్మ, అచేతనమైన మాయతో జాగ్రత్ ప్రపంచాన్ని సృష్టిస్తాడు. మన స్వప్నం మన కర్మల మీద ఆధారపడి ఉంటే, జాగ్రత్ ప్రపంచం-సమష్టి కర్మల మీద ఆధారపడి ఉంది. ముందు రెండవ పాదం చూద్దాం.

**ఖం వాయుర్జ్యోతిరాపః పృథివీ –** వరుసక్రమంలో ఆకాశం, వాయువు, అగ్ని, నీరు, భూమి అన్నీ ఈశ్వరుడి నుంచి ఉద్భవించాయి. అవి కూడా రెండు దశల్లో- సూక్ష్మ పంచభూతాలు, స్థూల పంచభూతాలు. స్థూల పంచభూతాల విషయం చూస్తే –

| **పంచభూతాలు** | – | **పంచేంద్రియాలు** |
|---|---|---|
| **ఆకాశం** | – | **శబ్దం** |
| **వాయు** | – | **శబ్దం, స్పర్శ** |
| **అగ్ని** | – | **శబ్దం, స్పర్శ, రూపం** |
| **నీరు** | – | **శబ్దం, స్పర్శ, రూపం, రసం** |
| **భూమి** | – | **శబ్దం, స్పర్శ, రూపం, రసం, గంధం** |

అన్నింటిలోకీ ఆకాశం సూక్ష్మమైనది. భూమి స్థూలమైనది. భూమి పూర్తిస్థాయి వ్యక్తరూపంలో ఉంది. పంచేంద్రియాల ద్వారా భూమిని గ్రహించవచ్చు.

**విశ్వస్య ధారిణీ –** భూమికి విశేషణం ఇది. జీవరాసులన్నింటిని అది ధరిస్తోంది. భూమి ఎంతో అద్భుతమైనది కాని మనం దానిని పట్టించుకోము.

ముందు సూక్ష్మపంచభూతాలు ఏర్పడ్డాయి. అవి స్థూల పంచభూతాలు అయ్యేముందు పంచీకృతం అవుతాయి. అంటే ఉదాహరణకు భూమిని తీసుకుంటే భూమిలో సగం మేరకు భూమి ఉంటుంది. మిగతా సగంలో తక్కిన నాలుగుభూతాల మిశ్రమం ఉంటుంది. అంటే తక్కిన నాలుగు భూతాల్లోంచి ఎనిమిదోవంతు కలుస్తాయి. అవన్నీ కలిసి ఒక సగం అవుతాయి.

దీనివల్ల ఆకాశం కూడా కార్యం అని తెలుస్తోంది. ప్రళయంలో అది కూడా లేదు. కాలతత్వం కూడా ఈశ్వరుని నుంచే వచ్చింది. ఇప్పుడు మొదటి పాదంకి వెళ్ళాము. సూక్ష్మశరీరంలో ఉన్న అంశాల వివరణ వస్తుంది ఇందులో.

**ఏతస్మాజ్జాయతే ప్రాణో మనః సర్వేన్ద్రియాణి చ–** ప్రాణః అంటే పంచప్రాణాలు, మనః అంటే నాలుగు అంతఃకరణాలు. సర్వేంద్రియాణి చ అంటే పంచజ్ఞానేంద్రియాలు, పంచ కర్మేంద్రియాలు, పంచప్రాణాలు, నాలుగు అంతఃకరణాలు ఉద్భవించాయి.

పంచభూతాలు మాయ నుంచి పుట్టాయి కాబట్టి, మాయలో ఉన్న లక్షణాలు వీటికి కూడా ఉంటాయి. కారణం నుంచి పుట్టిన కార్యానికి కారణ లక్షణాలు ఉంటాయన్నది సూత్రం.

ఆ మూడు గుణాలు సత్వ,రజ,తమో గుణాలు. సత్వగుణంలో నేర్చుకునే శక్తి, రజోగుణంలో పనిచేసే శక్తి, తమోగుణంలో విశ్రాంతి తీసుకునే శక్తి ఉంటాయి. మన జీవితమంతా మనం ఈ మూడింటిలో ఏదో ఒకటి, మార్చి మార్చి నిరంతరం చేస్తూనే ఉంటాము. జీవితమంతానేర్చుకుంటూ, పనిచేస్తూ, విశ్రాంతి తీసుకుంటూ గడుపుతాము. కొందరిలో ఒకటి కొంచెం ఎక్కువగానూ, తక్కిన రెండూ తక్కువగానూ ఉంటాయి.

మనకు ఈ శక్తి ఎక్కడ్నుంచి వచ్చింది? మాయాశక్తి నుంచి. మాయకు శక్తినెవరు ఇచ్చారు? బ్రహ్మ. బ్రహ్మ ఎవరు? శుద్ధ చైతన్యం. ఎలా ఇచ్చాడు? సంకల్పం చేత – ఒక అయస్కాంతం తాను కదలకుండా, తన దగ్గరికి ఇనుప ముక్కలను ఆకర్షించినట్టుగా, బ్రహ్మ ఉనికి వల్లనే మాయ శక్తిని పొంది ఈ జగత్తును సృష్టించింది. కర్మ సిద్ధాంతం వల్ల సృష్టించింది. ప్రళయంలో అన్నీ మాయలో లయమవుతాయి. మాయ కూడా బ్రహ్మలో లయమవుతుంది. స్వప్నప్రపంచం మనలో ఎలా లయమవుతుందో అలా జాగ్రత్ ప్రపంచం బ్రహ్మలో లయమవుతుంది.

మొదటి సృష్టి ఎప్పుడు జరిగింది? సృష్టి అన్నది ఒక వృత్తంలాంటిది. అవ్యక్తం నుంచి వ్యక్తంలోకి, వ్యక్తంలోంచి అవ్యక్తంలోకి మారుతూ ఉంటుంది. అందుకని సృష్టికి ఆదిలేదు. ఇంకో ప్రత్యేకత, జగత్తులో ఉండే మార్పులు, మలినాలు బ్రహ్మకు అంటవు. ఆ అసంగమైన బ్రహ్మ నువ్వే అంటుంది వేదాంతం. నీలోనే ఆ మాయ ఉంది. నువ్వే కల సృష్టించి అందులోకి వెళ్ళి నువ్వే సృష్టించినట్టు మర్చిపోయావు. అందుకని ఉత్తిష్ఠత జాగ్రతః అంటుంది. ఇది ఉపనిషత్తు సారం.

సృష్టి నిజంగా జరగలేదు. ఇది పరమాత్మ కల. కాని నేను దాన్ని కలగా తీసుకోలేను అని మనమంటే వేదాంతం నీ స్వప్న ప్రపంచంలో నువ్వు ఉన్నంతసేపు

నువ్వు అది నిజమనే అనుకుంటావు. కలలో పులి వేటాడితే భయపడతావు. కాని ఆ భయం ఎప్పుడు పోతుంది? ఆ కల నుంచి లేస్తే. మన స్వప్నం నుంచి బయటకి వస్తేనే, స్వప్నం నిజం కాదని తెలుస్తుంది. అలాగే ఈ సృష్టిని పారమార్థిక స్థాయి నుంచి చూస్తే ఇది ఈశ్వర కల అని తెలుస్తుంది. పారమార్థిక స్థాయి అంటే బ్రహ్మ దృష్టి నుంచి. ఇప్పుడు మనం భ్రమ దృష్టిలో ఉన్నాము.

## మంత్రం - 4

**అగ్నిర్మూర్ధా చక్షుషీ చన్ద్రసూర్యౌ**
**దిశః శ్రోత్రే వాగ్వివృతాశ్చ వేదాః।**
**వాయుః ప్రాణో హృదయం విశ్వమస్య**
**పద్భ్యాం పృథివీ హ్యేష సర్వభూతాన్తరాత్మా॥**

**ప్రతిపదార్థం:** అస్య– ఈశ్వరుడు; మూర్ధా– శిరస్సు; అగ్నిః– (ఇక్కడ) స్వర్గం; చక్షుషీ – కళ్ళు; చన్ద్రసూర్యౌ– సూర్యచంద్రులు; దిశఃశ్రోత్రే–దిక్కులు చెవులు; వివృతా – వెలువడిన; వాక్– వాక్కు; వేదాః – వేదాలు; వాయుః ప్రాణః – గాలి ప్రాణం; హృదయం విశ్వమ్ – అంతఃకరణం జగత్తు; పద్భ్యాం పృథివీ– పాదాలుభూమి; ఏషః – ఆయనే; సర్వభూతాన్తరాత్మా– అన్నిటిలో ఉన్నాడు.

**తాత్పర్యం:–** విశ్వరూప ఈశ్వరుడికి స్వర్గం శిరస్సు, సూర్యచంద్రులు కళ్ళు; దిశలు చెవులు; వెలువడ్డ వాక్కు వేదాలు; గాలి ప్రాణం; జగత్తు అంతఃకరణం; భూమి పాదాలు; ఆ ఈశ్వరుడే అన్ని జీవరాసులలోనూ కొలువై ఉన్నాడు.

**వివరణ:–** ఇప్పుడు రెండవ దశలో సృష్టి ప్రకరణం. ముందు సూక్ష్మప్రపంచం చూసాము. అది అమూర్తప్రపంచం. ఇప్పుడు స్థూలప్రపంచం చూస్తాము. అది మూర్తప్రపంచం. మనలోనే మన శరీరం స్థూలశరీరం. దాన్ని చూడగలము. మనస్సు సూక్ష్మ శరీరానికి చెందినది కాబట్టి దాన్ని చూడలేము. అందుకే ఎదుటి వ్యక్తిలో ఉన్న ఆలోచనలని, అతనిలో కదిలే భావోద్వేగాలనీ మనం గ్రహించలేము.

ఈ మంత్రంలో స్థూలప్రపంచాన్ని విశ్వరూప ఈశ్వరునిగా వర్ణిస్తోంది. ఈశ్వరుని నుంచి సమష్టి సూక్ష్మప్రపంచం అయిన హిరణ్యగర్భ ఉద్భవించాడు. ఆయన నుంచి సమష్టి స్థూలప్రపంచం అయిన విరాట్ ఉద్భవించాడు. విరాట్‌కి కూడా మూలం ఈశ్వరుడే. (అద్వైత వేదాంత పరిచయంలో వివరంగా వస్తుంది)

ఈ విరాట్‌ని అర్థం చేసుకోవటానికి కవితాధోరణిలో చెప్తోంది ఉపనిషత్తు.

**భూః పాదౌ యస్య నాభిర్వియదసురనిలశ్చంద్ర సూర్యౌ చ నేత్రే**

**కర్ణావాశాశ్శిరోద్యౌర్ముఖమపి దహనో యస్య వాస్తేయమబ్ధిః।**

**అంతస్థం యస్య విశ్వం సురనరఖగగోభోగిగంధర్వదైత్యైః**

**చిత్రం రంరమ్యతే తం త్రిభువనవపుషం విష్ణుమీశం నమామి ॥**

ఇది ఎంతో ముఖ్యమైన ఊహాచిత్రం. ఇక్కడ కూడా అదే వర్ణన. ఇటువంటి వర్ణన ఎందుకు ముఖ్యం? విశ్వరూప ఈశ్వర వర్ణన చేయటం వల్ల రాగద్వేషాలు తగ్గుతాయి. భగవంతుడు ఎక్కడో వైకుంఠంలో ఉన్నాడు అనుకుంటే భగవంతుని ప్రేమించి, జగత్తుని ద్వేషిస్తాము. కాని కార్య ప్రపంచమంతటా కారణ ఈశ్వరుడు ఉన్నాడు అని ఉపనిషత్తు చెప్తోంది. అంతటా ఈశ్వరుడే ఉన్నాడు. ఆయనకి భిన్నంగా ఏదీ లేదు. అంటే రాగద్వేషాలకు చోటేది? సగం మంది రాగద్వేషాలలో కొట్టుమిట్టాడుతుంటారు. అహంకార, మమకారాలలో పడిపోతుంటారు. **అహమేషాం, మమ ఏతే** అనుకుంటారు. ఈ విశ్వరూప ధ్యానం రాగద్వేషాలకు పరిహారం. ఈయన ఎక్కడ ఉన్నాడు? సర్వభూతాన్తరాత్మ, అన్ని జీవరాసుల్లోనూ ఉన్నాడు.

**అగ్నిర్మూర్ధా–** ఇక్కడ అగ్ని అంటే స్వర్గలోకం. పంచాగ్ని విద్య ధ్యానంలో స్వర్గాన్ని అగ్నిగా వర్ణిస్తారు. అగ్నిలాగా ప్రకాశవంతమైన సూర్యుడు. ఆయన లోకం స్వర్గలోకం. అంటే భూమిపైన ఉన్న అన్ని లోకాలూ తీసుకోవాలి. మూర్ధా – శిరస్సు. విరాట్ శిరస్సు ఊర్ధ్వలోకాలు.

**చక్షుషీ చన్ద్ర సూర్యౌ –** రెండు కళ్ళు చంద్రుడు, సూర్యుడు. మన అక్రమాలన్నింటిని పగలు సూర్యునిరూపంలో, రాత్రి చంద్రుని రూపంలో చూస్తాడు.

**దిశః శ్రోత్రే–** దిక్కులు చెవులు. దిక్కులు నాలుగు ప్రధాన దిక్కులు. తూర్పు, పడమర,ఉత్తరం, దక్షిణం; నాలుగు తక్కిన దిక్కులు. ఈశాన్యం, ఆగ్నేయం, నైఋతి, వాయువ్యం; పైనా, కిందా వస్తాయి. మొత్తం పది. అంటే ఈశ్వరునికి తెలియకుండా ఏమీ మాట్లాడలేము.

**వాగ్వివృతాశ్చ వేదాః** – భగవానునికి వాక్కు ఏమిటి? వేదాలు. మనం వేదాల్లో చదివే యమ, నియమాలు ఏమిటి? సాక్షాత్తూ ఆ భగవానుడు ఏర్పరచినవి.

ఉదాహరణ– సత్యం వద, ధర్మం చర. వివృతా – విస్తారమైనది. మన శాస్త్రం చాలా విస్తారమైనది. మనకు ప్రాథమికంగా నాలుగు వేదాలున్నాయి. వాటి మంత్రాలన్నీ కలుపుకుంటే 20,000పైనే ఉంటాయి. అవి కాక 18 పురాణాలు, 18 ఉపపురాణాలు ఉన్నాయి. వాటిలో వేలాది శ్లోకాలున్నాయి. ఒక్క మహాభారతంలోనే లక్షపైన శ్లోకాలున్నాయి. వీటన్నింటినీ మన జీవితకాలంలో పూర్తిచేయలేము. వీటన్నింటి సారం మనకు ఒక్క భగవద్గీతలో వచ్చేస్తుంది. అందుకని వేదాలు భగవానుని వాక్కు.

**వాయుః ప్రాణః –** అంతటా ఉన్న వాయు తత్త్వమే భగవానుని ప్రాణశక్తి కాని మనం గాలిని అపరిశుభ్రం చేస్తున్నాము అంటే భగవానుడు ప్రసాదించిన గాలిని అపరిశుభ్రం చేస్తున్నాము.

**హృదయం విశ్వమస్య –** అంతఃకరణం ఈ జగత్తు. జగత్తులోని వస్తువులు, మనుష్యులు అన్నీ వస్తాయి. కనబడని మన మనసులో కూడా కనిపించే స్వప్న వస్తువులు ఉన్నట్టుగా కనబడని బ్రహ్మలో కనిపించే జాగ్రత్ వస్తువులు ఉన్నాయి. స్వప్నప్రపంచం మన మనోవృత్తి వల్ల ఏర్పడితే, జాగ్రత్ ప్రపంచం మాయావృత్తి వల్ల ఏర్పడింది.

**పద్భ్యాం పృథివీ –** పాదాలు భూమి,

**ఏష–** ఆయనే;

**సర్వభూతాన్తరాత్మా–** అన్నింటిలో ఉన్నాడు. జగత్తుకు చైతన్యం ఆయనే. చూసేది, వినేది, తెలుసుకునేది, ఆలోచించేది అన్నీ ఆయనే. ఏ ఉపాధి కూడా బ్రహ్మకి భిన్నంగా లేదు. బ్రహ్మ సత్యం– ఉపాధి (జగత్) మిథ్య.

మూడు స్థాయిల్లో సృష్టిని చూసాము. బ్రహ్మ జగత్తును సృష్టించాడు. జగత్తు అయ్యాడు. బ్రహ్మ సృష్టించలేదు. అవలేదు. బ్రహ్మ మార్పు చెందకుండా జగత్తుగా కనిపిస్తున్నాడు. ఉదాహరణకు మనం మార్పు చెందకుండా ఉన్నచోటి నుంచే స్వప్నప్రపంచాన్ని సృష్టిస్తున్నాము. జగత్తు సృష్టించబడినట్టుగా కనిపిస్తోంది కాని అది అంతిమ సత్యం కాదు. ఉదాహరణకు సూర్యోదయం. సూర్యోదయం అవుతున్నట్టు కనిపిస్తోంది కాని వైజ్ఞానిక శాస్త్రపరంగా అది నిజం కాదు. భూమి తిరగటం వల్ల అలా అనిపిస్తోంది. కాని దాన్ని మనం లెఖ్ఖలోకి తీసుకోము సూర్యుని గమనం ఆధారంగా కాలాన్ని నిర్ణయిస్తాము. మిథ్య అంటే జగత్తు లేదని కాదు. **సదసద్భ్యాం అనిర్వచనీయం మిథ్య.**

వ్యవహార స్థాయిలో జగత్తు సత్యం. పారమార్థిక స్థాయికి ఎదిగితే జగత్తు మిథ్య.

## మంత్రం - 5

**తస్మాదగ్నిః సమిధో యస్య సూర్యః**
**సోమాత్పర్జన్య ఓషధయః పృథివ్యామ్।**
**పుమాన్ రేతః సిఞ్చతి యోషితాయాం**
**బహ్వీః ప్రజాః పురుషాత్సంప్రసూతాః॥**

**ప్రతిపదార్థం –** తస్మాత్ – ఈశ్వరుని నుంచి; అగ్నిః – స్వర్గంలోకం; యస్య – సూర్యః సమిధః – అక్కడ సూర్యుడు ప్రకాశిస్తాడు. సోమాత్పర్జన్య – చంద్రుని నుంచి మేఘాలు పుట్టాయి; పృథివ్యామ్ ఓషదయః – భూమ్మీద పెరిగే చెట్లుచేమలు; పుమాన్ – పురుషుడు; యోషితాయామ్ – స్త్రీయందు; రేతః – రేతస్సుని; సిఞ్చతి – వదులుతాడు; పురుషాత్ – భగవానుని నుంచి; బహ్వీః ప్రజాః – వేలాది జీవులు; సంప్రసూతాః – పుట్టారు.

**తాత్పర్యం –** ఆ ఈశ్వరుని నుంచి స్వర్గలోకం పుట్టింది. ఆ లోకాన్ని సూర్యుడు ప్రకాశింపజేస్తున్నాడు. చంద్రుని నుంచి మేఘాలు ఆవిర్భవించాయి. భూమ్మీద పెరిగే చెట్లు, చేమలు, మేఘాల వల్ల వచ్చాయి. పురుషుడు స్త్రీ యందు రేతస్సు విడవటం ద్వారా మనుష్యులు పుడతారు. ఈ విధంగా భగవానుని నుంచే అనేకరకాలైన జీవులు ఉద్భవిస్తున్నాయి.

**వివరణ –** ఇది పూర్తిగా సాంకేతికపరమైన మంత్రం. జీవాల పుట్టుకను వివరిస్తుంది. జీవాలన్నీ ప్రళయంలో అవ్యక్తరూపంలో ఉంటాయి. శరీరం, మనసు, కర్మలు అన్నీ అవ్యక్తంగా ఉంటాయి. జీవి కారణశరీరం బ్రహ్మ యొక్క మాయాశక్తిలో బీజరూపంలో ఉంటుంది. సృష్టి జరిగినప్పుడు వ్యక్తరూపంలోకి వస్తాడు జీవి. వ్యక్తం నుంచి అవ్యక్తం, అవ్యక్తం నుంచి వ్యక్తం – ఇలా వృత్తం కొనసాగుతూనే ఉంటుంది.

ఈ మంత్రంలో కొన్ని జీవాలు ఎలా పుడతాయన్నది వస్తుంది. ఇది ఇంకా వివరంగా ఛాందోగ్యపనిషత్తులోనూ, బృహదారణ్యకంలోనూ, బ్రహ్మసూత్రాల్లోనూ వస్తుంది. ముందుగా సారాంశం చూద్దాము.

మరణం సమయంలో స్థూలశరీరం పడిపోతుంది. ప్రారబ్ధకర్మ యొక్క పుణ్య, పాపాలను క్షయం చేయటానికి స్థూలశరీరం ఏర్పడింది. ఎప్పుడైతే అవి

క్షయమవుతాయో అప్పుడే ఆ శరీరం పడిపోతుంది. మరణకాలంలో ఈ స్థూలశరీరం పడిపోతుంది అంటే అర్ధం, భగవంతుడిచ్చిన ఒక జీవి శరీరాన్ని అగ్నిదేవత ద్వారా మళ్ళీ భగవానునికి అర్పితం చేస్తారు అతని బంధువులు. అతని సంచిత కర్మల్లో మరికొన్ని కర్మలను అనుభవించటానికి అనువైన మరో శరీరాన్ని భగవానుడు అగ్ని దేవుని ద్వారా మళ్ళీ ఇస్తాడు.

జీవి పుట్టుక ఐదు దశల్లో ఐదు కేంద్రాల్లో అవుతుందని శాస్త్రం చెప్తోంది. అవి – స్వర్గం, మేఘం, పృథివీ, పురుషుడు, నారి. ఒక్కొక్కచోట, జీవికి ఒక్కొక్కపేరు ఉంటుంది. మొదటి కేంద్రం స్వర్గం. స్వర్గంలో జీవి పేరు సోమ. సోమ అనే జీవి మేఘంలోకి వచ్చాక అతని పేరు వృష్టి. అలాగే పృథివిలో అన్నం, పురుషునిలో రేతస్సు, నారిలో ప్రజా అన్నపేర్లు వస్తాయి. ఐదో కేంద్రం తల్లి. ఇలా వేలాది జీవులు సృష్టించబడ్డాయి. ఈ కొత్త శరీరంతో మళ్ళీ కొన్ని కర్మలు చేసి, మళ్ళీ కొన్ని కొత్తవి పోగేసుకుని, మళ్ళీ కొత్త జన్మ పొందుతూ ఉంటాడు జీవి.

ఈ పునరపి జననం, పునరపి మరణం వృత్తాన్ని తప్పించుకోవాలంటే పారమార్థిక సత్యానికి మేలుకోవాలి. ఈ జాగృత్ ప్రపంచం మిథ్య. ఇది ఈశ్వర కల అని గ్రహించి, ఈ బంధంలో పడి కొట్టుమిట్టాడకుండా ఉండాలి.

ఇప్పుడు ఈ మంత్రంలోని పదాలను చూద్దాము.

| | | |
|---|---|---|
| **తస్మాత్** | – ఆయన్నుంచి, ఆ ఈశ్వరుని నుంచి. | |
| **అగ్నిః** | – (ఇక్కడ) స్వర్గలోకం– ఉత్పాదక కేంద్రం 1 | |
| **యస్య సూర్యః సమిధః** | – సూర్యదేవత చేత ప్రకాశింపబడే స్వర్గ లోకం. | |
| **పర్జన్య** | – మేఘం | – ఉత్పాదక కేంద్రం 2 |
| **సోమాత్ పర్జన్య** | – చంద్రుని నుంచి మేఘాలు పుట్టాయి. | |
| **ఓషదయ** | – భూమి | – ఉత్పాదక కేంద్రం 3 |
| **ఓషదయ పృథివ్యామ్** | – జీవులకు ఆధారం భూమి. వేరేచోట జీవులు లేవు. ఓషదయ అంటే చెట్లు. | |
| **పుమాన్** | – పురుషుడు | – ఉత్పాదక కేంద్రం 4 |
| **పుమాన్ రేతః సిఞ్చతి** | – పురుషుడు తన రేతస్సుని స్త్రీలో వదులుతాడు. | |
| **యోషితాయాం** | – స్త్రీ యందు | – ఉత్పాదక కేంద్రం 5 |

**బహ్వీః ప్రజా** – ఈ విధంగా ఐదు దశల్లో వేలాది జీవులు పుడతాయి. ప్రజా అంటే జీవులు.

**పురుషాత్ సంప్రసూతాః–** పురుషుడు అంటే పైన పుమాన్‌కి చెప్పుకున్న పురుషుడు కాదు. ఈశ్వరుడు. ఆయన్నుంచే అన్నీ ఉద్భవిస్తున్నాయి.

| వ.సం. | దశలు | జీవిపేరు | మంత్రంలో వచ్చిన పదం |
|---|---|---|---|
| 1. | స్వర్గం | సోమ | అగ్ని |
| 2. | మేఘం | వృష్టి | పర్జన్య |
| 3. | పృథివీ | అన్నం | ఓషదయ |
| 4. | పురుషుడు | రేతస్సు | పుమాన్ |
| 5. | నారి | ప్రజా | యోషితాయాం |

## మంత్రం – 6

**తస్మాదృచః సామ యజూంషి దీక్షా**
**యజ్ఞాశ్చ సర్వే క్రతవో దక్షిణాశ్చ।**
**సంవత్సరశ్చ యజమానశ్చ లోకాః**
**సోమో యత్ర పవతే యత్ర సూర్యః॥**

**ప్రతిపదార్థం:–** తస్మాత్ – ఈశ్వరుని నుంచే; ఋచః – ఋగ్వేదం; సామ – సామవేదం; యజూంషి – యజుర్వేదం; దీక్షా – విధులు, యజ్ఞాశ్చసర్వే – అన్ని యజ్ఞాలు, క్రతవః – క్రతువులు; దక్షిణాః – దక్షిణలు, సంవత్సరః – కాలం; యజమానః – వైదికజీవి; లోకాః – 14 లోకాలు; సోమః – చంద్రుడు; యత్ర – ఎక్కడ; పవతే – పునీతం చేస్తాడో; యత్ర – ఎక్కడ; సూర్యాః – సూర్యుడు.

**తాత్పర్యం –** నాలుగు వేదాలు, విధులు, యజ్ఞాలు, క్రతువులు, దక్షిణలు, కాలం, వైదిక జీవి, చంద్రుడు, సూర్యుడు ప్రకాశించే స్వర్గలోకం, బ్రహ్మలోకం లాంటి లోకాలన్నీ ఈశ్వరుని నుంచే ఉద్భవించాయి.

**వివరణ–** సృష్టి వివరాలు మరికొన్ని. జీవులు తాము చేసుకున్న పుణ్యపాపాల వల్ల మళ్ళీ మళ్ళీ పుడతారు. శరీర మాధ్యమం ద్వారానే సుఖదుఃఖాలు అనుభవిస్తారు. ఒక శరీరం వెళితే ఇంకో శరీరం వస్తుంది. అది ఇంతకన్నా మంచిదా కాదా అన్నది వారు చేసుకున్న పుణ్య, పాపాలను బట్టి ఉంటుంది. వారి బ్యాంకు బాలెన్స్‌లో పుణ్యం ఎక్కువ ఉంటే మంచి జన్మ, పాపం ఎక్కువ ఉంటే నీచ జన్మ వస్తుంది.

ఒక జీవి మనిషి జన్మ ఎత్తినప్పుడు మళ్ళీ ఈ జనన మరణాల వృత్తంలో పడి కొట్టుమిట్టాడకుండా ఉండటానికి భగవంతుడు ఒక పద్ధతిని ఇచ్చాడు. పుణ్యం పెరిగి, పాపం తగ్గే మార్గాన్నిచ్చాడు. అది శాస్త్రంలో ఉంది. ముందు మంత్రంలో విశ్వరూప ఈశ్వర దర్శనం చేసినప్పుడు, వాగ్వివృతాశ్చవేదః అని వచ్చింది. అంటే భగవంతుని వాక్కు విస్తారంగా ఉన్న, వెలువడిన వేదాలు అని అర్థం.

వేదాల్లో మనకు మూడు రకాల కర్మల గురించి వివరణ ఉంది. అవి కామ్యకర్మలు, ప్రాయశ్చిత్త కర్మలు, నిత్య నైమిత్తిక కర్మలు. కామ్యకర్మలు చేస్తే ప్రాపంచిక సుఖాలు, పుణ్యలోక ప్రాప్తి కలుగుతాయి. ప్రాయశ్చిత్త కర్మలు చేస్తే పాపాలు తగ్గుతాయి. నిత్యనైమిత్తిక కర్మలు చేస్తే ఆధ్యాత్మిక ఎదుగుదల కలుగుతుంది. ఇవి కాక నిషిద్ధ కర్మలు కొన్ని ఉన్నాయి. అవి చేస్తే పాపం పెరుగుతుంది. ఇప్పటి మన జీవితం మనం ఈ జన్మలో, గతంలో చేసిన పాపపుణ్యాలు, గత జన్మల్లో చేసిన పుణ్యపాపాల ఫలం. ఇప్పుడు మనం హాయిగా ఉంటే, ఎంతో కొంత పుణ్యం చేసుకున్నట్టన్నమాట. ఇప్పుడు అవస్థపడుతుంటే ఎంతో కొంత పాపం చేసినట్టన్నమాట. దీన్ని బట్టి మన భవిష్యత్తుని ముందే మార్చుకోవచ్చు అని గ్రహించి ఇప్పటికన్నా నిత్యనైమిత్తిక కర్మలు ఎక్కువ చేస్తే మంచిది. ఇప్పుడు మంత్రం చూద్దాము.

**తస్మాత్ –** ప్రతి మంత్రంలోనూ ఈ పదం మళ్ళీ మళ్ళీ వస్తోంది. మాయాసహిత బ్రహ్మ అంటే ఈశ్వరుని మాయ నుంచే ఇందులో చెప్పబడినవి వచ్చాయి. ఏమిటవి?

**ఋచః సామయజూంషి –** ఋగ్వేదం, సామవేదం, యజుర్వేదం వచ్చాయి. మనం అథర్వణ వేదం కలుపుకోవాలి. అది కలుపుకుంటేనే మంచిది. ఎందుకంటే అథర్వణ వేదంలోనిదే ఈ ముండకోపనిషత్తు. ఈ వేదాలు ఎలా వచ్చాయి? ఋషులు వారి తపశ్శక్తి వల్ల వాటిని అందుకున్నారు. వారిని మంత్రద్రష్టాః అంటారు. వాళ్ళ శిష్యులు మళ్ళీ తపస్సు చేయనక్కరలేదు. వారు విని నేర్చుకున్నది వాళ్ళ శిష్యులకు అందజేస్తారు. అందుకే వేదాలను శ్రుతులు అని కూడా అంటారు.

**యజ్ఞా** క్రతవః – వైదిక యజ్ఞాలు, క్రతువులు. యజ్ఞాల్లో బలిలేదు, కాని క్రతువుల్లో బలి ఉంది. బలికూడా నిజంగా జంతువులను బలి ఇవ్వనక్కరలేదు. వాటి ఆకారాలను మట్టితో చేసి వాటిని ఇవ్వవచ్చు. నాగప్రతిష్ఠ చేసేటప్పుడు అలా

పిండితో నాగప్రతిమలు చేస్తాడు బ్రాహ్మణుడు. కొన్ని బిస్కెట్లు అనేక జంతువుల ఆకారంలో ఉంటాయి. పిల్లలకు తినిపిస్తూ, విద్యకూడా బోధించవచ్చు తేలిగ్గా.

మనిషి దేవునికి తమ్ముడు, పశువుకి అన్న అనే అర్థంతో ఒక ఇంగ్లీషు సామెత ఉంది. అంటే మనిషిలో దైవగుణాలు దేవునికన్నా తక్కువగాను, పశు ప్రవృత్తి జంతువుకన్నా ఎక్కువగాను ఉంటాయి. అందుకే అంటారు, పాముకు విషం కోరల్లోనే ఉంటే, మనిషికి నిలువెల్లా విషమే అని. ఈ పశు ప్రవృత్తిని పోగొట్టుకుని దైవీసంపత్తి పొందటానికి ఏర్పడినవే యజ్ఞాలు, క్రతువులు.

**దీక్షా దక్షిణః –** యజ్ఞాలకు సంబంధించినవే ఈ రెండూ. ఒక యజ్ఞం చేయాలంటే ఎంతో దీక్ష ఉండాలి. ఎన్నో నియమాలు ఉంటాయి. యజ్ఞం చేసాక దక్షిణ ఇవ్వందే ఆ యజ్ఞఫలం దొరకదు. దానికి కూడా నిబంధనలు ఉంటాయి.

**సంవత్సరః –** కాలతత్వం – తిథి, వార, నక్షత్రాలను సూచిస్తుంది. ఒక యజ్ఞం చేయాలంటే దానికొక సమయం, సందర్భం ఉండాలి. సంధ్యావందనం కూడా ఎప్పుడంటే అప్పుడు చేయకూడదు. అంటే కాలంకూడా సృష్టించబడింది.

**యజమానశ్చ –** వైదిక జీవి కూడా. వేదాల మీద శ్రద్ధ ఉన్న వ్యక్తి. కర్మలు చేయాలంటే వేదాలు చెప్పిన యజ్ఞాల మీద నమ్మకం ఉండాలి.

**లోకాః –** లోకాలు సృష్టించబడ్డాయి. ఇందాకే చూసాము, జీవి పుణ్యం ఎక్కువ చేస్తే ఊర్ధ్వలోకాలకు, పాపం ఎక్కువ చేస్తే అధోలోకాలకు వెళతాడు. అవి అనుభవించటానికి ఆయా లోకాలు సృష్టించబడ్డాయి. పుణ్యపాపాలు సమానంగా ఉంటే మనుష్య జన్మనెత్తుతాడు.

**సోమో యత్ర పవతే యత్ర సూర్యః –** 14 లోకాలనూ వర్ణించకుండా రెండు లోకాలను పేర్కొంది శాస్త్రం ఇక్కడ. చంద్రుడు ప్రకాశించే చంద్రలోకం అంటే స్వర్గలోకం. సూర్యుడు ప్రకాశించే బ్రహ్మలోకం. స్వర్గాన్ని చంద్రుడు పునీతం చేస్తే, బ్రహ్మలోకంలో సూర్యుడు ప్రకాశిస్తాడు. కానీ 14 లోకాల్లోనూ కర్మ చేసే అధికారం లేదు. ఆ వర్క్‌పర్మిట్ ఒక్క భూలోకంలోనే, అదీ మనుష్యులకే ఉంది.

కేవలం కర్మలు చేసిన వారు కృష్ణగతి ద్వారా స్వర్గలోకం వెళతారనీ కర్మ + ఉపాసన చేసిన వాళ్ళు శుక్లగతి ద్వారా పుణ్యలోకం వెళతారనీ ముందు ఖండాల్లో చూశాము.

## మంత్రం - 7

**తస్మాచ్చ దేవా బహుధా సంప్రసూతాః**
**సాధ్యా మనుష్యాః పశవో వయాంసి॥**
**ప్రాణాపానౌ వ్రీహియవౌ తపశ్చ**
**శ్రద్ధా సత్యం బ్రహ్మచర్యం విధిశ్చ॥**

**ప్రతిపదార్థం –** తస్మాత్ – ఆ ఈశ్వరుని నుంచి; బహుధా దేవాః – అనేక రకాల దేవతలు; సంప్రసూతాః – ఉద్భవించారు. సాధ్యా – పితృదేవతలు; మనుష్యాః – అవైదిక మనుష్యులు; పశవః – పశువులు; వయాంసి– పక్షులు; ప్రాణాపానౌ – ప్రాణ, అపానాలు (ఉచ్ఛ్వాస, నిశ్వాసలు); వ్రీహియవౌ – వరి, గోధుమలు; తపశ్చ – ఇంద్రియ నిగ్రహం; శ్రద్ధా – శాస్త్రం మీద శ్రద్ధ; సత్యం – నిజం; బ్రహ్మచర్యం – బ్రహ్మచర్యం; విధిశ్చ – కర్తవ్యాలు.

**తాత్పర్యం –** అనేకరకాల దేవతలు, పితృదేవతలు, అవైదిక మనుష్యులు, పశువులు, పక్షులు, ఉచ్ఛ్వాసనిశ్వాసలు, వరి, గోధుమలు, తపస్సు, శ్రద్ధ, సత్యం, బ్రహ్మచర్యం, విధులు – అన్నీ ఆ ఈశ్వరుని నుంచే ఉద్భవించాయి.

**వివరణ – తస్మాత్ –** ఆ ఈశ్వరుని నుంచే; మాయాశక్తితో కూడిన బ్రహ్మను ఈశ్వరుడు అంటారు. ఈ విషయం మర్చిపోకూడదు. కేవలం సంకల్పంతో సృష్టించాడు. ఏం సృష్టించాడు?

**బహుధా దేవాః –** అనేక రకాల దేవతలు. దీన్ని బట్టి దేవతలలో కూడా తారతమ్యాలున్నాయని తెలుస్తోంది. యక్ష, కిన్నెర, కింపురుషులు అని కూడా అంటాం కదా. తైత్తిరీయ ఉపనిషత్తులో బ్రహ్మానందం ఎలా ఉంటుందన్న ప్రశ్నకి మనిషికి ఉండే ఆనందానికి వందరెట్లు మనుష్య గంధర్వులకు ఉంటుందనీ, వారికి ఉండే ఆనందానికి వందరెట్లు దేవ గంధర్వులకు ఉంటుందనీ, అలా సాగుతుంది. అంటే స్వర్గంలో కూడా తారతమ్యాలున్నాయన్నమాట. అక్కడ కూడా కొందరు రంభా ఊర్వశుల నృత్యానికి దగ్గరగా కూర్చుంటే, మరికొందరు ఎక్కడో దూరం నుంచి చూడాలి.

స్వర్గలోకంలో ఇంద్రుడికి మాత్రమే ఐరావతం ఉంది. ఆయన వెనుక కూర్చునే అర్హత కూడా ఎవరికీ లేదు.

**సాధ్యాః –** పితృదేవతలు. స్వర్గలోకంలోని దేవతలకన్నా తక్కువస్థాయి వారు.
**మనుష్యాః –** అవైదిక మనుష్యులు. ముందు మంత్రంలో యజమానః వచ్చింది. వారు యజ్ఞాలను అంటే వేదాలను నమ్ముతారు. వీరు నమ్మరు.
**పశవః –** పశువులు. మన భాషలో పశువు అంటే ఆవు. కానీ సంస్కృతంలో పశవు అంటే అన్ని జంతువులు. గాడిద కూడా అందులోకే వస్తుంది.
**వయాంసి –** పక్షులు. వయః – అంటే వయసు, పక్షి రెండు అర్థాలు వస్తాయి. ఇక్కడ పక్షులు – ఈ మంత్రంలో అన్నిరకాల స్థాయిలు వచ్చాయి.

| | | |
|---|---|---|
| దేవ,సాధ్య | – | ఉత్తమస్థాయి |
| మనుష్య | – | మధ్యమస్థాయి |
| పశు,వయాంసి | – | అధమస్థాయి |

**సంప్రసూతా –** పుట్టాయి. అన్నింటికీ సంప్రసూతా కలుపుకోవాలి. ప్రాణాపానౌ– ప్రాణ,అపాన. ప్రాణ అంటే ఊపిరి వదలటం. అపాన అంటే ఊపిరి తీసుకోవటం. మామూలుగా అపానం విసర్జన క్రియ చేస్తుంది. కాని ఇక్కడ ప్రాణ, అపానలని ఉచ్ఛ్వాస, నిశ్వాసలకు తీసుకోవాలి.
**వ్రీహియవౌ –** మనం జీవించటానికి ఆహారం కావాలి. మన కడుపు నిండాలి. రుచిగా కూడా ఉండాలి. నారు పోసిన వాడు నీరు పోస్తాడన్న సామెత ఊరికే రాలేదు. భగవంతుడు మన ఆకలికి సరిపడా ఆహారాన్నిచ్చాడు. మన ఆశకి సరిపడా ఇవ్వలేదు. వ్రీహి అంటే వరి, యవ అంటే గోధుమ. అంటే ఆహారం అంతా వస్తుంది.
**తపః –** ఇది కూడా ముఖ్యం. తపః అంటే ఆత్మసంయమనం వస్తుంది. ఉపాసన కూడా వస్తుంది. ఒకయజ్ఞం చేసేముందు రోజు ఉపవాసం ఉండటం లాంటిది కూడా తపస్సు కిందకే వస్తుంది. మనం కడుపుకి కావాల్సినదాన్ని మించి తింటాము. గులాబ్‌జామ్ తింటున్నప్పుడన్నా ఇంత చక్కటి రుచికరమైన దాన్ని ఎవరు సృష్టించారో అనుకోము. ఎక్కువ తినకుండా ఉండగలగటం కూడా తపస్సే.

**యుక్తాహారవిహారస్య యుక్తచేష్టస్య కర్మసు – గీత 6–17**

ఇంకో అర్థం ఉపాసన అని చూశాము. ఉపాసన చేస్తే బ్రహ్మలోకానికి వెళ్తారు.

**శ్రద్ధ–** శాస్త్రం మీద నమ్మకం.

మామూలు **మనిషి + శ్రద్ధ = యజమాని**

మన జీవితాన్ని మెరుగుపరచుకోవటానికి శాస్త్రంలో నిర్దేశించిన జీవన విధానాన్ని పాటించాలి. మనకు ఐశ్వర్యానికి లక్ష్మీదేవి, జ్ఞానానికి సరస్వతీదేవి, శక్తికి దుర్గాదేవి ఉన్నట్లే శ్రద్ధకి శ్రద్ధాదేవి ఉంది. బ్రహ్మచారికి ఉపనయనం అయ్యాక శ్రద్ధాదేవి సూక్తం నేర్పిస్తారు. దాని సారాంశం – ఓ శ్రద్ధాదేవీ నువ్వు నాలో ప్రవేశించకపోతే నేను దైవాన్ని, శాస్త్రాన్ని నమ్మను అని.

**సత్యం –** నిజం. శాస్త్రంలో నేర్చుకున్న దాన్ని ఆచరణలో పెట్టాలి. అలా నిజాయితీగా ఆచరణలో పెట్టాలని ఆశిస్తుంది శాస్త్రం. కర్మకాండలో నేర్చుకున్న దాన్ని పాటిస్తేనే దాని ఫలం దక్కుతుంది. యోగాసనాలు నేర్చుకుని వాటిని సాధన చేస్తేనే కదా ఫలం దక్కేది. అలాగే మనం నేర్చుకున్నదాన్ని అమలులో పెట్టాలి. నేర్చుకున్నదొకటి, చేసేదొకటీ ఉండకూడదు.

సత్యం పలకటం గృహస్థుకి కొన్ని సందర్భాలలో కష్టం కావచ్చు. అవకాశం రానంతవరకూ ఎవరైనా పెద్దమనిషే అంటారు. ఒక విలువని వదులుకోవాల్సివచ్చినప్పుడు ఆ పరిస్థితిని తప్పించుకోవటానికి మనం కొంత ప్రయత్నం చేస్తే, భగవానుడు ఎంతో సాయం చేస్తాడు. తప్పించుకోలేని పరిస్థితిని మారుస్తాడు. అందుకని గట్టి ప్రయత్నం చేయాలి.

**బ్రహ్మచర్యం –** ఒక వ్యక్తి తాను ఉన్న ఆశ్రమధర్మాన్ని బట్టి బ్రహ్మచర్యం నిర్వచనం కొంత మారుతుంది. బ్రహ్మచారిగా ఉంటే అతను స్త్రీవ్యామోహం లేకుండా ఉండాలి. గురుకులవాసం చేసి, శాస్త్రాన్ని అధ్యయనం చేయాలి. బ్రహ్మచారిగా కర్మకాండ నేర్చుకుంటే సన్యాసిగా జ్ఞానకాండ నేర్చుకుంటాడు. రెండింటిలోనూ స్త్రీని తాకకూడదు. అదే గృహస్థాశ్రమం విషయానికి వచ్చేసరికి పరస్త్రీ వ్యామోహం ఉండకూడదని అర్థం.

**విధిః చ –** ఒక వ్యక్తి తాను ఉన్న ఆశ్రమ ధర్మాలను బట్టి తన కర్తవ్యాన్ని నేరవేర్చాలి. యమ,నియమాలు అని చెప్పవచ్చు. మరుగుతున్న నీళ్ళలో వేలు పెట్టకూడదు. నీళ్ళు మరుగుతున్నాయని ఎలా తెలుస్తుంది? మరుగుతున్నప్పుడు, నీటి బుడగలు ఏర్పడి, శబ్దం చేస్తాయి, మేము మరుగుతున్నాము సుమా అని. ఈశ్వరుడు అందుకే బుడగలను తయారుచేసాడని పూజ్యస్వామీజీ అంటారు. అలా ప్రకృతి సూత్రాలన్నీ ఈశ్వరుడు విధించిన యమనియమాలు.

## మంత్రం - 8

**సప్త ప్రాణాః ప్రభవన్తి తస్మాత్**
**సప్తార్చిషః సమిధః సప్త హోమాః।**
**సప్త ఇమే లోకా యేషు చరన్తి ప్రాణా**
**గుహాశయా నిహితాః సప్త సప్త॥**

**ప్రతిపదార్థం :-** తస్మాత్ - ఆ ఈశ్వరుని నుంచే; సప్త ప్రాణాః - ఏడు ఇంద్రియాలు; సప్త అర్చిషః - ఏడు జ్వాలలు (ఏడు శక్తులు); సమిధ - సప్త సమిధలు (ఏడు వస్తువులు), సప్త హోమాః - ఏడు హోమగుండాలు; (ఇంద్రియ విషయ సంబంధం); సప్త ఇమే లోకా - ఈ ఏడు లోకాలు (ఏడు గోళకాలు), యేషుచరన్తి ప్రాణా - ఈ ఇంద్రియాలు సంచరిస్తాయి; గుహాశయా - హృదయ గుహలో; ప్రభవన్తి - పుడతాయి; నిహితాః - సుషుప్తిలో నిద్రిస్తాయి; సప్త సప్త - ఏడేడుగా.

**తాత్పర్యం -** ఆ ఈశ్వరుని నుంచే ఏడు ఇంద్రియాలు, ఏడు ఇంద్రియ శక్తులు, ఏడు వస్తువులు, ఏడు ఇంద్రియ విషయ సంబంధాలు, ఏడు గోళకాలూ ఉద్భవించాయి. ఇంద్రియాలు జాగ్రదావస్థలో గోళకాలలో సంచరించి సుషుప్తిలో హృదయంలో నిద్రిస్తాయి. అన్నింటినీ ఏడేడుగా ఈశ్వరుడే సృష్టించాడు.

**వివరణ -** శాస్త్రం మన జీవిత అనుభవాలను ఒక యజ్ఞంతో పోలుస్తోంది. ఐదు అంశాలు ఉంటేనే ఒక యజ్ఞం సాధ్యమవుతుంది. జీవితమనే యజ్ఞానికి కావాల్సిన ఐదు అంశాలు ఏమిటి?

1. **ఐదు ఇంద్రియాలు -** మనం ప్రపంచాన్ని ఇంద్రియాలతోనే చూడగలము. అందుకే అవి సుషుప్తిలో నిద్రిస్తున్నప్పుడు మనకు సుఖ దుఃఖాలనేవి కలగవు.
2. **ఐదు ఇంద్రియశక్తులు -** ఇంద్రియాలు ఉండి, వాటికి శక్తి లేకపోతే ఏమీ చూడలేము. కన్నుకి చూసే శక్తి, చెవికి వినే శక్తీ ఉండటం వల్లే రంగు,రూపులను చూడగలుగుతున్నాము, శబ్దాన్ని వినగలుగుతున్నాము.
3. **ఐదు విషయాలు / వస్తువులు -** జగత్తుని ఐదు విషయాలుగా విభజించింది శాస్త్రం. రంగు,రుచి, వాసన, శబ్దం, గంధం. ఇంద్రియాలు ఉండీ, శక్తి ఉండీ, చూడటానికి, వినటానికి ఏమీ లేకపోతే ఏం చూస్తాం? ఏం వింటాం?

4. **ఇంద్రియ విషయ సంయోగం–** ఇంద్రియాలు బాగానే పనిచేస్తున్నాయి, విషయాలూ చాలానే ఉన్నాయి. అయినా ఏమీ చూడలేకపోతున్నామంటే ఏమిటికారణం? ఈ రెండూ ఒకదానితో ఒకటి కలవాలి. ఎక్కడో మంచి ప్రసంగం అవుతోంది. దాన్ని మనం విని ఆనందించాలంటే ఏం చేయాలి? అక్కడికి వెళ్ళాలి, వినాలి. అక్కడికి వెళ్ళి నిద్రపోయినా ఇంద్రియ విషయ సంయోగం అవనట్టే.
5. **గోళకాలు –** ఇంద్రియాలు సూక్ష్మశరీరానికి చెందినవి. గోళకాలు స్థూల శరీరానికి చెందినవి. (ఇది వివరంగా అద్వైత వేదాంత పరిచయంలో వస్తుంది) అందుకని ఇంద్రియాలు పనిచేయాలంటే స్థూలశరీరం ఉండాలి. ఒక వ్యక్తి మరణం తర్వాత అతని సూక్ష్మశరీరం వెళ్లిపోతుంది. అప్పుడు అతన్ని చూస్తే అతని కళ్ళు తెరిచే ఉంటాయి. కాని అందులో చూపు ఉండదు. గుడ్డివాళ్ళకు కళ్ళు ఉంటాయి. వాటిని గాజు కళ్ళు అంటాము. కాని వాటిలో జీవం ఉండదు. పొద్దున్న లేచినప్పటినుంచీ ఐదు ఇంద్రియాలూ ఏదో ఒక విధంగా పనిచేస్తూనే ఉంటాయి. ఎవరినో చూస్తాము, బెడ్‌కాఫీ తాగుతాము. ఏదో పాట వినిపిస్తుంది. కాలికి అడ్డంగా ఏదో తగులుతుంది. అలా సాగుతూనే ఉంటుంది.

ఈ ఐదు ఇంద్రియాలను, వాటి శక్తిని, అన్నింటినీ ఈశ్వరుడే సృష్టించాడు. కాని ఈ మంత్రంలో ఏడు సంఖ్య వచ్చింది. 5 = 7 ఎలా?

ఐదు ఇంద్రియాలు

| | | |
|---|---|---|
| కన్ను | – | 2 కళ్లు |
| చెవి | – | 2 చెవులు |
| ముక్కు | – | 2 ముక్కు రంధ్రాలు |
| నోరు | – | 1 నాలుక |

ఇక మిగిలింది చర్మం. నాలుకకి స్పర్శా తెలుసు. రుచీ తెలుసు. వేడిది తగిలితే నోరు కాలిపోతుంది. ఏదైనా తింటే తియ్యగా ఉందో, ఉప్పగా ఉందో చెప్తుంది. అందువల్ల ఒక నాలుకను, రెండు ఇంద్రియ శక్తులకు వాడింది.

ఇప్పుడు మంత్రం చూద్దాము.

**తస్మాత్ –** ఆ ఈశ్వరుని నుంచి. అంటే బ్రహ్మ+ మాయ = ఈశ్వరుడు అని చూస్తూనే ఉన్నాము. ఈ జాగ్రత్ ప్రపంచం ఈశ్వర స్వప్నం.

**సప్త ప్రాణాః ప్రభవన్తి –** ఏడు ఇంద్రియాలు వచ్చాయి.
**సప్తార్చిషః –** ఏడు జ్వాలలు – ఇక్కడ ఏడు శక్తులు. చూడటం, వినటం, వగైరా శక్తులను జ్వాలలతో ఎందుకు పోల్చారంటే జీవితాన్ని యజ్ఞంతో పోల్చారు కాబట్టి.
**సమిధః –** సమిధలు – ఇక్కడ ఏడు వస్తువులు. జగత్తులోని వస్తువులను ఐదుగా వర్ణించిందని చూసాము. ఇక్కడ ఏడు చేసుకోవాలి.ఏడు సంఖ్య కూడా కలుపుకోవాలి.
**సప్తహోమాః –** ఏడు హోమాలు– ఇక్కడ ఇంద్రియ విషయ సంయోగం. హోమంలో సమిధలు వేసినట్లుగా విషయాలను ఇంద్రియాలకు వేస్తారు.
**సప్త ఇమే లోకాః –** ఏడు లోకాలు – ఏడు గోళకాలు

రెండు కళ్ళు – కుడికంటితో సూటిగా చూస్తూ కూడా, ఎడమ కంటితో ఓరగా చూస్తాము. (చత్వారం వచ్చినప్పుడు రెండు కళ్ళకీ ఒక్కలాగా ఉండదు)

రెండు చెవులు – కొంతమంది ఒకేసారి ఒక చెవితో ఒకళ్ళు చెప్పేది, రెండో చెవితో ఇంకోళ్ళు చెప్పేది, లేదా దూరంగా జరిగే సంభాషణని వినగలరు.అందుకే వారు వినటం లేదు కదా అనుకోకూడదు.

**రెండు ముక్కు రంధ్రాలు–** శ్వాస మీద ధ్యాస పెట్టి ధ్యానం చేస్తే ఒక రంధ్రంతో ఎక్కువ గాలి పీలుస్తున్నట్లు తెలుస్తుంది.

**నాలుక –** నాలుకమీద చల్లటి వస్తువు పడితే జివ్వుమంటుంది. రుచికరమైనది పడితే జుర్రుకుంటుంది. రుచీ, స్పర్శ చూడటం నాలుక ఒక్కటే చేస్తుంది.
**యేషు చరన్తి ప్రాణాః –** ఇలా ఈ ఏడు ప్రాణాలూ పగలంతా గోళకాలనే ఆఫీసులో పనిచేస్తాయి. 12–15 గంటలు పనిచేసాక అలసిపోయి, వాటి ఇంటికి వెళ్ళి నిద్రపోతాయి. ఏమిటది?
**గుహాశయా నిహితాః –** హృదయమనే గుహలో నిద్రపోతాయి. అప్పుడు గోళకం ఉన్నా, దాని వెనుక ఇంద్రియం లేదూ, దాని శక్తీ లేదు. చెవులు వినిపించవు. టీవీ ఎంత రొద చేసినా వినపడదు. దోమలు చర్మం మీద స్వైర విహారం చేసినా స్పర్శ తెలియదు. ముక్కుబద్దలయ్యే దుర్గంధం ఉన్నా వాసన తెలియదు. అందుకే శాస్త్రం నిద్రపోతున్న వ్యక్తిని హఠాత్తుగా లేపవద్దంటుంది. హఠాత్తుగా లేపితే, దిక్కుతోచని పరిస్థితిలో ఇంద్రియాలు స్థానభ్రంశం చెందే అవకాశం ఉంది.

అందుకే చూడండి– ఒక్కోసారి నేనెక్కడున్నాను అనుకుంటాం హఠాత్తుగా లేస్తే. ఇది శాస్త్రంలోనే కాదు. విజ్ఞానశాస్త్రంలో కూడా ఉంది. ఇలాంటి పరిస్థితిని సినస్తేషియా అంటారట.

**సప్త, సప్త–** ఏడేడు సంఖ్యలలో;

నిహితా – ఉన్నాయి. ఎక్కడో అరుదుగా ఒక్కొక్క వ్యక్తికి ఒక్కొక్క ఇంద్రియం పనిచేయదు. దానికి కారణం వారి ప్రారబ్ధకర్మే. ఆ కర్మ ఉన్నన్నాళ్ళూ అది పనిచేయదు. జంతువులకు అన్ని ఇంద్రియాలూ ఉన్నా అన్నీ పనిచేయవు. అందుకే మానవ జన్మ అన్నిటికన్నా ఉన్నతమైన జన్మ.

| ఐదు అంశాలు | మంత్రంలో పేరు |
|---|---|
| ఐదు ఇంద్రియాలు | సప్త ప్రాణాః |
| ఐదు శక్తులు | సప్తార్చిషః |
| ఐదు విషయాలు | (సప్త) సమిధః |
| ఐదు ఇంద్రియ విషయ సంయోగాలు | సప్త హోమాః |
| ఐదు గోళకాలు | సప్త లోకాః |

## మంత్రం - 9

**అతః సముద్రా గిరయశ్చ సర్వే**
**అస్మాత్ స్యన్దన్తే సిన్ధవః సర్వరూపాః।**
**అతశ్చ సర్వా ఓషధయో రసశ్చ**
**యేనైష భూతైస్తిష్ఠతే హ్యన్తరాత్మా॥**

**ప్రతిపదార్థం–** అతః – ఆ ఈశ్వరుని నుంచే; సముద్రాః – సముద్రాలు; గిరయః – పర్వతాలు; సర్వే – అన్నీ; తస్మాత్ – ఆయన్నుంచే; సర్వరూపాః సిన్ధవః – అన్ని రకాల నదులు; స్యన్దన్తే – ప్రవహిస్తున్నాయి; అతః చ – ఆయన నుంచే; సర్వా ఓషదయః – అన్ని చెట్లు చేమలు; రసశ్చ – అన్నం, యేన – అన్నరసం; అంతరాత్మా హి – (ఇక్కడ) సూక్ష్మశరీరం; భూతైః – స్థూల శరీరంలో; తిష్ఠతి– ఉన్నది.

**తాత్పర్యం–** ఆ ఈశ్వరుని నుంచే సముద్రాలు, పర్వతాలు, అన్నిరకాల నదులూ, చెట్లుచేమలూ, అన్నం ఉద్భవించాయి. ఆ అన్నరసం వల్లే స్థూలశరీరంలో సూక్ష్మశరీరం కొలువై ఉన్నది.

**వివరణ – అతః సముద్రాగిరయశ్చ సర్వే –** ఆ ఈశ్వరుని నుంచే అన్ని సముద్రాలూ, కొండలూ పుట్టాయి. పుట్టాయి అన్న పదం మనం కలుపుకోవాలి.

**అస్మాత్ స్యన్దన్తే సిన్ధవః సర్వరూపాః –** సిన్ధవ అంటే నదులు. అన్ని రకాల నదులూ – మామూలు నదులూ, జీవనదులూ – ఆయన్నుంచే పుట్టాయి.

**అతశ్చ సర్వా ఓషధయః –** అన్ని చెట్లు చేమలూ పుట్టాయి.

**యేనైష భూతైస్తిష్ఠతే హ్యన్తరాత్మా –** శాస్త్రంలో జీవి అంటే స్థూలశరీరంతో సూక్ష్మశరీరం కలిసి ఉండటం. సూక్ష్మశరీరం స్థూల శరీరాన్ని విడిచి వెళ్ళిపోతే మరణం. సంబంధం జీవితం. వియోగం మరణం. ఎందువల్ల కలిసి ఉన్నాయి? **రసశ్చ–** సమయం ప్రకారం అందులోకి రసం (అన్నం) వేస్తున్నాము కాబట్టి. రెండు రోజులు తినకుండా ఉంటే వాటి శక్తి ఎలా ఉంటుందో తెలుస్తుంది. ఆ అన్నం కూడా ఈశ్వరుని నుంచే వచ్చింది.

ఒక్కముక్కలో చెప్పాలంటే అన్నీ బ్రహ్మ నుంచే వచ్చాయి. ఇప్పుడు ముఖ్యమైన ప్రశ్న వస్తుంది మనకు. ఎలా ఆ బ్రహ్మ గురించిన జ్ఞానం పొందటం? తరువాత వచ్చే మంత్రం ఈ ఖండం మొత్తం సారాంశం.

## మంత్రం - 10

**పురుష ఏవేదం విశ్వం కర్మ తపో బ్రహ్మ పరామృతమ్।**

**ఏతద్యో వేద నిహితం గుహాయాం సోఽ విద్యాగ్రన్థిం వికిరతీహ సోమ్య॥**

**ప్రతిపదార్థం –** ఇదం విశ్వమ్ – ఈ మొత్తం ప్రపంచం; పురుషః ఏవ –ఈశ్వరుడే; బ్రహ్మ పరామృతమ్ – ఈ బ్రహ్మ సత్యం, అమృతం; కర్మ – కర్మ ఫలం; తపః – ఉపాసన ఫలం; గుహాయా నిహితమ్ – తన మనసులోనే ఉన్నాడని; ఏతద్యోవేద – ఆయనను ఎవరు తెలుసుకుంటారో; సః – అతను; అవిద్యాగ్రన్థిమ్ – అజ్ఞాన బంధం నుంచి; ఇహ – ఇప్పుడే; వికిరతి – విడివడతాడు; సోమ్య – సౌమ్యుడా!

**తాత్పర్యం–** సౌమ్యుడా! కర్మఫలం, ఉపాసనఫలం అయిన ఈ జగత్తు మొత్తం ఈశ్వరుడే. ఆయన తన మనసులోనే సాక్షీభూతంగా నెలకొని ఉన్నాడని ఎవరు తెలుసుకుంటారో, అతను అజ్ఞాన బంధం నుంచి ఇప్పుడే విడివడతాడు. అంటే జీవన్ముక్తి పొందుతాడు.

**వివరణ–** మొదటి పాదంలో బ్రహ్మ మాయాశక్తితో సృష్టించిన ఈ జగత్తుకు భిన్నంగా లేదు అని వస్తుంది. స్వప్నప్రపంచం జాగ్రత్ వ్యక్తికి భిన్నంగా లేదు.

జాగ్రత్ ప్రపంచం బ్రహ్మకు భిన్నంగా లేదు. రెండూ దూరంగా లేవు.
**పురుష ఏ వేదం విశ్వమ్ –** ఈ ప్రపంచం మొత్తం బ్రహ్మే! దానికి భిన్నంగా లేదు.
**పరామృతమ్ –** బ్రహ్మకు ఇంకో పేరు పరామృతం. పరం అంటే పారమార్థిక సత్యం. అమృతం అంటే శాశ్వతం.
**కర్మ తపః–** ఈ జగత్తు మొత్తం అంటే 14 లోకాలూ మన కర్మఫలం, ఉపాసనఫలం. జగత్తు సమష్టి కర్మఫలం వల్ల ఏర్పడింది. అందులో సుఖదుఃఖాలు అనుభవించాలి మనం. ఈ శరీరం కూడా కర్మఫలమే.

కార్యప్రపంచమంతటా కారణం బ్రహ్మ ఉన్నాడు. ఈ సత్యం మనం తెలుసుకోవాలా? వదిలేయాలా? అంటే అపరావిద్యతో ఆపేయవచ్చా, పరావిద్య తెలుసుకుని తీరాలా? పరావిద్య తెలుసుకుని తీరాలి అంటోంది శాస్త్రం. ఎందుకు? మొదటి ముండకం, మొదటి ఖండంలో కార్యప్రపంచం, కారణ బ్రహ్మ గురించి తెలుసుకున్నాం.

**కారణం – ఏకం, నిత్యం, సారం, సత్యం**

**కార్యం – అనేకం, అనిత్యం, అసారం, అసత్యం**

కార్యప్రపంచంలో అందం ఉంది, వినోదం ఉంది, వైవిధ్యం ఉంది.కాని శాశ్వతత్వం లేదు. కార్యప్రపంచం మనం కోరుకునే శాంతి, భద్రత, ఆనందాన్నీ ఇవ్వలేదు. అందుకని ప్రపంచాన్ని త్రోసిపుచ్చమనటం లేదు. కాని దాని మీద బంధం పెంచుకోవద్దంటుంది శాస్త్రం.
**గుహాయం నిహితం–** కార్యం అనిత్యం అని ఎలా తెలుసుకుంటాం? మార్పు ఉన్నదంతా కార్యం. నిద్రపోతే జాగ్రత్ ప్రపంచం, దాని దేశం, కాలం, విలీనమవుతాయి. స్వప్నం నుంచి లేస్తే స్వప్నప్రపంచం, దాని దేశం, కాలం విలీనమవుతాయి. ఇంక మిగిలింది ఏమిటి? అదే సాక్షిచైతన్యం. ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనసుని సాక్షీభూతంగా చూస్తుంది అది.
**యః వేద సోఽవిద్యాగ్రన్థిం వికిరతీహ –** ఎవరు తెలుసుకుంటారో అతనికి ఇప్పుడే ఇక్కడే అజ్ఞానబంధం విడివడుతుంది. గ్రంథి అంటే ముడి. ముడి రెండు వస్తువులను కలుపుతుంది. ఇక్కడ మనను అజ్ఞానంతో ముడివేస్తోంది.

అవిద్య = అజ్ఞానం+ అహంకార మమకారాలు.

జ్ఞానికి ఈ మూడూ విడివడతాయి. అతను సర్వవ్యాపకమైన ఆత్మను గ్రహించి,

తన అసలు స్వరూపాన్ని తెలుసుకుని, జీవితాన్ని ఒక ఆటగా మలచుకుంటాడు. మన కలని అది కల అని తెలిసి చూస్తే ఎలా నిశ్చింతగా ఉంటుందో, అలా ఈ జగత్తులో నిశ్చింతగా ఉంటాడు. అలా ఉండాలంటే అహం బ్రహ్మాస్మి జ్ఞానం పొందాలి.

ఈ మంత్రం ఒక మహా వాక్యం. జీవాత్మ, పరమాత్మల ఐక్యాన్ని చూపించే ఏ మంత్రమన్నా మహావాక్యం అవుతుంది.

**పురుష ఏ వేదం విశ్వమ్ – పరమాత్మ**

**నిహితం గుహాయామ్ – జీవాత్మ**

**సోఽ విద్యాగ్రన్థిం వికిరతీ హ – ఫలం**

**ప్రత్యేక విశ్లేషణ–** 3వ మంత్రం నుంచి 9వ మంత్రం వరకూ సృష్టిప్రకరణం జరిగింది. ఇదొక మహావాక్య మంత్రం. బ్రహ్మను ఎలా తెలుసుకోవాలి, ఎందుకు తెలుసుకోవాలి అన్న పెద్ద విషయాన్ని రెండు పాదాల్లో చెప్పిస్తుంది ఈ మంత్రం.

**మొదటిదశ–** కారణం బ్రహ్మ కార్యప్రపంచం నుంచి దూరంగా లేదు అని తెలుసుకోవాలి.

**పురుష ఏ వేదం విశ్వమ్**

కారణం లేకుండా కార్యం ఉండదు. ఆభరణం వదిలేసి, బంగారం వెతికి లాభం ఏమిటి?

**యత్ర కార్యం వర్థతే తత్ర ఏవ కారణమపి**

**రెండవదశ–** కారణం లేకుండా కార్యం లేదు కాని, కార్యం లేకుండా కారణం ఉంటుంది.

**కారణం – ఏకం, నిత్యం, సారం, సత్యం**

**కార్యం – అనేకం, అనిత్యం, అసారం, అసత్యం**

మార్పు ఉన్నదంతా కార్యం. వచ్చిపోయేది కార్యం. వీటిని నేతి (న+ఇతి) నేతి అనుకుంటూ అనిత్య వస్తువులుగా తీసివేస్తూ రావాలి.

కనబడే జాగ్రత్ ప్రపంచం - నిద్రలో ఉండదు.

స్వప్నంలో కనబడే స్వప్నప్రపంచం - నిద్రలేస్తే ఉండదు.

**మూడవదశ** - అలా అశాశ్వత వస్తువులుగా ఇవన్నీ కొట్టివేస్తాము. జగత్తు, శరీరం, ఇంద్రియాలు, మనసు, మనసులో వచ్చే ఆలోచనలు, ఇవన్నీ పోతే మిగిలేది కారణ బ్రహ్మ అవాలి. కాని నాకు మిగిలిందేమిటి? శూన్యం. సుషుప్తిలో శూన్యమే మిగులుతుంది. అంటే బ్రహ్మ శూన్యమా? కాదు. మిగిలింది శూన్యమని ఎలా తెలుస్తోంది? నేను బాగా నిద్రపోయాను అని ఎలా తెలుస్తోంది? అంటే ఆలోచనలున్న, ఆలోచనలు లేని మనస్సుని ఒకటి సాక్షీభూతంగా చూస్తోందన్నమాట.

**నాలుగవ దశ**- అలా నన్ను ఒకటి సాక్షీభూతంగా చూస్తోందంటే నాకెందుకు తెలియటం లేదు? సాక్షి చైతన్యాన్ని నేను చూడలేను అంటోంది శాస్త్రం. ఎందుకంటే అది నేనే కాబట్టి. సబ్జెక్ట్ (కర్త) అనే నేను ఎదురుగుండా ఉండే ఆబ్జెక్ట్ (కర్మ)ని చూడగలను కాని నన్ను నేను చూడలేను. నేను శరీరం కాదు. మనసు కాదు, ఆలోచనలు కాదు, శూన్యం కాదు, కాలం కాదు, దేశం కాదు. మరి ఎవరు నేను?

**అనుభవిస్తున్న నేనే ఎప్పటికీ ఆత్మను, అనుభవించబడే వస్తువు ఎన్నటికీ కాదు.**

అది ఎలా తెలుసుకోవాలి? ఒక్కటే మార్గం ఉంది.

**అహం బ్రహ్మాస్మి** - నేనే కారణం బ్రహ్మ అని తెలుసుకుంటే, కారణం బ్రహ్మకున్న నాలుగు లక్షణాలూ నాకూ ఉన్నాయి. ఏకం, నిత్యం, సారం, సత్యం.

1. **అహం ఏకమ్** - నేను సృష్టించే స్వప్నంలో అనేక నామరూపాలున్న స్వప్నప్రపంచం వస్తుంది కాని అది సృష్టించిన నేను ఏకం.
2. **అహం నిత్యమ్** - జాగ్రత్ ప్రపంచం నిద్రలో ఉండదు.
   స్వప్నప్రపంచం లేస్తే ఉండదు.
   సుషుప్తిలో ఆలోచనలు ఉండవు.
   నేను మూడు అవస్థల్లోనూ ఉన్నాను.
   సుషుప్తిలో మనసు కూడా నిద్రిస్తుంది కాబట్టి ప్రపంచ అనుభవం ఉండదు కాని నేను ఉన్నాను, సాక్షిచైతన్యంగా.

**3. అహం సారం–** నేనే ఈ ప్రపంచానికి అధిష్టానాన్ని.

**మయ్యేవ సకలం జాతం మయి సర్వం ప్రతిష్టితమ్।**
**మయి సర్వం లయం యాతి తద్బ్రహ్మాద్వయమస్మ్యహమ్॥ – కైవల్య ఉపనిషత్తు**

**4. అహం సత్యం –** శరీరం లేకపోయినా నేను ఉన్నాను, కాని నేను లేకుండా శరీరం లేదు.

విశ్వమంతా ఉన్న బ్రహ్మ, నాలో సాక్షిచైతన్యంగా ఉన్న బ్రహ్మ ఒకటే. నేను సర్వవ్యాపకమైన చైతన్యాన్ని.

ఇదంతా అర్థం చేసుకోవటం కష్టంగా ఉంది అంటే శాస్త్రం అందుకే శ్రవణం,మననం, నిదిధ్యాసనం అనే మూడు దశలను నిర్దేశించింది. శ్రవణం అంటే ఉత్తినే వినటం కాదు. ఎన్నో రోజులు ఒక క్రమపద్ధతిలో, ఒక సమర్థవంతమైన గురువు దగ్గర నేర్చుకోవటం. శంకరాచార్యులు పది ఉపనిషత్తులకు భాష్యం రాసారు. పదీ కాకపోయినా ఐదారన్నా నేర్చుకుంటే కాని ఈ విషయం అంత తేలిగ్గా జీర్ణమవదు.

**ఫలం –** కారణ పరమాత్మను తెలుసుకుంటే మన సమస్యలు తీరుతాయా? ఉపనిషత్తు బోధించేది సీటు గ్యారంటీ కోర్సు. లేదా జాబ్ గ్యారంటీ కోర్సు లాంటిది. ఇక్కడే ఇప్పుడే మోక్షం అని హామీ ఇస్తోంది. జీవ ఈశ్వర ఐక్య జ్ఞానం పొందిన వ్యక్తి బ్రతికి ఉండగానే జీవన్ముక్తి పొందుతాడు. మరణించాక విదేహముక్తి పొందుతాడు.

# ద్వితీయ ముండకం

## ద్వితీయ ఖండం

### మంత్రం - 1

**ఆవిః సంనిహితం గుహాచరం నామ**
**మహత్పదమత్రైతత్ సమర్పితమ్।**
**ఏజత్ ప్రాణాన్నిమిషచ్చ యదేతత్ జానథ సదసద్వరేణ్యం**
**పరం విజ్ఞానాద్ యద్వరిష్ఠం ప్రజానామ్॥**

**ప్రతిపదార్థం–** ఆవిః – ప్రకాశవంతమైన, సంనిహితమ్ – చాలా దగ్గరగా; గుహాచరం నామ – హృదయమనే గుహలో సంచరించేదైన; మహత్పదమ్ – అనంతమైన బ్రహ్మ; అత్ర– బ్రహ్మలో; ఏతత్ సమర్పితమ్– ఇవి అన్నీ నెలకొని ఉన్నాయి; ఏజత్– చరించేవి, ప్రాణాత్– జీవమున్నవి, నిమిష చ–చూడగలిగినవి; యద్ ఏతద్ జానథ – మీరందరూ తెలుసుకోండి; సత్– కనబడేవి (మూర్త); అసత్ – కనబడనివి (అమూర్త); వరేణ్యం – ఉత్తమ లక్ష్యం; విజ్ఞానాత్ పరమ్– పరా విద్య; యద్వరిష్ఠమ్ – అది శ్రేష్ఠం.

**తాత్పర్యం–** ప్రకాశవంతమైన చైతన్యం అత్యంత సమీపంగా హృద్గుహలో నెలకొని ఉన్నది. అదే అనంతమైన బ్రహ్మలో చరించేవి, శ్వాసపీల్చేవి, రెప్పలల్లార్చేవి అన్నీ ప్రతిష్ఠితమై ఉన్నాయి. మూర్త, అమూర్త వస్తువులు అదే. వరించదగ్గ ఉత్తమ లక్ష్యం. అపరావిద్యకన్నా పరావిద్య శ్రేష్ఠమైనది అని మీరందరూ తెలుసుకోండి.

**వివరణ –** సూటిగా దూసుకువస్తోంది ఒక మహావాక్యం. అంతటా ఉన్న బ్రహ్మ, నాలో సాక్షిచైతన్యంగా ఉన్న బ్రహ్మ ఒకటే. ఈ విషయం అర్థం కావటం కష్టం కాబట్టి ఉపనిషత్తు రెండు ఉదాహరణలు ఇస్తుంది. 1. ఆకాశం 2. ప్రకాశం. ఆకాశం ఉందని తెలుసుకొని దాన్ని విశ్లేషిస్తే అత్యంత సూక్ష్మమని తెలుస్తుంది.

ఇక్కడ ప్రకాశం తీసుకుందాం. ప్రకాశం అంటే సూర్యప్రకాశం. దానికి ఉన్న లక్షణాలు కొన్ని చూద్దాం.

1. **ప్రకాశకమ్ –** ఒకగది తీసుకుంటే ఆ గదిలో ఉన్నవారిని ప్రకాశింపజేస్తుంది. సూర్యకాంతి లేకపోతే వారిని చూడలేము. కాని దురదృష్టం, అంత ముఖ్యమైన సూర్యకాంతిని పట్టించుకోము. ఈ గదిలో ఏమున్నాయి అని ఎవరినన్నా అడిగితే, ఒక పెద్ద పట్టిక చదువుతారుకానీ, సూర్యకాంతి గురించి చెప్పరు. నిజానికి అది లేకపోతే ఈ పట్టికని చూడనే లేరు.
2. **ఏకమ్ –** ఒక గదిలో అనేకం ఉన్నాయి. కుర్చీలు, బల్లలు, ఫ్యాన్లు, మనుష్యులు వగైరా. కాని సూర్యప్రకాశం ఒకటే.
3. **సూక్ష్మమ్ –** ఈ సూర్యకాంతి ఆ గది అంతా వ్యాపించినా, దాన్ని చూడలేము. అది వ్యాపించి ఉందని నిదర్శనం ఏమిటి? అది లేకపోతే ఆ గదిలో వస్తువులను చూడలేము. కాని దాన్ని చేత్తో పట్టుకోలేము, కత్తితో కోయలేము.
4. **వ్యాపకమ్ –** మనం ఒక కుర్చీకి పరిమితం. నవాబులు వాడే అతి పెద్ద డైనింగ్‌టేబుల్ కూడా ఒక గదికే పరిమితం. కాని సూర్యకాంతి సర్వవ్యాపకం.
5. **అసంగమ్ –** సూర్యకాంతి అంతటా ఉన్నా, అన్నిటితో కలిసి ఉన్నా, దేనితోనూ సంగత్వం లేదు. మనం ధరించిన దుస్తులు మనను అంటిపెట్టుకుని ఉన్నాయి. ఎలా తెలుసు? మనం ఎక్కడికి వెళితే అక్కడికి మనతో వస్తాయి కాబట్టి. మనం ఆ గది వదిలివెళ్ళినా అందులో కాంతి అలాగే ఉంటుంది.
6. **అఖండమ్ –** అంతటా వ్యాపించేకాంతిని విభజించలేము. మా ప్రాంతంలో కరెంట్ లేదు, కొంత సూర్యకాంతిని కోసి తీసుకువెళతాను అనలేము.
7. **నిరంజనమ్ –** ఈ గదిలో ఒక మూల మట్టి ఉన్నా,సూర్యకాంతికి అది అంటదు. గది దుర్గంధభూయిష్టమైనా దానికి ఆ దుర్గంధం అంటదు. అంజనం అంటే కాలుష్యం. నిరంజనం అంటే కాలుష్యం లేనిది. నిత్య శుద్ధం అని కూడా అనవచ్చు. నిరంజనం అంటే వ్యతిరేక పద్ధతిలో చెప్పినట్టు. శుద్ధం అంటే సానుకూలపద్ధతిలో చెప్పినట్టు.
8. **అనాగమాపాయి –** వస్తువులు వస్తాయి, పోతాయి. ఎక్కడో ఒక ప్రసంగం ఉందంటే అనేకమంది అక్కడికి వస్తారు.ప్రసంగం అవగానే దూసుకుని

పోతారు. కాని కాంతి మాత్రం ముందూ ఉంటుంది, తర్వాతా ఉంటుంది. దానికి రాకపోకలు లేవు. ముందు మనుష్యులున్న హాలు, ఇప్పుడు ఖాళీహాలు. అనాగమాపాయి అంటే రాకపోకలు లేనిది.

ఈ ఎనిమిది విషయాలను జాగ్రత్తగా అర్థం చేసుకుని గుర్తుపెట్టుకోవాలి. ఇప్పుడు వీటిని చైతన్యానికి వర్తింపజేస్తాము.చైతన్యం సర్వవ్యాపకం. సూర్యప్రకాశకం చూడాలంటే కళ్ళు మూయకూడదు.

ఇప్పుడు మనసుని గదితో పోలుస్తాము. గదిలో అనేక వస్తువులు ఉన్నట్టుగా, మనసులో అనేక ఆలోచనలు వచ్చిపోతుంటాయి. గదిలో వస్తువులను సూర్యకాంతి ప్రకాశవంతం చేస్తే, మనసులో ఆలోచనలను సాక్షిచైతన్యం ప్రకాశవంతం చేస్తుంది. దాని పేరు చైతన్యప్రకాశకం.

ఇప్పుడు ఆ ఎనిమిది సూత్రాలనీ ఇక్కడ వాడదాం.

1. **ప్రకాశకమ్ –** మనసులో చెలరేగే అనేక ఆలోచనలనీ, భావాలనీ మనకు తెలిసేలా చేస్తుంది. కోపం వస్తే తెలుస్తోంది, కోపం పోతే తెలుస్తోంది.
2. **ఏకమ్** – ఆలోచనలు అనేకం, భావోద్రేకాలు అనేకం,చైతన్యం ఏకం.
3. **సూక్ష్మమ్** – కంటితో చూడలేము, దానివల్లే అన్నీ చూస్తున్నామని అర్థం చేసుకోవాలి తప్ప.

**తదద్రేశ్యమ్ అగ్రాహ్యమ్ అగోత్రమ్ అవర్ణమ్**

4. **వ్యాపకమ్ –** ఎందరు జీవులు ఉంటే, అందరిలోనూ ఉంటుంది. మనసులు ఎన్నో, వాటిలోని ఆలోచనలు మరెన్నో, కాని చైతన్యం మాత్రం ఒకటే. ఢిల్లీలో ఉన్న సూర్యుడు వేరు, ఇక్కడి సూర్యుడు వేరు అనగలమా? అలాగే మీలో ఉన్న చైతన్యం, నాలో ఉన్న చైతన్యం వేరు కాదు. అది సర్వవ్యాపకం. ఆ చైతన్యంలో మనం ఉన్నాము.
5. **అసంగమ్ –** మనసులో ఉన్నా, మనసులో వచ్చిపోయే ఆలోచనలు దానికి అంటవు. ఆలోచనలు ఉన్నప్పుడూ ఉంది, ఆలోచనలు లేకుండా సుషుప్తిలో గాఢనిద్రపోయినప్పుడూ ఉంది.
6. **అఖండమ్ –** చైతన్యం సర్వవ్యాపకం కాబట్టి, దాన్ని కోయలేము, విభజించలేము.
7. **నిరంజనమ్ –** మనసులో చెలరేగే రాగద్వేషాలు, కామక్రోధాలు మనసుని కలుషితం చేస్తాయి కాని, మనసులో ఉన్న చైతన్యానికి ఇవేవీ అంటవు.

రిపబ్లిక్‌డే పెరేడ్ రోజు గవర్నర్ వచ్చిపోయే పెరేడ్‌కి సెల్యూట్ చేస్తూ నిల్చున్నట్లుగా, మనలో ఉన్న సాక్షిచైతన్యం ప్రతిరోజూ మనలో పెరేడ్ చేస్తున్న అనేకానేక ఆలోచనలకు సెల్యూట్ చేస్తూ, వాటికి అంటకుండా ఉంటుంది.

8. **అనాగమాపాయి –** జాగ్రదావస్థలో మనసు, అనేక విషయాలను చూసి, అనేక ఆలోచనలను చేస్తుంది. అనేక భావోద్రేకాలకు గురి అవుతుంది. అప్పుడు దాన్ని చూస్తుంది చైతన్యం. తరువాత స్వప్నావస్థలో తను నిక్షిప్తం చేసుకున్న ఆలోచనల్లోంచి స్వప్న ప్రపంచాన్ని సృష్టిస్తుంది మనసు. దాన్నీ చూస్తుంది చైతన్యం. తర్వాత ఏమీ ఎరగనట్టు ఆలోచనలన్నింటినీ కట్టిబెట్టి, నిర్వికారంగా నిద్రపోతుంది మనసు. అదీ చూస్తుంది చైతన్యం. అంటే మనసులో ఆలోచనలు వచ్చిపోయినా, చైతన్యం మాత్రం స్థిరంగా ఉంటుంది.

ఈ లక్ష్యాలను నిదిధ్యాసనం చేస్తే బాగా గుర్తుంటుంది.

**మొదటి దశ –** ముందు సూర్యకాంతికి ఈ లక్షణాలను గుర్తుంచుకుని, తర్వాత వీటిని చైతన్యానికి ఆపాదించుకోవాలి.

**రెండవదశ –** ఈ సర్వవ్యాపక చైతన్యమే అసలు నేను. శరీరం తాత్కాలికంగా ధరించిన వస్త్రం. మనసు తాత్కాలికంగా వాడే పరికరం. ఇవి నా అసలు స్వరూపం కాదు.

**మూడవదశ –** నేనే జగత్‌కారణాన్ని. అహం పరమాత్మ. ఇదొక పెద్ద గెంతు. నేను ఈ ప్రపంచంలో ఒక మామూలు జీవిని కాను. నేను సృష్టికర్త పరమాత్మను. ఓ దేవా నన్ను రక్షించు అని మేకలాగా అర్థించటం కాదు. నేను పరమాత్మను (ఆత్మపరంగా) అని సింహంలా గర్జించాలి.నేను ఈ జడ శరీరాన్నో, మనసునోకాదు, నేను చైతన్యాన్ని. టూకీగా మళ్ళీ చూస్తే

| | | |
|---|---|---|
| పరమాత్మ జగత్ కారణం | – | మొదటి దశ |
| నేను పరమాత్మను | – | రెండవ దశ |
| నేను జగత్ కారణాన్ని | – | మూడవ దశ ఇదే జ్ఞాననిష్ఠ |

ఇది పొందటం కష్టం. కష్టమైనా పొందటానికి ప్రయత్నించాల్సిన ఉత్తమ పురుషార్థం. ఇది పొందితే కల నుంచి లేచినట్టు అవుతుంది. కలలోఉండగా ఎవరో మనను పొడిస్తే మనకు రక్తం రావచ్చు. ఏ పులో మనను తరుముకు

రావచ్చు. గుప్పెడన్నం కోసం ఎందరినో బ్రతిమాలవచ్చు, కాని ఒకసారి లేచాక ఏమవుతుంది? అవన్నీ మనమే సృష్టించుకున్న బాధలని తెలుస్తుంది. లేవగానే స్వప్న ప్రపంచానికి నేనే సృష్టికర్తని అని తెలుస్తుంది. బ్రహ్మజ్ఞానంలో ఈ విశాల ప్రపంచానికి నేనే సృష్టికర్తని అని తెలుస్తుంది. ముండకోపనిషత్తు ఈ విషయం చెప్తుంది. ఇంతసేపు మనం చూసిన విషయాలను ముండకోపనిషత్తు నాలుగు పాదాల్లో చెప్తుంది. ఇప్పుడు మంత్రాన్నిచూద్దాము.

**ఆవిః –** ప్రకాశస్వరూపం. సూర్యప్రకాశంలో చైతన్యకాంతి. ఆవిః పదం నుంచే ఆవిర్భూతం (ప్రకటితం), ఆవిష్కృతం (వెలువడటం) వచ్చాయి. ముందు అధ్యాయంలో అద్రేశ్యం ఒక మంత్రంలోనూ, దివ్యః ఇంకో మంత్రంలోనూ వచ్చాయి. ఇప్పుడు ఆవిః – ఈ మూడు పదాలూ బ్రహ్మను వివరించేవే.

**సంనిహితమ్ –** ప్రకాశించే ఈ చైతన్యం ఎక్కడుంది? సన్నిహితంగా, అతి సమీపంగా ఉంది. ఉదాహరణకు మన చేతిని ప్రకాశింపజేసేది ఏమిటి? సూర్యకాంతి. కాని మనం చేతిని చూస్తాము కాని, కాంతిని చూడము. ఇప్పుడు మన దృష్టిని చేతినుంచి కాంతికి మరల్చాలి. అలాగే ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనసుని ఒకటి సాక్షీభూతంగా చూస్తోంది. దానివైపు మన దృష్టిని మరల్చాలి. పరమాత్మ ఎక్కడో వైకుంఠంలో లేడు. నీ మనసులోనే ఆలోచనలను ప్రకాశింపజేసే చైతన్యంలా ఉన్నాడు.

**ఆత్మా త్వం గిరిజామతిః సహచరాః ప్రాణాః శరీరం గృహమ్**
**– శివ మానస పూజా**

**గుహాచరం నామ–** గుహాచరం అనే పేరు పొందింది. ఎందుకు? మనసనే గుహలో చరించేది. శాస్త్రం మనసుని తరచు గుహతో పోలుస్తుంది. గుహ చీకటిగా ఉంటుంది. దానిలో చూడటానికి కాంతి కావాలి. మనసనే గుహలో ఆలోచనలు తెలియాలంటే చైతన్యకాంతి కావాలి. ఆ చైతన్యం అన్ని అనుభవాల్లోనూ ఉంది. మారే అనుభవాల్లో మారని చైతన్యంగా ఉంది. అందువల్ల ఆత్మకి పేరు గుహాచరం.

**మహత్పదమ్ –** చైతన్యం శరీరానికి పరిమితం కాదు. సూర్యకాంతి హాలుకి మాత్రమే పరిమితం కాదు. అలా చైతన్యం సర్వవ్యాపకం. పదం అంటే అధిష్ఠానం. కుండలకు మట్టి అధిష్ఠానం. మహత్ అంటే అనంతం. జగత్కారణం బ్రహ్మ.

ఇది ఒక మహావాక్యం. మనసులో ఉన్న జీవాత్మే, జగత్ కారణం బ్రహ్మ. ఎటువంటి పరమాత్మ?

**అత్రైతత్ సమర్పితం** –ఈ చైతన్యం బ్రహ్మలోనే, నెలకొని ఉన్నాయి. ఏమిటవి? అన్ని రకాల జీవాల పట్టిక వస్తుంది.

**ఏజత్ ప్రాణాన్నిమిషచ్చ** – ఏజత్ అంటే చరించేవి కాని జడమైనవి. ఉదాహరణకు గాలి, నీరు. ప్రాణం ఉన్నవాటిని తక్కిన రెండు పదాల్లో సూచిస్తోంది. ప్రాణాత్ అంటే జీవమున్నవి, ప్రాణశక్తి ఉన్నవి. ఉదాహరణకు చెట్లు, పురుగులు. నిమిష అంటే కనురెప్పలను అల్లలాడించడం. అంటే కనురెప్పలు ఉన్నవి లేదా చూడగలిగినవి. ఉదాహరణకు మనుష్యులు, జంతువులు.

**యదేతత్ సద్సత్**– సత్, అసత్ అంటే ఇక్కడ సత్యం, మిథ్యకాదు. ఈవర్ణన జగత్ గురించినది. బృహదారణ్యక ఉపనిషత్తులో సత్యం అంటే పంచభూతాలు అన్న అర్థం వస్తుంది.

**సత్** – అగ్ని, నీరు, పృథ్వి– మూర్తప్రపంచం.

**త్యమ్** – వాయువు, ఆకాశం– అమూర్తప్రపంచం

అందువల్ల మూర్త, అమూర్త పంచభూతాలకు ఉనికి బ్రహ్మ వల్లే అని అర్థం. వ్యష్టిపరంగా తీసుకుంటే శరీరం మూర్తం, మనసు, భావోద్రేకాలు అమూర్తం. వీటన్నింటికీ అధిష్ఠానం ఎవరు? చైతన్యం.

**వరేణ్యం**– ఆ పరమాత్మను అంతిమలక్ష్యంగా తెలుసుకోవాలి. ఆయన శ్రేష్ఠం. ఎందుకు? కారణం తెలుసుకోవాలి. పరమాత్మ నిత్యవస్తువు. సంచరించేవి, జీవమున్నవి, కళ్ళతోచూసేవి, మూర్తం, అమూర్తం అన్నింటికీ ఆధారం బ్రహ్మనే. అందుకే వరణీయం.

ప్రపంచం అందంగా ఉండవచ్చు. నూతనంగా ఉండవచ్చు. అనేకరకాల వస్తువులతో నిండి ఉండవచ్చు. కాని దానికి శాశ్వతత్వం లేదు. శాశ్వతత్వం లేనిచోట భద్రత లేదు. ఈ రెండూ లేనిచోట శాంతి లేదు. శాంతి లేని చోట ఆనందం లేదు. అందువల్ల మనం వెంపర్లాడే శాంతి, ఆనందం, భద్రత జగత్తులో దొరకవు కాబట్టి పరమాత్మను పట్టుకోవాలి.

**ప్రజానాం విజ్ఞానాత్ పరమ్** – పరమాత్మ జ్ఞానం అపరావిద్యకన్నా శ్రేష్ఠం. ఏ ఉపనిషత్తులో వస్తుంది ఈ మాట? ఇందులోనే. పరావిద్య వేరే పద్ధతిలో దొరకదు. అంటే ప్రత్యక్ష ప్రమాణాలకు గానీ, అనుమాన ప్రమాణాలకు గానీ

దొరకదు. అందుకని ఇది వరిష్ఠం. దోషరహితం. బ్రహ్మలో దోషాలు ఉండవు. **ఏతద్ జానథ–** అందరు శిష్యులకీ చెప్తోంది శాస్త్రం. మీరందరూ తెలుసుకోండి. మీ స్వరూపం తెలుసుకోండి. మోక్షం కావాలంటే ఇది పట్టుకోండి. హరిద్వార్‌లో స్నానం చేసేటప్పుడు, అక్కడ ఉన్న కడ్డీని పట్టుకొని స్నానం చేయకపోతే, ఆ ప్రవాహంలో కొట్టుకుపోతాము. అలా ఉపనిషత్తు అనే గంగలో గురువు అనే కడ్డీని పట్టుకుని జ్ఞానం పొందాలి.

**ప్రత్యేక విశ్లేషణ –** ఈ ఖండంలో ఒక్కొక్క మంత్రం ఒక్కొక్క మహావాక్య బోధన. మన దృష్టిని ప్రపంచం నుంచి మరల్చి, మనసు వైపుకి అంతర్ముఖం చేయాలి. మనసులో అనేక ఆలోచనలు వచ్చి పోతుంటాయి. వాటిని చైతన్యకాంతి ప్రకటితం చేస్తుంది. మనసు శూన్యం అయినప్పుడు అంటే ఆలోచనలు లేనప్పుడు కూడా చైతన్యకాంతి ఉంటుంది. ఎలా తెలుసు? శూన్యం కూడా చైతన్యం వల్లే తెలుసు. ఉపనిషత్తు మన దృష్టిని అంతర్ముఖం చేస్తోంది. ముఖ్యమైనది ఏదైనా రాసేటప్పుడు, పెన్నుని ముందు ఇంకో కాగితం మీద రాసి చూస్తాము. అలా ముందు సూర్యకాంతికి ఎనిమిది లక్షణాలు చూసి వాటిని ఆత్మ ప్రకాశంతో పోల్చి చూసాము.

ముందు ఖండంలో పరమాత్మ జగత్ కారణం అనీ, అన్ని కార్యాల్లోనూ ఆయనే కనిపిస్తాడనీ చూసాము. ఇక్కడ్నుంచీ మహావాక్యాలు చూస్తాము. నాలో ఉన్న సాక్షిచైతన్యమే, జగత్ కారణం బ్రహ్మ.

| | | |
|---|---|---|
| **ఆవిః సన్నిహితం గుహాచరం నామ** | – | **జీవాత్మ** |
| **మహత్పదమ్** | – | **పరమాత్మ** |
| **వరేణ్యమ్** | – | **జ్ఞానం శ్రేష్ఠం** |

**మంత్రం – 2**

**యదర్చిమద్ యదణుభ్యోఽణు చ**
**యస్మిన్ లోకా నిహితా లోకినశ్చ।**
**తదేతదక్షరం బ్రహ్మ స ప్రాణస్తదు వాఙ్మనః**
**తదేతత్సత్యం తదమృతం తద్వేద్ధవ్యం సోమ్య విద్ధి॥**

**ప్రతిపదార్థం:–** యదర్చిమత్ – ప్రకాశించే ఆత్మ చైతన్యం; తదేతత్ బ్రహ్మ – ఈ చైతన్యమే బ్రహ్మ; అక్షరమ్ – నాశనం లేదు; తదేతత్సత్యమ్ – చైతన్యం ఒక్కటే సత్యం; తదమృతమ్ – అమరం; యస్మిన్– ఈ పరమాత్మలోనే; లోకాః –

లోకాలు; లోకినశ్చ – జీవులు, నిహితాః – వసిస్తున్నవి; సః – అది; ప్రాణస్తదు వాఙ్మనః – ప్రాణులలోనూ, వాక్కులోనూ, మనసులోనూ; యద అణుభ్యోఽ ణు చ – అణుః – అణువుకన్నా చిన్నది; తద్వేద్ధవ్యమ్ – ఆ బ్రహ్మ నీ ప్రాథమిక లక్ష్యం; విద్ధి – తెలుసుకో; సోమ్య – సౌమ్యుడా (క్రమం మారింది)

**తాత్పర్యం:–** ఓ సౌమ్యుడా! ప్రకాశించే ఆత్మ చైతన్యమే బ్రహ్మ. ఇది అక్షర బ్రహ్మ. ఇదే సత్యం, ఇదే శాశ్వతం. ఈ బ్రహ్మలోనే లోకాలు, జీవులు నివసిస్తున్నాయి. ఈ బ్రహ్మే ప్రాణంలోనూ, వాక్కులోనూ, మనసులోనూ ఉన్నది. ఇది అణువుకన్నా చిన్నది. ఈ బ్రహ్మ జ్ఞానమే నీ ప్రాథమిక లక్ష్యంగా ఉండాలని తెలుసుకో.

**వివరణ–** ఇంకో మహావాక్య మంత్రం.

**యదర్చిమత్ –** ప్రకాశించే ఆత్మ చైతన్యం, మనసులో ఆలోచనలు ఉన్నా, లేకపోయినా మనసుని ప్రకాశింపజేస్తుంది. మరి చైతన్యాన్ని ఎవరు ప్రకాశింపజేస్తారు? అది జడం కాదు. చైతన్యం దాని విశేషణం కాదు. చైతన్యం దాని స్వరూపం. పంచదశిలో నాటక దీప ఉదాహరణ వస్తుంది. నాటకరంగం మీద మనుష్యులు ఉన్నా, లేకపోయినా దీపకాంతి ఎప్పుడూ ఉంటుంది. అలాగే మనసుని నాటకరంగంతో పోలిస్తే, దానిమీద ఆలోచనలు తీవ్రంగా నాట్యం చేస్తాయి. మారే ఆలోచనలను సాక్షిగా చూస్తుంది మారని చైతన్యం.

**తదేతత్ బ్రహ్మ –** (3వ పాదంలో) ఈ చైతన్యం బ్రహ్మ. ఎక్కడో వైకుంఠంలో లేదు. ప్రతికార్యంలోనూ, కారణంగా అంతటా ఉంది. సృష్టి, స్థితి, లయ కారణం బ్రహ్మ అని ముందు ఖండంలో చూసాము. ఏమిటా బ్రహ్మ?

**అక్షరం –** నాశనం లేదు. ఇది కూడా ఇంతకు ముందు చూసాం.

**కారణం – ఏకం, నిత్యం, సారం, సత్యం**

**కార్యం – అనేకం, అనిత్యం, అసారం, అసత్యం**

చైతన్యం ఏమిటి? కారణం. అందువల్ల అక్షరం అంటే నిత్యం

**తదేత్సత్యమ్ –** (నాలుగవ పాదం) ముందేమన్నాం? నిత్యం. ఇప్పుడు సత్యం. చైతన్యం ఒక్కటే సత్యం. మిగతాదంతా మిథ్య. స్వప్నంలో ఉన్నంత సేపూ అది సత్యం అనుకుంటాము. స్వప్నం నుంచి బయటకి వస్తే అది అసత్యం అవుతుంది. మనం పారమార్థిక సత్యానికి మేలుకుంటే ఏమౌతుంది?

ఉన్నదంతా మిథ్య అని తెలుసుకుంటాము. స్థూలశరీరం, సూక్ష్మశరీరం, మనసు, 14 లోకాలు అన్నీ అసత్యం. ఎండమావులు దాహం తీర్చలేనట్టుగా మిథ్యావస్తువు శాంతి, ఆనందం, భద్రతలనివ్వలేదు.

**బ్రహ్మ సత్యం, జగత్ మిథ్య**

ఈ మహావాక్యం ఇందులో గోచరమవుతుంది.

**తదమృతమ్ –** చైతన్యమొక్కటే శాశ్వతం. తక్కినవంతా వచ్చిపోయేవే.

**యస్మిన్ లోకా లోకినశ్చ నిహితా (రెండవపాదం) –** ఈ పరమాత్మలోనే అసత్య ప్రపంచం ఉంది. యస్మిన్ అంటే ఆయనలోనే, లోకాః – లోకాలు, లోకినః చ – జీవులు, నిహితాః – జీవిస్తున్నాయి. అందువల్ల బ్రహ్మ సృష్టి, స్థితి, లయ కారకుడు.

**స ప్రాణస్తదు వాఙ్మనః–** ప్రాణంలోనూ, వాక్కులోనూ, మనసులోనూ బ్రహ్మే ఉన్నాడు.

బ్రహ్మ కారణం. జగత్‌కార్యం కాబట్టి కార్యం అంతటా కారణం ఉంది. ఒక్క బ్రహ్మే అనేకంగా భాసిల్లుతున్నాడు.

**అణోరణీయాన్మహతో మహీయాన్**
**ఆత్మాస్య జన్తోర్నిహితో గుహాయామ్** – కఠ 1-2-20

**యదణుభ్యోఽణు చ** – అతి చిన్నదైన అణువుకన్నా చిన్నది, అత్యంత పెద్దదానికన్నా పెద్దదీ అయిన ఈ ఆత్మ ప్రాణుల హృద్గుహలో కొలువై ఉన్నది.

జగత్తు రంగులమయం. నిత్య నూతనంగా కనిపించినా అది శాశ్వతానందాన్ని ఇవ్వలేదు. శాంతి, ఆనందం, భద్రతలు కావాలంటే బ్రహ్మను తెలుసుకోండి. వీటిని జగత్తులో వెతికితే, చెప్పుల దుకాణానికి వెళ్లి బట్టలు కావాలని అడిగినట్టు ఉంటుంది.

**తద్వేద్ధవ్యమ్ –** ఆ బ్రహ్మ నీ ప్రాథమిక లక్ష్యంగా ఉండాలి. ఎందుకు? ఎవరైనా కోరేది – శాంతి, ఆనందం, భద్రతలే కాబట్టి, అవి అశాశ్వతమైన జగత్తులో దొరకవు కాబట్టి

**సోమ్య విద్ధి** – అందువల్ల ఓ సౌమ్యుడా బ్రహ్మ అనే లక్ష్యాన్ని గురి చూసి కొట్టు అంటున్నాడు గురువు. ఇందులో కూడా శిష్యుడు కోరిన ప్రశ్నకు జవాబు వచ్చింది. ఆ ప్రశ్న–

**కస్మిన్ను భగవో విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతి। 1-1-3**

**యదర్చిమత్** - ప్రకాశించే ఆత్మ చైతన్యం

**తదేతత్ బ్రహ్మ** - అదే బ్రహ్మ

**తద్వేద్ధవ్యమ్** - నువ్వు తెలుసుకోవాల్సింది అదే.

ఇది ఒక మహావాక్యం.

## మంత్రం - 3

**ధనుర్గృహీత్వౌపనిషదం మహాస్త్రం**
**శరం హి ఉపాసానిశితం సన్ధయీత**
**ఆయమ్య తద్భావగతేన చేతసా**
**లక్ష్యం తదేవాక్షరం సోమ్య విద్ధి॥**

**ప్రతిపదార్థం-** ఔపనిషదమ్ - ఉపనిషత్తులు చెప్పే; ధనుః - ధనుస్సు; మహాస్త్రం- మహాస్త్రాన్ని, గృహీత్వా- తీసుకుని; ఉపాసానిశితమ్ - ధ్యానం చేసి పదును చేయబడిన; శరం హి- బాణాన్ని, సన్ధయీత- సంధించాలి; తద్భావగతేన- బ్రహ్మ భావనతో నిండిన; చేతసా - మనస్సుతో; ఆయమ్య- లోపలికి లాగి, లక్ష్యమ్ - లక్ష్యాన్ని; తదేవాక్షరం - బ్రహ్మ; విద్ధి- తెలుసుకో; సోమ్య- సౌమ్యుడా

**తాత్పర్యం-** సౌమ్యుడా! ఉపనిషత్తులనే మహాస్త్రమైన ధనుస్సుని పుచ్చుకుని, ధ్యానం చేత పదునెక్కిన మనస్సనే బాణాన్ని సంధించి, బ్రహ్మ భావనతో నిండిన మనస్సుతో బాణాన్ని లోపలికి లాగి, నీ లక్ష్యాన్ని ఛేదించాలి. ఆ లక్ష్యమే అక్షరం బ్రహ్మ. దానిని తెలుసుకో.

**వివరణ-** ముందు మంత్రంలో బ్రహ్మ నీ లక్ష్యం. దాన్ని పొందు-
**తద్వేద్ధవ్యం సోమ్య విద్ధి -** అంది. లక్ష్యం అంది కాబట్టి - ఆధ్యాత్మిక సాధనకి ఒక అందమైన ఉదాహరణ ఇస్తోంది శాస్త్రం 3,4 మంత్రాల్లో. ముందుగా ధనుర్బాణ ఉదాహరణ గురించి కొన్ని విషయాలు చూద్దాము.

1. **లక్ష్యం** - గురి చూడాల్సిన లక్ష్యం ఒకటి ఉండాలి.
2. **బాణం** - వెళ్ళి ఆ లక్ష్యాన్ని ఛేదించి, లక్ష్యంతో ఒకటైపోవాలి. ముందు భేదం, తరువాత అభేదం.
3. **ధనుస్సు** - బాణం ప్రయాణం చేయాలంటే ఒక పరికరం కావాలి. బాణాన్ని ధనుస్సుకి సంధించాలి.

**4. బాణం తీరు** - నిటారుగా ఉండాలి. లేకపోతే దూరం ప్రయాణించదు. పదునుగా ఉండాలి. లేకపోతే లక్ష్యాన్ని సంధించాక అందులో నిలబడదు.

**5. విలుకాడు** - బాణాన్ని సంధించే వ్యక్తి.

ఇప్పుడు మన ఆధ్యాత్మిక సాధనపరంగా చూద్దాము.

**1. లక్ష్యం** - పరమాత్మ

**2. బాణం** - జీవాత్మ

**3. ధనుస్సు** - ఉపనిషత్తు

**4. అస్త్రం** - నిటారుగా ఉంచటానికి– కర్మయోగ సాధన.
పదునుగా ఉంచటానికి – ఉపాసన యోగ సాధన.

**5. విలుకాడు** - సాధకుడు

సాధకుడు జీవాత్మ అనే చెప్పవచ్చు. అతను ప్రయాణించేవాడు. పరమాత్మ లేదా బ్రహ్మ అనే గమ్యం చేరేవరకు ప్రయాణం. కర్మకాండలో జీవాత్మ, పరమాత్మల భేదం ఉంటుంది. ఐక్యం ఉపనిషత్తులో వస్తుంది. కర్మయోగం ద్వారా చిత్తశుద్ధి పొంది, ఉపాసనయోగం ద్వారా చిత్త ఏకాగ్రత పొంది ఉపనిషత్తులకు వచ్చి శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారా లక్ష్యాన్ని ఛేదించాలి. వింటినారిని ఎంత లోపలికిలాగితే బాణం అంతదూరం వెళుతుంది. అలా మనసుని ఎంత లోపలికి లాగితే అంత శక్తివంతంగా లక్ష్యాన్ని ఛేదిస్తుంది. ప్రసంగానికి వెళ్లినప్పుడు చెప్పులు బయట వదిలినట్టు, బాహ్యముఖంగా ఉన్న ఆలోచనలను బయట వదిలి అంతర్ముఖం అవటానికి సిద్ధంగా ఉండాలి.

**అంతర్ముఖ సమారాధ్య బహిర్ముఖ సుదుర్లభ – లలితాసహస్రనామం.**

మనిషిని బాహ్యంగా లాగే ఐదు విషయాల నుంచి అంతర్ముఖం చేయాలి. అది శరీరం,మనసు, కుటుంబం, ఉద్యోగం, ఆస్తిపాస్తులు. ధనుస్సు, బాణం ఎంత బాగున్నా విల్లుని లోపలికి లాగకపోతే లాభం లేదు. బాణం అక్కడే ఉండిపోతుంది.

**పరాంచి ఖాని వ్యతృణత్ స్వయంభూః**
**తస్మాత్పరాజ్ పశ్యతి నాన్తరాత్మన్ కఠ 2-1-1**

ఇంద్రియాలను బాహ్యపరంగా ఏర్పాటు చేసాడు భగవంతుడు. అందుకని అవి బయటి విషయాలను మాత్రమే చూడగలుగుతున్నాయి.

ఈ వివరంతో మంత్రంలోకి వెళ్దాము.

**ధనుర్గృహీత్వౌపనిషదం మహాస్త్రం –** ఉపనిషత్తు అనే గొప్ప ధనుస్సుని తీసుకోవాలి వేదాంత సాధకుడు. ఉపనిషత్తుని ధనుస్సుతో ఎందుకు పోల్చారు? ధనుస్సు- బాణాన్ని, లక్ష్యాన్ని కలుపుతుంది.

ఉపనిషత్తు- జీవాత్మ, పరమాత్మలను ఐక్యం చేస్తుంది. కాని రెండింటి మధ్య భేదం ఏమిటి? బాణానికీ, లక్ష్యానికీ ఎంతో కొంత దూరం ఉంటుంది. అది అంత దూరం ప్రయాణించాలి. కాని జీవాత్మ పరమాత్మల మధ్య దూరమెంత? అస్సలు లేదు. దూరం ఉంటే పరమాత్మను సర్వవ్యాపకం అనలేము. కాబట్టి ఇక్కడ దూరం వాచ్యార్థం తీసుకోకూడదు. దూరం ఉన్నది నిజంగా కాదు, అజ్ఞానం వల్ల. అజ్ఞానమనే దూరాన్ని జ్ఞానం ద్వారా ప్రయాణించాలి. పరమాత్మ అనే లక్ష్యాన్ని ఛేదించాలి. జ్ఞానమే ప్రయాణం. అందుకని ఉపనిషత్తుల శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయాలి.

**శరం సన్ధయీత –** జీవాత్మ అనే బాణాన్ని సంధించాలి. దానికి నియమం ఏమిటి?

**ఉపాసానిశితం శరం హి –** సగుణ ఈశ్వర ఉపాసన ద్వారా బుద్ధిని పదును పెట్టాలి. ఇంకోటి ఉపనిషత్తు చెప్పలేదు. మనం కలుపుకోవాలి. కర్మయోగం ద్వారా చిత్తశుద్ధిని పొందాలి. గీత 13వ అధ్యాయంలో చెప్పిన అమానిత్వం, అదంభిత్వం లాంటి విలువలను సాధన చేయటం ద్వారా నైతిక జీవనం ఏర్పడుతుంది. బాణం నిటారుగా, పదునుగా ఉండాలని ముందే చూసాం. కర్మయోగం ద్వారా జీవాత్మ అనే బాణం నిటారుగా, ఉపాసనయోగం ద్వారా పదునుగా అవుతుంది.

**సన్ధయీత –** సంధించాలి. ఉపనిషత్తు బోధ ద్వారా సంధించాలి. వేరే మార్గం లేదు.స్వంతంగా నేర్చుకోవటానికి ప్రయత్నించకూడదు.

**తద్విజ్ఞానార్థం సగురుమేవాభిగచ్ఛేత్ –ముండకం 1-2-12**

వేదాంత శ్రవణం చేయాలి. ఉపనిషత్తు బోధనకి శరీరం వచ్చినా, మనసు వెంటనేరాదు. మనసుని కూడా లాగాలి.

**ఆయమ్య –** తాత్కాలికంగా సన్యాసభావనతో ఉండాలి. ప్రపంచం నుంచి బంధాలు తగ్గించుకోవాలి.

**తద్భావ గతేన చేతసా–**ఏకాగ్రచిత్తంతో ఉండాలి. దేనిమీద? బ్రహ్మభావన మీదే ఏకాగ్రత నిలపాలి.

**తదేవ లక్ష్యం విద్ధి** – ఆ లక్ష్యాన్ని నువ్వు ఛేదించుగాక.

**తదేవాక్షరం** – అదే అక్షరం బ్రహ్మ. అదే ఏకం, నిత్యం, సారం, సత్యం అయిన బ్రహ్మ.

**యత్ తదద్రేశ్యమ్ అగ్రాహ్యమ్ అగోత్రమ్ అవర్ణమ్**
**అచక్షుః శ్రోత్రం తదపాణిపాదమ్।** **– ముండకం 1-1-6**

**మంత్రం - 4**

**ప్రణవో ధనుః శరో హ్యాత్మా బ్రహ్మ తల్లక్ష్యముచ్యతే।**
**అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్తన్మయో భవేత్॥**

**ప్రతిపదార్థం–** ప్రణవః – ఓంకార మంత్రం; ధనుః – ధనుస్సు; ఆత్మా హి– ఆత్మయే; శరః – బాణం; బ్రహ్మ – పరమాత్మే; తల్లక్ష్యముచ్యతే – ఆ లక్ష్యం చెప్పబడుతోంది; అప్రమత్తేన – ఏమరుపాటు లేని మనస్సుతో, వేద్ధవ్యమ్ – ఛేదించాలి; శరవత్ – బాణం లాగా; తన్మయః – ఆ లక్ష్యంతో; భవేత్ – ఒకటైపోవాలి.

**తాత్పర్యం** – ఓంకార మంత్రం ధనస్సు, ఆత్మ బాణం. పరమాత్మే లక్ష్యం అని చెప్పబడుతోంది. బాణం ఎక్కుపెట్టినవాడు ఏకాగ్రతతో ఎక్కుపెట్టి లక్ష్యాన్ని ఛేదించినట్టుగా పరమాత్మతో మమేకమవ్వాలి.

**వివరణ** – ఈ మంత్రంలో పోలిక పట్టిక వస్తుంది.

**ప్రణవః ధనుః** – ప్రణవ అసలు అర్థం ఓంకారం. ఓంకారం ఉపనిషత్తుల సారం. అందువల్ల ప్రణవ అంటే వేదాంత శాస్త్రం.

**శరో హ్యాత్మా** – బాణం జీవాత్మ

**బ్రహ్మ తల్లక్ష్యముచ్యతే** – జీవాత్మ లక్ష్యం బ్రహ్మగా చెప్పబడుతోంది. శిష్యుడు ఏం చేయాలి?

**వేద్ధవ్యమ్** – బోధనని అర్థం చేసుకున్నాక ఛేదించాలి. ఎలా ఛేదించాలి? **అప్రమత్తేన–** ఏమరుపాటు లేకుండా ఏకాగ్రచిత్తంతో. వేదాంత బోధన ఒక నిరంతర సాధన. ఒకదానిమీద ఒకటి ఆధారపడి ఉంటుంది.

**శరవత్తన్మయో భవేత్** – లక్ష్యంతో లయం అవాలి. శరీరం స్థాయికి రాకూడదు. ఈ శరీరం మనం ఈ జన్మలో వేసుకునే దుస్తులలాంటిది. అందుకని ఇక్కడ ఉన్నంతసేపూ జీవితమనే నాటకంలో మనది ఒక పాత్రలాగా భావించాలే తప్ప దానిలో మమేకం చెందకూడదు. బ్రహ్మనిష్ఠలో నిలవాలి.

**ప్రత్యేక విశ్లేషణ –** శంకరభాష్యం నుంచి ఓంకారం గురించిన కొన్ని విశేషాలను చూద్దాము.

ఏదైనా కష్టమైతే దానికి ఉపాయం ఓం. ఓం అన్నది అదే మంత్రం, మంత్రంలో ఒక భాగం కూడా. కేవలం 'ఓం'కార ధ్యానం సన్యాసులు మాత్రమే చేయాలి. ఎందుకంటే కేవలం ఓంకార ఉపాసన వైరాగ్యాన్ని పెంచుతుంది.

**భాషపరంగా–** ఓం ధాతువు అవ్, రక్షణే – రక్షించేది. అవతి రక్షతి ఇతి ఓం – కాపాడేది ఓం. ఇది మంగళసూచకం.

**శబ్దపరంగా–** భాషాతీతంగా ఉండి,దేవునికి ఒక పదం ఉండాలంటే ఆ పదానికి కొన్ని అక్షరాలు ఉండాలి. వాటికి శబ్దం ఉండాలి. దానికి అ, ఉ, మ, అక్షరాలు కలిసే ఓం అవుతుంది. 'అ' అన్నది మొట్టమొదటి శబ్దం. నోరు తెరిస్తే పలికే శబ్దం. 'మ' అన్నది నోరు మూస్తేపలికే శబ్దం. అలా అమ్మ ఏర్పడింది. 'ఉ' అన్నది పెదాలను గుండ్రంగా తిప్పితే వచ్చే శబ్దం. అది మధ్యలో పదాలను సూచిస్తుంది.

**అ + ఉ = ఓ**

**మహా + ఉన్నతి = మహోన్నతి**

అలా ఓం శబ్దపరంగా ఏర్పడింది.

**వేదపరంగా–** సృష్టి, స్థితి, లయకారణం. ఓం శబ్దంలో జగత్ ఉంటే, ఓం పలికాక ఏర్పడే నిశ్శబ్దంలో బ్రహ్మ ఉంది. మాండూక్య ఉపనిషత్తులో ఓంకారం = బ్రహ్మ అని వస్తుంది. త్రికాలాల్లోనూ ఉన్నది ఓం, త్రికాలాల్లోనూ ఉన్నది బ్రహ్మ. అందువల్ల ఓం, బ్రహ్మకు ప్రతీక. ఓం= బ్రహ్మ, ఆత్మ= బ్రహ్మ. అందువల్ల ఓం= ఆత్మ. ఇది మాండూక్య ఉపనిషత్తులో వివరంగా ఉన్నది.

| **అక్షరం** | **అవస్థ** | **వ్యష్టి** | **సమష్టి** |
|---|---|---|---|
| **అ** | **జాగృద్** | **విశ్వ** | **విరాట్** |
| **ఉ** | **స్వప్న** | **తైజస** | **హిరణ్యగర్భ** |
| **మ** | **సుషుప్తి** | **ప్రాజ్ఞ** | **ఈశ్వర** |
| **అమాత్ర** | **నిశ్శబ్దం** | **తురీయం** | **బ్రహ్మ** |

**ఓం –** సగుణ ఈశ్వరుని సూచిస్తే **అమాత్ర నిర్గుణ బ్రహ్మను** సూచిస్తుంది.

ఓం అంటే ఈశ్వరుడు కాబట్టి ఉపాసనలకు రాజు. ఏకాగ్రత వస్తుంది. మనసు శుద్ధం అవుతుంది. ఈశ్వరానుగ్రహం కలుగుతుంది. ఆటంకాలు తొలగి, ఆనందం కలుగుతుంది.

## మంత్రం - 5

**యస్మిన్ ద్యౌః పృథివీ చాన్తరిక్షమ్**
**ఓతం మనః సహ ప్రాణై శ్చ సర్వైః।**
**తమేవైకం జానథ ఆత్మానమ్**
**అన్యా వాచో విముఞ్చథ అమృతస్యైష సేతుః॥**

**ప్రతిపదార్థం -** యస్మిన్ - పరమాత్మ అనే దారంలో; పృథివీ - భూలోకం; అంతరిక్షమ్ చ - భువర్లోకం; ద్యౌః - సువర్లోకం, ఓతమ్ - నెలకొని ఉన్నాయి; మనః ప్రాణైశ్చ సహ - మనసు, ప్రాణాలు కూడా; సర్వై - అన్నీ, తమేవ- ఆ పరమాత్మ, ఆత్మానమ్ - జీవాత్మ; జానథ ఏకమ్ - రెండూ ఒకటే అని తెలుసుకోండి; అన్యావాచః - వేదాంతం కాని వాటన్నింటినీ; విముఞ్చథ - వదిలిపెట్టండి; అమృతస్య ఏష సేతుః - ఇది అమరత్వానికి వారధి.

**తాత్పర్యం-** పరమాత్మ అనే దారంలో భూలోకం, భువర్లోకం, సువర్లోకం నెలకొని ఉన్నాయి. మనసు, ప్రాణాలు కూడా అందులోనే ఉన్నాయి. జీవాత్మ, పరమాత్మ ఒకటే అని తెలుసుకోండి. వేదాంతం కాని వాటన్నింటినీ వదిలిపెట్టండి. ఇది అమరత్వానికి వారధి.

**వివరణ-** జ్ఞానయోగమనే విలువిద్య సరిగ్గా సాధన చేస్తే- 5 ఫలితాలు స్పష్టంగా పొందవచ్చు.

1. నేను సర్వవ్యాపకమైన చైతన్యాన్ని.
2. శాంతి, ఆనందం, భద్రతలు పొందే మార్గాన్ని నేనే.
3. కేవలం నా ఉనికి వల్లే నా భౌతిక శరీరానికి జీవం ఏర్పడి, ఈ జగత్తులో వ్యవహారం నడపగలుగుతోంది.
4. ఈ జగత్తులో ఏం జరిగినా చైతన్యస్వరూపుడనైన నాకు అది అంటదు.
5. నా అసలు స్వరూపాన్ని నేను మర్చిపోయి నా జీవితాన్ని భారంగా చేసుకుంటున్నాను. జ్ఞానయోగమనే విలువిద్యను సరిగ్గా సాధన చేసి, జీవితాన్ని ఒక ఆటగా మలచుకుంటాను.

ఈ మంత్రం ఒక మహావాక్యం. ఈ ఖండంలో ఇంచుమించు ప్రతి మంత్రమూ ఒక మహావాక్యమే. జగత్తు కార్యం, పరమాత్మ కారణం అయితే , పరమాత్మ ఎక్కడ ఉన్నాడు? కార్యం అంతటా ఉన్నాడు. ఆభరణం అంతటా బంగారం ఉన్నట్టు, కుండ అంతటా మట్టి ఉన్నట్టు, వస్త్రం అంతటా దారం ఉన్నట్టు, కార్యం అంతటా కారణం బ్రహ్మ ఉన్నాడు.

**యస్మిన్ ద్యౌః ప్రథివీ చాన్తరిక్షం ఓతమ్ –** పరమాత్మ అనే దారంలో, భూలోక, భువర్లోక, సువర్లోకాలు అల్లబడి ఉన్నాయి. అంటే సృష్టి మొత్తం ఉంది. ఒక వస్త్రం నేసేటప్పుడు ఓతం, ప్రోతం అంటారు. ఓత అంటే పొడుగుదారం. ప్రోత అంటే అడ్డదారం. పొడుగు దారం నేసాక అడ్డంగా నేస్తారు. ఒక చీరమీద చేసిన ఎంబ్రాయిడరీలో సూర్యుడు, చెట్లు, జంతువులు అల్లారనుకోండి. సూర్యుడి బొమ్మ ఉన్నచోట దారం లాగేసారనుకోండి. అప్పుడేమవుతుంది? సూర్యుడు లేడు కాని దారం ఉంటుంది. అలా లోకాలు చైతన్యంలో నేయబడి ఉన్నాయి. దాన్ని చిత్రపటన్యాయం అంటారు.

**మనః సహ ప్రాణై శ్చ సర్వై –** సమష్టి ప్రపంచానికి చెందిన లోకాలే కాదు. వ్యష్టికి చెందిన మనసు, ప్రాణాలు, ఇంద్రియాలు వగైరా కూడా పరమాత్మ అనే ఏకదారంతో అల్లబడి ఉన్నాయి. ఒక వస్త్రం చూస్తే దాని దారం తెలుస్తోంది. కాని కార్యంలో ఉన్న పరమాత్మ అనే దారం తెలియటంలేదు. ఎలా? ఎలా అంటే కార్యం అంతటా సమానంగా అనుభవంలోకి వచ్చేది ఏమిటో చూడాలి. కారణం వచ్చిపోయేది కాదు. మారేది కాదు. అందుకని మారే వస్తువులను చూస్తే ఎలా అర్థమవుతుంది? మారే వస్తువుల వెనుకనున్న మారని శుద్ధ చైతన్యాన్ని చూడమంటోంది వేదాంతం. దేర్ ఈజ్ ఏ ఫ్యాన్, దేర్ ఈజ్ ఏ మ్యాన్ అనేటప్పుడు, అన్నింటిలో సమానంగా ఉన్నది, ఈజ్‌నెస్, ఉనికి. ఉనికిని అనుభవించకపోతే ఫ్యాన్ ఉంది అనలేము.

**జగత్తు = శుద్ధచైతన్యం + నామరూపాలు.**

**శుద్ధచైతన్యం = జగత్తు – నామరూపాలు**

నామరూపాలు లేని జగత్తు అంటే శుద్ధ చైతన్యం. జగత్తుని, శరీరాన్ని, ఇంద్రియాలను, మనసుని అన్నీ నేను కాదు, నేను కాదు అని నెగేట్ చేసుకుంటూ పోతే శుద్ధ చైతన్యం మిగలాలి కదా. మరినాకు ఏమీ కనబడటం లేదే?

వేదాంతం చెప్తోంది, సరిగా వినండి – మిగిలేది వస్తువు కాదు నేనే. మార్పు చెందిన వస్తువు– నామరూపాలు. శుద్ధ చైతన్యం వెతకబడే వస్తువు కాదు. వెతుకుతున్న నేనే. అన్నిటినీ సాక్షీభూతంగా చూసే సాక్షిచైతన్యాన్ని నేను– తత్ త్వం అసి.

**శుద్ధ సత్** = శుద్ధ చిత్

**శుద్ధ చిత్** = నేను, సాక్షిచైతన్యాన్ని

**నేను, సాక్షి చైతన్యం** = జగత్ కారణం బ్రహ్మ

**స్వప్నప్రపంచం** – నా మనశ్శక్తివల్ల

**జాగృద్ ప్రపంచం** – బ్రహ్మనైన నా మాయాశక్తి వల్ల

ఎలా తెలుసుకోవాలి ఇది? స్వప్నంలో ఉన్నంతసేపూ అదే నిజమని అనుకుంటాము. స్వప్నం నుంచి బయటకి వచ్చాకే ఆ స్వప్నప్రపంచాన్ని నేనే సృష్టించానని తెలుసుకుంటాము. అలాగే ఇప్పుడు జాగృద్ ప్రపంచంలో భ్రమలో ఉన్నాము. జీవుడు, జగత్, ఈశ్వరుడు వేరు అనుకుని జగత్తు మనను బాధిస్తోందనుకుని ఈశ్వరునికి మొరపెట్టుకుంటున్నాము. ఉపనిషత్తు నువ్వే ఆ పరమాత్మవి, నీ అసలు స్వరూపాన్ని మర్చిపోయి నీ జీవితాన్ని భారంగా చేసుకుంటున్నావు. ఇందాక నేర్చుకున్న ఐదవసూత్రం గుర్తుంచుకో అంటోంది. నా అసలు స్వరూపాన్ని నేను మర్చిపోయి, నా జీవితాన్ని భారంగా చేసుకుంటున్నాను.

**తమేవైకం జానథ ఆత్మానమ్–** అంటే అర్థం ఇది. జీవాత్మ పరమాత్మ ఐక్యం తెలుసుకో. మనం దాసోహం అనే స్థితిలో ఉన్నాము. ఉపనిషత్తు సోహం అంటోంది. నువ్వే జగత్ కారణం బ్రహ్మవి అంటోంది. ఐక్యం గుర్తించేవరకు జీవాత్మ వేరు, పరమాత్మ వేరు. ఐక్యం గుర్తిస్తే– ఏకాత్మ. రెండింటిలోనూ సమానంగా ఉన్న పదం ఏది? ఆత్మ.

ఏకాత్మ తెలిసింది, తరువాత ఏం చేయాలి? శిష్యునికి ఎప్పుడూ ప్రశ్నలే. గురువు ఇక ప్రశ్నలు అడక్కు. నిశ్శబ్దంగా ఉండు. ఈ బోధనలో నిలువు అంటున్నాడు.

**అన్యావాచో విముఞ్చథ–** వేదాంతం కానివన్నీ వదిలేసేయ్. జీవ, జగత్, ఈశ్వర అనే త్రిపుటి సూత్రం నుంచి, ఆత్మ, అనాత్మ అన్న సూత్రానికిరా. నువ్వే ఆ ఈశ్వరుడివి, ఈ జగత్తు ఉన్నది నీ ఆనందం కోసం అని తెలుసుకుంటే జీవితం ఆనందమయం అవుతుంది. ఎప్పుడో 1954లో ఎవరో ఏదో మోసం చేసారన్న మాట వదిలి వేదాంతం వైపుకి తిరిగితే బోలెడు సమయం మిగులుతుంది. దాన్ని నిదిధ్యాసనంకి వినియోగించ మంటాడు గురువు.

**అమృతస్య సేతుః –** సంసారమనే సాగరాన్ని దాటి ఒడ్డుకి చేరాలి. సుగ్రీవుడిని వాలి వెంటాడినట్టుగా కర్మఫలం అనే వాలి మనను వెంటాడుతోంది. సుగ్రీవుడు ఋష్యమూక పర్వతాన్ని ఆశ్రయించినట్టుగా మనం ఆత్మ అనే పర్వతాన్ని ఆశ్రయించాలి. అది మనకు వంతెనలాంటిది. ఓంకార విచారణ ద్వారా ఆత్మబోధ కలుగుతుంది. ఆత్మ గురించి తెలిస్తే సంసార బంధం లేదు. అదే మోక్షం.

**ప్రత్యేక విశ్లేషణ–** ఉపనిషత్తు ప్రాథమిక బోధ జీవాత్మ, పరమాత్మల ఐక్యం. పరమాత్మ అంటే శుద్ధ చైతన్యం. అన్నీ మారతాయి కాని చైతన్యం మారదు. దాని 5 లక్షణాలను గుర్తుంచుకోవాలి.

ఇప్పుడు సర్వవ్యాపకమైన శుద్ధచైతన్యం నాలో కూడా మారని విషయంగా ఉండాలి కదా. ఏమిటది? అది శరీరం కాదు. ఇంద్రియాలు కాదు. మనసు కాదు, ఆలోచనలు కాదు. అలా చూసుకుంటూ పోతే మిగిలేది శూన్యం. ఆ శూన్యం ఉందని చెప్పేదే సాక్షిచైతన్యం అంటోంది ఉపనిషత్తు.

| | |
|---|---|
| సమష్టిలో శుద్ధ సత్ | – వ్యష్టిలో శుద్ధచిత్ |
| పరమాత్మ | – జీవాత్మ |
| జాగ్రత్ అవస్థలో | – శరీరం, ఇంద్రియాలు, మనసు, అన్నీ ఉన్నాయి. |
| స్వప్న అవస్థలో | – మనసు మాత్రమే పనిచేస్తుంది. |
| సుషుప్తి అవస్థలో | – మనసుకూడా పనిచేయదు. |

ఈ మూడు అవస్థలలోనూ అధిష్టానంగా ఉన్నది సత్,చిత్, ఏకాత్మ. ఈ జ్ఞానమే జీవాత్మ, పరమాత్మల ఐక్యజ్ఞానం. ఈ మంత్రం దాన్ని సూచించే ఒక మహావాక్యం.

| | | |
|---|---|---|
| **ద్యౌః పృథివీ చాన్తరిక్షమ్** | – | **సమష్టిలో సత్** |
| **మనః సహ ప్రాణైశ్చ** | – | **వ్యష్టిలో చిత్** |
| **అమృతస్యైష సేతుః** | – | **ఫలం** |

అనాత్మ నుంచి విడివడి ఆత్మలో నిలువు. ఇదే జ్ఞాననిష్ఠ అంటోంది ఉపనిషత్తు. జ్ఞానాన్ని అభ్యాసం చేస్తే అది జ్ఞాననిష్ఠ అవుతుంది.

## మంత్రం - 6

**అరా ఇవ రథనాభౌ సంహతా యత్ర నాడ్యః**

**స ఏషోఽన్తశ్చరతే బహుధా జాయమానః।**

**ఓమిత్యేవం ధ్యాయథ ఆత్మానం**

**స్వస్తి వః పారాయ తమసః పరస్తాత్॥**

**ప్రతిపదార్థం –** రథనాభౌ– రథపు ఇరుసులో; అరాః ఇవ– ఆకుల్లాగా; యత్ర – హృదయంలో; నాడ్యః – నాడులు; సంహతా – కలిసిపోతాయో; సః– సర్వవ్యాపక శుద్ధ సత్; ఏషః – చిత్‌లాగా; అన్తః – శరీరం లోపల; చరతే – కదులుతోంది; బహుధా – అనేక విధాలుగా; జాయమానః – వచ్చి పోయినట్టుగా అనిపిస్తుంది; ఓమిత్యేవమ్ – ఓం అని; ఆత్మానమ్ – ఆత్మను; ధ్యాయథ – ధ్యానం చేయండి; వః – మీ, స్వస్తి – నిదిధ్యాసనమ్ ఆటంకాలు లేకుండా సాగుగాక; తమసః – అజ్ఞానం; పరస్తాత్ – లేనిది; పారాయ – అవతలి గట్టు.

**తాత్పర్యం:–** రథపు ఇరుసులో ఆకులన్నీ చేరి ఉన్నట్టు హృదయంలో నాడులన్నీ కలిసి ఉన్నాయి. సర్వవ్యాపక శుద్ధ సత్ అక్కడ చిత్ రూపంలో ఉండి, వచ్చిపోయినట్టుగా అనిపిస్తుంది. ఓం అన్న మంత్రం ద్వారా ఆత్మను జపించండి. అజ్ఞానం లేని ఆవలి ఒడ్డుకి మీ నిదిధ్యాసనం ఆటంకాలు లేకుండా సాగుగాక.

**వివరణ:–** మనసు పనిచేసేటప్పుడు దాని కార్యాలయం శరీరం అంతటా ఉంటుంది. కాని అది విశ్రాంతి చెందేది హృదయంలో. ముందు రెండవపాదం చూద్దాం.

**స ఏషోఽన్తశ్చరతే –** సః అంటే సర్వవ్యాపక శుద్ధ సత్. అది ఏషః– చిత్‌లాగా; అన్తశ్చరతే – శరీరం లోపల కదిలినట్టుగా ఉంటుంది. ఎలా? చైతన్యరూపంలో. చరతే అంటే కదిలినట్టుగా, వచ్చిపోయినట్టుగా అనిపిస్తుంది. ఎందుకు? మనసు పనిచేస్తుంటే చైతన్యం తెలుస్తుంది. సుషుప్తిలో మనసు నిద్రపోయినప్పుడు, చైతన్యం తెలియదు. ఆ మనసు ఎక్కడ ఉంది?

**యత్ర నాడ్యః సంహతా –** హృదయం నుంచీ నాడులన్నీ శరీరం అంతటా వ్యాపిస్తాయి. మనసు హృదయంలో నెలకొని ఉంది.

**శతం చైకా చ హృదయస్య నాడ్యః** - కఠ 2-3-16

ఈ హృదయంలో నూటొక్క నాడులు ఉన్నాయి. ఈ నాడులు ఎలా ఉన్నాయి? **అరా ఇవ రథనాభౌ** - ఒక రథపు ఇరుసులో ఆకులన్నీ కలిసి ఉన్నట్టుగా ఉన్నాయి. హృదయం - ఇరుసు; శరీరం- బయట చక్రం, నాడులు- ఆకులు. **ఆత్మానం ధ్యాయథ-** మనసులో ఆలోచనలు వచ్చినా చైతన్యం వల్లే తెలుస్తుంది. మనసు నిశ్శబ్దంగా ఉన్నా చైతన్యం వల్లే తెలుస్తుంది. ఆ చైతన్యతత్త్వం వైపు నీ దృష్టి మరల్చు అంటుంది ఉపనిషత్తు. ఎవరైనా చెయ్యిని చూపించి ఇక్కడ ఏముంది అని అడిగితే, మనం సాధారణంగా ఏం చెప్తాం? చెయ్యి ఉందనే చెప్తాం కాని, కాంతి ఉన్నదని చెప్పము. మనసు కదిలేదాన్ని చూస్తుంది కాని కదలని దాన్ని చూడదు. దృష్టి మరల్చు అంటే చేయిని కాక, కాంతిని చూడగలగటమే. మారుతున్న ఆలోచనలను వదిలి మారని చైతన్యాన్ని పట్టుకోండి. దానికి ఆధారంగా ఒక మంత్రం పట్టుకోండి అంటోంది ఉపనిషత్తు. ఏమిటది? **ఓమిత్యేవమ్** - ఓంకారానికి కొన్ని ప్రత్యేక శక్తులున్నాయి. ఇది వైరాగ్యాన్ని పెంపొందిస్తుంది. అందుకే సన్న్యాసులు కేవలం 'ఓం'కార ధ్యానం చేస్తారు. కాని గృహస్థులకు ఓంకారానికి జతచేసి ఏదో ఒక దైవనామస్మరణ ఇస్తారు. ఓం నమో నారాయణాయ అనో ఓం నమశ్శివాయ అనో చేయమంటారు. దానివల్ల కొంత వైరాగ్యం ఏర్పడుతుంది, సంసారంలోనే ఎప్పుడూ కొట్టుమిట్టాడుతూ ఉండకుండా.

ఓంకారం ఎందుకు చేయాలి? అనాత్మ ఆలోచనలు తీసివేయటానికి. దాని ఆత్మతత్త్వం తెలుసుకోవటానికి. అంతకు ముందు తెలుసుకున్న 5 సూత్రాల వివరణ గుర్తుతెచ్చుకోవటానికి. వాటిని మళ్ళీ చూద్దాం.

1. నేను సర్వవ్యాపకమైన చైతన్యాన్ని.
2. శాంతి, ఆనందం, భద్రతలు పొందే మార్గాన్ని నేనే.
3. కేవలం నా ఉనికి వల్లే నా భౌతిక శరీరానికి జీవం ఏర్పడి, ఈ జగత్తులో వ్యవహారం నడపగలుగుతోంది.
4. ఈ జగత్తులో ఏం జరిగినా అది నాకు అంటదు.
5. నా అసలు స్వరూపాన్ని నేను మర్చిపోయి నా జీవితాన్ని భారంగా చేసుకుంటున్నాను. జ్ఞానయోగమనే విలువిద్యని సరిగ్గా సాధన చేసి, జీవితాన్ని ఒక ఆటగా మలచుకుంటాను.

అసలు స్వరూపం తెలిస్తే జీవితం ఒక ఆట అవుతుంది. తెలియకపోతే భారంగా సాగుతుంది. శ్రవణం దశలో శిష్యుని పాత్ర అంతగా ఉండదు. గురువు చెప్పినది శ్రద్ధగా వినాలి అంతే. మననం దశలో శిష్యుని పాత్ర కొంతా, గురువు పాత్ర కొంతా ఉంటుంది. శిష్యునికి కలిగే సందేహాలు గురువు తీరుస్తాడు. నిదిధ్యాసనం దశలో అంతా శిష్యునిదే. తను నేర్చుకున్న ఈ ఐదుసూత్రాల వివరణను సాధన చేసుకోవటానికి శిష్యుడే సమయం పెట్టుకోవాలి. గురువు కేవలం దీవించగలడు అంతే.

**స్వస్తి వః –** అందుకే నీ నిదిధ్యాసనం ఆటంకాలు లేకుండా సాగుగాక అని గురువు దీవిస్తున్నాడు. నీ కుటుంబ వాతావరణం సానుకూలంగా ఉండుగాక. అంటే గురువు వీడ్కోలు చెప్తున్నాడు. ఎక్కడికి?

**పారాయ –** అవతలి ఒడ్డుకి. మోక్షాన్నిచ్చే అవతలి ఒడ్డుకి. ఏమిటది?

**తమసః పరస్తాత్ –** తమస్ లేనిది. అజ్ఞానమనే సంసార సాగరంలో పడి కొట్టుమిట్టాడకుండా, మోక్షమనే ఆవలి తీరం చేరటానికి దీవెన ఇది. ఇంకోవిధంగా చూస్తే మన దృక్కోణం మార్చాలి. మనం ఇప్పుడు చూసే పద్ధతి ఏమిటి? జగత్తు, ఈశ్వరుడు, జీవి– అని మూడున్నాయి. జీవి అనే నన్ను ఈ జగత్తు బాధిస్తోంది. నువ్వు అనాథ రక్షకుడవు. ఆపద్బాంధవుడవు. నన్ను ఈ జగత్తు నుంచి కాపాడు అని ఈశ్వరుణ్ణి వేడుకుంటున్నాము. దాన్నించి మన ఆలోచన మరల్చి ఉన్నవి రెండే – అనాత్మ, ఆత్మ అని తెలుసుకోవాలి. అనాత్మ వల్ల సుఖం కలగదు, అది అశాశ్వతం. ఆత్మను నేనే, నాలోనే శాంతి, ఆనందం, భద్రతలు కలుగుతాయి అని తెలుసుకోవాలి. అంటే ఒక్క ముక్కలో చెప్పాలంటే మోక్షం అంటే నా ఒళ్ళోనే నేను సేదతీరటం.

**ప్రత్యేక విశ్లేషణ:–** సృష్టి చేసేముందు, పరమాత్మ రెండు పదాలను ఉచ్ఛరించాడని చెప్తారు. అవి 'ఓం', 'అథ' అందుకని వీటిని చాలా శుభప్రదమైన పదాలుగా వ్యవహరిస్తారు. భగవద్గీతలో ప్రతి అధ్యాయానికి అథ ప్రథమోధ్యాయః, అథ ద్వితీయోధ్యాయః అంటూ వస్తుంది.

**ఓమిత్యేవం ధ్యాయథ**

**సత్యం,జ్ఞానం, అనంతం బ్రహ్మ**

**అహం బ్రహ్మ అస్మి**

**అయమాత్మా బ్రహ్మ**

ఈ మహావాక్యాల వెనుక ఇతి అన్న పదం రాలేదు. ఉదాహరణకు అహం బ్రహ్మ అస్మి అన్న వాక్యాన్ని ధ్యానం చేయనక్కరలేదు. నేను బ్రహ్మను అని ధ్యానం చేసేది ఎవరు? జ్ఞానా, అజ్ఞానా? జ్ఞాని ధ్యానం చేయనవసరంలేదు. ఎందుకంటే, అతను బ్రహ్మ అన్న జ్ఞానాన్ని పొందేశాడు. నేను మనిషిని అని మనం ఎలా జపిస్తూ కూర్చోమో అలా నేను బ్రహ్మను అని జపిస్తూ కూర్చోనక్ఖరలేదు. అజ్ఞాని నేను బ్రహ్మను అని జపిస్తూ కూర్చుంటే సమస్య తీరకపోగా, అది మరింత జటిలమవుతుంది. అతను 'నేను' అంటే అహంకారం అనుకుంటున్నాడు.

నేను బ్రహ్మను అన్నది సత్యం. సత్యాన్ని ధ్యానం చేయనక్కరలేదు. ఓంకారం సత్యానికి ప్రతీక. ఓంకారాన్ని సత్యానికి ప్రతీకగా ధ్యానం చేయండి అని అర్థం.

### మంత్రం-7

**యః సర్వజ్ఞః సర్వవిద్ యస్యైష మహిమా భువి।**

**దివ్యే బ్రహ్మపురే హ్యేషః వ్యోమ్న్యాత్మా ప్రతిష్ఠితః॥**

**ప్రతిపదార్థం:–** యః – ఎవరు; సర్వజ్ఞః – పరావిద్య తెలిసినవాడు; సర్వవిత్ – అపరావిద్య తెలిసినవాడు; ఏషః – ఈ; భువి – సృష్టిలో; యస్య మహిమా – ఎవరి మహిమో; ఏషః ఆత్మా – ఆ ఆత్మ; దివ్యే – ప్రకాశవంతమైన; బ్రహ్మపురే – హృదయంలో; వ్యోమ్ని – హృదయ ఆకాశంలో; ప్రతిష్ఠిత – నెలకొని ఉంది.

**తాత్పర్యం:–** సర్వజ్ఞుడు, సర్వవిదుడు ఎవరో, ఈ సృష్టి ఎవరి మహిమో, ఆ పరమాత్మ జ్యోతిర్మయమైన హృదయంలో నెలకొని ఉన్నాడు.

**వివరణ:–** అజ్ఞానమనే సముద్రాన్ని దాటటానికి, ఏ జ్ఞానం పొందాలన్న విషయం వస్తుంది ఈ మంత్రంలో. ఇంకో మహావాక్య మంత్రం. ఇప్పటిదాకా మనం కర్మకాండలో మునిగిపోయాము. జీవ, జగత్తు, ఈశ్వర త్రిపుటి సూత్రంలో ఉన్నాం. దానివల్ల నేను దీనుడిని, ఈశ్వరుడు దీనబాంధవుడు అని భావించి, పరమాత్మ ఎక్కడో వైకుంఠంలోనో, కైలాసంలోనో ఉన్నాడు, అక్కడ్నుంచి వచ్చి నన్ను కాపాడాలి అనుకుంటున్నాము.

కాని అలా పరమాత్మను వైకుంఠానికే పరిమితం చేసి ఆయనకు కూడా పరిమితులు విధిస్తున్నాము. మనను మనం కర్తగా, భోక్తగా భావించినన్నాళ్ళూ

దానివల్ల కలిగే కర్మఫలం అనుభవించక తప్పదు. అందుకని ఈ దృక్పథం నుంచి బయటపడాలి.

**తదేవ బ్రహ్మ త్వం విద్ధి నేదం యదిదముపాసతే ॥** **కేన 1-4**

బాహ్యవస్తువు ఎన్నటికీ అంతిమ సత్యం అవదు. అది వచ్చిపోయే అశాశ్వత వస్తువు అవుతుంది. పరమాత్మ ఎక్కడో లేడు. నాలోనే ఉన్నాడు. నా మనసులోనే ఉన్నాడు. ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని నా మనసుని సాక్షీభూతంగా చూస్తున్నాడు. అదే నా అసలు స్వరూపం. అందుకని నేను సహాయం బయటనుంచి కోరను. నానుంచే శక్తిని తెచ్చుకుంటాను. నా చెయ్యే నాకు ఓదార్పు. నేనే ఆత్మను.దానికి అనంత శక్తి ఉంది. ప్రపంచం నా వల్లే నడుస్తోంది.

ఈ విషయం మనకు ఇన్నాళ్ళు తెలిసిన దానికి భిన్నంగా ఉంది. అందుకని మనం దీన్ని జీర్ణించుకోవటానికి కొంత సమయం పడుతుంది.

**దేహో దేవాలయ ప్రోక్తః-** ఈ మంత్రంలో శరీరాన్ని దేవాలయంతో పోల్చింది ఉపనిషత్తు. హృదయం గర్భగుడి. హృదయంలో మనసు ఉందని చూసాము కదా. ఆ మనసులో ఉన్న సాక్షిచైతన్యం దేవుడు.

**ఆత్మా త్వం గిరిజామతిః సహచరాః ప్రాణాః శరీరం గృహం**
**- శివ మానస పూజా**

ఇదే భావన ఈ మంత్రంలో కూడా చెప్పబడింది. చాలా అద్భుతమైన మంత్రం ఇది. ఇప్పుడు మంత్రం చూద్దాము.

**యః సర్వజ్ఞః సర్వవిత్-** అక్కడ పరమాత్మ ఉన్నాడు. పరమాత్మ అనగానే ఎక్కడో ఉన్నాడనుకుని పైకి చూస్తాము. కాని పరమాత్మ సర్వవ్యాపకుడు. అతను సర్వజ్ఞుడు. సర్వవిదుడు. సర్వజ్ఞుడంటే పరావిద్య తెలిసినవాడు. సర్వవిదుడు అంటే అపరావిద్య తెలిసినవాడు. ఆత్మజ్ఞానం పొందిన వ్యక్తిని సర్వజ్ఞుడనవచ్చు కాని సర్వవిదుడు అనలేము. ఎందుకు? అన్నీ తెలిసిన వాడంటే ప్రమాణం వాడనవసరం లేదని అర్థం. ఒక ప్రమాణం వాడాడంటే, అంతకు ముందు అజ్ఞానంలో ఉన్నాడనీ, దాని ద్వారా ఆ అజ్ఞానాన్ని తొలగించుకున్నాడనీ అర్థం. ఈశ్వరుడు ప్రమాణాన్ని వాడనక్ఖరలేదు. ఎందుకంటే ఈశ్వరుని జ్ఞానం నేర్చుకున్న జ్ఞానం కాదు. అందుకే అతన్ని మాత్రమే సర్వవిదుడు అనగలము.

రెండురకాల అజ్ఞానాలున్నాయి మనకు – మూల అవిద్య, తూల అవిద్య. మూల అవిద్య అంటే ఆత్మ గురించిన అజ్ఞానం, తూల అవిద్య అంటే అనేక విషయాల గురించిన అజ్ఞానం. జ్ఞానికి మూల అవిద్య ఉండదు, కాని తూల అవిద్య కొనసాగుతుంది. అందుకని అతన్ని సర్వవిదుడు అనలేము. ఈ భేదం ఉపాధి భేదం వల్ల కలుగుతుంది. అందువల్ల జ్ఞానం పొందాక కూడా, జీవుడు, ఈశ్వరుడు అన్న పదాల వాక్యార్థంలో భేదం ఉంటుంది. లక్ష్యార్థంలో మాత్రమే భేదం తొలగిపోతుంది.

**యస్యైషః మహిమా భువి –** ఈ రెండే కాదు. సృష్టిలోని మహిమలన్నీ ఈశ్వరునివే. దీన్ని వివరంగా గీతలో 10వ అధ్యాయంలో చూస్తాము. ఉదాహరణకు–

**వేదానాం సామవేదోఽస్మి దేవానామస్మి వాసవః।**

**ఇంద్రియాణాం మనశ్చాస్మి భూతానామస్మి చేతనా।। – గీత 10–22**

వేదాలలో నేను సామవేదాన్ని. దేవతలలో ఇంద్రుడను. ఇంద్రియములలో మనస్సును. ప్రాణులలో చైతన్యాన్ని.

సర్వవిదుడైన ఈశ్వరుడే జగత్తు రూపంలో ప్రకటితమవుతున్నాడు. అతని మహిమలేమిటి? సమష్టి ప్రపంచంలో చూస్తే సూర్యచంద్రులు, నక్షత్రాలు, పంచభూతాలు లాంటివి. వ్యష్టిలో చూస్తే శరీరం, ఇంద్రియాలు, మనసు, బుద్ధి అన్నీ. ఈశ్వరుని మహిమవల్లే ప్రపంచం అంతా సవ్యంగా నడుస్తోంది.

**మహద్భయం వజ్రముద్యతం య ఏతద్విదురమృతాస్తే భవన్తి।। – కఠ 2–3–2**

వజ్రాయుధాన్ని ఎత్తి పట్టుకున్నట్టు భగవంతుడు ఉన్నాడన్న గొప్ప భయం కారణంగానే ఈ కార్యకలాపాలు జరుగుతున్నాయి.

కోరిక ఉండటం తప్పు అనుకుంటారు. కాని అది తప్పు అంటారు దయానంద సరస్వతి స్వామి. అది కూడా ఒక శక్తి. ఇచ్ఛాశక్తి. క్రియాశక్తి, జ్ఞానశక్తి లాంటి అన్ని శక్తులూ ఆ పరమాత్మవే. కొందరు ఆ శక్తివంతుడైన భగవానుని కలవాలని శబరిలాగా కన్నులు కాయలు కాచేలాగా ఎదురుచూస్తారు. అది ద్వైతభక్తి. దాన్ని కొట్టిపారేయటం లేదు. కాని మనను దానికి అతీతంగా ఎదగమంటుంది ఉపనిషత్తు. ఆ పరమాత్మ రాడు. వచ్చి దర్శనం ఇచ్చినా తృప్తి ఉండదు. ఇంకా ఎక్కువసేపు ఉండలేదే అనుకుంటాము. ఆ పరమాత్మ ఎక్కడో లేదు. నీలోనే ఉన్నాడు అంటోంది ఉపనిషత్తు.

**ఏషః దివ్యే బ్రహ్మపురే –** శరీరమనే ఆలయంలో హృదయం గర్భాలయం. అందులోని మనసులో సాక్షిచైతన్యంగా నెలకొని ఉన్నాడు. బ్రహ్మపురం అంటే బ్రహ్మలోకం కాదు.

**వ్యోమన్యాత్మా ప్రతిష్ఠిత–** వ్యోమ్ని అంటే హృదయ ఆకాశం. అందులో దివ్య ఆత్మ ఉంది. జీవాత్మ రూపేణ పరమాత్మ ప్రతిష్ఠితా అస్తి.

**మంత్రం– 8**

**మనోమయః ప్రాణశరీరనేతా**
**ప్రతిష్ఠితోఽన్నే హృదయం సన్నిధాయ।**
**తద్విజ్ఞానేన పరిపశ్యన్తి ధీరాః**
**ఆనందరూపమమృతం యద్విభాతి॥**

**ప్రతిపదార్థం: –** మనోమయః – జీవాత్మగా; ప్రాణశరీరనేతా – పునర్జన్మ దాతా; అన్నే – అన్నమయ కోశంలో; ప్రతిష్ఠితః – నెలకొని ఉన్నాడు; హృదయమ్– హృదయంలో; సన్నిధాయ – నెలకొని ఉన్నాడు. తద్విజ్ఞానేన – ఏకాత్మ జ్ఞానం పొంది; పరిపశ్యన్తి – తెలుసుకొంటాడు; ధీరాః – వివేకి; యత్ – ఎవరు; ఆనందరూపమ్ – ఆనందంలాగా; అమృతమ్ – శాశ్వతంగా, విభాతి – ప్రకాశిస్తున్నాడు.

**తాత్పర్యం: –** పునర్జన్మ దాత జీవాత్మగా అన్నమయకోశంలో ఉన్న హృదయంలో నెలకొని ఉన్నాడు. ఈ ఏకాత్మ జ్ఞానం పొందిన ధీరుడు పరమాత్మ ఆనందరూపముగా, శాశ్వతంగా ప్రకాశిస్తున్నాడని తెలుసుకుంటాడు.

**వివరణ: –** ఇంకొక మహావాక్య మంత్రం. ఈ ఖండం చాలా ముఖ్యమైన ఖండం. ఎందుకంటే ఇందులో దాదాపుగా ప్రతి మంత్రమూ ఒక మహావాక్య మంత్రము. వేదపూర్వభాగంలో ద్వైత భావన కలుగుతుంది. వేద అంతభాగం ద్వైతభావనని పారద్రోలుతుంది.

ఉదాహరణకు అలని తీసుకోండి. అలని అలగా చూస్తే దానికి ఒక పరిమితి ఉంటుంది. చావు, పుట్టుకలుంటాయి. అది దాసుడు, సముద్రం స్వామి అవుతుంది. అల అనేసరికి దానికొక నామరూపం ఏర్పడింది. అలాగే సముద్రం కూడా ఒక నామరూపమే. మన దృష్టి మారిస్తే చిన్న అలలో ఉన్నదీ నీరే. పెద్ద సముద్రంలో ఉన్నదీ నీరే! మూడు కాలాల్లోనూ ఉండేది నీరే!

అల,సముద్రం అని ఎలా విడదీసి చూస్తున్నామో అలా జీవాత్మ, పరమాత్మలను విడదీసి చూస్తున్నాము. నామరూపాలవల్ల వచ్చిన ఈ భేదాన్ని పక్కకి తీస్తే ఉన్నది ఒకటే ఆత్మ. అందులో భేదాలు లేవు. ద్వైతభక్తి తీసి, అద్వైత దర్శనం ఇస్తుంది ఉపనిషత్తు. భగవద్గీతలో నాలుగు రకాల భక్తులున్నారన్నాడు శ్రీకృష్ణపరమాత్మ.

**చతుర్విధా భజంతే మాం జనాః సుకృతినోఽర్జున**
**ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ ॥** గీత – 7–16

1. **ఆర్త భక్తుడు:–** ఏదో ప్రమాదం ముంచుకొచ్చినప్పుడు మాత్రమే ప్రార్థన చేస్తాడు.
2. **అర్థార్థీ భక్తుడు:–** ఫక్తు వ్యాపారస్తునిలా ఉంటాడు. నాకీ వ్యాపారంలో విజయం చేకూరితే నీకిది ఇస్తాను అంటాడు.
3. **జిజ్ఞాస భక్తుడు:–** ద్వైత భక్తి నుంచి పైకి రావాలనుకుంటాడు.
4. **జ్ఞాని–** పరమాత్మ ప్రాప్తి పొందినవాడు.

మనం ఎంతసేపూ ఏదో ఒక కోరిక కోరుతూ ఉంటాము. భక్తులకు పలికీ పలికీ దేవుడు కూడా అలసిపోతాడు. ఎవరైనా ఓ దేవా నువ్వు నాకు ఆత్మజ్ఞానం ఇచ్చావు. నేను నిన్ను ఏదీ అడగటానికి రాలేదు, కృతజ్ఞతలు చెప్పటానికి వచ్చాను అంతే అనేవ్యక్తి కోసం ఎదురుచూస్తుంటాడుట దేవుడు.

అలా కృతజ్ఞతలు చెప్పుకునే స్థాయికి ఎదగటం ఎలా? నేను అనాథని. నువ్వు అనాథ రక్షకుడివి. నేను దీనుడిని. నువ్వు దీనబాంధవుడివి అంటే అది భేదభావన అవుతుంది. ఈ భేదభావనను పూర్తిగా తుడిచిపెట్టివేయమంటుంది ఉపనిషత్తు. నేను మామూలు, పరిమితి ఉన్న అల్ప జీవిని కాదు.

నేను అధిష్ఠాన బ్రహ్మను అని నిస్సంకోచంగా గ్రహించాలి. అంతకు ముందు నేర్చుకున్న 5 సూత్రాల సత్యం గుర్తు తెచ్చుకోవాలి.

నిద్రలో మన స్వప్నం సృష్టి. నిద్రలేచాక మనమే దాని సృష్టికర్తలం. ఈ ఖండం అంతా మనను జీవినుంచి సృష్టికర్తగా చూపుతుంది. అంతా అయోమయంగా అనిపిస్తుంది. వెంటనే అంగీకరించలేము. కాని గురువు పదే పదే చెబుతూనే ఉంటాడు. మొదట్లో గురువు మీద గౌరవం కొద్దీ సానుభూతితో తలాడిస్తాము. వినగా వినగా నిజమేనేమో అనుకుంటాము. ఐదేళ్ళయ్యాక నిజమే

అంటాము. ఇంకా మాట్లాడితే అవును ఇది నిజం. ఇది నిజం తప్ప మరోటి కాదు అంటాము.

పరమాత్మ నీకు అత్యంత సమీపమైన నీ శరీరంలో, నీహృదయమనే గర్భాలయంలో నెలకొని ఉన్నాడు అంటుంది ఉపనిషత్తు. తీర్థయాత్రలు ఎవరికోసం చేస్తావో, అతనే సాక్షిచైతన్యంలా ఉన్నాడు.

మరి అతన్ని చూడటం ఎలా? నువ్వు చూడలేవు ఎందుకంటే నువ్వే ఆ సాక్షిచైతన్యానివి. నువ్వు భక్తుడివి కాదు.నువ్వే భగవంతుడివి అంటోంది ఉపనిషత్తు.

**దేహో దేవాలయః ప్రోక్తః**
**జీవో దేవ సనాతనః।**
**త్యజేత్ అజ్ఞాన నిర్మాల్యం**
**సోహం భావేన పూజయేత్॥**

మనప్రార్థన సోహమస్మి రూపంలో ఉండాలి. దాసోహం రూపంలో ఉండకూడదు. అద్భుతమైన మంత్రం. చదివిన కొద్దీ లోతులు తెలిపే మంత్రం. ఇప్పుడు మంత్రంలోకి వెళ్దాము.

**ప్రాణశరీరనేతా–** ఇది పరమాత్మ వర్ణన. మామూలుగా ఆ పరమాత్మ అంటాము. కాని ఇక్కడ ప్రాణశరీరనేతా వచ్చింది. ఎందుకు? పరమాత్మ పని ఏమిటి? కర్మఫలదాత అతను. మనకు మన పుణ్య,పాపాల ఫలితాలనిస్తాడు. ఒక జీవిని ఒక శరీరం నుంచి ఇంకో శరీరంలోకి మారుస్తాడు.అందువల్ల ప్రాణశరీరనేతా అంటే పునర్జన్మ దాతా అన్నమాట.

**ప్రతిష్ఠితోఽ న్నే–** ఏ పరమాత్మను ఎక్కడో ఉన్నట్టు చేస్తున్నామో ఆ పరమాత్మ నీ అన్నమయ కోశంలో ఉన్నాడు అంటోంది ఉపనిషత్తు. అన్నం అంటే అన్నమయకోశం లేదా స్థూల శరీరం.

**అన్నరసేనైవ భూత్వా అన్నరసేనైవ వృద్ధిమ్**
**ప్రాప్యాన్నరూపపృథివ్యాం యత్ విలీయతే**
**తద్ అన్నమయః కోశః స్థూలశరీరమ్॥ – తత్త్వబోధ 5.1**

స్థూలశరీరం అన్నం నుంచి పుట్టి, అన్నం వల్ల స్థితి పొంది, అన్నంలో లీనమవుతుంది.

**హృదయం సన్నిధాయ –** శరీరంలో అనేక ప్రాకారాలున్నాయి. హృదయం గర్భాలయం. పరమాత్మ శరీరం, హృదయం సృష్టించి, హృదయం లోపల నెలకొని ఉన్నాడు. మనసు హృదయంలో ఉంది. మనసులో పరమాత్మ ఉన్నాడు. ఎలా ఉన్నాడు? సాక్షిచైతన్యరూపంలో. ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనసుని సాక్షీభూతంగా చూస్తున్నాడు.

సూర్యప్రకాశక ఉదాహరణ మర్చిపోకూడదు. సూర్యప్రకాశం గదిలోకి వచ్చిపోయే వారిని సాక్షీభూతంగా చూసినట్టు, సాక్షిచైతన్యం మనసులోకి వచ్చిపోయే ఆలోచనలను సాక్షీభూతంగా చూస్తోంది.

**మనోమయః –** ఇక్కడ మనోమయ అంటే మనోమయ కోశం కాదు, జీవాత్మ. ప్రాణశరీరనేత పరమాత్మ, మనోమయ జీవాత్మగా శరీరంలో నెలకొని ఉన్నాడు. ఒకే వ్యక్తి ఆఫీసులో ఆఫీసర్‌గా, ఇంట్లో భర్తగా ఉంటాడు.

బయట ఒక సంస్థని నడిపించేవాడు – పరమాత్మ

ఇంట్లో భార్యచేత నడిపింపబడేవాడు – జీవాత్మ

రెండింట్లోనూ వ్యక్తి ఒకడే. స్థానం బట్టి హోదా, అధికారం మారుతుంది.

**తద్విజ్ఞానేన –** ఆత్మ తత్త్వానికి చెందిన విజ్ఞానం వల్ల. జ్ఞానానికి 'వి' అన్న అక్షరం కలపటం వల్ల, ఈ జ్ఞానం శాస్త్రాధ్యయనం వల్ల వచ్చింది అని, ఎవరికో స్వయంగా అనుభవంలోకి వచ్చింది కాదని సూచిస్తోంది. ఇలా శాస్త్రాధ్యయనం వల్ల వచ్చిన జ్ఞానమే పరిపూర్ణంగా ఉండి శిష్యుడు అధికారి అయితే ఇంక నేర్చుకోవాల్సిందేమీ లేకుండా చేస్తుంది.

**అధికారి లక్షణాలు –** మనో నిగ్రహం, ఇంద్రియ నిగ్రహం, ధ్యానం, వైరాగ్యం అని శంకరాచార్యుల వారు పేర్కొన్నారు. 'అంతా నేను' అని నేను చెప్పేలోపల 'అంతా ఈశ్వరునికి చెందింది,' అన్న విషయం గ్రహించగలిగి ఉండాలి. అప్పుడు 'నాది,' అన్న భావన పోతుంది. శమం, దమం పెంపొందించుకుంటే రాగద్వేషాలను పోగొడుతుంది. ఈ రెండింటిలోనూ ఉన్నది ఒకటే. జీవాత్మే పరమాత్మ అన్న ఏకాత్మ జ్ఞానం పొందాలి. అహం బ్రహ్మ అస్మి. కాని అహం అంటే ఎవరు?

కీళ్ళనొప్పితో బాధపడే శరీరం కాదు. విషయ వాంఛలతో నిండిన ఇంద్రియాలు కాదు. రాగద్వేషాలకు పుట్టినిల్లయిన మనసు కాదు. నేను అంతా చేస్తున్నాననే

అహంకారం కాదు. శూన్యమైన మనసు కాదు. వీటన్నింటినీ తెలుసుకునే శుద్ధ సాక్షిచైతన్యం.

అక్కడితో అవదు మన ప్రయాణం. ఈ సాక్షిచైతన్యమైన నేనే ప్రాణ శరీర నేత అయిన పరమాత్మను. నేను ఏకాత్మను. దీన్ని ఐక్యజ్ఞానం అంటారు. ఇది మహావాక్యం.

| | | |
|---|---|---|
| **ప్రాణశరీరనేతా** | **– పరమాత్మ** | **– తత్** |
| **మనోమయః** | **– జీవాత్మ** | **– త్వం** |
| **తద్విజ్ఞానమ్** | **– ఐక్యం** | **– అసి** |

**పరిపశ్యన్తి ధీరాః–** వివేకి తెలుసుకుంటాడు. సూర్యకాంతిని చూడలేము. పట్టుకోలేము. అర్థం చేసుకోలేము. దానికన్నా సూక్ష్మమైన ఆత్మజ్ఞానం పొందటానికి మనసుని సూక్ష్మం చేయాలి. అంటే పదునుపెట్టాలి.

**యథా ప్రకాశయత్యేకః కృత్స్నం లోకమిమం రవిః।**
**క్షేత్రం క్షేత్రీ తథా కృత్స్నం ప్రకాశయతి భారత॥** – గీత 13–33

అర్జునా! ఒక్క సూర్యుడే ఈ సమస్త జగత్తునూ ప్రకాశింపజేస్తున్నట్లు, ఒకే ఆత్మ అన్ని ప్రాణులయందు ఉండి వాటిని ప్రకాశింప చేస్తుంది.

అందుకే సూర్యకాంతి మీద ధ్యానం లేదా ఆకాశధ్యానం చేయాలి. ఆకాశానికి శబ్దం తప్ప తక్కిన స్పర్శ, రూప, రస, గంధాలు లేవు. సూర్యకాంతి ఉంది, ఆకాశం ఉంది అన్న వాక్యాల్లోని ఉంది అన్న పదం ద్వారా ఆత్మ సూర్యకాంతిలోనూ ఉంది. ఆకాశంలోనూ ఉంది అని గురువు చెప్తాడు.

దీనిని ధీరుడు అర్థం చేసుకుంటాడు. ధీరుడు అంటే సాధన చతుష్టయ సంపన్నుడు. నిత్యానిత్య వస్తు వివేకం చేసి వైరాగ్యం పెంచుకుంటాడు. దీనివల్ల అతని బుద్ధి పదునుగా అవుతుంది.

బయట సత్ రూపంలో ఉన్న బ్రహ్మ లోపల చిత్ రూపంలో ఉంది అని తెలుసుకుంటాడు. మనసు ప్రశాంతంగా, నిర్మలంగా ఉంటే ఆనందం కూడా అని తెలుసుకుంటాడు. బ్రహ్మకు ఒక వర్ణన ఏమిటి?

**సచ్చిదానంద ఆత్మ (సత్ + చిత్ + ఆనందం).**

బ్రహ్మ ఈ మూడు రూపాల్లోనూ ఎప్పుడూ ఉంటుంది కాని మూడూ ప్రతిసారీ ప్రకటితమవవు.

ఉదాహరణకు రెండు బర్నర్లున్న ఒక స్టవ్ మీద, ఒకవైపు గిన్నెలో నీళ్ళు, ఇంకోవైపు ఇనుపకడ్డీని కాల్చామనుకోండి. ఏమవుతుంది అప్పుడు? వాటిని వేడిచేయటానికి కింద ఉన్న నిప్పుకు రెండు లక్షణాలున్నాయి. ఏమిటవి? వేడి, కాంతి. నీటిలో కాంతిని చూడలేము. వేడిని మాత్రమే గ్రహించగలము. కాని ఇనుపకడ్డీ విషయానికి వచ్చేసరికి వేడి, కాంతి రెండూ ప్రకటితమవుతున్నాయి. అంటే దేనికైనా సరియైన మాధ్యమం కావాలి. అగ్నికున్న రెండు లక్షణాలూ రెండింటిలోనూ సమానంగా ప్రకటితమవటం లేదు.

అలాగే ఆత్మకున్న మూడు లక్షణాలూ అన్ని వేళలా, అన్నిచోట్లా ప్రకటితమవవు. శరీరం, మనసుల్లో సత్+చిత్ ప్రకటితమవుతాయి. మామూలు మనసు ఆనందాన్ని చూడలేదు. ఆలోచనలు ఆగి, సాత్విక వృత్తి వచ్చాక అప్పుడు ఆనందమయ కోశం మూడింటినీ ప్రకటింపజేయగలదు. ఎప్పుడూ కీళ్ళనొప్పి ఆనందాన్ని హరించివేస్తుంది. కాని అబ్బాయి అమెరికా నుంచి వస్తుంటే, ఆనందం ప్రభావం ఎక్కువయి, తాత్కాలికంగా కీళ్ళనొప్పిని హరించి వేస్తుంది. ప్రకటితమయేది వచ్చి పోతుంటుంది కాని అసలు స్వరూపం ఎప్పుడూ ఉంటుంది. ఏకాత్మ ఆనంద రూపం. దాన్ని ఎలా అనుభవించాలి?

తెలుసుకునే నేనే ఆత్మను. తెలుసుకోబడే వస్తువు కాదు. ఈ విషయం జీర్ణించుకోవాలి. ఒక అద్దం తీసుకోండి. అందులో మూడు ఉంటాయి.

| | | |
|---|---|---|
| ఒకటి | – ఫ్రేమ్ | – అది అద్దానికి చెందినది; |
| రెండు | – మెరిసే ఉపరితలం | – అది అద్దానికి చెందినది. |
| మూడు | – నా ముఖం | – అది నాకు చెందినది. |

నా ముఖం అద్దం మీద కనబడుతోంది కాని అద్దానికి చెందినది కాదు. పక్కకి జరిగితే ముఖం కనబడదు. ఐస్‌క్రీమ్ తినే విషయం కూడా అంతే.

నామం ఐస్‌క్రీమ్‌ది.

రూపం ఐస్‌క్రీమ్‌ది.

ఆనందం నాది.

ఆనందం ఐస్‌క్రీమ్‌ది కాదు. నాది. ఐస్‌క్రీమ్ తినటం వల్ల వచ్చింది. ఐస్‌క్రీమ్‌కి సంబంధించినది కాదు. తినేస్తే ఆనందం లేదు. అద్దం తీసేస్తే ప్రతిబింబం లేదు.

**ఆనందరూపమమృతం యద్విభాతి –** ఇలా ప్రతిబింబంలా అప్పుడప్పుడు వచ్చి పోయే ఆనందం కాదు నాది. అహం ఆనంద స్వరూపః. ఎటువంటి ఆనందం? అమృతం – శాశ్వతం. ప్రతిబింబం శాశ్వతం కాదు. నేను ఎప్పుడన్నా ఏడ్చినా కూడా ఆనందస్వరూపాన్నే. ఏడుపు అన్నది మనసుకి చెందింది. జ్ఞాని ఏడవకూడదని లేదు. అది అనాత్మ స్వభావం. తను ఎప్పటికీ ఆనందస్వరూపం అని తెలుసుకుంటాడు.

## మంత్రం–9

**భిద్యతే హృదయగ్రన్థిః ఛిద్యన్తే సర్వసంశయాః।**
**క్షీయన్తే చాస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరావరే॥**

**ప్రతిపదార్థం: –** తస్మిన్ పరావరే – కార్యకారణ బ్రహ్మ; దృష్టే– దర్శిస్తే; హృదయగ్రన్థిః – హృదయంలోని ముడి; భిద్యతే – విడిపోతుంది; సర్వ సంశయాః – అన్ని సందేహాలూ; ఛిద్యన్తే – సమసిపోతాయి; అస్య – అతని; కర్మాణి చ – అన్ని కర్మలూ; క్షీయన్తే – నశించిపోతాయి.

**తాత్పర్యం: –** ఎవరు కార్యకారణ బ్రహ్మను దర్శిస్తారో, అతనికి హృదయంలో ముడులు విడిపోతాయి. అన్ని సందేహాలూ సమసిపోతాయి; అన్ని కర్మలూ నశించిపోతాయి.

**వివరణ: –** ఈ మంత్రంలో జ్ఞానఫలం చెప్తోంది ఉపనిషత్తు. మామూలుగా చివర్లో వస్తుంది కాని, ఇప్పుడే చెప్తోంది.

పరావరే – పరావరం అంటే ఏకాత్మ లేదా బ్రహ్మ.

| | | | |
|---|---|---|---|
| పరం – | ఉన్నతమైనది | – కారణం | – సముద్రం |
| అవరం – | తక్కువస్థాయిది | – కార్యం | – అల |

రెండింటి నామరూపాలూ తీసేస్తే ఉన్నది ఒకటే – ఏకాత్మ.
సమష్టి నామరూపాలు – పరమాత్మ – పరం – కారణభూతపరమాత్మ
వ్యష్టి నామరూపాలు – జీవాత్మ – అవరం – కార్యభూత జీవుడు.

**తస్మిన్ దృష్టే పరావరే –** పరావరం అయిన బ్రహ్మను చూసినప్పుడు 'తెలుసుకుంటే' అవి వాడాల్సిన చోట శాస్త్రం 'చూస్తే' అని వాడుతోంది. ఎందుకంటే చూపు ప్రత్యక్ష ప్రమాణం, దానిలో ఇంక ఏ సందేహం ఉండదు. దృష్టిని దృష్టిగానూ

వాడుతుంది కాని ఇక్కడ అర్థం 'తెలుసుకుంటే' అని వస్తుంది. ఈ పరావరం ఏకాత్మని స్పష్టంగా నేను అని అర్థం చేసుకుంటే ఏమవుతుంది?
**భిద్యతే హృదయగ్రంథిః–** హృదయంలో ఉన్న ముడులు విడిపోతాయి.

**సోఽవిద్యాగ్రన్థిం వికిరతీహ సోమ్య॥ – ముండకం 2.1.10**

జ్ఞానం పొందితే ఇప్పుడే, ఇక్కడే అవిద్యవల్ల, అంటే అజ్ఞానం వల్ల, ఏర్పడిన ముడులు విడిపోతాయి అని ఇంతకుముందు ఖండంలోనే చెప్పింది ఉపనిషత్తు.

ముడి అన్నది రెండు వస్తువులను కలుపుతుంది. అజ్ఞానం వల్ల అనేకముడులు మనమే వేసుకుంటున్నాము.

శంకరాచార్యులు గ్రంథిని కామంతో పోలుస్తున్నారు. కామం అంటే కోరికలు. కోరికల మూలాన ఎప్పుడూ అసంతృప్తే, ఎప్పుడూ బాధే. జ్ఞానం పొందితే మనను అనాత్మ నుంచి విడదీస్తుంది. జీవ–జగత్తు– ఈశ్వర అనే త్రిపుటి ధ్యాసనుంచి ఆత్మ – అనాత్మ అనే ద్విపుటి ధ్యాసకి రావాలి.
**ఛిద్యన్తే సర్వసంశయా –** అన్ని అనుమానాలూ సమసిపోతాయి.

**బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నా పరః.**

ఈ విషయం అందరినీ పిలిచి చెప్పనక్ఖరలేదు. మనలో మనమే తేల్చుకోవచ్చు. నేను ముక్తపురుషుడినా, సంసారినా?

పూజ్యస్వామీజీని ఒక పండితుడు అడిగాడు, 'స్వామీజీ ఎవరైనా వచ్చి శంకారాచార్యులవారి బోధని మెరుగుపరిస్తే ఏమవుతుంది?' స్వామీజీ చెప్పారు, 'శంకరులవారికి తనకంటూ విడిగా ఒక సిద్ధాంతమేమీ లేదు.' ఉపనిషత్తు, 'అహం బ్రహ్మ అస్మి' అని బోధిస్తుంది. శంకరులవారు ఆ మహావాక్యం మనకు స్పష్టంగా అర్థమయేటట్టు చేశారు అంతే. ఆ వాక్యాన్ని ఎవరూ ఏమీ మార్చలేరు. చెప్పే విధానం మార్చవచ్చేమో గానీ 'నువ్వు పూర్ణం' అన్నదాన్ని ఇంకా ఏం మెరుగుపరుస్తారు?'
**క్షీయన్తే చాస్య కర్మాణి** – అన్ని కర్మలూ నాశనమవుతాయి. జ్ఞాని శరీరం, మనసులతో మమేకం చెందదు. అందువల్ల జ్ఞానికి బాధలేదు. ఒకవేళ ఏదైనా బాధవేసినా నా శరీరానికి బాధవచ్చింది అంటాడు. అందువల్ల జ్ఞాని జీవన్ముక్తుడవుతాడు. ఇది ఫలం.

**ప్రత్యేక విశ్లేషణ: –**బ్రహ్మజ్ఞానం పొందిన వ్యక్తికి అన్ని కర్మలూ నశించిపోతాయి. శాస్త్రం మూడురకాల కర్మల గురించి చెబుతుంది.

1. **సంచితకర్మలు: –** సంచిత కర్మలంటే గతజన్మలనుంచీ ప్రోగుచేసుకుని వచ్చిన కర్మలు. ఈ జన్మలో కొన్ని మాత్రమే అనుభవిస్తాము. మిగతావి సంచిలో ప్రోగయి ఉంటాయి. అనేక అనుభవాలనిచ్చే సంచిత కర్మలను దగ్ధం చేయటానికి జీవి అంతులేని జన్మలను పొందుతూనే ఉండాలి.
2. **ప్రారబ్ధకర్మలు: –** ఆరంభించబడిన కర్మలు ప్రారబ్ధకర్మలు. ఈ జన్మలో అనుభవిస్తాము వాటిని.
3. **ఆగామి కర్మలు: –** ఆత్మజ్ఞానం పొందకముందు, పోగుచేసుకుంటున్న కర్మలను ఆగామికర్మలు అంటారు. ఈ కర్మలఫలం దాని తీవ్రతను బట్టి ప్రారబ్దంగా లేదా సంచితంగా మారుతుంది. జ్ఞానం పొందాక, నేను అకర్తా, అభోక్తా అనుకుని కర్మలు చేయడం వల్ల, ఎన్ని పనులు చేసినా జ్ఞానికి ఆగామి కర్మలు అంటవు. కర్మలు పుణ్యపాపాలు పుట్టిస్తాయి అనేది సాధారణ కర్మసిద్ధాంతం. కాబట్టి జ్ఞానిని పూజించిన వారికి జ్ఞానిపుణ్యం, జ్ఞానిని నిందించిన వారికి జ్ఞానిపాపం వెళ్తాయి(తత్త్వబోధ).

జ్ఞానం కలిగాక, సంచితకర్మలు దగ్ధమయిపోతాయి. ఎందుకంటే కర్తృత్వభావన ఉండదు.నేను బ్రహ్మను కాబట్టి, బ్రహ్మ అకర్త కాబట్టి నేను ఎప్పుడూ అకర్తనే. అంతకుముందు అజ్ఞానం వల్ల నేను కర్తను అనుకుని కొన్ని కర్మలను ప్రోగేశాను. కాని అవి నా అజ్ఞానపు ఆలోచనల నుంచి పుట్టినవి కాబట్టి సంచిత కర్మలు ఇప్పుడు ఆవిరయిపోతాయి. స్వప్నంలో చేసిన చర్యకి జాగృదావస్థలో జవాబుదారీ కాను కదా. ఇదీ అంతే!

జ్ఞానికి ఆగామికర్మలు అంటవు. ఎందుకంటే అతనికి కర్తృత్వభావన లేదు. జీవితంలో ఇంతవరకూ చేసిన కర్మలు దగ్ధం అయిపోతాయి. ఎందుకంటే ఇవి నేను చేసాను, నేను కర్తని అని చెప్పే వ్యక్తి ఇంక లేదు. జ్ఞాని పనులు చేసినా అతనికి పుణ్యం, పాపం అంటదు. అతను చేసే పనులకు దృష్టఫలం మాత్రమే, కనబడే ఫలం మాత్రమే, ఉంటుంది. అందువల్ల జ్ఞానికి సంచిత కర్మలు మిగలవు. ఆగామి కర్మలు రావు.

ఈ శరీరానికి కారణభూతమైన ప్రారబ్ధకర్మలు మాత్రం మిగులుతాయి. ఈ విషయంలో దేవునికి కృతజ్ఞతలు చెప్పుకోవాలి. లేకపోతే బ్రహ్మజ్ఞానం

పొందటానికి ఎవరూ ఆసక్తి చూపరు. మన ప్రారబ్ధకర్మని పూర్తిచేయటానికి ఏర్పడిన ఈ స్థూలశరీరం ఈశ్వరసృష్టి. ఈశ్వరాజ్ఞచే ఏర్పడింది. ఈశ్వరాజ్ఞ ప్రకారం శరీరం ప్రారబ్ధకర్మని అనుభవిస్తుంది. అది ముగిసేదాకా కష్టసుఖాలను అనుభవించక తప్పదు.

జ్ఞానిలో కూడా గత జ్ఞాపకాలు ఉంటాయి. అది సహజం. అవి అతని ఊహ నుంచి జనించినవి కావు. అందుకని జ్ఞానం పొందగానే మాయమవవు. పదవ వ్యక్తి తలమీద ఉన్న కట్టులాగా శరీరం కొనసాగుతుంది. ఒక గురువు దగ్గర ఉన్న పదిమంది శిష్యులు ఒకసారి నది దాటారు. ఎవరూ నదిలో మునిగిపోలేదు కదా అని తేల్చుకోవటానికి వారి నాయకుడు లెఖ్ఖపెట్టటం మొదలుపెట్టాడు. అతని లెఖ్ఖకి తొమ్మిదిమందే వస్తున్నారు. పదోవాడు లేడు.

గురువాజ్ఞని మీరినందుకు తగిన శాస్తే జరిగిందనుకున్నాడు. అపరాధభావంతో, దగ్గరున్న చెట్టుకేసి తన తల బాదుకున్నాడు. రక్తం కారింది. కట్టు కట్టారు. అందరూ ఏడుస్తున్నారు. దారినపోయే దానయ్య చూసి వారి బాధేంటో కనుక్కుని 'నువ్వే ఆ పదవవాడివి' అని లెఖ్ఖపెట్టిన నాయకుడికి చెప్పాడు. అతనికి 'నేనే ఆ పదవవాడిని' అన్న జ్ఞానం అయితే కలిగింది కాని తగిలిన దెబ్బ, కట్టిన కట్టు పోవు కదా. దాన్నే ప్రారబ్ధకర్మ అంటారు.

జ్ఞానం కలిగాక కూడా ప్రారబ్ధ కర్మలు కొనసాగుతాయని నిరూపించటానికి అనేక ఉదాహరణలున్నాయి. కుమ్మరి కుండలు చేయటం ఆపాక కూడా, అతని చక్రం కొంతసేపు తిరుగుతూనే ఉంటుంది. లాగి వదిలిన బాణం దాని వేగం తగ్గేదాకా ప్రయాణిస్తూనే ఉంటుంది, వద్దన్నా ఆగదు. అలాగే మనం తరువాత తినకుండా ఉన్నా, తిన్న అన్నమయితే జీర్ణం అవాలి కదా. అంటే దాని మేరకు జీర్ణక్రియ జరుగకమానదు.

ఈ శరీరం ఈశ్వరప్రసాదం, ఈశ్వరుడు కోరినట్టుగా దాన్ని నడవనివ్వాలి. జీవుడే గనుక దీన్ని సృష్టిస్తే, జ్ఞానం కలగగానే అది మాయమయిపోవాలి. ఎలా? రజ్జుసర్పభ్రాంతిలో అది పాము కాదు తాడు అని తెలిసిన మరుక్షణం పాము మాయమయినట్టుగా ఈ శరీరం మాయమవాలి. రజ్జుసర్పభ్రాంతిని అర్థధ్యాస (అర్థ + అధ్యాస) అంటారు. అక్కడ ఒక వస్తువును చూసి ఇంకో వస్తువుగా పొరబడుతున్నాము. కాని శరీరం విషయంలో అజ్ఞానాన్ని జ్ఞానాధ్యాస (జ్ఞాన+ అధ్యాస) అంటారు. జ్ఞానం విషయంలో చేసిన పొరపాటు.

సూర్యుడు కదలడు అని వైజ్ఞానపరంగా తెలిసాక కూడా సూర్యోదయం, సూర్యాస్తమయం ఆగిపోవు. అవి కొనసాగుతూనే ఉంటాయి. సూర్యోదయం సమయం చెప్తూనే ఉంటారు. అంటే చూసే వస్తువు మీద, దృష్టిమారుతుంది. అలాగే ప్రారబ్ధకర్మ ఉన్నన్నాళ్ళూ శరీరం ఉంటుంది. శరీరం ఈశ్వర ప్రసాదం అని అంటే ఈశ్వరుడు అతని ఇష్టాయిష్టాల మేరకు మనకీ శరీరం ఇచ్చాడని కాదు అర్థం. కర్మసిద్ధాంతాన్ని దృష్టిలో పెట్టుకునే ఇచ్చాడు.

ఇప్పుడున్న శరీరం బాగాలేదు అనలేము. అలా ఎవరైనా అంటే, వారు ఈశ్వరుడు మంచివాడు కాదు అన్నట్టు. అది మన నిర్ణయం అవుతుంది. ప్రారబ్ధకర్మను అంగీకరిస్తే ఈశ్వరుడిని అంగీకరించినట్టు. మనకు ఫ్రీవీల్ ఉన్నా కూడా, దాన్ని ప్రారబ్ధకర్మకు వదిలేసి, దానిననుసరించి పనిచేస్తాము. ప్రారబ్ధకర్మ మనకో, మనతో సంబంధం ఉన్నవారికో ఏదైనా చేసే కోరికను పుట్టిస్తుంది. కోరకుండా ఒక అనారోగ్యాన్ని కూడా ఇవ్వవచ్చు.

జ్ఞానం వచ్చాక కూడా ప్రారబ్ధకర్మ తప్పదు. కాని ఇంకోవిధంగా చూస్తే ప్రారబ్ధకర్మ అంటదు. జ్ఞాని నేను శరీరం కాదు. నేను మనసు కాదు అనుకుంటాడు కాబట్టి తనకి కలిగిన శారీరక అనారోగ్యానికి కాని, మానసిక రాగద్వేషాలకు కాని చలించడు. ఈ దృష్ట్యా జ్ఞానికి ప్రారబ్ధకర్మ కూడా లేనట్టే.

జ్ఞానం ఏర్పడ్డాక, 'నేను కర్తను, నేను భోక్తను' అన్న అపోహలు పోతాయి తప్ప వేరే ఏమీ పోవు. ప్రారబ్ధకర్మ కూడా పోతే, గురువు కాని, శిష్యుడు కాని, బోధించే సంప్రదాయం కాని, మోక్షం కాని ఉండనే ఉండవు!

## మంత్రం - 10

**హిరణ్మయే పరే కోశే విరజం బ్రహ్మ నిష్కలమ్।**

**తచ్ఛుభ్రం జ్యోతిషాం జ్యోతిః తద్యదాత్మవిదో విదుః॥**

**ప్రతిపదార్థం:-** హిరణ్మయే - బంగారు రంగులో; పరేకోశే - విజ్ఞానమయ కోశంలో; విరజం - దోషాలు లేని; నిష్కలమ్ - భాగాలు లేని; బ్రహ్మ- చైతన్యం; తత్ - అది; శుభ్రమ్ - శుద్ధం; జ్యోతిషాం జ్యోతిః - జ్యోతులన్నింటికీ జ్యోతి; యత్ తత్ - ఆయన్ని; ఆత్మవిదః - ఆత్మజ్ఞానులు; విదుః - తెలుసుకుంటారు.

**తాత్పర్యం:-** బంగారు రంగులో మెరిసే ఆత్మ విజ్ఞానమయ కోశంలో ఉంది. అది విరజం, నిష్కళం, శుద్ధం, జ్యోతిషాం జ్యోతి. ఎవరు ఆత్మను అధిష్ఠాన

జ్యోతిగా తెలుసుకుంటారో, వాళ్ళు బ్రహ్మను తెలుసుకున్నట్లు.

**వివరణ: –** ఇంకో మహావాక్య మంత్రం. బ్రహ్మకారణ వస్తువు. కారణపరమాత్మ ప్రతికార్యంలోనూ అధిష్ఠానంగా ఉన్నాడు. అంటే మనలో కూడా జీవాత్మలా ఉన్నాడు. జీవాత్మను తెలుసుకుంటే పరమాత్మను తెలుసుకోగలము. కారణం తప్ప అన్నీ వచ్చిపోయేవే. వాటిని పట్టుకుంటే మిగిలేది భయం, ఆదుర్దా తప్ప ఏమీ లేదు. హరిద్వార్‌లో స్నానం చేయాలంటే అక్కడ ఉన్న చెయిన్‌ని పట్టుకోవాలి. లేకపోతే ఎటు తేలతామో తెలీదు. అలా ఏకం, నిత్యం, సారం, సత్యమైన బ్రహ్మను పట్టుకోవాలి. లేకపోతే అవస్థ పడతాము. ఏం చేయాలో తేల్చుకోవాల్సింది మనమే.

**విరజం బ్రహ్మ నిష్కలమ్ తచ్ఛుభ్రం –** బ్రహ్మ విరజం నిష్కళం శుద్ధం. రజం అంటే కాలుష్యం. మనసులోని రాగద్వేషాలు అంతర్గత కాలుష్యం. పరమాత్మ విరజం. అంతేకాదు శుభ్రం, ఎప్పటికీ శుద్ధం. ఎక్కడ ఉంది ఈ శుద్ధమైన బ్రహ్మ?

**హిరణ్మయే పరే కోశే –** విజ్ఞానమయ కోశంలో ఉంది. హిరణ్మయే అంటే బంగారంలా మెరిసే అని అర్థం. ఈ కోశం ఎందుకు ప్రకాశవంతంగా ఉంది? అది చైతన్యాన్ని ప్రతిబింబింపచేస్తుంది కాబట్టి. సూర్యకాంతిని ప్రతిబింబింపజేసేగోడ ప్రకాశవంతంగా ఎలా ఉంటుందో, అలా విజ్ఞానమయకోశం ప్రకాశవంతంగా ఉంటుంది.

**జ్యోతిషాం జ్యోతిః –** బ్రహ్మ ఎలా ఉంది? సాక్షిచైతన్యంగా. జీవాత్మ రూపంలో ఉంది.

ఆ జీవాత్మ జ్యోతిషాం జ్యోతిః జ్యోతి అంటే ప్రకాశించేది. బ్రహ్మ జ్యోతులకే జ్యోతి.

**జ్యోతిషామపి తజ్జ్యోతిః తమసః పరముచ్యతే – గీత 13–17**

జ్యోతికి సాంకేతిక అర్థం–జ్యోతి సమక్షంలో వస్తువులు తెలిసి, ఆ జ్యోతి లేకపోతే వస్తువులు తెలియకపోవటం. ఉదాహరణకు సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు. అందువల్ల జ్యోతి అంటే స్వయం ప్రకాశక జ్యోతి.

సూర్యుడు ఒక స్వయం ప్రకాశక జ్యోతి. సూర్యుడు అన్నింటినీ ప్రకాశింపజేస్తాడు. తనను తాను ప్రకాశింపజేసుకుంటాడు. **అంటే సూర్యుడు ఒక జ్యోతి.** కాని అంత స్వయం ప్రకాశక జ్యోతి కూడా గుడ్డివానికి తెలియదు. కన్ను అనే ఇంద్రియం పనిచేస్తేనే బయట జ్యోతి తెలుస్తుంది. జ్యోతి అంటే ఏమన్నాం? జ్యోతి సమక్షంలో వస్తువులు తెలిసి, ఆ జ్యోతి లేకపోతే వస్తువులు తెలియకపోవడం అన్నాం. అలా చూస్తే **కన్ను ఒక జ్యోతి**.

ఇదే భావం తక్కిన ఇంద్రియాలకు కూడా వర్తిస్తుంది. చెవి అనే ఇంద్రియం పనిచేయకపోతే ఏ ధ్వనీ వినిపించదు. చెవిటివారి ముందు శంఖం ఊదినట్టు అన్న సామెత ఉండనే ఉంది. చెవి పనిచేయకపోతే ఏదైనా ప్రసంగానికి వెళ్ళి మాత్రం లాభమేమిటి? అలా ఇంద్రియాలు ఒక జ్యోతి.

ఇప్పుడు ఇంద్రియాలు ఎలా పనిచేస్తున్నాయి? వాటి వెనుక మనసు ఉంటేనే. ఒక ప్రసంగానికి వెళ్ళి అయ్యో గ్యాస్ కట్టేసానా లేదా అని మనసు కల్లోలంలో పడిపోతే, ఆ ప్రసంగం అర్థం కాదు. అందుకే చూడండి. ఖంగారులో ఏదైనా వస్తువు వెతుకుతుంటే, అది ఎదురుగా ఉన్నా కూడా కనబడదు. ఎందుకు? మన మనసు కుదురుగా లేదు. అంటే ఇప్పుడు **మనసు ఒక జ్యోతి**.

ఎన్ని జ్యోతులో చూడండి. సూర్యుడు ఒక జ్యోతి. దాన్ని చూసే కన్ను (ఇంద్రియాలు) ఒక జ్యోతి. దాని వెనుక నడిపించే మనసు మరో జ్యోతి. మనసు తనంతట తాను చూడగలదా? ఇది కూడా జడమే. పంచభూతాలతో చేయబడింది. మనసనే జ్యోతిని ప్రకాశింపజేసేది ఇంకోటుంది. ఏమిటది? అది ఆత్మ జ్యోతి, **చైతన్యజ్యోతి**. ఇది దేనివల్ల ప్రకాశిస్తోంది? దీని వెనుక ఇంకో జ్యోతి లేదు. అందుకని ఇది **ఒక** జ్యోతి అనకూడదు. ఇదే జ్యోతి. **ఇది స్వయం ప్రకాశకజ్యోతి**. ఇది తనంతట తాను ప్రకాశిస్తూ, తక్కిన వాటిని ప్రకాశింపజేస్తుంది. ఇప్పుడు వెనుకనుంచీ ముందుకు వెళితే ఆత్మ జ్యోతి మనసుని ప్రకాశింపజేస్తే, మనసు ఇంద్రియాలను ప్రకాశింపజేస్తే, ఇంద్రియాలు బాహ్యంగా ఉన్న జగత్తుని ప్రకాశింపజేస్తాయి. అంటే ఒక్క చైతన్యం అన్నింటినీ ప్రకాశింపజేస్తోంది. అందుకే అది జ్యోతిషాం జ్యోతిః అయింది.

**తద్యదాత్మవిదోవిదుః–** ఎవరు ఆత్మను అధిష్ఠాన జ్యోతిగా తెలుసుకంటారో, వారు ఆత్మనే కాదు బ్రహ్మను తెలుసుకున్నట్టు. బ్రహ్మ జీవాత్మలాగా ఉంది. ఇక్కడ తర్కం చూసారా? ఆత్మను తెలుసుకున్న వ్యక్తి ఆత్మను తెలుసుకున్నట్టు అనలేదు.

**జీవాత్మ విదః పరమాత్మ విదుః**

అని ఉంది. జీవాత్మని తెలుసుకున్నవాడు పరమాత్మను తెలుసుకున్నట్టు అంటోంది. పరమాత్మే చైతన్యజ్యోతిలాగా జీవాత్మలో ఉన్నాడు.

**మంత్రం- 11**

**న తత్ర సూర్యో భాతి న చన్ద్రతారకం**
**నేమా విద్యుతో భాన్తి కుతోఽ యమగ్నిః।**
**తమేవ భాన్తమనుభాతి సర్వం**
**తస్య భాసా సర్వమిదం విభాతి॥**

**ప్రతిపదార్థం:-** తత్ర - అక్కడ; సూర్యః - సూర్యుడు; న భాతి - ప్రకాశించదు; చన్ద్రతారకమ్ - చంద్రుడూ, నక్షత్రాలూ; న- ప్రకాశించవు; ఇమా - ఈ; విద్యుతః - మెరుపులు; నభాన్తి- ప్రకాశించవు; అయమ్ - ఈ; అగ్నిః- అగ్ని; కుతః - ఎక్కడ; భాన్తమ్- ప్రకాశించే; తమ్- దానిని; అనుభాతి- అనుసరించి; సర్వమ్ - అన్ని; భాతి - ప్రకాశిస్తున్నాయి; ఇదం సర్వమ్ - ఈ సమస్తం; తస్యభాసా - ప్రకాశించే; విభాతి ప్రకాశిస్తోంది.

**తాత్పర్యం:-** అక్కడ సూర్యుడు ప్రకాశించలేడు. చంద్రుడు, తారకలు ప్రకాశింపజేయలేవు. మెరుపులు ప్రకాశింపజేయలేవు. ఇంక అగ్ని గురించి ఏం చెప్పాలి? అన్నీ ఆత్మ వల్లే ప్రకాశిస్తున్నాయి.

**వివరణ:-** ఇంకోముఖ్య మంత్రం. శాస్త్రంలో తరచు వచ్చే మంత్రం.

**న తత్ర సూర్యో భాతి న చన్ద్రతారకం**
**నేమా విద్యుతో భాన్తి కుతోఽ యమగ్నిః।**
**తమేవ భాన్తమనుభాతి సర్వం**
**తస్య భాసా సర్వమిదం విభాతి॥ - కఠ 2-2-15**

కఠలో కూడా అక్షరాలా ఇదే మంత్రం ఉంది. ఇంతకు ముందు మంత్రం వల్ల రాగలిగే ప్రశ్నకు జవాబు ఇది. ముందు మంత్రంలో జీవాత్మను తెలుసుకున్నవాడు పరమాత్మను తెలుసుకున్నట్టు అన్నాం. వెంటనే ఉదయించే ప్రశ్న ఆత్మను ఎలా తెలుసుకుంటాను? ఎండోస్కోప్ లైటు ఉన్నట్టు, ఆత్మోస్కోప్ లైటు అంటూ ఏదైనా ఉందా? ఈ స్కోప్ ద్వారా పంచకోశాల్లో ఒక్కొక్క కోశం దాటుకుంటూ వెళితే, లోపల ఏదైనా ప్రకాశవంతమైన కాంతి కనబడుతుందా?

ఆత్మసాక్షాత్కారం అవుతుందా? అర్థం లేని ప్రశ్న. పరమానంద శిష్యుల ప్రశ్నలా ఉంటుంది.

అంతకుముందు ఏమన్నాం? ఆత్మను జ్యోతిషాం జ్యోతి అన్నాం. అంటే ప్రకాశవంతమైనవన్నీ జ్యోతివల్లే ప్రకాశిస్తున్నాయి అన్నాం. ఇప్పుడు మళ్ళీ దాన్ని ఎలా చూస్తాం? అలా అడిగితే చంద్రకాంతి ద్వారా సూర్యకాంతిని చూడటానికి ప్రయత్నించినట్టు ఉంటుంది. చంద్రుడు వెన్నెల కురిపిస్తున్నాడంటే, సూర్యకాంతి వల్లే అని మనకు తెలిసిన విషయమే.

ఇప్పుడు, ఆత్మజ్యోతి విషయానికొస్తే జ్యోతి పదం ఉంది కాబట్టి మనం జ్యోతిలాగా ఇది కూడా ఒక జ్యోతా, ధ్యానంలో కూర్చుంటే ఒక కాంతిలాగా కనబడుతుందా అనుకుంటాం. కాని ఆత్మను ప్రకాశింపజేసే కాంతి లేదు. అందుకే ఈ మంత్రంలో కొన్ని శక్తివంతమైన జ్యోతులను తీసుకోవటం జరిగింది. ఇవి వేరే వాటిని చూపిస్తాయి కాని ఆత్మను చూపలేవు.

**నతత్ర సూర్యోభాతి –** సూర్యకాంతి శక్తివంతమైనది. అన్నింటినీ ప్రకాశింపజేస్తుంది. కాని అక్కడ ప్రకాశించలేదు.

**న చన్ద్ర తారకం –** చంద్రుడు, నక్షత్రాలు కూడా ఆత్మను ప్రకాశింపజేయలేవు. చంద్రుడినే సూర్యుడు ప్రకాశింపజేస్తున్నప్పుడు, చంద్రుడెలా ఆత్మను ప్రకాశింపజేయగలడు?

**నేమా విద్యుతోభాన్తి –** వేలాది మెరుపులు కలిసినా దాన్ని ప్రకాశింపజేయలేవు.

**కుతోఽ యమగ్ని –** అగ్నిమాటో? అగ్ని గురించి చెప్పేదేం ఉంది? దీన్ని కౌముతిక న్యాయం అంటారు.

సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, మెరుపు, అగ్ని – ఈ ఐదూ బాహ్యమైన పంచజ్యోతులు. ఇవే ప్రకాశింపజేయలేనప్పుడు, మనకున్న పంచేంద్రియాలు ఏం చేయగలవు?

**న తత్ర చక్షుః గచ్ఛతి న వాక్ గచ్ఛతి నో మనః। – కేన 1–3**

ఇంద్రియాలే కాదు, మనసు కూడా వెళ్ళలేదు. అంటే ప్రమాణగోచరం కాదు.

మొదటి రెండు పాదాల సారాంశం. ఆత్మను ప్రమాణాలేవీ చూపించలేవు. ధ్యానంలో మనసనే ప్రమాణాన్ని వాడతాము. కాని ఆత్మను దానితో చూడలేము.

అందుకే ఆత్మ అప్రమేయం. సర్వప్రమాణ అగోచరం. ఎందుకు? అన్నీ ఆత్మ వల్లే ప్రకాశించబడుతున్నాయి. ప్రకృతి సూత్రం– ప్రకాశింపజేసేది వేరే దానిచేత ప్రకాశింపబడదు. సూర్యకాంతి కుర్చీని ప్రకాశింపజేస్తోంది. కాని కుర్చీ, కాంతిని ప్రకాశింపజేయలేదు.

**దృగేవ న తు దృశ్యతే। - దృక్ దృశ్యవివేకం**

వేరే ఏవీ ప్రకాశింపజేయలేదు అంటే ఆత్మను ఎలా తెలుసుకుంటాం?

ఆత్మ కర్మ కాదు. ఆత్మ కర్త. ఆత్మ ఆబ్జెక్ట్ కాదు. ఆత్మ సబ్జెక్ట్. ప్రమాణంతో తెలుసుకునే బాహ్యవస్తువు కాదు. ప్రమాణం వెనుకనున్న నేనే.

***ఎవ్వర్ ది ఎక్స్‌పీరియన్సర్, నెవ్వర్ ది ఎక్స్‌పీరియెన్స్‌డ్***

**అనుభవిస్తున్న నేనే ఎప్పటికీ ఆత్మను, అనుభవించబడే వస్తువు ఎన్నటికీ కాదు.**

అందువల్ల ఆత్మ ప్రమాణంకి అటువైపు ఉన్నది కాదు. ప్రమాణాల వెనుక నున్న నేను. ఇప్పుడు ఆత్మ గురించి ముందుచెప్పిన పదాలకు ఆత్మ అన్న మాట తీసి నేను అని కలపాలి.

నేను బ్రహ్మను. నేను విరజం. నేను నిష్కళం. నేను శుభ్రం. నేను జ్యోతిషాం జ్యోతి.

నేను మనసుని ప్రకాశింపజేస్తే, అది ఇంద్రియాలను ప్రకాశింపజేస్తే, అవి బాహ్యప్రపంచాన్ని ప్రకాశింపజేస్తాయి.

అన్నిటి వెనుకా ఉన్నది ఎవరు? దిక్కులు చూడకూడదు. నేను! సుషుప్తిలో శరీరం, ఇంద్రియాలు, మనసు అన్నీ నిద్రపోతాయి. మిగిలేది శుద్ధచైతన్యం మాత్రమే. జాగ్రదావస్థలో మనసు మేలుకుంటుంది. (నేను మేలుకుంటాను అనకూడదు) నేను మనసుని ప్రకాశింపజేస్తే మనసు ఇంద్రియాలను, ఇంద్రియాలు ప్రపంచాన్ని ప్రకాశింపజేస్తాయి. నేను నిర్వికారం. ఈ విషయం జీర్ణమయ్యేవరకూ శ్రవణం చేస్తూనే ఉండాలి.

**తమేవ భాన్తమ్** – తనని తనే ప్రకాశింపజేస్తుంది.

**అనుభాతి సర్వమ్** – అంతటినీ ప్రకాశింపజేస్తుంది. అంటే ఆత్మ స్వ, పర ప్రకాశకం.

**తస్య భాసా** – (మమ వేసుకోవాలి) ఆ (నా) చైతన్యకాంతి వల్లే

**సర్వమిదం విభాతి** – అన్నీ ప్రకాశిస్తున్నాయి. ఉన్నదొకటే కాంతి – జ్యోతిషాం జ్యోతి. ఆ జ్యోతిషాం జ్యోతిని నేనే.

**ప్రత్యేక విశ్లేషణ:– న తత్ర సూర్యోభాతి –** అక్కడ సూర్యుడు ప్రకాశించడు. 'సూర్యుడు ప్రకాశిస్తున్నప్పుడు నక్షత్రాలు మెరవవు,' అన్నట్టన్నమాట. నక్షత్రాల కాంతి మించినది సూర్యకాంతి. అలాగే ఆ జ్యోతిషాం జ్యోతిని సూర్యుడు ప్రకాశింపజేయలేడు. ఇంక చంద్రుడు, నక్షత్రాల సంగతి వేరే చెప్పాలా?

పంచజ్యోతులైన సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, మెరుపు, అగ్నులను చూడటానికి మనకు వేరే జ్యోతి అవసరం లేదు. కాని వీటికి కూడా, అవి ప్రకాశించటానికి వేరే కాంతి కావాలని, ఇక్కడ చెప్తోంది శాస్త్రం. అంటే ఈ జ్యోతి ఈ పంచజ్యోతులకు భిన్నమైనది.

**తమేవ భాన్తమనుభాతి సర్వం –** అది ప్రకాశిస్తే దాని వల్లే అన్నీ ప్రకాశిస్తున్నాయి. ఆ కాంతే జ్యోతిషాం జ్యోతి. భాతి అంటే ప్రకాశిస్తుంది. అనుభాతి అంటే దాని తర్వాత ప్రకాశిస్తుంది. అంతకు ముందు సూర్యుడు కన్నువల్లా, కన్ను మనసువల్లా, మనసు చైతన్యంవల్లా ప్రకాశిస్తున్నాయని చూశాము.

| | | | |
|---|---|---|---|
| సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు | – అనుభాతి | కన్ను | – భాతి |
| కన్ను (ఇంద్రియాలు) | – అనుభాతి | మనసు | – భాతి |
| మనసులో ఆలోచనలు | – అనుభాతి | చైతన్యం | – భాతి |

ఇంకోచోట ఈ బోధను గురుశిష్యుల సంవాదంగా బోధించారని పూజ్యస్వామీజీ చెపుతారు.

**కిం జ్యోతిస్తవ? భానుమానహని మే రాత్రౌ ప్రదీపాదికమ్,**
**స్యాదేవం రవిదీపదర్శనవిధౌ కిం జ్యోతిరాఖ్యాహి? మే।**
**చక్షుస్తస్య నిమీలనాది సమయే కిం? ధీర్ధియో దర్శనే**
**కిం? తత్రాహమతో భవాన్ పరమకం, జ్యోతిస్తదస్మి ప్రభో!॥**

గురువు – ఏ జ్యోతి వల్ల నువ్వు వస్తువులను చూస్తున్నావు?

శిష్యుడు – నా కళ్ళనే జ్యోతి వల్ల.

గురువు – నీ కళ్ళు మూసుకున్నప్పుడు ఏ జ్యోతివల్ల చూస్తున్నావు?

శిష్యుడు – నా మనసనే జ్యోతి వల్ల.

గురువు – మనసు నిద్రపోయినప్పుడు ప్రకాశించే జ్యోతి ఏది?

శిష్యుడు – అది ఆత్మ చైతన్యం గురువు గారూ. నేనే ఆ ఆత్మ చైతన్యాన్ని.

బ్రహ్మ సత్యం. అందువల్ల దాని కాంతి స్వయం ప్రకాశకం. దేని మీదా ఆధారపడదు.

**అనుభాతి –** ఆత్మ ప్రకాశిస్తుంటే సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు దాని వల్ల ప్రకాశిస్తున్నాయి. అనుభాతి అంటే మిథ్య అయితీరనక్కరలేదని వాదించవచ్చు కొందరు. ఉదాహరణకు రామగచ్ఛతి, లక్ష్మణ అనుగచ్ఛతి అన్న వాక్యం తీసుకుంటే రాముడు వెళ్తున్నాడు, లక్ష్మణుడు వెనుక వెళుతున్నాడు అని అర్థం. కాని లక్ష్మణుడు మిథ్య కాదు. రాముని వెనుక వెళ్ళటానికి లక్ష్మణుడు నిశ్చయించుకున్నాడు అంతే. అనుగచ్ఛతి ఎలా మిథ్య కాదో, అనుభాతి కూడా మిథ్యకాదు అని వాదించవచ్చు కాని అది నిజం కాదు. ఎందుకంటే గచ్ఛతి, అనుగచ్ఛతి. ఒకే సత్యానికి చెందినవి. కాని భాతి, అనుభాతి ఒకే సత్యానికి చెందినవి కాదు. అందుకని ఆ జ్యోతి స్వయంప్రకాశకం. అది లేకపోతే తక్కినవాటికి ప్రకాశించే శక్తి లేదు.

ఆధ్యాత్మ స్థాయిలో అంటే వ్యష్టిపరంగా తీసుకుంటే కన్నుకు అధిష్ఠాన దేవత సూర్యుడు. మనసుకు అధిష్ఠాన దేవత చంద్రుడు. వాక్కుకు అధిష్ఠాన దేవత అగ్ని. వాక్కు, మనసు, కన్ను (ఇంద్రియాలు) బ్రహ్మను వర్ణించలేవు.

**యద్వాచాఽ నభ్యుదితం యేన వాగభ్యుద్యతే ।**
**తదేవ బ్రహ్మ త్వం విద్ధి నేదం యదిదముపాసతే ॥ కేన 1–4**
**యన్మనసా న మనుతే యేనాఽ ఽ హుర్మనో మతమ్ ।**
**తదేవ బ్రహ్మ త్వం విద్ధి నేదం యదిదముపాసతే ॥ కేన 1–5**
**యచ్చక్షుషా న పశ్యతి యేన చక్షూంషి పశ్యతి ।**
**తదేవ బ్రహ్మ త్వం విద్ధి నేదం యదిదముపాసతే ॥ కేన 1–6**

వాక్కు చెప్పలేదు కాని దాని వల్లే మాట్లాడగలుగుతోంది. మనసు వర్ణించలేదు కాని దానివల్లే మనసు పనిచేస్తోంది. కన్ను చూడలేదు కాని దానివల్లే కన్ను అన్నీ చూస్తోంది.

**న తత్ర సూర్యో భాతి** … ఈ మంత్రాన్ని హారతి ఇచ్చేటప్పుడు పఠిస్తారు. దీని అర్థం, 'ఓ దేవా! నా చేతిలో ఉన్న, క్షణం మాత్రం వెలిగే ఈ చిన్న కర్పూర కాంతి నిన్ను ప్రకాశింపజేస్తుందనుకోను. దీని ద్వారా నేను నా బుద్ధిని వెలిగిస్తున్నాను. ఎందుకంటే బుద్ధి ద్వారానే నిన్ను తెలుసుకోగలనని తెలుసుకున్నాను. ఆ బుద్ధి ద్వారా, నీ అనుగ్రహం వల్ల, నా గురువు బోధ వల్ల తత్ త్వం అసి అని నేను గ్రహించుగాక.'

## మంత్రం - 12

**బ్రహ్మైవేదమమృతం పురస్తాద్**
**బ్రహ్మ పశ్చాద్ బ్రహ్మ దక్షిణతశ్చోత్తరేణ।**
**అధశ్చోర్ధ్వం చ ప్రసృతం**
**బ్రహ్మైవేదం విశ్వమిదం వరిష్ఠమ్ ॥**

**ప్రతిపదార్థం:-** ఇదమ్ - ఈ; పురుస్తాత్ - ముందు; పశ్చాత్ - వెనుక; దక్షిణతః - కుడిపక్క; ఉత్తరేణ - ఎడమపక్క; అథః - కింద; ఊర్ధ్వమ్ - పైన; ప్రసృతమ్ - సర్వత్; విశ్వమ్ - జగత్తు; వరిష్ఠమ్ - సర్వోత్క్రృష్టమైన; అమృతమ్ - అమరమైన; బ్రహ్మ ఏవ- బ్రహ్మ ఒక్కటే.

**తాత్పర్యం:-** ముందు, వెనుక, కుడిపక్క, ఎడమపక్క, క్రింద, పైన అంతటా ఉన్నది సర్వోత్కృష్టమైన, అమరమైన బ్రహ్మ ఒక్కటే.

**వివరణ-** ముందు మంత్రాన్ని జీర్ణం చేసుకునే లోపే ఇంకో లోతైన సందేశం. ఈ మంత్రాల గురించి నెలలు, సంవత్సరాలు గడపవచ్చు.

ముందు మంత్రం (11వ మంత్రం) ఆత్మ ఆబ్జెక్ట్ కాదు. తెలుసుకోబడే వస్తువు కాదు. తెలుసుకోవటానికి ప్రయత్నించే నువ్వే అంటోంది.

**మొదటి గెంతు - నేను = ఆత్మ.**

సరే నేను ఆత్మను అని ఒప్పుకున్నా కూడా, అంతకు ముందు మంత్రం (10వ మంత్రం) ఆత్మను తెలుసుకున్న వాడు బ్రహ్మను తెలుసుకున్నట్టు అంది.

ఎ = బి; బి = సి; అందువల్ల ఎ = సి సూత్రం ప్రకారం

నేను = ఆత్మ; ఆత్మ = బ్రహ్మ; అందువల్ల నేను = బ్రహ్మ

అంటే మనచేత రెండో గెంతు గెంతిస్తోంది.

**రెండవ గెంతు - నేను = బ్రహ్మ.**

ఈ గెంతు గెంతితే సరిగా నిల్చోలేము అనుకుంటే ఇక్కడ ఇంకో పెద్ద గెంతు గెంతిస్తోంది. ముందు ఖండంలో (ముందు మంత్రంలో కాదు) బ్రహ్మ జగత్కారణం అంది. మళ్ళీ వరుసగా చూసుకుంటూ పోతే తేలేది ఏమిటి?
నేను = జగత్కారణం.

నేను = ఆత్మ; ఆత్మ = బ్రహ్మ; బ్రహ్మ = జగత్ కారణం, అందువల్ల నేను = జగత్‌కారణం.

నేను అన్నప్పుడల్లా ఆ నేను ఎవరన్నది మర్చిపోకూడదు. నేను శరీరం కాదు. ఇంద్రియాలు కాదు. మనసు కాదు. నేను అంటే ఆత్మ. అంటే నేను = జగత్ కారణం.

**మూడవ గెంతు – నేను = జగత్ కారణం.**

హే గురో ఇదంతా నాకు కొరుకుడు పడటం లేదు అంటే నువ్వు స్వప్నప్రపంచంలో చేస్తున్నది అదే అంటోంది. స్వప్నంలో ఉన్నంతసేపూ అది నువ్వు సృష్టించిందని తెలియదు. స్వప్నంలోంచి లేచాకే తెలుస్తుంది. అలాగే జాగ్రత్ ప్రపంచం ఇంకో కలలాంటిది.

ఇంకా మన గెంతులు పూర్తికాలేదు. మోకాళ్ళ నెప్పితో నడవటమే కష్టమైన మనను ఏకంగా పెద్ద గెంతులే గెంతిస్తోంది ఉపనిషత్తు.

అన్ని కార్యాలూ, కారణానికి నామరూపాలు. అంటే కారణమే కార్యంగా భాసిల్లుతోంది. బంగారమే నామరూపాలున్న ఆభరణాలుగా భాసిల్లుతోంది. ఉన్నదంతా ఒకటే. ద్వితీయం ఉంటేనే భయం. ద్వితీయం లేకపోతే దేన్ని చూసి భయం? అంటే జగత్కారణం కార్యమంతటా ఉంది.

**నాలుగవ గెంతు – నేను = కార్యమంతటా భాసిల్లుతున్న జగత్కారణం**

ఇప్పుడు మంత్రంలోకి వెళ్దాము.

**బ్రహ్మైవేద మమృతం పురస్తాత్ –** కారణం బ్రహ్మ అయిన నేనే ముందున్న జగత్తు.

**బ్రహ్మ పశ్చాత్ –** కారణ బ్రహ్మ అయిన నేనే వెనుకనున్న జగత్తు.

**బ్రహ్మ దక్షిణతశ్చోత్తరేణ –** దక్షిణం వైపు, ఉత్తరం వైపు.

**అధ శ్చోర్ధ్వం చ ప్రసృతమ్ –** నేనే పైనా, కిందా, సర్వత్రా

**బ్రహ్మైవేదం విశ్వమిదం వరిష్ఠమ్ –** ఒక్కముక్కలో చెప్పాలంటే మొత్తం జగత్తులో నేనే శ్రేష్ఠమైన బ్రహ్మగా నెలకొని ఉన్నాను.

మొదటి పాదంలో అమృతం అనీ, ఆఖరిపాదంలో వరిష్ఠం అనీ వచ్చింది. రెండూ బ్రహ్మకు విశేషణాలు. అనేకం, అనిత్యం, అసారం, అసత్య ప్రపంచం అంతటా ఏకం, నిత్యం, సారం, సత్యమైన కారణం ఉంది. ఆ కారణం నేనే.

పై దశలన్నీ కలిపి ఒకసారి చూస్తే –

నేను = ఆత్మ; ఆత్మ = బ్రహ్మ; బ్రహ్మ =జగత్కారణం;
జగత్కారణం = జగత్ కార్యమంతటా.

అందువల్ల జగత్కారణం బ్రహ్మనైన నేను (శరీరం, ఇంద్రియాలు, మనసు కాదు, ఆత్మను) జగత్తు అనే కార్యమంతటా భాసిల్లుతున్నాను.

ఏక,నిత్య,సార, సత్య కారణం నేను అనేక, అనిత్య, అసార, అసత్యకార్య ప్రపంచం అంతటా ఉన్నాను.

**ప్రత్యేక విశ్లేషణ:–** ముందు ముండకంలో ఆఖరి మంత్రంలో పురుష వేదం విశ్వం – అని వచ్చింది. ఇక్కడ ఉన్నదంతా పురుషుడే. ఇక్కడ –'బ్రహ్మైవేదం' అని వచ్చింది. ఇక్కడ ఉన్నదంతా బ్రహ్మనే. అంటే పురుషుడు, బ్రహ్మ ఒకటే.

పైన, కింద, ఉత్తరం, దక్షిణం, ముందు, వెనుక అనటం వల్ల ఆరు దిక్కులను సూచిస్తోంది. ఈ ఆరు దిశల్లో ఉన్నదీ, దిక్కుల మధ్యలో ఉన్నదీ కూడా బ్రహ్మే. ఇంకో మాటలో చెప్పాలంటే అనేక విధాలుగా కనబడుతున్న ఈ జగత్తంతా బ్రహ్మే. చూసినదీ, విన్నదీ, ప్రత్యక్షంగా తెలుసుకున్నదీ, పరోక్షంగా తెలుసుకున్నదీ, ఉందని తెలిసిన ప్రతీదీ బ్రహ్మే.

వస్తువులు – తెలిసినవీ, తెలియనివీ. అన్నింటినీ కలిపి విశ్వం అంటారు.
స్థూలశరీరం, దానికుండే లక్షణాలు – పొడుగు, లావు వగైరా;
దానికి జరిగే మార్పులు – పెరగటం, వృద్ధాప్యం, మరణం, ప్రాణం;
దానికుండే లక్షణాలు – ఆకలిదప్పులు;
ఇంద్రియాలు, వాటికుండే లక్షణాలు – శబ్ద,స్పర్శ,రూప, రస, గంధాలు;
మనసు – దానిలో రేగే ఆలోచనలు, జ్ఞాపకాలు, రాగద్వేషాలు, కోరికలు, అన్నీ వస్తాయి ఇందులో. అన్నీ బ్రహ్మే. ఎలా?

**బ్రహ్మైవేదం –** అంతా బ్రహ్మే. ఈ వాక్యంలో సమానాధికరణ్యం ఉంది బ్రహ్మకూ, ఇదంకూ మధ్య. ఇదం అంటే జగత్తు. అందువల్ల జగత్తు బ్రహ్మతో

సమానం. ఎప్పుడు సమానమవుతుంది? జగత్తు నుంచి నామరుపాలను తీసివేస్తే మిగిలేది సత్ చిత్ ఆనంద బ్రహ్మ.

మనం ఏం చేసినా, ఏం చూసినా, ఏం తిన్నా, ఏం ఆలోచించినా, సత్ – చిత్ – ఆనందం ఎప్పుడూ ఉంటుంది. జాగ్రత్, స్వప్నావస్థలలో సత్ చిత్ ఆనందం + మనసూ + ఏదో ఒక వస్తువూ ఉంటూనే ఉంటాయి. ఆ 'ఏదో ఒక వస్తువు' అన్నది మారుతూ ఉంటుంది. సుషుప్తిలో మనసు పనిచేయదు కాబట్టి, అక్కడ మనం సత్ చిత్ ఆనందం + ఆలోచనలు లేని మనసు. అందువల్ల మనం ఎప్పటికీ **సత్ చిత్ ఆనందం.** బ్రహ్మే అనేక నామరూపాలతో కనబడుతున్నాడు. అందుకని ఉన్నదంతా బ్రహ్మే.

నామరూపాలు బ్రహ్మ సహజలక్షణాలు కావు. అవి బ్రహ్మ మీద ఆరోపించబడినవి. తాడు మీద పాముని ఆరోపించినట్టుగా. నామరూపాలు వ్యావహారిక సత్యం. బ్రహ్మ పారమార్థిక సత్యం.

# తృతీయ ముండకం

## ప్రథమ ఖండం

### మంత్రం - 1

**ద్వా సుపర్ణా సయుజా సఖాయా సమానం వృక్షం పరిషస్వజాతే।**
**తయోరన్యః పిప్పలం స్వాద్వత్తి అనశ్నన్ అన్యః అభిచాకశీతి ॥**

**ప్రతిపదార్థం:-** ద్వా - రెండు; సుపర్ణాః - పక్షులు; సయుజా - కలిసి తిరుగుతున్నాయి; సఖాయా - ఒకే విధంగా ఉన్నాయి; సమానం వృక్షమ్ - ఒకే చెట్టుమీద; పరిషస్వజాతే - ఉంటున్నాయి; తయోః - ఆ రెండింటిలో; అన్యః - ఒకటి; పిప్పలమ్ - పండును; స్వాద్వత్తే - ఆస్వాదిస్తూ; అత్తి - తింటోంది; అన్యః - ఇంకోటి; అనశ్నన్ - తినకుండా; అభిచాకశీతి - చూస్తూ ఉంది.

**తాత్పర్యం:-** ఎప్పుడూ కలిసి తిరిగే, ఒకే విధమైన రెండు పక్షులు ఒక చెట్టు మీద కూర్చుని ఉన్నాయి. వాటిలో ఒకటి పిప్పలం పండును ఆస్వాదిస్తూ తింటోంది. ఇంకోటి తినకుండా చూస్తోంది.

**వివరణ:-**ఈ ఖండంలో మొదటి మూడు మంత్రాల్లో జీవాత్మ పరమాత్మ ఐక్యాన్ని సూచిస్తోంది ఉపనిషత్తు. దానికి ఒక దృష్టాంతం తీసుకుంది. ఒక పెద్ద చెట్టు మీద రెండు పక్షులు కూర్చుని ఉన్నాయి. ఒక పక్షి తింటోంది. రెండోది తినకుండా, సాక్షీభూతంగా చూస్తోంది. అంటే తినే పక్షి ఒకటి, గమనించే పక్షి ఒకటి అన్నమాట.

**ద్వా సుపర్ణా సయుజా సఖాయా -** రెండు పక్షులు మెరిసే రెక్కలతో ఉన్నాయి. అవి సన్నిహితంగా కలిసి తిరుగుతున్నాయి.

**సమానం వృక్షం పరిషస్వజాతే -** ఒకే చెట్టుమీద ఉన్నాయి.

**తయోరన్యః పిప్పలం స్వాద్వత్తి -** అందులో ఒకటి ఆస్వాదిస్తూ తింటోంది.

**అనశ్నన్ అన్యో అభిచాకశీతి -** ఇంకోటి తినకుండా చూస్తోంది.

వేదాంతానికి ఈ దృష్టాంతాన్ని అన్వయిస్తే –

| | |
|---|---|
| చెట్టు | – స్థూలశరీరం |
| అనేక శాఖలు | – అనేక అంశాలు, అందులో మనసు ఒకటి. |

సాక్షిచైతన్యం స్వభావం ఏమిటి? అది శుద్ధ చైతన్యం. దానికి 5 లక్షణాలు చూసాము. వాటిని మళ్ళీ చూద్దాము.

1. చైతన్యం, శరీరంలో ఒక భాగం కాని, లక్షణం కాని, దాని నుంచి ఉత్పత్తి అయిన వస్తువుగాని కాదు.
2. చైతన్యం స్వతంత్ర వస్తువు. అది శరీరం అంతటా వ్యాపించి, దాన్ని ప్రకాశింపచేస్తుంది.
3. చైతన్యం, శరీరం సరిహద్దులకే పరిమితమవలేదు.
4. చైతన్యం, శరీరం నాశనమయితే నాశనమవదు. తదనంతరం కూడా చైతన్యం ఉంటుంది.
5. చైతన్యం, శరీరం లేకపోయినా ఉంటుంది కాని కనబడదు. దాన్ని ప్రతిబింబింపచేసే మాధ్యమం లేదు కాబట్టి అది కనిపించదు. అంతమాత్రాన చైతన్యం లేనట్టు కాదు.

అహంకారం లక్షణం ఏమిటి? జడం. అహంకారం మనసుకి ఉన్న పేరు. ఎటువంటి మనసు? సూక్ష్మ పంచభూత కార్యం. అందువల్ల జడం. కాని అది జడమైనా ప్రతిబింబింపజేయగలదు. అద్దం జడం అయినా సూర్యకాంతిని ప్రతిబింబింపచేసినట్టుగా, మనసు జడం అయినా శుద్ధ చైతన్యాన్ని ప్రతిబింబింపజేయగలదు. అలా ఏర్పడిన ప్రతిబింబాన్ని చిదాభాస అంటారు. అలా అచేతన మనసు చేతనం పొందింది. అది అహంకారం అయింది. ఇప్పుడు మళ్ళీ చూస్తే – ఒక శరీరంలో రెండు ఉన్నాయి. ఏమిటవి?

**1. సాక్షిచైతన్యం – శుద్ధ చైతన్యం – ఉన్నత స్థాయి నేను**
**2. అహంకారం – ప్రతిబింబ చైతన్యం – తక్కువ స్థాయి నేను**

ఈ రెండింటిలో సాక్షిచైతన్యం ఏమీ చేయదు. అది అకర్తా, అభోక్తా. దానికి కర్మఫలం అంటదు. అందువల్ల సంచిత, ప్రారబ్ధ, ఆగామి కర్మలు కూడా దానికి అంటవు. ఒక్క ముక్కలో చెప్పాలంటే పుణ్యపాపాలు అంటవు.

అందువల్ల సుఖదుఃఖాలు లేవు. అందువల్ల నిత్యముక్త. ఇది ఉన్నత స్థితిలో ఉన్న నేను పరిస్థితి.

తక్కువ స్థితిలో ఉన్న నేను పరిస్థితి ఏమిటి? ఉన్నత స్థితిలో ఉన్న నేను ఏమీ చేయకపోతే, తక్కువ స్థితిలో ఉన్న నేను ఎప్పుడూ ఏదో చేస్తూనే ఉంటుంది. అనేక కర్మలు చేస్తూనే ఉంటుంది. ఆలోచనల ద్వారా మానసకర్మలు, వాక్కు ద్వారా వాచిక కర్మలు, శరీరం ద్వారా కాయిక కర్మలు చేస్తూనే ఉంటుంది. అందువల్ల అది కర్తా, భోక్తా అయింది. కర్తా, భోక్తా అయితే కర్మఫలం వస్తుంది. పుణ్యపాపాలు కలుగుతాయి. దానివల్ల సుఖదుఃఖాలను భరిస్తూ, మూడు బ్యాంక్ ఎకౌంట్లు పోగేసుకుంటుంది. ఏమిటవి? సంచిత, ప్రారబ్ధ, ఆగామి కర్మలు. వాటిని క్షయం చేయటానికి మళ్ళీ ఇంకో స్థూలశరీరంతో ఇంకో జన్మనెత్తుతుంది.

మళ్ళీ టూకీగా సాక్షిచైతన్యానికి, అహంకారానికి మధ్యనున్న భేదాన్ని చూద్దాము.

| **సాక్షిచైతన్యం** | **అహంకారం** |
|---|---|
| అకర్తా, అభోక్తా | కర్తా, భోక్తా |
| అసంగం | ససంగం |
| సర్వవ్యాపకం | శరీరం వరకు పరిమితం |
| నిత్యముక్తం | పునరపి జననం, పునరపి మరణం |
| అవ్యవహారి | వ్యవహారి |

అజ్ఞాని జీవి తన స్వరూప అజ్ఞానంతో పుట్టాడు. తనకొక ఉన్నతమైన సాక్షి స్వభావం ఉందని తెలియదు. తనను సాక్షి చైతన్యం అనుకోడు. అహంకారం అనుకుంటాడు. అందుకే కర్తా, భోక్తా అనుకుంటాడు. సుషుప్తిలో అహంకారం లయమయి, ఆనందమే మిగులుతుంది. ఇది మన అసలు ఆనందానికి చిహ్నం. అందుకని ఉపనిషత్తు మనను ప్రశ్నిస్తోంది. అహంకారం ఎన్నుకుంటావా, సాక్షిచైతన్యాన్ని ఎన్నుకుంటావా? నిర్ణయం నీ చేతిలో ఉంది. అహంకారాన్ని ఎన్నుకుంటే సంసారచక్రంలో పడి కొట్టుమిట్టాడాల్సిందే. సంసారం అంటే ఏమిటో రెండవ మంత్రంలో సూచిస్తోంది.

**ప్రత్యేక విశ్లేషణ: –** శరీరాన్ని వృక్షంతో పోల్చారు. పెద్ద వృక్షాన్ని కొట్టివేసినా, అది మళ్ళీ పెరుగుతుంది. అలాగే ఈ శరీరం రాలిపోయినా, జీవి మళ్ళీ ఇంకో జన్మనెత్తాలి. చెట్టు మళ్ళీ పెరగకూడదంటే దాన్ని కూకటివేళ్ళతో సహా పెకలించాలి. సంసారంలో మళ్ళీ కొట్టుమిట్టాడకూడదంటే, ఈ సంసార వృక్షాన్ని కూకటివేళ్ళతో పెకలించాలి. అది ఎలా చేయాలో శాస్త్రం చెబుతుంది.

**అభిచాకశీతి –** రెండో పక్షి తిననప్పుడు, ఎందుకు అక్కడ కూర్చుని ఇంకో పక్షి తినటాన్ని గమనిస్తోంది? ఎందుకంటే, ఈ పక్షి లేకపోతే, మొదటి పక్షి తినలేదు. దీనికి కొన్ని ఉదాహరణలున్నాయి. రాజు తను ఏమీ చేయడుకాని, ఆయన సమక్షంలోనే రాజ్యంలో అందరూ క్రమశిక్షణతో పనిచేస్తారు. అయస్కాంతం తను కదలకుండా, ఇనుపముక్కలను తనవైపుకి ఆకర్షించుకుంటుంది. అలాగే ఆత్మ తను ఏమీ చేయదు కాని దాని సమక్షంలో జీవుడు అనేక పనులు చేసి, అనేక ఫలాలను పొందుతాడు.

మనసులో ఉన్న ప్రతిబింబ చైతన్యాన్ని జీవుడంటారు. అది మిథ్య. బింబచైతన్యాన్ని ఈశ్వరుడంటారు. అది సత్యం. సత్యం లేకుండా మిథ్యకు ఉనికి లేదు. అందుకే సయుజా అన్నారు. అవి రెండూ కలిసి ఉన్నాయి.

రెండు పక్షులను చెప్పటానికి ఇంకో కారణం కూడా ఉంది. మిథ్య రజ్జుసర్పభ్రాంతి లాంటిది కాదు. కుండ–మట్టి లాంటిది. రజ్జుసర్ప భ్రాంతిలో అక్కడున్నది పాము కాదు, తాడు అని తెలిసాక, పాము మాయమవుతుంది. కాని కుండ–మట్టి విషయంలో మట్టి సత్యం, కుండ మిథ్య అని తెలుసుకున్నాక కూడా కుండ ఉంటుంది. కుండ 'ఉన్నట్టుగా' ఉంటుంది.

రెండు పక్షుల దృష్టాంతం ఇవ్వటం వల్ల కొత్త సిద్ధాంతానికి అవకాశం ఇచ్చినట్టయింది. దేవుడు తన స్థానంలో కూర్చుని అందరినీ గమనిస్తున్నాడు. ఆయన కళ్ళు కప్పి మనం ఏం చేయలేము. మన మీద ప్రేమతోనే మనను గమనిస్తున్నాడు, అనుకుంటారు కొందరు. కాని ఇక్కడున్నదంతా బ్రహ్మే అని ఇంతకుముందు మంత్రంలోనే శాస్త్రం స్పష్టంగా చెప్పింది.

అంత స్పష్టంగా చెప్పినా కొందరు ఈ దృష్టాంతం ద్వారా భేద భావననే చూపుతారు. జీవ, ఈశ్వర ఐక్యం అంతకు ముందు అధ్యాయంలోనే చెప్పింది శాస్త్రం. ఒకటే అద్వైత ఆత్మను రెండు పక్షులుగా చూపించటంలోని అర్థం, జీవి గురించి తెలుసుకుని, జీవత్వభావనను జ్ఞానం ద్వారా పోగొట్టుకోవాలని. అందుకని ఇలాంటి అపోహలకు తావివ్వకుండా శాస్త్రాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి.

## మంత్రం - 2

**సమానే వృక్షే పురుషో నిమగ్నోఽ నీశయా శోచతి ముహ్యమానః।**

**జుష్టం యదా పశ్యత్యన్యమీశమస్య మహిమానమితి వీతశోకః॥**

**ప్రతిపదార్థం:–** సమానే వృక్షే – ఒకే చెట్టుమీద; పురుషః – మనిషి, నిమగ్నః – మునిగిపోయి; అనీశయా– అజ్ఞానం వల్ల; ముహ్యమానః – భ్రాంతి చెంది; శోచతి – దుఃఖిస్తున్నాడు; జుష్టమ్ – ఆరాధనీయమైన; అన్యమ్ – మరొక; ఈశమ్ – పరమాత్మను; అస్య– దాని; మహిమానమ్ – మహిమను; యదా పశ్యతి – ఎప్పుడు చూస్తాడో; వీతశోకః ఇతి – దుఃఖాల నుంచి విడివడతాడు.

**తాత్పర్యం:–** ఒకే చెట్టుమీద జీవాత్మ, పరమాత్మ ఉన్నారు. మనిషి అజ్ఞానంలో మునిగిపోయి, భ్రాంతి చెంది దుఃఖిస్తున్నాడు. ఆరాధనీయమైన పరమాత్మనూ, అతని మహిమనూ ఎప్పుడు చూస్తాడో అప్పుడు దుఃఖాల నుంచి విడివడతాడు.

**వివరణ:–** చాలా అందమైన, చాలా ముఖ్యమైన మంత్రం. నాలో రెండు ఉన్నాయి. సాక్షి చైతన్యం, అహంకారం. నేను జాగ్రదావస్థలో అహంకారమనే కోటు వేసుకున్నాను. ప్రపంచంతో వ్యవహారం నడుపుతున్నాను. నిద్రావస్థలో మనసు, చిదాభాస, అహంకారం తాత్కాలికంగా లయం చెందుతున్నాయి. అహంకారంకోటు ఉంటేనే సంసారం.

**అహంకార సత్త్వే సంసార సత్త్వమ్।**

**అహంకార అభావే సంసార అభావః।**

**తస్మాత్ అహంకారః ఏవ సంసారస్య కారణః॥**

అంతమాత్రాన అహంకారాన్ని నాశనం చేయమనటం లేదు వేదాంతం. టీవీని ఎప్పుడు చూడాలో, ఎప్పుడు ఆపాలో తెలిసినట్టుగా మనం అహంకారం అనే మీటను ఎలా ఆపాలో తెలుసుకోవాలి. వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారా అహంకారం అనే మీటని ఆపి, ఉన్నత స్థితిలో ఉన్న నేనుకి రావాలి. ఐదవ సూత్రం గుర్తుంచుకోండి. అది ఉన్నత స్థితిలో ఉన్న నేనుకు ఎదిగితే జీవితం ఆనందమయం. మర్చిపోతే దుఃఖమయం.

ఇప్పుడు మంత్రంలోకి వద్దాము. మంత్రం మొదటి భాగం నేను అహంకారంగా సంసారిని అని చూపిస్తే, రెండవభాగం నేను సాక్షిచైతన్యంగా నిత్యముక్తను అని వివరిస్తోంది.

**పురుషః –** మనిషి. మనిషే ఎందుకు? జంతువులకు సంసారం, ఈ మోక్షం లాంటి విషయాలు తెలియవు. సమస్య ఏమిటి?

**ముహ్యమానః –** అజ్ఞానం వల్ల భ్రాంతి చెంది నేను అహంకారం అనుకుంటాడు.

**అనీశయా –** నిస్సహాయుడు. ఇది చాలా శక్తివంతమైన పదం. నిస్సహాయత నుంచి నిరాశానిస్పృహలు వస్తాయి. ఈ నిస్సహాయత అనేకవిధాలుగా ఉంటుంది. శరీరపరంగా వచ్చే సమస్యలు కొన్ని. కొంతమందికి చిన్నప్పుడే జుట్టు తెల్లబడిపోతుంది. రంగు వేసుకుంటే పంచరంగుల్లోకి మారుతుంది. కుటుంబపరంగా వచ్చే సమస్యలు కొన్ని. పిల్లలు చెప్పిన మాట వినరు. రాగద్వేషాలలో మునిగి తేలుతుంటాము. నన్ను ఎవరూ అర్థం చేసుకోరు అని వాపోతుంటాము. ఆ మాటకొస్తే దేవుడు కూడా నన్ను సరిగ్గా అర్థం చేసుకోరు అంటున్నట్టే ఉంటుంది.

**మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే। – గీత 7–3**

ఆస్తి ఉంటే ఒక సమస్య. లేకపోతే ఇంకో సమస్య. అలా పంచ అనాత్మలతో బంధకత్వం పెంచుకుంటాము. ఏమిటవి? శరీరం, మనసు, కుటుంబం, ఆస్తి, వృత్తి. వీటినుంచి బయటపడే మార్గం లేక ఏ గురువునో పట్టుకుని నన్ను దీవించకపోయినా, నా మనవడిని దీవించండి అంటాము.

**వృక్షే నిమగ్నః –** చెట్టులో నిమగ్నమవుతాము అంటే స్థూలశరీరంతో బంధం పెంచుకుని, తద్వారా ఈ పంచ అనాత్మతో బంధం పెంచుకుంటాము. అందువల్ల నిస్సహాయంగా మారతాము.

**శోచతి –** అందువల్ల దుఃఖం. ఒక సమస్య తరువాత ఇంకో సమస్య తలెత్తుతూనే ఉంటుంది. అలల్లాగా వస్తూనే ఉంటాయి. ఒక అతను సముద్రపుటొడ్డున అలా కూర్చునే ఉన్నాడుట. ఎందుకని అడిగితే, అలలు ఆగాక స్నానం చేద్దామనుకుంటున్నానన్నాడట. అలలు ఆగేనా? మన కర్మఫలం అలా కొనసాగుతూనే ఉంటుంది. ఈ జన్మ ముగిస్తే ముగియదు. మరు జన్మలో ఎలా పుడతామో తెలియదు.

ఒక కోతి వేరుశెనగలు తినేస్తోందని, ఒక దుకాణదారు ఒక సన్నమూత ఉన్న సీసాలో వాటిని పోశాడు. కోతి అరచేతి నిండా వాటిని తీసుకుంది. కాని గుప్పిట మూస్తే చేయి బయటకి రావటం లేదు. అది ఒక పక్క అవస్థ పడుతుంటే, దుకాణదారు వచ్చి దాన్ని కొట్టటం మొదలుపెట్టాడు. అది గుప్పిట వదిలితే

తప్పించుకోవచ్చు కాని అలా చేయటం లేదు. దాన్ని చూచి నవ్వుతాం కాని, మనం చేస్తున్నది కూడా అదే. మనం ఆ వేరుశెనగల లాంటి అహంకారాన్ని పట్టుకు పాకులాడి, కర్మఫలం అనే యజమాని చేత దెబ్బలు తింటున్నాము. ఎక్కడో కొందరు మాత్రమే కర్మల గురించి విచారణ చేస్తున్నారు.

**పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో**
**నిర్వేదమాయాత్ నాస్త్యకృతః కృతేన।**
**తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్**
**సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్॥ –ముండకం 1.2.12**

మోక్షం కావాలంటే అహంకారాన్ని మెరుగుపరచలేము. వేరుశెనగలు వదలాల్సినట్టుగా, అహంకారాన్ని వదలాలి. అహంకారాన్ని వదిలి ఉన్నతస్థితిలో ఉన్న నా స్వరూపం వైపు తిరగాలి. రెండో భాగంలో పరిష్కారం ఉంది.

**యదా పశ్యత్యన్యమ్ –** ఉన్నతస్థితిలో ఉన్న నేను ఏమిటి? అది సాక్షిచైతన్యం. అకర్తా, అభోక్తా, ఆనంద స్వరూపం.

**జుష్టమ్ –**అది ఆరాధనీయమైనది.

**పశ్యతి–** దాన్ని కనుగొంటాడు. దయానంద సరస్వతి స్వామి ఈ భూమ్మీద మన జీవితం నాటకంలో వేసే పాత్రలాంటిది అంటారు. పాత్ర నేను అనుకుంటేనే కష్టం. అది గ్రహించినతను సాక్షిచైతన్యాన్ని కనుగొంటాడు.

ఈ విషయం చదివి (విని) అక్కడికక్కడే వదిలేసి, మళ్ళీ అహంకారాన్నే పట్టుకుంటే మళ్ళీ శోకమే మిగులుతుంది.

**ఈశమస్య మహిమానం –** పరమాత్మ యొక్క మహిమని చూస్తాడు. విభూతి యోగంలో వివరంగా వస్తుంది.

ఇక్కడితో ఆగకూడదు. జ్ఞాని పరమాత్మ మహిమ అనడు, నా మహిమ అంటాడు. ఇది చాలా ముఖ్యం. ఆ భగవంతుడు, ఆ సాక్షి చైతన్యం నా ఉన్నత స్థాయి. అది నేను. నేను అంతటా నా మహిమను వీక్షిస్తున్నాను.

**వీతశోకః –** ఎప్పుడైతే ఇది గ్రహిస్తామో ఇంక శోకం అన్నమాట ఉండదు. అంతకుముందు, మన శోకాల పట్టిక రాయమంటే 300 పుటలు నింపేయగలము. ఇప్పుడు జగత్తును నవరసాలున్న నాటకంలా చూసి ఆనందించగలుగుతాము.

## మంత్రం – 3

**యదా పశ్యః పశ్యతే రుక్మవర్ణం**
**కర్తారమీశం పురుషం బ్రహ్మయోనిమ్।**
**తదా విద్వాన్ పుణ్యపాపే విధూయ**
**నిరంజనః పరమం సామ్యముపైతి॥**

**ప్రతిపదార్థం:–** పశ్యః – విచక్షణ ఉన్న సాధకుడు; యదా – ఎప్పుడు; పశ్యతే – చూస్తాడో; రుక్మవర్ణమ్ – బంగారు రంగు; కర్తారం – జగత్‌కారణం; ఈశమ్ – పరమాత్మ; బ్రహ్మయోనిమ్ – చతుర్ముఖ బ్రహ్మ నానించే పుట్టాడు; తదా – అప్పుడు; విద్వాన్ – జ్ఞాని; పుణ్యపాపే – పుణ్యపాపాలను; విధూయ – విదిలించి; నిరంజనః – దుఃఖరహితమైన; పరమమ్ – శ్రేష్ఠమైన; పరమాత్మలో సామ్యమ్ – ఐక్యం; ఉపైతి – పొందుతాడు.

**తాత్పర్యం:–** విచక్షణ ఉన్న సాధకుడు ఎప్పుడు రుక్మవర్ణం ఉన్న జగత్ కారణం పరమాత్మను తానుగా చూస్తాడో; చతుర్ముఖ బ్రహ్మ నానుంచే పుట్టాడని ఎప్పుడు అనుకుంటాడో, అప్పుడు ఆ జ్ఞాని పుణ్యపాపాలను విదిలించుకుని. నిరంజనమైన, శ్రేష్ఠమైన పరమాత్మలో ఐక్యం పొందుతాడు.

**వివరణ:–** జ్ఞానం, జ్ఞానఫలం వస్తాయి ఈ మంత్రంలో.
**పశ్యః–** విచక్షణ ఉన్న సాధకుడు. అహంకారం వైపు మొగ్గు చూపిన సాధకుడు సంసార విముక్తి పొందదు. వైకుంఠం వెళ్ళినా అహంకారం వీడదు.
**పశ్యతే –** విచక్షణ ఉన్న సాధకుడు సాక్షి చైతన్యాన్ని కనుగొంటాడు. ఎలా? శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారా. ఆ సాక్షిచైతన్యం ఎలా ఉంటుంది?
**రుక్మవర్ణమ్** – రుక్మ అంటే బంగారం. బంగారం వేసుకున్న స్త్రీని రుక్మిణి, అనీ, పురుషుడిని రుక్మీ అనీ అంటారు. రుక్మవర్ణం అంటే బంగారం వన్నె మెరుపు అని అర్థం. ఇక్కడ స్వయం ప్రకాశక చైతన్యం. చైతన్యం 5 లక్షణాలను మర్చిపోకూడదు.
**ఈశం పురుషమ్ –** ఈశం అంటే పరమాత్మ. సాక్షిజీవాత్మ పరమాత్మతో సమానం. పురుషం అంటే సర్వవ్యాపకం.పూర్ణం. మన శరీరం, మనసు, అహంకారం అన్నీ అపూర్ణం. మనం అహంకారంతో ముడివేసుకుంటే వెలితి ఏమీ లేదు అని ఎన్నడూ అనలేము. అలా అనగలగాలంటే అహంకారం నుంచి సాక్షిస్థాయికి ఎదగాలి.

అందువల్ల పురుషం అంటే పూర్ణం. పరమాత్మ పూర్ణం, కాని సాక్షిచైతన్యం ఎలా పూర్ణం? దానికి జవాబు ఇక్కడ వస్తుంది.

**కర్తారమ్‌–** ఈ పరమాత్మ జగత్‌ కారణం అని అంతకుముందు అధ్యాయంలో చూసాము.

నేను = ఆత్మ (సాక్షిచైతన్యం); ఆత్మ = బ్రహ్మ; బ్రహ్మ = జగత్కారణం; జగత్కారణం = జగత్‌ కార్యమంతటా. అందువల్ల నామరూపాలన్నీ నాకు చెందినవే. అందుకే జ్ఞాని వజ్రాలను చూసినా చలించడు. ఇందాకటి దాన్ని పొడిగిస్తే జగత్కార్యమంతటా = నామరూపాలు = వజ్రాలు (నామరూపాల్లో ఒకటి). ఇప్పుడు వెనక్కి వెళితే వజ్రాలు = నామరూపాలు = జగత్‌ కార్యమంతటా= జగత్కారణం = బ్రహ్మ = ఆత్మ (సాక్షిచైతన్యం) = నేను.

ఇది సరదాగా చెప్పినది కాదు.

**అహమన్న– మహమన్న – మహమన్నమ్‌ – అహమన్నాదో – తైత్తరీయం**

అందువల్ల కర్తారం అంటే జగత్‌కారణం. అందువల్ల పూర్ణం.

**బ్రహ్మయోనిమ్‌–** చతుర్ముఖ బ్రహ్మ, బ్రహ్మనైన (చైతన్యమైన) నా నుంచే పుట్టాడు. తైత్తిరీయంలో జ్ఞాని తన మహిమను పాడతాడు.

నేనే హిరణ్యగర్భగా పుట్టాను.

నేను బ్రహ్మ విష్ణు మహేశ్వరులను.

అంతకుముందు –

**గురుర్బ్రహ్మ గురుర్విష్ణు, గురుర్దేవో మహేశ్వరః।**

**గురుస్సాక్షాత్‌ పరబ్రహ్మ, తస్మై శ్రీ గురవే నమః॥**

ఇప్పుడు– **అహం బ్రహ్మ అహం విష్ణుః అహం దేవో మహేశ్వరః।**

**అహం సాక్షాత్‌ పరబ్రహ్మ తస్మై అహవే నమః॥**

అద్వైత వేదాంతానికి పరాకాష్ఠ. నేనే త్రిమూర్తుల సృష్టికి కారణం.

నేను అన్నప్పుడల్లా ఆ నేను ఎవరన్నది మర్చిపోకూడదు. కీళ్ళనొప్పితో బాధపడే శరీరం కాదు. బాహ్యప్రపంచాన్ని చూసే ఇంద్రియాలు కాదు. రాగద్వేషాలతో భగ్గుమనే మనసుకాదు. నేను అంటే సాక్షిచైతన్యం. సాక్షిచైతన్యమైన నేనే, త్రిమూర్తుల సృష్టికి కారణం. ఈ విషయం గ్రహిస్తే ఏమవుతుంది?

**తదా విద్వాన్ పుణ్యపాపే విధూయ –** ముందు ఉపనిషత్తు జీవిని భోక్తగా చూపించింది. ఈ మంత్రంలో కర్తగా చూపిస్తోంది. జ్ఞానం పొందాక వ్యక్తి విద్వాన్ అయి, పుణ్యపాపాలను వదుల్చుకుంటాడు. శాస్త్రం మొదట్లో ప్రతిజీవి పుణ్యపాపాలకు బద్ధుడవుతాడు అంటుంది. అదే శాస్త్రం ఇప్పుడు పుణ్యపాపాల నుంచి విముక్తుడవుతాడు అంటుంది. వాటిని తన చర్యవల్లో, సంకల్పం వల్లో వదులుకోడు. ఒక వ్యక్తికి స్వప్నంలో తను చేసిన చర్యల నుంచి జాగ్రదావస్థలో కర్తృత్వ భోక్తృత్వ భావనలు తొలగిపోతాయి. ఏమీ తినకుండా చూస్తున్న రెండో పక్షి అభిచాకశీతి తాను అని గ్రహిస్తాడు.

ఈ జ్ఞానం వచ్చినప్పుడు, జ్ఞాని పుణ్యపాపాలను ఒక్కసారిగా విదిలించుకుంటాడు. ఋషులు జంతువులను పరిశీలనగా చూడటం వల్ల విధూయ అన్న పదం వాడారు. కుక్క లేవగానే ఒక్కసారి శరీరాన్నంతటినీ కుదుపుతుంది, తన ఒంటికి అంటుకున్న దుమ్మును దులుపుకోవటానికి. అలాగే జ్ఞాని తన నుంచి సంచితకర్మల దుమ్ము, ఆగామికర్మల దుమ్ము, ప్రారబ్ధకర్మల దుమ్ము దులుపుకుంటాడు. ఈ మూడు కర్మల వల్ల వచ్చిన పుణ్యపాపాల దుమ్ము దులుపుకుంటాడు. పుణ్యం కూడా ఎందుకు? పుణ్యం బంగారు బంధం. పాపం వచ్చి దుఃఖపెడితే, పుణ్యం పోయి దుఃఖపెడుతుంది.

**క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి॥** –గీత

**నిరంజనః –** అలా పుణ్యపాపాలను విదిలించుకోవటం వల్ల, జ్ఞానిలోని కాలుష్యం పోతుంది. అన్నిటికన్నా పెద్ద కాలుష్యం అజ్ఞానం. దాని నుంచి విడివడి త్రిపుటి నుంచి ద్విపుటికి వస్తాడు.

**పరమం సామ్యముపైతి –** పరమాత్మతో ఐక్యం చెందుతాడు.

అంటే జీవన్ముక్తి పొందుతాడు. ఇది చాలా ముఖ్యంగా గమనించాల్సిన విషయం. ఎందుకంటే కొంతమంది మోక్షం పొందటమంటే పరమాత్మ దగ్గరికి ప్రయాణం చేయాలి అనుకుంటారు. పరమాత్మలో ఐక్యం చెందటానికి నాలుగు దశలను వర్ణిస్తారు. సాలోక్యం, సామీప్యం, సారూప్యం, సాయుజ్యం – అంటే వరుసగా ఆ లోకానికి వెళ్ళి, పరమాత్మ సన్నిధిలో ఉండి, ఆయన లక్షణాలు పొంది, చివరగా ఆయనలో ఐక్యం అవటం అనుకుంటారు. జ్ఞాని విషయంలో ప్రయాణం లేదు. అజ్ఞానం తొలిగితే జీవాత్మ పరమాత్మ భేదం తొలగి, జ్ఞానం

కలుగుతుంది,జీవాత్మ, పరమాత్మ ఐక్యభావన కలుగుతుంది. అంటే ఇది వృత్తి (ఆలోచన)లో మార్పు.

## మంత్రం - 4

**ప్రాణో హ్యేష యః సర్వభూతైర్విభాతి**
**విజానన్ విద్వాన్ భవతే నాతివాదీ।**
**ఆత్మక్రీడ ఆత్మరతిః క్రియావాన్**
**ఏష బ్రహ్మవిదాం వరిష్ఠః ॥**

**ప్రతిపదార్థం:–** ఏషః – ఈ; ప్రాణః హి – పరమాత్మను; సర్వభూతైః – సకల జీవులలో; విభాతి– ప్రకాశిస్తున్నది; యః విద్వాన్– ఏ వివేకి; విజానన్– గ్రహించిన వ్యక్తి; నాతివాదీ – మితభాషి; భవతే– అవుతాడు; ఆత్మక్రీడః– ఆత్మలోనే రమిస్తాడు; ఆత్మరతిః– ఆత్మలో ఆనందిస్తాడు; క్రియావాన్– కర్మలను చేసేవాడు; ఏషః – ఇతను; బ్రహ్మవిదామ్ – ఆత్మజ్ఞానులలో; వరిష్ఠ– శ్రేష్ఠుడు.

**తాత్పర్యం:–**సకల జీవరాసులలో ప్రకాశిస్తున్నది పరమాత్మే అని ఏ వివేకి గుర్తిస్తాడో, అతను మితభాషిగా ఉండి, ఆత్మలోనే రమిస్తాడు, ఆత్మలోనే ఆనందం పొందుతాడు. ఆదర్శంగా ఉండటానికి తన (విహిత)కర్మలు చేస్తాడు. ఇతను జ్ఞానులలో శ్రేష్ఠుడు.

**వివరణ:–** జ్ఞానఫలం, జ్ఞాని ఎలా ఉంటాడో వివరిస్తోంది.

**ప్రాణోహ్యేషయః సర్వభూతైర్విభాతి–** ఇక్కడ ప్రాణః అంటే పరమాత్మ లేదా బ్రహ్మ. దీన్ని ప్రాణస్య ప్రాణః అని కూడా అంటారు. అంటే ప్రాణంతో సహా అన్నింటినీ ప్రకాశింపజేసేది. ఈ బ్రహ్మ అన్ని వస్తువుల్లోనూ, జీవాల్లోనూ భాసిల్లుతోంది. ఏక, నిత్య, సార, సత్య కారణం అనేక, అనిత్య, అసార, అసత్య కార్యంగా జగత్తులో కనబడుతోంది. ఒకటే నీరు నది, కాలువ, కొలనులాగా భాసిల్లినట్టు ఒకటే కారణబ్రహ్మ కార్యజగత్తుగా ప్రకటితమవుతోంది.

బ్రహ్మ + నామరూపాలు = సృష్టి.
ఇది ఈ క్రింది మంత్రాన్ని గుర్తు చేస్తోంది.

**బ్రహ్మైవేదమమృతం పురస్తాద్ బ్రహ్మపశ్చాద్**
**బ్రహ్మ దక్షిణతశ్చోత్తరేణ।**
**అధశ్చోర్ధ్వం చ ప్రసృతం బ్రహ్మైవేదం**
**విశ్వమిదం వరిష్ఠమ్ ॥ –ముండకం 2.2.12**

**బ్రహ్మార్పణం బ్రహ్మహవిః   – గీత 4.24**

ఈ నామరూపాలను కలిపి మాయ అంటారు. ఆకర్షణీయమైన వేషం మాయమైతే, దాని వెనుక ఉన్నది అనాకర్షణీయమైన వేషి బ్రహ్మ.

**అశబ్దమస్పర్శమరూపమవ్యయం – కఠ 1.3.15**

**విజానన్ విద్వాన్ –** జ్ఞాని అన్నీ మాయావేషంలో ఉన్నాయి అని. అనేక సాధనల వల్ల తెలుసుకుంటాడు. భక్తుడు పాడే పాట ఇలా ఉంటుంది.

**హర్ దేశ్ మే తూ; హర్ వేష్ మే తూ**

**తేరా నామ్ అనేక్; తు ఏక్ హీ హై**

అదే జ్ఞాని పాడితే తూ బదులు మై (నేనే) ఉంటుంది.

**హర్ దేశ్ మే మై; హర్ వేష్ మే మై**

**మేరా నామ్ అనేక్; మై ఏక్ హీ హూ**

జ్ఞాని ఇలా అన్నీ నేనే అని తెలుసుకోవటం వల్ల అతనికి కలిగే ఫలం ఏమిటి? మోక్షాన్ని అనేక విధాలుగా నిర్వచించారు. ఇక్కడ –

**నాతివాదీ భవతే –** ఎక్కువ మాట్లాడడు. శరీరాన్ని ఎంత మేరకో అంత మేరకే చూడాలి కాని, దానితో మమేకం చెందకూడదు. అలాగే కుటుంబం, ఆస్తిపాస్తులకు కూడా ప్రాముఖ్యతని ఎంత మేరకు ఇవ్వాలో అంత మేరకే ఇవ్వాలి. నామరూపాల వల్ల నా స్వరూపం తెలుసుకోవాలి. మాయను వీడి నేను బ్రహ్మను అని గ్రహించి, మాయతో చెందే మమేకాన్ని వదులుకోవాలి. బ్రహ్మ స్వరూపాన్ని తెలుసుకుని, మాయ గురించిన తపనను తగ్గించుకోవాలి. ధర్మాన్ని నిర్లక్ష్యం చేయకూడదు. కాని దానికి అతిగా ప్రాముఖ్యత ఇవ్వకూడదు. అలా తెలుసుకున్న జ్ఞాని ఎక్కువ మాట్లాడడు. మాట్లాడటం తగ్గిస్తే వేదాంతాన్ని జీర్ణించుకున్నట్టు.

ఎవరు చెప్తున్నారు ఈ మాట? వేదాంతమే చెప్తోంది. ఏదీ శాశ్వతం కాదు. అన్నీ వెళ్ళిపోయేవే. అలాంటప్పుడు ఎందుకు అతిగా దాని గురించి ఆలోచించటం? నేను సచ్చిదానంద ఆత్మను, మాయా వేషంతో నేను జగత్తుని సృష్టించాను. ఈ జగన్నాటకం అంతా నా మహిమ వల్ల అని తన మహిమని మెచ్చుకుంటాడు. బెంగపడే సమయాన్ని తన మహిమను మెచ్చుకోవటానికి వినియోగిస్తాడు.

**ఆత్మక్రీడ –** తనతో రమిస్తాడు. ఎందుకంటే రచన, దర్శకత్వం, తెర, పాత్రలు అన్నీ తన మహిమే అని తెలుసుకుంటాడు. ఆ నేను ఎవరు? అహంకారమా ఆత్మనా? అహంకారం మహిమ ఏమిటి? తమాషా చూడండి. అది నేను అహంకారం కాదు అని తెలుసుకోవటానికి తోడ్పడుతుంది.

**యస్త్వాత్మరతిరేవ స్యాత్ ఆత్మతృప్తశ్చ మానవః।**
**ఆత్మన్యేవ చ సంతుష్టః తస్య కార్యం న విద్యతే॥** గీత **3-17**

ఈ గీతాశ్లోకం ఈ మంత్రం నుంచే వచ్చింది. క్రీడ అంటే బాహ్యసాధన సంబంధం. రతి అంటే అంతరసాధన సంబంధం. బాహ్యంగా ఆడే ఆటలు క్రీడలు. పాత ఫొటోలు చూసి మనసులో ఆనందించటం, జరగబోయే గృహప్రవేశాన్ని తలచుకొని ఆనందించటం రతి. జ్ఞానికి బాహ్యానందం, అంతర్గతానందం రెండూ ఆత్మనుంచే.

**ఆత్మరతిః –** ఆత్మ క్రీడలో నా మాయాశక్తిని, నా సగుణ స్వరూపాన్ని మెచ్చుకుంటాను. ఆత్మరతిలో నా నిర్గుణ స్వరూపాన్ని, సచ్చిదానంద రూపాన్ని మెచ్చుకుంటాను. విద్యానందం, విషయానందం, యోగానందం అన్నీ ఆత్మానందమే అని పంచదశిలో వస్తుంది. ఒకటే ఆత్మ నుంచి అనేక నామరూపాలున్న జగత్తు వచ్చింది. అది నా మహిమ అని ఆనందిస్తాను. కళ్ళు తెరిచినా, మూసినా ఆత్మే కనబడుతుంది.

**క్రియావాన్ –** ఇది చాలా ముఖ్యం. ఆత్మజ్ఞానం పొందాక, ముక్త పురుషుడైనా, లక్ష్యం పొందినా (అనాది ప్రయాణం ముగిసినా) తన కార్యకలాపాలు కొనసాగిస్తాడు. నెరవేర్చాల్సిన ధర్మాలున్నాయి. తను గృహస్థు అయితే గృహస్థుగా నెరవేరాల్సిన ధర్మాలను నిర్వర్తిస్తాడు. ఉన్న భేదం అల్లా ఒకటే. అది దృక్పథంలో మార్పు. అంతకుముందు మోక్షం పొందటానికి ధర్మాన్ని పాటిస్తే, ఇప్పుడు అయోమయాన్ని పారద్రోలటానికి పాటిస్తాడు. వేదాంతం స్పష్టంగా సూచన ఇస్తోంది. సంసారి అయినా తన సంసార ధర్మాన్ని నిర్వర్తించాలి, అదికూడా అంతకన్నా తీవ్రంగా. ఎందుకు? తక్కినవారికి ఆదర్శంగా నిలవాల్సిన బాధ్యత జ్ఞానికి ఉంటుంది. అతను యమ నియమాలను పాటిస్తాడు. అందువల్ల జ్ఞాని క్రియావాన్.

**ఏష బ్రహ్మవిదాం వరిష్ఠః** –అటువంటి జ్ఞాని ఆత్మజ్ఞానులలో శ్రేష్ఠుడే కాదు, జ్ఞాననిష్ఠుడు కూడా. జ్ఞాననిష్ఠుడుని కృష్ణపరమాత్మను గీతలో 2వ అధ్యాయంలో

స్థితప్రజ్ఞుడనీ, 14వ అధ్యాయంలో గుణాతీతుడనీ పేర్కొన్నాడు. పదాలు భేదం అంతే. అతను నిత్యముక్తుడు. ఇక్కడితో జ్ఞానయోగం ముగిసింది.

ఇకముందు జ్ఞానసాధనలు, ఫలం గురించి వస్తుంది.

**మంత్రం - 5**

**సత్యేన లభ్యస్తపసా హ్యేష ఆత్మా**
**సమ్యగ్జ్ఞానేన బ్రహ్మచర్యేణ నిత్యమ్।**
**అన్తఃశరీరే జ్యోతిర్మయో హి శుభ్రః**
**యం పశ్యన్తి యతయః క్షీణదోషాః॥**

**ప్రతిపదార్థం:–** ఏషః ఆత్మా – ఈ ఆత్మ; నిత్యమ్ హి – ఎప్పుడూ; సత్యేన – సత్యం చేత; తపసా – ఏకాగ్రత చేత; బ్రహ్మచర్యేణ – బ్రహ్మచర్యం చేత; సమ్యక్ జ్ఞానేన – పరిపూర్ణ జ్ఞానం చేత; లభ్యః – లభిస్తుంది. యతయః – నిజాయితీగా ఆధ్యాత్మిక జీవనం గడిపిన వారు; క్షీణదోషాః – పాపాలు తొలగిపోయి; జ్యోతిర్మయః – జ్యోతిర్మయంగా; శుభ్రః – శుద్ధం; అంతఃశరీరే – శరీరం లోపల; యం పశ్యన్తి – ఆత్మను గ్రహిస్తారు.

**తాత్పర్యం:–** ఎప్పుడూ సత్యం, తపస్సు, బ్రహ్మచర్యం అనే మూడు సహకారీ సాధనలూ, సమ్యక్జ్ఞానం అనే ప్రాథమిక సాధన చేసినవాళ్ళు నిజాయితీగా శుద్ధ చైతన్యాన్ని తమ శరీరంలోనే గ్రహిస్తారు.

**వివరణ:–** అనేక సాధనలు చెప్తోంది ఉపనిషత్తు. వాటిని రెండుగా విభజించవచ్చు.

**1. సాక్షాత్ సాధనాని – ప్రాథమిక సాధన లేదా ప్రత్యక్ష సాధన.**

**2. సహకారీ సాధనాని – తోడ్పడే సాధనలు లేదా పరోక్షసాధనలు.**

ఉదాహరణకు అనారోగ్యం వస్తే మందు తీసుకోవటం సాక్షాత్ సాధన. దానికి తగ్గ పథ్యం చేయటం సహకారీ సాధన. పథ్యం కూడా ముఖ్యమే.

ఇప్పుడు వేదాంతం విషయంలో జ్ఞానయోగం సాక్షాత్సాధన. కర్మయోగం సహకారీ సాధన. అందులో అనేక సాధనలు ఉంటాయి. ఈ సహకారీ సాధనది ద్వితీయ స్థాయి కాదు. సాక్షాత్కి చేదోడువాదోడుగా ఉంటుంది. అందుకని ఇది కూడా చేసి తీరాలి. అనేక సహకారీ సాధనల్లో ఇక్కడ పేర్కొన్నవి మూడు. అవి సత్యం, తపస్సు, బ్రహ్మచర్యం. జ్ఞానయోగంలోకి శ్రవణ, మనన, నిదిధ్యాసనలు వస్తాయి.

**1. సాక్షాత్ సాధనాని - సమ్యక్ జ్ఞానం - శ్రవణ, మనన, నిదిధ్యాసనలు.**

**2. సహకారీ సాధనాని - సత్యం, తపస్సు, బ్రహ్మచర్యం.**

**సమ్యగ్జ్ఞానేన-** సాక్షాత్ సాధన

**శ్రవణం-** ఒక క్రమ పద్ధతిలో, క్రమం తప్పకుండా కొన్ని సంవత్సరాల పాటు సమర్ధవంతుడైన గురువు దగ్గర శాస్త్ర అధ్యయనం చేయటం. ఇందులో ప్రతి పదమూ ముఖ్యమే. ఆకళింపు చేసుకోవటం, అది కూడా కొన్ని సంవత్సరాల పాటు చేయటం.

**మననం-** మననం సందేహాలను తొలగించి, మనకు నిస్సంశయ జ్ఞానం కలిగిస్తుంది.

**నిదిధ్యాసనం-** మనకు కలిగిన నిస్సంశయ జ్ఞానాన్ని మనలో జీర్ణించుకోవటం.

**సహకారీ సాధనలు- సత్యం-** నిజం చెప్పటం చాలా ముఖ్యమైన సాధన. మీరు జీవితాన్ని నిజాయితీగా జీవిస్తేనే ఇంకో సత్యాన్ని పొందగలరు. వ్యావహారిక సత్యం ద్వారా పారమార్థిక సత్యాన్ని పొందగలరు. అందుకని అబద్ధం చెప్పటం మానాలి. అబద్ధాలు మానటం ఎలా?

చెప్పే అబద్ధాల పట్టిక తయారుచేయండి. వాటిని రెండుగా విభజించండి- తప్పించుకోగలిగిన అబద్ధాలు, తప్పించుకోలేని అబద్ధాలు. ఈ పట్టిక తయారుచేయడానికే కొంత నిజాయితీ ఉండాలి. ముందు తప్పించుకోగలిగిన అబద్ధాలను తప్పించుకోవటానికి ప్రయత్నించండి. దానికి కొంత తీవ్రప్రయత్నం, కొంత త్యాగం చెయ్యాల్సి ఉంటుంది. తరువాత తప్పించుకోలేని అబద్ధం చెప్పినప్పుడల్లా 108 సార్లు ఏదైనా జపం చేయండి. ఉదాహరణకు **ఓం నమశ్శివాయః** జపించండి. దీనివల్ల జపమన్నా మెరుగవుతుంది. మీరు నిజాయితీగా ప్రయత్నిస్తే భగవంతుడు తప్పకుండా ఆదుకుంటాడు. మానవ ప్రయత్నం చేస్తే మాధవ సహాయం ఖచ్చితంగా ఉండి తీరుతుంది. ఎలా తెలుస్తుంది?

క్రమేపీ తప్పించుకోలేని అబద్ధాలు తప్పించుకోగలిగిన అబద్ధాలలోకి వస్తాయి. ఎలా వస్తాయి? మీకన్నా ధైర్యం పెరుగుతుంది. లేదా ఎదుటివాళ్ళన్నా మారతారు. జాగ్రత్తగా గమనిస్తే మీరే స్పష్టంగా చూడవచ్చు. అందుకని అబద్ధాల సంఖ్యని తగ్గిస్తూ రండి. భగవంతుడు మీరు ఎంత విజయం పొందారని చూడడు. ఎంత నిజాయితీగా ప్రయత్నం చేసారని చూస్తాడు.

**తపస్సు -** దీనికి అనేక అర్థాలున్నాయి. ప్రతి ఆధ్యాత్మిక నియమం ఒక తపస్సే.

**ఋతం తప - స్సత్యం తప - శ్రుతం తప - శ్శాన్తం తపో దమ - స్తప - శ్శమ - స్తపో దానం తపో యజ్ఞం తపో భూర్భువస్సువ - బ్రహ్మై తదుపాస్వై తత్తపః॥ - మహానారాయణోపనిషత్తు -10**

ఉపవాసం ఉండటం కూడా తపస్సు కిందకే వస్తుంది. కాని వేదాంత విషయానికొస్తే ప్రాథమిక తపస్సు ఏకాగ్రత అవ్వాలి. ఉపవాసం మానమని కాదు. కాని జ్ఞాన బోధకి వెళ్ళి ఏకాగ్రత చూపలేకపోతే ఏమిటి లాభం? రెండూ చేయగలిగితే మరీ మంచిది. కాని, ఏదో ఒకటే చేయగలిగితే, జ్ఞాన బోధకి వెళ్ళాలి.

**బ్రహ్మచర్యం -** బ్రహ్మచర్యం అంటే నైతిక విలువ. అది ఆశ్రమాన్ని బట్టి మారుతుంది. గురుకులంలో ఉంటే గురుశుశ్రూష చేయాలి. ఎందుకు అని అడగకూడదు. యథోక్తకారీ శిష్య అంటే గురువు అడిగింది చేసేవాడు.

**నిత్యం-** సత్యం, తపస్సు, బ్రహ్మచర్యం మాటలకు ముందు 'నిత్యం' అన్న పదం కలుపుకోవాలంటున్నారు శంకరాచార్యులు. లేకపోతే నిన్న సత్యం చెప్పాను అనుకుంటాడు శిష్యుడు.

ఈ మూడూ సహకారీ సాధనలు. పథ్యం లాంటివి. ప్రాథమిక సాధన సమ్యక్ జ్ఞానం. వీటితోపాటు బుద్ధిగా, లక్షణంగా రోజూ బోధకి వెళ్ళాలి. సమ్యక్ జ్ఞానం పొందటానికి శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయాలి. ఎన్నాళ్ళు? నిత్యం చేయాలి. శిష్యుడు గురువు చెప్పినదాన్ని మననం చేసుకుంటే అది అతనికే కాదు, గురువుకు కూడా ఉపయోగకరంగా ఉంటుంది. ముండకంలో పదే పదే విన్న ఏకం, నిత్యం, సారం, సత్యం - కారణం బ్రహ్మ మాటలు ముండకం తోనే వదిలేస్తే, దీని తరువాత ఇంకో ఉపనిషత్తు విన్నప్పుడు గురువు మళ్ళీ ఈ మాటలు వాడితే ఎక్కడో విన్నట్టుందే అనుకుంటాడు గాని, ముండకోపనిషత్తులో అని వెంటనే తట్టదు.

**ఏషః ఆత్మా లభ్యః -** ఇక మీదట ఆత్మ అంటే ఏకాత్మ. ఈ ఆత్మను నేను అని చెప్పగలుగుతాడు.

**యం పశ్యన్తి యతయః క్షీణదోషాః-** యతయః అన్నమాటకి రెండు అర్థాలున్నాయి. యతి అంటే సన్యాసి. రెండో అర్థం నిజాయితీగా ఆధ్యాత్మిక జీవనం గడిపే వ్యక్తి. గృహస్థు ఐనా సన్యాసిలాగా ఈ నాలుగు సాధనలు చేసేవాడు. ఈ సాధనలు చేస్తే చాలు, ఎంత విజయం సాధించారన్నది కాదు ముఖ్యం, ఎంత నిజాయితీగా

ప్రయత్నించారన్నది ముఖ్యం. ఐదు మెట్లున్న నిచ్చెన మీద మీరు మూడో మెట్టు మీద ఉన్నారనుకుందాం. ఆ మెట్టుమీంచి, కిందకి దిగుతుంటే మూడో మెట్టుమీద ఉండి కూడా లాభం లేదు. చెడు లక్షణాలున్నా నేను వీటిని మానటానికి ప్రయత్నిస్తేనే యతి కింద లెఖ్ఖ.

**క్షీణదోషాః –** పాప ప్రతిబంధకాలు తగ్గుతాయి. ప్రాపంచికంగా గెలవకపోయినా, ఆధ్యాత్మికంగా పెరుగుతారు. దీని గురించి తరువాత మంత్రంలో వివరంగా వస్తుంది. కనబడని ఆటంకాలనుంచి విముక్తి పొందటం వల్ల శ్రవణ, మనన,నిదిధ్యాసనలు తేలిగ్గా చేయగలుగుతారు. దీని తరువాత ఇంకో ఉపనిషత్తు కూడా నేర్చుకోగలుగుతారు. మొదట్లో కష్టంగా ఉన్నా రాను రానూ బాగా తేలిగ్గా అర్థం అవుతుంది.

**పశ్యన్తి –** గ్రహిస్తారు. దేన్ని?

**యం –** ఏకాత్మను; ఎటువంటి ఏకాత్మను?

**జ్యోతిర్మయః శుభ్రః –** శుద్ధ చైతన్యాన్ని. ఎక్కడ?

**అంతః శరీరే –** శరీరం లోపల సాక్షీభూతంగా ఉన్న ఆత్మను గ్రహిస్తారు. ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనసుని సాక్షీభూతంగా చూసే ఆత్మను చూస్తారు. మారుతున్న ఆలోచనలను సాక్షిగా చూసే మారని ఆత్మ అది.

## మంత్రం - 6

**సత్యమేవ జయతే నానృతం, సత్యేన పన్థా వితతో దేవయానః ।**
**యేనాక్రమన్తి ఋషయో హి ఆప్తకామాః, యత్ర తత్సత్యస్య పరమం నిధానమ్॥**

**ప్రతిపదార్థం: –** సత్యమేవ – సత్యం మాత్రమే; జయతి – జయిస్తుంది; నానృతమ్ – అసత్యం కాదు; సత్యేన – సత్యం చేత; దేవయానః పన్థా – శుక్లగతి; వితతః – ఏర్పడి ఉంది.; యేన– దాని ద్వారా, ఆప్తకామాః – కోరికలు తీరినవారు; ఋషయః – సగుణ బ్రహ్మ ఉపాసకులు; ఆక్రమన్తి– వెళతారు; యత్ర – ఆ బ్రహ్మలోకం; తత్సత్యస్య – సత్యం యొక్క; పరమమ్ – శ్రేష్ఠమైన; నిధానమ్ – మోక్షమనే నిధి.

**తాత్పర్యం: –** సత్యమే జయిస్తుంది. అసత్యం కాదు. సత్యమే పలికే సగుణ ఈశ్వర ఉపాసకులు,శుక్లగతి ద్వారా బ్రహ్మలోకానికి వెళతారు. ఆ బ్రహ్మలోకంలో శ్రేష్ఠమైన మోక్షమనే నిధిని కనుగొంటారు. అంటే అక్కడ క్రమముక్తి పొందుతారు.

వివరణ:– ముందు మంత్రంలో 4 సాధనలను చూశాము. అందులో మూడు సహకారీ సాధనలన్నాం. అవి సత్యం, తపస్సు, బ్రహ్మచర్యం. వాటిలో కూడా సత్యం చాలా ముఖ్యం. సత్యం అంటే నిజం చెప్పటం. నిజాయితీగా జీవనం గడపటం. దాన్ని ఇక్కడ కీర్తిస్తున్నారు.

**సత్యమేవ జయతే –** సత్యం మాత్రమే (ఏవ) గెలుస్తుంది. నిజం చెప్పే సాధకుడు మాత్రమే గెలుస్తాడు – వ్యావహారికంగా అయినా, ఆధ్యాత్మికంగా అయినా. మొదట్లో కష్టంగా ఉన్నా, అబద్ధం ఆడేవారు తొందరగా విజయం పొందినట్లు కనిపించినా, చివరికి గెలిచేది సత్యమే. కొండ మీదకి వెళ్ళేదోవ, ఎగుడుదిగుడుగా ఉన్నా దైవ దర్శనం కావాలంటే కష్టపడి ఎక్కుతామా లేదా? అలాగే ఈ మార్గం సుగమంగా లేకపోయినా, చివరికి విజయలక్ష్మి సత్యసంధుడినే వరిస్తుంది. ఏ మార్గంలో ఉన్నా సత్యమే జయిస్తుంది.

సత్యమేవ జయతే అన్న వాక్యం మన రూపాయిల మీద కనబడుతుంది. అది ముండకోపనిషత్తు నుంచి గ్రహించబడిందన్నమాట. అంటే మన పూర్వీకులు వేద, వేదాంతాల్లో ఎంత నిష్ణాతులో గమనించండి. ఆధ్యాత్మికంగా విజయం చూస్తే జ్ఞానం పొంది, మోక్షం పొందటం.

**న అనృతమ్ –** సత్యం మాత్రమే అనటంలోనే అసత్యం తీసుకురాలేదు అన్న అర్థం చెప్పకనే చెప్పినట్టవుతుంది. కాని ఉపనిషత్తు అది కూడా స్పష్టం చేస్తుంది. అసత్యం తీసుకురాలేదు.

ఇక్కడ్నుంచి ఇంకో విషయం. సత్యం జ్ఞానం పొందటానికే కాదు. క్రమముక్తి పొందటానికి కూడా అవసరమే.

ఉపాసకుడు క్రమముక్తి పొందుతాడు అన్న విషయం చెప్తోంది ఇప్పుడు. సగుణ ఈశ్వర ఉపాసన చేసిన సాధకుల జీవాత్మ సుషుమ్నా నాడి ద్వారా వెలువడి, శుక్లగతి ద్వారా బ్రహ్మలోకం చేరుకుంటుంది. అక్కడ బ్రహ్మదేవుని ద్వారా నిర్గుణ బ్రహ్మజ్ఞానం పొంది క్రమముక్తి పొందుతుంది. క్రమముక్తి కావాలన్నా కూడా ఈ సహకారీ సాధనలను పాటించాలి. వాటిలో ముఖ్యమైనది సత్యం.

**సత్యేన పన్థా వితతో దేవయానః –** సత్యం మాటల వల్ల; శుక్లగతి మార్గం ఏర్పడి ఉంది. మనం మాట్లాడిన సత్యవాక్కులే ఆ మార్గాన్ని పరుస్తాయి.

**యేనాక్రమన్తి ఋషయో హి ఆప్తకామాః –** సగుణ బ్రహ్మ ఉపాసకులు; కోరికలు తీరి; శుక్లగతి ద్వారా (దేవయానః పన్థాః); వెళతారు; ఎక్కడికి?

**యత్ర తత్సత్యస్య పరమం నిధానమ్–** బ్రహ్మలోకానికి వెళతారు. ఆ బ్రహ్మలోకంలో మోక్షం నిధి కనుగొంటారు. ఏమిటది? సత్యం యొక్క ఫలం. అందువల్ల జీవన్ముక్తి పొందాలన్నా, క్రమముక్తి పొందాలన్నా, రెండింటికీ మార్గం సత్యమే. సత్యం ఎప్పుడు చెప్పాలి? ఎప్పుడూ చెప్పాలి.

**ప్రత్యేక విశ్లేషణ:– సత్యమేవ జయతే –** సత్యమే జయిస్తుంది. సత్యం ఒక విలువ, అనృతం దానికి వ్యతిరేకం. సత్యం గెలుస్తుందంటే సత్యవాది గెలుస్తాడని తీసుకోవాలి అర్థం.

కాని, 'ఇది నిజం కాదు. కోర్టుకేసుల్లో ఎక్కువగా అసత్యవాదులే గెలుస్తారు. సత్యవాదులు గెలిచే అవకాశాలు తక్కువ,' అనవచ్చు ఎవరైనా. అలా ఎందుకవుతుందంటే, సత్యవాది సత్యమే గెలుస్తుందనుకుని దాని గురించి ఏమీ చేయడు. తన నిజాయితీ చూపించుకోవటానికి ఏమీ ప్రయత్నం చేయడు. కాని అసత్యవాది తనను గెలిపించుకోవటానికి అవసరమైన సాక్ష్యాలన్నింటినీ జాగ్రత్తగా ప్రోగుచేసుకుంటాడు. సత్యాన్ని కూడా నిరూపించుకోవాలి. దానంతట అది గెలవదు. అందుకే అసత్యవాది గెలుస్తాడు. అలాంటి పరిస్థితిలో సత్యాన్ని నమ్ముకున్న వ్యక్తి నాస్తికుడయ్యే ప్రమాదం కూడా ఉంది.

నిజం చెప్పాలంటే, అబద్ధం ఆడే వ్యక్తిని అబద్ధమే శిక్షిస్తుంది. అతను గెలిచాడనుకుంటున్నాడు కాని నిజానికి ఏమీ గెలవలేదు. ఏ తప్పు చేసినా, అదే శిక్ష. మనసులో ఒక ఘర్షణను లేపుతుంది. అపరాధభావనని మించిన శిక్ష లేదు. అదికాక, దానివల్ల పాపం కలుగుతుంది. ఆ పాపం ఇప్పుడో, తర్వాతో పండుతుంది. అందువల్ల తప్పు చేసి ఏమీ లాభం లేదు.

ఉదాహరణకు, ఒక వ్యక్తి దొంగతనం చేసి, జైలుశిక్ష పొందితే, అతని శిక్ష మూడు రకాలుగా ఉంటుంది.

1. **మానసిక శిక్ష:–** దొంగతనం చేసానన్న ఆలోచన భయాన్ని, అపరాధాన్ని కలగజేస్తుంది.
2. **శారీరక శిక్ష: –** అతనిమీద కేసు వేసి, కోర్టు అతనికి జైలు శిక్ష వేస్తుంది.
3. **వైదిక శిక్ష: –** ఈ రెండూకాక, అదనంగా ఈ తప్పు అతనికి కొంత పాపాన్ని మూటగట్టి ఇస్తుంది. దానికి ఫలితంగా కొన్ని కష్టాలు అనుభవించాలి. కోర్టు శిక్షతో అతని పాపం ముగిసిపోదు.

పాపం, కోర్టు శిక్షలాంటిది కాదు. ఉదాహరణకు ఒక వ్యక్తి రెండు నేరాలు చేసాడనుకుందాం. ఒక దానికి అతనికి మూడేళ్ళు, రెండో దానికి నాలుగేళ్ళు జైలు శిక్ష వేసారనుకుందాం. అంటే మొత్తం ఏడేళ్ళ జైలు శిక్ష అనుభవించాలి. కాని జడ్జి దయగలవాడైతే, 'ఈ రెండు శిక్షలు ఒకసారే అనుభవించాలి,' అనవచ్చు. అప్పుడు నాలుగేళ్ళ జైలు శిక్షలో మూడేళ్ళ జైలు శిక్ష కరిగిపోతుంది. అప్పుడు నాలుగేళ్ళే అనుభవించాలి. కాని పాపం అక్కడితో కరిగిపోదు. ఇంకా అదనపు శిక్ష విధించటానికి కాచుకుని ఉంటుంది. అందువల్ల అనృతం గెలుస్తుందనలేము.

ఎప్పటికీ గెలిచేది సత్యవాదే. ఆ మాటకొస్తే అతను గెలవాల్సిన పని లేదు. సత్యం పలకటంలోనే గెలుపు సాధించేసాడు. దేనికీ తల వంచకపోవటమే అతని విజయం. ప్రపంచంలో నష్టపోతానని తెలిసి కూడా సత్యం పక్కన నిల్చోవటమే అతని విజయం. అతనేమీ కోల్పోలేదు. అసలైన విజయం అంటే అది. ఆ విజయాన్ని అతను ఆనందించాలి. దానికి ఫలితంగా మోక్షమనే నిధి పొందబోతున్నాడు. అది తరువాత వాక్యంలో స్పష్టమవుతుంది.

**యత్ర తత్సత్యస్య పరమం నిధానమ్** – అది గొప్ప నిధి ఉన్న స్థావరం. మోక్షమనే గమ్యం అది. గమ్యాన్ని ఇక్కడ నిధానం అని ఎందుకన్నారంటే అది గొప్ప నిధి ఉన్న స్థావరం కాబట్టి. ఎవరైనా బంగారు నిధిని కనుగొన్నారనుకోండి అది నిధానం. బంగారు నిధి అంతటా బంగారం ఉండదు. కొంచెమే ఉంటుంది. కాని ఇక్కడ అలా కాదు. ఇది అసలు, సిసలు బంగారం. అందుకే దాన్ని పరమం నిధానం అన్నారు. గొప్ప నిధి. బ్రహ్మను మించిన నిధి ఏముంటుంది? ఈ నిధి పొందిన వ్యక్తికి తను చేయాల్సిన పనులన్నీ చేసేసినట్టు, అంటే తను కృతకృత్యుడయినట్టు అనిపిస్తుంది.

మనుష్యులకు నిధి మీద ఉన్న మక్కువ చూసే, కావాలనే శాస్త్రం నిధిని పొందుతారని చెప్తోంది. మనుష్యులకు నిధి కావాలి. బ్రహ్మను మించిన నిధి లేదు. మనుష్యులకు జ్ఞానం కావాలి. బ్రహ్మను మించిన జ్ఞానం లేదు. మనుష్యులకు మృత్యుభయం పోవాలి. మోక్షాన్ని మించిన అమృతత్వం లేదు. రథం, నిధి లాంటి దృష్టాంతాలు కావాలనే ఇచ్చింది శాస్త్రం. వీటిని సరిగ్గా అర్థం చేసుకోవాలి కాని బ్రహ్మ దూరంగా ఉందనీ, రథం ఎక్కి, దోవలో ఎదురయ్యే ఆటంకాలను తొలగించుకుంటూ ప్రయాణం చేసి గమ్యం చేరుకోవాలనీ అనుకుంటే తప్పు. వాటిని పారద్రోలాలి.

రాబోయే మంత్రంలో బ్రహ్మ గురించిన కొన్ని అపోహలను తొలగిస్తుంది.

### మంత్రం - 7

**బృహచ్చ తద్ దివ్యమ్ అచిన్త్యరూపం**
**సూక్ష్మాచ్చ తత్ సూక్ష్మతరం విభాతి ।**
**దూరాత్ సుదూరే తదిహాన్తికే చ**
**పశ్యత్సు ఇహైవ నిహితం గుహాయామ్॥**

**ప్రతిపదార్థం: –** తత్ – అది; బృహత్ – అతి పెద్దది; దివ్యమ్ – ప్రకాశవంతమైనది; అచిన్త్యరూపమ్ – వస్తువుగా అనుభవంలోకి రాదు; సూక్ష్మాత్ – సూక్ష్మమైన దానికన్నా; సూక్ష్మతరం – మరింత సూక్ష్మమైనది. తత్ – అది; విభాతి – ప్రకాశిస్తున్నది. దూరాత్ – అతి దూరమైన వాటికన్నా; సుదూరే – దూరమైనది; ఇహ – ఇక్కడ; అన్తికే చ – అతి దగ్గరలో; పశ్యత్సు – చూసేవారితో; ఇహ ఏవ – ఇక్కడే; గుహాయామ్ – హృదయమనే గుహలో, నిహితమ్ – ఉన్నది.

**తాత్పర్యం: –** ఆత్మ అతి పెద్దది, ప్రకాశవంతమైనది. వస్తువుగా అనుభవంలోకి రాదు, సూక్ష్మమైన దానికన్నా మరింత సూక్ష్మమైనది. అజ్ఞానికి అతి దూరమైన దానికన్నా దూరంగా ఉంది. జ్ఞానికి దగ్గర దానికన్నా చాలా దగ్గర. జ్ఞాని మనసనే గుహలో ప్రకాశిస్తున్నదని ఇక్కడే తెలుసుకుంటాడు.

**వివరణ: –** ఇంకో ముఖ్యసాధన గురించి పరోక్షంగా చెప్తోంది ఉపనిషత్తు. అతి సూక్ష్మ బుద్ధి ఉండాలి. ఎందుకు? సగుణ బ్రహ్మను అర్థం చేసుకోవటానికి సూక్ష్మబుద్ధి అఖ్ఖరలేదు. విశ్వరూప ఈశ్వర విషయంలో జగత్తే అతని రూపం అన్నప్పుడు విశాల దృక్పథం ఉండాలి. కాని నిర్గుణ ఈశ్వర విషయానికొస్తే

**యత్ తదద్రేశ్యమ్ అగ్రాహ్యమ్ అగోత్రమ్ అవర్ణమ్**
**అచక్షుః శ్రోత్రం తదపాణిపాదమ్ – ముండకం 1-1-6**

ఇంద్రియాలకందదు, దానికి ఇంద్రియాలు లేవు అంటుంది శాస్త్రం. ఇంత సూక్ష్మమైన విషయాన్ని అర్థం చేసుకోవటానికి మన మనసుని చాలా పదును పెట్టాలి. దానికి ఉపనిషత్తులు అనేక సాధనలను సూచిస్తున్నాయి. ఛాందోగ్యోపనిషత్తు పంచభూత సాధన గురించి చెబుతుంది.

పంచభూతాలలో ఆకాశం అన్నిటికన్నా సూక్ష్మం. దీని మీద ధ్యానం చేస్తే బుద్ధి సూక్ష్మం అవుతుంది. ఈ సూక్ష్మమైన బుద్ధితో శుద్ధచైతన్యాన్ని తెలుసుకోవచ్చు. శుద్ధచైతన్యం తను స్వయంగా వ్యవహారం నడపదు కాని, శుద్ధ చైతన్యం లేనిదే వ్యవహారాలేవీ జరుగవు. దీనికి ఉదాహరణ కాంతి. కాంతి సమక్షంలో గురువు నుంచి శిష్యులకు బోధ జరుగుతుంది. కాని కాంతి వ్యవహారం నడపదు. అందువల్ల ఇంత సూక్ష్మమైన ఆత్మను అర్థం చేసుకోవటానికి సూక్ష్మమైన బుద్ధి కావాలి.

**బృహచ్చ తద్** – ఇది ఆత్మ స్వరూపాన్ని వర్ణిస్తోంది. బృహత్ అంటే చాలా పెద్దది. ఈ ఆత్మ సర్వవ్యాపకం. అంటే ఒక్క ప్రదేశానికి పరిమితమైనది కాదు. శుద్ధ చైతన్యానికి ఉన్న 5 లక్షణాలు మర్చిపోకూడదు.

శుద్ధ చైతన్యం సత్, చిత్, ఆనందం. ఛాందోగ్యోపనిషత్తు సత్ అంశాన్ని బోధించటంతో మొదలవుతుంది.

**సదేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయమ్। – ఛాందోగ్యం 6-2**

**దివ్యమ్** – ప్రపంచమంతటా సత్‌రూపంలో ఉన్న ఆత్మ ప్రతిమనసులోనూ చిత్‌రూపంలో ఉంది. స్వయంప్రకాశక ఆత్మ అది. ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనసుని సాక్షిచైతన్యంలా చూస్తోంది.

**అచిన్త్యరూపమ్** – ఆత్మస్వరూపం ఏమిటి? అది వస్తువుగా అనుభవంలోకి రాదు. ఎందుకు?

**అనుభవిస్తున్న నేనే ఎప్పటికీ ఆత్మను, అనుభవించబడే వస్తువు ఎన్నటికీ కాదు.**

మనం అనుభవించేదంతా వస్తువు. బాహ్యంగా, వస్తువుగా చూస్తే, అంతర్గతంగా ఆలోచనలు చూస్తాయి. ఆత్మ చూడబడే వస్తువు కాదు. చూస్తున్న నేను. అందుకని చూసే రూపం లేదు. ఆలోచించే నేను, ఆలోచన, ఆలోచన చేసే వస్తువు – మూడు బ్రహ్మే. అది నా స్వరూపం.

**సూక్ష్మాచ్చ తత్ సూక్ష్మతరం** – పంచభూతాల్లో ఆకాశం అన్నిటికన్నా సూక్ష్మం. దాన్ని ఒక్క ఇంద్రియంతోనే తెలుసుకోగలము. ఆత్మ ఈ సూక్ష్మమైన ఆకాశం కన్నా సూక్ష్మతరం. అందుకే ఇంద్రియ అగోచరం. అది గుర్తించటానికి బుద్ధిని సూక్షతరం చేసుకోవాలి.

**విభాతి** – ఆత్మ సత్‌రూపంలో అనేక వస్తువులుగా వివిధంగా ఉంది. వస్తురూపంలో చూడగలము కాని శుద్ధ చైతన్యంగా దానికి రూపురేఖలు, అంగాలు లేవు.

**న చక్షుః శ్రోతం తదపాణిపాదమ్**

కాంతి ఉన్నదని ప్రత్యక్షంగా తెలియదు. కాని నా చెయ్యి పెడితే తెలుస్తుంది. **దూరాత్ సుదూరే (అజ్ఞానికి) –** అజ్ఞానికి చాలా దూరమైన వస్తువు కన్నా ఇంకా దూరం. అతను వస్తువుగా వెతుకుతాడు కాబట్టి ఎంత వెతికినా దొరకదు. అతనికి అది బ్రహ్మలోకం కన్నా దూరంగా ఉన్నట్టు. బ్రహ్మలోకమే ఎంతో దూరం. బ్రహ్మను వెతికే అతనే బ్రహ్మ. అందువల్ల అది దూరంగా లేదు. కాని అది తెలియక వెతికి దూరం అనుకుంటున్నాడు. వెతకటం ఆపేసినా అది దూరమే. మిగిలింది నిస్పృహే! 'ఈ బ్రహ్మను నేను పొందలేను, అది చాలా దూరం,' అనుకుంటాడు. సంసిద్ధమైన మనసు లేనివాడికి, గురుప్రాప్తి పొందని వాడికి అది దూరాత్ సుదూరే. బ్రహ్మకూ తనకూ మధ్యదూరం లేదని తెలుసుకోవాలి. దూరాన్ని కాలంతో కొలుస్తాము. ఒక సమయంలో జరిగినది అనుభవం కిందకి వస్తుంది. బ్రహ్మ అనుభవంలోకి వచ్చేది కాదు.

**తదిహాన్తికే చ –** (జ్ఞానికి) తత్+ఇహ+అన్తికే చ– జ్ఞానికి దగ్గర దాని కన్నా చాలా దగ్గర. చాలా దగ్గర అన్న మాట కూడా చాలదు. అది తనే అని తెలుసుకుంటాడు.

ఇహ అంటే ఇక్కడే, ఇప్పుడే. కాలం,ప్రదేశం రెండూ వస్తాయి. ఇక్కడే ఈ శరీరంలో, ఇప్పుడే బ్రహ్మను దర్శించ వచ్చు. అంగుళం కూడా శారీరకంగా కదలనవసరం లేదు. ఆలోచనలో మార్పు కూడా అవసరం లేదు.

**ప్రతిబోధ విదితం మతం – కేన 2-4**

ప్రతి ఆలోచన కూడా బ్రహ్మే. దూరం, దగ్గర రెండు పదాలు వాడటం వల్ల అది దూరమూ కాదు, దగ్గరా కాదు. అది నువ్వే అంటోంది.

**పశ్యత్సు నిహితం గుహాయామ్ –** మనసనే గుహలో ఉందని గ్రహిస్తారు. మనసుని గుహతో ఎందుకు పోల్చిందంటే గుహ చీకటిగా ఉంటుంది.

మన మనసు అజ్ఞానమనే చీకటితో నిండి ఉంటుంది. చేతన ప్రాణులన్నింటిలోనూ ఆత్మ ఉంది.

**ఇహైవ –** ఇక్కడే తెలుసుకుంటాడు. ఆత్మ ఇక్కడే, నాలోనే ఉంది అని తెలుసుకోవటం వల్ల జీవన్ముక్తి పొందుతాడు.

## మంత్రం - 8

**న చక్షుషా గృహ్యతే నాపి వాచా**

**నాన్యైర్దేవైస్తపసా కర్మణా వా।**

**జ్ఞానప్రసాదేన విశుద్ధసత్త్వః**

**తతస్తు తం పశ్యతే నిష్కలం ధ్యాయమానః॥**

**ప్రతిపదార్థం:–** చక్షుషా – కన్నులతో; న గృహ్యతే – తెలియబడదు. నాపి వాచా – వాక్కుచేత కూడా; నాన్యైర్దేవై – ఇతర ఇంద్రియాల చేత; తపసా – ఉపాసన వల్ల; కర్మణా వా – కర్మల చేత; జ్ఞానప్రసాదేన – ఏకాగ్రతతో; విశుద్ధ సత్త్వః – శుద్ధమైన సత్త్వగుణంతో; తమ్ – ఆ ఆత్మను; ధ్యాయమానా – నిదిధ్యాసనం చేత; తతస్తు – తరువాత; నిష్కలమ్ – విభాగరహితమైన; పశ్యతే – చూస్తాడు.

**తాత్పర్యం:–** ఆత్మ కన్నులతో కాని, వాక్కు చేత కాని, ఇతర ఇంద్రియాల చేతకాని, ఉపాసన చేత కాని, కర్మల చేత కాని తెలియదు. ఏకాగ్రతతో, శుద్ధసత్త్వగుణంతో ఉన్న సాధకుడు నిదిధ్యాసనం చేత తరువాత నిష్కలం ఆత్మను చూస్తాడు.

**వివరణ:–** ముందు మంత్రాన్ని ఇక్కడ ఇంకొంచెం వివరంగా చూస్తాము. సూక్ష్మబుద్ధి అంటే ఏమిటి? సత్త్వగుణం ప్రధానంగా ఉన్న మనస్సు. అంటే రజోగుణ, తమోగుణ స్వభావం లేనిది. రజోగుణం ఎక్కువగా ఉంటే మనసు బాహ్యంగా ఉండి, చంచలంగా, నిలకడ లేకుండా, అన్యాక్రాంతంగా ఉంటుంది. అటువంటి మనసు ఏకాగ్రత చూపలేదు. అందువల్ల జ్ఞానం లభ్యమవదు. తమోగుణం ఎక్కువ ఉంటే పై లక్షణాలేవీ ఉండవు కాని నిద్రాగుణం ఎక్కువగా ఉంటుంది.

అందువల్ల ఇటువంటి మనసుకి కూడా జ్ఞానం లభ్యమవదు. చంచలం కాని, మెలకువగా ఉండే లక్షణం సత్త్వగుణానికి ఉంది. కర్మయోగం, ఉపాసన యోగాలు సత్త్వగుణాన్ని పెంచటానికి తోడ్పడుతాయి. గీత 14వ అధ్యాయంలో ఈ విషయం వివరంగా వస్తుంది.

శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయటంతో పాటు, సత్త్వగుణ ప్రధానంగా ఉన్న మనసు కలిగి ఉండాలి అని ఈ మంత్రం చెప్తోంది. ముందుగా ఆత్మ లక్షణాన్ని వివరిస్తోంది.

**న చక్షుసా గృహ్యతే –** ఆత్మను కళ్ళు చూడలేవు. అద్రేశ్యమ్, అగ్రాహ్యమ్, అగోత్రమ్, అవర్ణమ్ అని ముందే చూశాము. ఆత్మ వస్తువు కాదు కాబట్టి రూపం లేదు. రంగు లేదు.

**నాన్యైర్దేవై (నగృహ్యతే)–** దేవైః అంటే ఇక్కడ జ్ఞానేంద్రియాలు. కన్నుని ముందు పేర్కొంది. అందువల్ల కన్ను కాక తక్కిన జ్ఞానేంద్రియాలు కూడా ఆత్మను చూపలేవు. అంటే ఇంద్రియ అగోచరం.

**న వాచా –** వాక్కుకి అందదు.

**న వాగ్గచ్ఛతి నో మనః – కేన 1–3**

మాటలకు అందనిది. మనం వాడే మాటలన్నీ వస్తు అనుభవానికి చెందినది. అనుభవాలను వర్ణించటానికి పుట్టినవే పదాలు. సగుణ అచేతన ప్రపంచాన్ని వర్ణిస్తాయి అవి. ఆత్మను కూడా ఎవరైనా అనుభవిస్తే అప్పుడు కొత్త పదాలు పుడతాయేమో. తమాషా ఏమిటంటే ఆత్మ గురించి మాటలతో చెప్పలేమని ఎన్నో మాటలతో వర్ణిస్తారు. ఆత్మను పరోక్షంగా వర్ణిస్తారు. ఉదాహరణకు అక్కడ ఇద్దరు నిల్చున్నారు. అందులో మనం ఒకరిని చూపించి అతను చాలా తెలివైన వాడని అన్నామనుకోండి. అంటే ఏమిటి అర్థం? రెండోవాడు ఎందుకూ పనికిరానివాడని చెప్పకనే చెప్పినట్టన్నమాట.

**గురోఽస్తు మౌనం వ్యాఖ్యానం శిష్యాస్తు ఛ్ఛినసంశయా ॥**

**– దక్షిణామూర్తి స్తోత్రం**

ఆత్మ కంటికి కనబడే వస్తువు కాదు. కాని అది ఉంది అంటే ఏమిటి అర్థం? జగత్తు మొత్తంలో ఉన్నవి రెండే– సబ్జెక్టు (కర్త), ఆబ్జెక్టు (కర్మ). అది ఆబ్జెక్టు కాదు అంటే గమనించబడని ఆబ్జెక్ట్ కాదు. అది సబ్జెక్టే అంటే నేనే. అందువల్ల నాపి వాచా అంటే–

**వాచ్యార్థేన న గృహ్యతే –** ప్రత్యక్షంగా వర్ణించలేము.

**లక్ష్యార్థేన ఏవ గృహ్యతే–** పరోక్షంగా మాత్రమే చెప్పగలము.

నిజ జీవితంలో మనకు తెలియకుండా లక్ష్యార్థం వాడేస్తుంటాము. ఇద్దరు అబ్బాయిలు ఉంటే వచ్చినవారందరితో పెద్దబ్బాయిని తెగ పొగుడుతూ మాట్లాడుతాము. రెండో అబ్బాయి దాన్ని మౌన వ్యాఖ్యానం కింద తీసుకుంటాడు. (మనకు ఆ ఉద్దేశం లేకపోయినా) తను ఎందుకూ పనికిరానివాడినని ఆత్మన్యూనతా భావంతో కృంగిపోతాడు.

**తపసా కర్మాణా వా (న గృహ్యతే)–** తపస్సు వల్ల, వైదిక కర్మల వల్ల పొందలేము. ఇక్కడ గురువు చెప్పిన మాటలను జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. తపస్సు, కర్మలు మానమని కాదు అర్థం. కర్మల వల్ల చిత్త శుద్ధి కలుగుతుంది. ఉపాసన

వల్ల చిత్త ఏకాగ్రత కలుగుతుంది. వాటితో ఆగిపోకుండా చిత్తశుద్ధి,చిత్త ఏకాగ్రత పెంచుకుని జ్ఞానయోగానికి రావాలి.

**జ్ఞానప్రసాదేన –** ఇప్పుడు ముఖ్యసాధన చెప్తోంది. ఉపనిషత్తు క్లాసులకు వెళ్ళాలి. మంచి బెంజ్‌కారు కొనుక్కుని రెండు గంటలు ప్రయాణం చేసి ఉపనిషత్తుల క్లాసుకి వెళ్ళారనుకోండి. తీరా అక్కడికెళ్ళాక, అమ్మో కొత్తకారుని ఎవరైనా పాడు చేస్తారేమో అని కారులోనే కూర్చున్నారనుకోండి. ఏమిటి లాభం? అందుకని కర్మ ఉపాసనలతో ఆగిపోకూడదు.

**జ్ఞానయోగానికి రానిదే కర్మ యోగం అసంపూర్ణం**
**కర్మయోగం లేనిదే జ్ఞానయోగం అసంభవం**

మనసుని ప్రశాంతంగా చేసుకోవాలి. మనసు ఎగిరెగిరీ పడకూడదు. మందంగానూ ఉండకూడదు. రెండూ పనికిరావు. ఏకాగ్రతతో గురువు చెప్పేది వినాలి.

**విశుద్ధ సత్త్వః –** శుద్ధ సత్త్వ అంతఃకరణం ఉండాలి. రజో, తమో గుణాలతో పాడవని చిత్త శుద్ధి ఉండాలి.

**త్రైగుణ్యవిషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జున।**
**నిర్ద్వంద్వో నిత్య సత్త్వస్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్॥ – గీత 2 –45**

ఉపనిషత్తు నుంచి స్వీకరింపబడింది గీతలోని ఈ శ్లోకం. మనసు ప్రశాంతంగా ఉంది. దీనితో జ్ఞానం వచ్చేస్తుందా? శాస్త్ర విచారణకి వచ్చి తీరాలి. మనసు అంతకుముందు అల్లకల్లోలంతో కూడిన అజ్ఞానంతో ఉంటే, ఇప్పుడు ప్రశాంతతతో నిండిన అజ్ఞానంతో ఉంది. అందుకని ప్రశాంతత ఉండాలి. వేదాంత శాస్త్ర విచారణ కూడా చేయాలి.

ఉదాహరణకు నా మొహం నేను చూసుకోవాలంటే ఇష్టం ఉన్నా లేకపోయినా అద్దం వాడాలి. ఇది ముఖ్యం. బాగానే ఉంది కాని కళ్ళు కనబడవు. అప్పుడు? ఎంత మంచి అద్దమున్నా నన్ను నేను చూసుకోలేను. అంటే ఏ ఒక్కటి ఉన్నా చాలదు. రెండూ కావాలి. **లోచనాభ్యాం విహీనస్య దర్పణం కిం కరిష్యతి?**

శాస్త్రం ఉండి, గురువు ఉపదేశం ఉండి, శిష్యునికి సాత్త్విక అంతఃకరణం లేకపోతే శాస్త్రం ఏం చేస్తుంది? శుద్ధ అంతఃకరణంతో పాటు శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయాలి.

**తతస్తు –** తరువాత (శుద్ధ సత్త్వ అంతఃకరణం పొందాక)

**తం పశ్యతే నిష్కలం –** సాధకుడు ఆ ఆత్మను స్పష్టంగా అర్థం చేసుకుంటాడు. ఎటువంటి ఆత్మను చూస్తాడు? సజాతీయ, విజాతీయ స్వగత భేదరహిత ఆత్మానం పశ్యతే. ఎలా?

**ధ్యాయమానః –** నిదిధ్యాసనం చేయటం వల్ల. శ్రవణ, మననలు చేసి నిదిధ్యాసనానికి వస్తారు కాబట్టి అవి కూడా కలుపుకోవాలి.

ఇక్కడ చెప్పిన సాధనలు– జ్ఞానయోగం – శ్రవణ, మనన, నిదిధ్యాసనలు.
సాత్త్వికఅంతఃకరణ– సాధన చతుష్టయ సంపత్తి

**ప్రత్యేక విశ్లేషణ: –** ఆత్మ ఇంద్రియ అగోచరం. ఇంద్రియాలకందని కొన్నింటిని మాటలతో వర్ణించవచ్చు. ఉదాహరణకు – స్వర్గలోకం, దాని అధిపతి ఇంద్రుడు, అతని వజ్రాయుధం, ఐరావతం – వీటన్నింటినీ గురించి శాస్త్రం చెప్తుంది.

**నాపి వాచా –** కాని శ్రుతి మాటలకు కూడా అందదు అంటోంది. చైతన్యం అన్నప్పుడు ఆత్మ లక్షణం చెప్తోంది శ్రుతి. ఇవి తక్కిన మాటల్లాంటిది కాదు. దీనికి అర్థం ఉంటుంది. కాని ఆబ్జెక్ట్ ఉండదు. ఉన్నదంతా బ్రహ్మే. అందుకని ఇది పదాల లక్ష్యం అవుతుంది. పదాలు ఆత్మ గురించిన అపోహలను పారద్రోలుతాయి.

సత్యం, జ్ఞానం, అనంతం బ్రహ్మ అంటాము. 'సత్యం' పదం తీసుకుంటే సత్యం అంటే 'సత్ ఉన్నదేదైనా.' దాన్ని 'అనంతం' అన్నపదంతో కలిపి వాడటం వల్ల సత్యంకున్న పరిమితులు పోతాయి. అనంతం అంటే దేశకాలాలకు అతీతమైనది. అందువల్ల సత్యం అంటే కాలపరిమితి లేదు, మూడుకాలాల్లోనూ ఉండేది అని వస్తుంది. ఈ అర్థం వాచ్యార్థం కాదు, లక్ష్యార్థం. అలాగే జ్ఞానం. 'జ్ఞానం' అంటే తెలుసుకోవటం. జ్ఞానాన్ని తెలుసుకునే వ్యక్తిని ప్రమాతా అనీ, తెలుసుకోబడే దాన్ని ప్రమేయం అనీ, జ్ఞానాన్ని ప్రమా అనీ అంటారు. ఈ మూడూ బ్రహ్మే కానీ బ్రహ్మ ఈ మూడింటికీ అతీతమైనది. అందుకని జ్ఞానం అంటే అనంతం అని అర్థం వస్తుంది. మనకున్న పదాలు వర్ణించేవి అశాశ్వతమైన వస్తువుని, మనం వర్ణించాల్సింది శాశ్వతమైన వస్తు తత్త్వాన్ని. అందుకే వాచ్యార్థం సరిపోదు.

మనకు జీవితంలో ఏం కావాలన్నా దానికో కర్మను సూచిస్తాయి వేదాలు. అలాగే మోక్షం పొందటానికి కూడా ఏదన్నా కర్మ ఉందేమోనన్న అపోహ పడకుండా

న తపసా కర్మణా వా అంటోంది. కర్మ, ఉపాసనల వల్ల మోక్షం పొందలేము. కర్మ వల్ల ఆత్మను పొందగలిగేటట్లయితే , దాన్ని చూడగలము.

కర్మవల్ల నాలుగు ఫలితాలు పొందుతాము. కాని ఆత్మ విషయంలో ఈ ఫలితాలు కుదరవు.

| కర్మ | | ఆత్మ | |
|---|---|---|---|
| 1. ఉత్పత్తి | – వడ్లు పండించటం | – నిత్యసిద్ధం | – పుట్టుకలేదు |
| 2. ఆప్తి | – వేరే ఊరికి పంపటం | – సర్వవ్యాపకం | – ప్రయాణం లేదు |
| 3. సంస్కారం | – పొట్టు తీయటం | – నిత్యశుద్ధం | – కాలుష్యం లేదు |
| 4. వికారం | – అన్నంగా మారటం | – నిర్వికారం | – మార్పుచెందదు |

ఆత్మ శుద్ధ చైతన్యం. దానికి ఫలితం అంటదు. అలాగే తపస్సు వల్ల కూడా ఆత్మను పొందలేము. ఎందుకంటే తపస్సు వల్ల సాధ్యవస్తువును పొందుతాము,కాని ఆత్మ సాధ్యవస్తువు కాదు. సిద్ధ వస్తువు.

**తపసా బ్రహ్మవిజిజ్ఞాసస్వ – తైత్తరీయం**

బ్రహ్మను తపస్సు వల్ల తెలుసుకో అంటుంది. ఇక్కడేమో ఆత్మను తపస్సు వల్ల పొందలేవు అంటోంది. మనం ఏ మాటను ప్రమాణంగా తీసుకోవాలి? సందర్భాన్ని బట్టి ఆ వాక్యం అర్థం మారుతుంది. తైత్తిరీయ ఉపనిషత్తులో 'తపస్సు' అంటే విచారణ. జ్ఞానం పొందటానికి విచారణ చేయమంటోంది.

ముందు మంత్రంలో '**తపసా లభ్యః**' అని వచ్చింది. ఇక్కడేమో '**న తపసా గృహ్యతే**' అని దానికి వ్యతిరేకంగా చెప్తోంది. ఇది ఉపనిషత్తు బోధనా విధానం. తపస్సు, కర్మ అవసరమే కాని వాటి వల్ల ఆత్మను పొందలేము.

కర్మ మనలో చిత్తశుద్ధిని, ఉపాసన చిత్త ఏకాగ్రతని పెంపొందించి, ఆత్మ జ్ఞానానికి సంసిద్ధులను చేస్తుంది. ప్రతిదానికీ ఒక స్థానం ఉంటుంది. ఏది సాక్షాత్ సాధన, ఏది సహకారీ సాధన అన్నది స్పష్టంగా తెలుసుకోవాలి.

**విశుద్ధ సత్త్వ–** విశుద్ధ సత్త్వ అంటే రాగద్వేషాల నుంచి విముక్తి చెందిన మనసు. అటువంటి మనసులో రాగద్వేషాలు లేవని కాదు. కాని రాగద్వేషాలకు బానిస అవదు, ప్రసాదం అంటే అది.

## మంత్రం - 9

**ఏషోఽణురాత్మా చేతసా వేదితవ్యః**
**యస్మిన్ ప్రాణః పంచధా సంవివేశ।**
**ప్రాణైశ్చిత్తం సర్వమోతం ప్రజానాం**
**యస్మిన్ విశుద్ధే విభవత్యేష ఆత్మా॥**

**ప్రతిపదార్థం:–** ఏషః –ఈ; అణుః– సూక్ష్మమైన; ఆత్మా– ఆత్మ; చేతసా వేది తవ్యః – మనస్సు చేత తెలుసుకోవాలి; యస్మిన్– ఏ; ప్రాణః – ప్రాణం; పంచధా– అయిదుగా; సంవివేశ – ప్రవేశించిందో; ప్రజానామ్ – జీవులు; ప్రాణై– ఇంద్రియాలు; చిత్తమ్ – మనస్సు, సర్వమ్ – అంతటా; ఓతం – అల్లబడి ఉంది; యస్మిన్– ఏ, విశుద్ధే– ప్రశాంతమైన మనస్సులో; ఏషః ఆత్మా– ఈ ఆత్మ; విభవతి – ప్రకాశిస్తుంది.

**తాత్పర్యం:–** సూక్ష్మమైన ఈ ఆత్మను సూక్ష్మమైన మనస్సు చేత తెలుసుకోవాలి. పంచప్రాణాలు ఉన్న శరీరంలో ఆత్మ ప్రకాశిస్తోంది. చైతన్యం రూపంలో అందరు జీవులలోని ఇంద్రియాలు, మనస్సు అంతటా అల్లబడి ఉంది. ప్రశాంతమైన మనస్సుతో ఈ ఆత్మను తెలుసుకోగలుగుతాము.

**వివరణ:–** ముందు మంత్రంలో చెప్పిన విశుద్ధ సత్త్వగుణ సాధన గురించి ఇక్కడ వివరంగా వస్తుంది. ఈ రెండూ కలిపి శుద్ధ అంతఃకరణం. అంటే ప్రశాంతత, ఏకాగ్రత ఉన్న మనసు.

**ఏషోఽణురాత్మా–** మామూలుగా అణువు అంటే చాలా చిన్నది. ఆత్మ సర్వవ్యాపకం కాబట్టి చిన్నది అనలేము. అందుకని చాలా సూక్ష్మమైనది. అణువుని పంచేంద్రియాలతో చూడలేనట్టుగా ఆత్మ కూడా ఇంద్రియ అగోచరం.

**చేతసా వేదితవ్యః–** ఈ ఆత్మ సూక్ష్మమైన అంశానికన్నా సూక్ష్మమైనది. సూక్ష్మమైన మనసు వల్లే తెలుసుకోగలము. సూక్ష్మమైన మనసు అంటే? ముందు మంత్రంలో వచ్చింది కదా. విశుద్ధ సత్త్వగుణం అన్నమాట. రజోగుణం, తమోగుణం తక్కువగా ఉండి సత్త్వగుణం ఎక్కువగా ఉన్న మనసు. ఈ విషయం ఎలా తెలుస్తుంది? మనసు చంచలమవకుండా ఆచార్యుని మాటలు ఏకాగ్రతతో వింటే సత్త్వగుణం ఎక్కువగా ఉన్నట్టు.

**ఏష సర్వేషు భూతేషు**

**గూఢోఽఽత్మా న ప్రకాశతే।**

**దృశ్యతే త్వగ్ర్యయా బుద్ధ్యా**

**సూక్ష్మయా సూక్ష్మదర్శిభిః॥ - కఠ 1-3-12**

ఈ ఆత్మ సమస్తజీవులలోనూ దాగి ఉంది. ప్రకటితం కాదు. కాని ఏకాగ్రత చెందిన సూక్ష్మమైన బుద్ధి ద్వారా ఈ ఆత్మను దర్శించగలరు.

ఎక్కడ ఉంది ఈ ఆత్మ? మన శరీరంలో

**మనోమయః ప్రాణశరీరనేతా**

**ప్రతిష్ఠితోఽన్నే హృదయం సన్నిధాయ - ముండకం 2-2-7**

**ప్రాణశరీరనేతా** - పరమాత్మ; **మనోమయః** - జీవాత్మగా;

**ప్రతిష్ఠితోఽన్నే హృదయం సన్నిధాయ-** అన్నమయ కోశంలో, హృదయంలో ఉన్నాడు.

**యస్మిన్ ప్రాణః పంచధా సంవివేశ-** ఈ స్థూల శరీరంలో ప్రాణం పంచప్రాణాలుగా ప్రవేశించి నివసిస్తోంది. పంచప్రాణాలు- ప్రాణ, అపాన, వ్యాన, సమాన, ఉదాన వాయువులు. ఇవి స్థూల శరీరంలో ఉన్నాయని మనకు ఏమిటి నిదర్శనం? అవి లేకపోతే శరీరం శవంతో సమానం. అందువల్ల ప్రాణంతో ఉన్న శరీరంలో ఆత్మను కనుగొనాలి. ఆత్మ ఎలా ఉంది?

**ప్రాణైశ్చిత్తం సర్వమోతం ప్రజానాం-**చైతన్యరూపంలో శరీరం అంతటా ఉంది. వెన్న పాలంతటా ఉన్నట్టు, చక్కెర చెరకుగడ అంతటా ఉన్నట్టు, చైతన్యం అంతటా ఉంది. ప్రాణై- అన్ని ఇంద్రియాలతో కలిపి; చిత్తం - మొత్తం మనసులో; సర్వం - అంతటా; ప్రజానాం- అన్ని జీవులలోనూ; ఓతం - (ఆత్మ చైతన్యం) అంతటా వ్యాపించి ఉంది. ఏమిటి నిదర్శనం? ఆత్మ చైతన్యం లేకపోతే శరీరం, ఇంద్రియాలు, మనసు అన్నీ జడం. దీపం వెలుగుతోందంటే దానిలో కనబడని విద్యుచ్ఛక్తి ఉంది. ఇవన్నీ చెప్పినప్పుడల్లా శుద్ధ చైతన్యానికున్న 5 లక్షణాలను గుర్తుంచుకోవాలి.

ఆత్మ అంతటా ఉంటే 'నాకెందుకు కనబడటం లేదు?' అని మనకు అనుమానం రావచ్చు. ఉదాహరణకు మీరు కాశీ చూడాలనుకుంటే, ఉన్నచోటునుంచి చూడలేరు కదా! అక్కడికి వెళ్ళాలి. కాని ఆత్మ తానే సబ్జెక్టు, తానే ఆబ్జెక్టు అయినప్పుడు,

మనం ఎక్కడికో వెళ్ళే అవసరం లేదు. మరి అయినా ఎందుకు తెలియటం లేదు? అది అందుబాటులో ఉన్నంతమాత్రాన గుర్తించాలని లేదు. మనకున్న అజ్ఞానం దీన్ని గుర్తించకుండా చేస్తోంది. మన అనారోగ్యానికి మూలికా వైద్యంలో పనికివచ్చే మొక్క ముందే మనం నిలుచున్నా మనక్కావాల్సిన మొక్క అదేనని మనం గుర్తించలేము, మనకు మూలికావైద్యం మీద అజ్ఞానం ఉంది కాబట్టి. అలాగే ఆత్మ అజ్ఞానం వల్ల ఆత్మను గుర్తించలేము. మనం పుట్టిందే అజ్ఞానంతో. దాన్ని పెంచి పోషించుకుంటూ వస్తున్నాము.

**యస్మిన్ విశుద్ధే విభవత్యేష ఆత్మా–** మనసు ప్రశాంతమయినప్పుడు, మనసులో ఉన్న చైతన్యం ప్రకాశిస్తుంది. అంటే గుర్తించటానికి అందుబాటులో ఉంటుంది. అదే మనసు అల్లకల్లోలంగా ఉంటే మన దృష్టి మనలో రేగే రాగద్వేషాల మీదికి పోతుంది. కాని, ఆత్మచైతన్యాన్ని చూడలేము. చేతిని చూపించి ఇక్కడేముంది అని మనను ఎవరైనా అడిగితే, చెయ్యి అంటామే గాని కాంతి ఉందని చెప్పలేము.

అలాగే మన రాగద్వేషాలను చూస్తాము కాని చైతన్యకాంతి వల్లే ఆ రాగద్వేషాలను చూడగలుగుతున్నామని తెలుసుకోము. చైతన్యం వల్లే అవి మన ఎరుకలోకి వస్తున్నాయి,కాని దాని ఎరుక మనకు రావటం లేదు.కాసేపు అయినా అన్నింటినీ పారద్రోలి,చైతన్యాన్నిచూడగలగాలి.

సినిమా హాలులో సినిమా చూస్తూ, సినిమాని చూపిస్తున్న తెరని పట్టించుకోము. తెర లేకపోతే ఆ పాత్రలకు ఉనికి లేదు. ఏమిటి నిదర్శనం? తెర ఉంటే పాత్రలు ఉన్నాయి. తెర లేకపోతే పాత్రలు లేవు. మధ్యలో విశ్రాంతి సమయంలో తెర మాత్రమే ఉంటుంది. అంటే తెర మాత్రమే అంతకు ముందు ఉంది, సినిమా జరుగుతున్నప్పుడూ ఉంది, సినిమా అయిపోయినా ఉంటుంది.

కాని ఎవరో రాసిన కథని, ఎవరో తీస్తే, మన మనసుని కదిలిస్తుంది. ప్రపంచం మిథ్య అయితే, మనసు మిథ్య, ఆలోచనలు మహామిథ్య. చైతన్యమనే తెరని చూడలేము. అందుకే మన మనసుని ఆలోచనలనుంచి చైతన్యమనే తెర మీదకి మరలుస్తోంది వేదాంతం.

తెరని గుర్తుంచుకోవటం జ్ఞాననిష్ఠ. అప్పుడు ఎన్ని సీరియల్స్ చూసినా, ఏడ్చినా వెంటనే మర్చిపోతాం. ఫలానా నటి బాగా నటించింది అనుకుంటాము. మిథ్యాజగత్ నుంచి సత్య అధిష్ఠాన చైతన్యం వైపుకి దృష్టి మరల్చటమే జ్ఞాననిష్ఠ.

## మంత్రం - 10

**యం యం లోకం మనసా సంవిభాతి**
**విశుద్ధసత్త్వః కామయతే యాంశ్చ కామాన్।**
**తం తం లోకం జయతే తాంశ్చ కామాన్**
**తస్మాదాత్మజ్ఞం హ్యర్చయేద్ భూతికామః॥**

**ప్రతిపదార్థం:–** విశుద్ధ సత్త్వః – శుద్ధ సత్త్వగుణం ఉన్న; మనసా– మనస్సుతో; యం యమ్– ఏ ఏ; లోకం– లోకాలను; సంవిభాతి– భావిస్తాడో; యామ్– ఏ, కామాన్ చ– వస్తువులను; కామయతే – కోరుకుంటాడో; తం తమ్ – ఆయా; లోకమ్ – లోకాలను; తామ్ – ఆ; కామాన్ చ– వస్తువులను; జయతే – పొందుతాడు; ఆత్మజ్ఞమ్– ఆత్మజ్ఞానిని; అర్చయేద్– పూజించాలి.

**తాత్పర్యం:–** విశుద్ధ సత్త్వగుణం ఉన్న జ్ఞాని ఏ లోకాలను, ఏ కోరికలను కోరతాడో, ఆ లోకాలనూ, ఆ వస్తువులనూ పొందుతాడు. అందువల్ల లౌకిక ఫలాలను కోరే వ్యక్తి జ్ఞానిని పూజించాలి.

**వివరణ:–** అనేక సాధనలతో పాటు ఇంకో సాధన కూడా చెప్తోంది ఉపనిషత్తు. అది ఆత్మజ్ఞానుల పూజ. తక్కిన ఆధ్యాత్మిక సాధనల ద్వారా పొందేదాన్ని ఈ పూజ ద్వారా కూడా పొందవచ్చు. అదీ ఈ పూజ గొప్పతనం. ఈశ్వర ఉపాసన చేస్తే అన్ని అధికారాలు పొందవచ్చు. ఇక్కడ ఈశ్వరపూజ బదులు జ్ఞానపూజ చేస్తే పొందవచ్చు అంటోంది. అంటే పరోక్షంగా జ్ఞాని, ఈశ్వరుడు ఒక్కరే అంటోంది ఉపనిషత్తు.

**యో బ్రహ్మాణం విదధాతి పూర్వం**
**యో వై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై॥**
**తం హ దేవం ఆత్మబుద్ధి ప్రకాశం**
**ముముక్షుర్వై శరణమహం ప్రపద్యే॥ – శాంతి మంత్రమ్**

దేవుడిని, గురువును సమానంగా పూజించిన వారికి అంతా లభిస్తుంది.

**భగవాన్ భుక్తి, ముక్తి ప్రదాత; జ్ఞానికూడా భుక్తి, ముక్తి ప్రదాత.**

ఇంకో సందేహం – ఈశ్వరుడిని పూజించే కారణాలు రెండు. లౌకిక ఫలం కోసం, ఆధ్యాత్మిక ఫలం కోసం.

జ్ఞాని ఎలా ఇస్తాడు?భగవంతుడు సంకల్పమాత్రం చేత ఇచ్చినట్టు జ్ఞానికూడా సంకల్ప మాత్రం చేత ఇస్తాడు.

**విశుద్ధసత్త్వః** – ఈ శక్తి అతనికున్న సత్యకామత్వం, సత్యసంకల్పత్వం వల్ల వచ్చింది. అంటే కేవలం ఆలోచనాశక్తితోనే దీవించగలడా? రజోగుణం, తమోగుణం తగ్గి, సత్త్వగుణం ఎక్కువ ఉంటే ఈ శక్తి దానంతట అదే వస్తుంది.

**యత్ర యత్ర సత్వగుణ ప్రధానత్వం, తత్ర తత్ర సత్యకామ సత్య సంకల్పత్వం**

**యం యం లోకం మనసా సంవిభాతి (జ్ఞాని)** – జ్ఞాని ఎటువంటి లోకం కావాలని మనసులో ఊహించుకుంటాడో;

**కామయతే యాంశ్చ కామాన్** – ఏది కోరుకుంటాడో;

**తం తం లోకం తాంశ్చ కామాన్ జయతే**– ఆయా లోకాలను పొందుతాడు. ఇక్కడ ఉపనిషత్తు లోకాలనూ,కోరిన వస్తువులనూ పొందుతాడని ఎందుకు చెప్తోంది? వేదాంతం అంటే వేద అంతభాగం. వేదమంతా కర్మకాండ గురించి చెప్తుంది. ఏ కర్మ చేస్తే ఏ కోరిక తీరుతుందో చెబుతుంది. స్వర్గలోకానికి వెళ్ళాలంటే ఏ యజ్ఞాలుచేయాలో చెబుతుంది. ఒక వ్యక్తి వేదాన్ని దాటి వేదాంతానికి వచ్చినా కూడా కర్మకాండ సువాసనలు, దాని ప్రభావం పూర్తిగా వదలకపోవచ్చు అతన్ని. అందుకని కర్మకాండ భాషే వాడి జ్ఞానిని మెచ్చుకుంటోంది.

**తస్మాద్ ఆత్మజ్ఞమ్ అర్చయేద్ భూతికామః** – జ్ఞానం పొందాక అతను తన కోసం కోరడు. లౌకిక ఫలాలకోసం; జ్ఞానిని ప్రార్థించండి.

జ్ఞాని సత్త్వగుణ ప్రధానంగా ఉంటాడు కాబట్టి, అతను ఏం కోరితే అది జరుగుతుంది. లౌకిక ఫలాలు ఏం కావాలన్నా అతన్ని ప్రార్థించండి అంటోంది ఉపనిషత్తు. మరి ఆధ్యాత్మిక ఫలాలు కావాలంటే ఏం చేయాలి? తరువాత ఖండంలో వస్తుంది దానికి జవాబు.

**ప్రత్యేకవిశ్లేషణ:**– మన భారతదేశంలో సన్యాసులను పూజించే సంప్రదాయం ఉంది. సన్యాసులను ఎందుకు పూజించాలో ఈ మంత్రం వివరిస్తోంది. ఈశ్వరుడిని ఎలా పూజిస్తామో, సన్యాసిని కూడా అలాగే పూజిస్తాము. జ్ఞానం పొందిన వ్యక్తి తన జ్ఞానాన్ని నలుగురితో పంచుకుంటాడు. అంటే విద్యాదానం చేస్తాడు. ఏ దానం చేసినా కూడా పుణ్యం వస్తుంది. అందువల్ల జ్ఞానికి రోజూ పుణ్యం వస్తుంది. అతను అకర్తా, అభోక్తాగా చేస్తాడు కాబట్టి అతని పుణ్యం అతనికి అంటదు. అతనికి సేవచేసే వ్యక్తులకు వెళ్ళి, వారికి కోరిన కోరికలను నెరవేరుస్తుంది.

ఈశ్వరుడికి అహంకారం లేదు. జ్ఞానికి అహంకారం మటుమాయం అవుతుంది. అందువల్ల జ్ఞాని కూడా పూజార్హుడవుతాడు. మనం ఒక రాతిలో ఈశ్వరుడిని పూజిస్తాము. ఈశ్వరునిగా చెక్కేముందు శిల్పి ఆ రాతిని ధ్యాన శ్లోకాలతో మంత్రించి, చెక్కుతాడు. ఒకసారి చెక్కటం ముగిసాక (లింగాకారం వచ్చాక) అందులోకి ప్రాణప్రతిష్ఠ చేస్తాము. రాతిని ఎందుకు పూజిస్తామంటే రాతిలో అహంకారం ఉండదు. రాతికి నేను శివుడిని అన్న అహంకారం ఉండదు. అలాగే జ్ఞానికి 'నేను ఫలానా,' అన్న అహంకారం ఉండదు. అతను తనను ఈశ్వరునికి భిన్నంగా ఊహించుకోడు. ఈశ్వరుడంతటి వాడవుతాడు. అందుకే అతనిలో ఈశ్వరుని ప్రతిష్టించుకోవచ్చు మనము.

**యే యథా మాం ప్రపద్యంతే తాంస్తథైవ భజామ్యహమ్।  – గీత 4 –11**

ఎవరు నన్ను ఎలా ప్రార్థిస్తే, ఆ రూపంలో వారిని నేను దీవిస్తాను అంటాడు కృష్ణపరమాత్మ. కృష్ణ స్వరూపమది. అతను ఈశ్వర స్వరూపము, జ్ఞానికూడా ఈశ్వర స్వరూపము.

'జ్ఞాని ఈశ్వర స్వరూపం అవచ్చేమో కాని అతను కూడా మనిషే కదా! అతనేదో నన్ను దీవిస్తాడని వెళితే జ్వరంతో గజగజ వణుకుతున్నాడు. అతనికే ఈశ్వర కృప కావాలి! అతనికి జ్ఞానం ఉంటే ఉండచ్చేమో కాని, అతనెలా దీవించగలడు?' అన్న సందేహం రావచ్చు ఎవరికన్నా. జ్ఞానిని మనం శరీరపరంగా కొలవటం లేదు. అతన్ని ఆత్మజ్ఞునిగా కొలుస్తున్నాము. మనం ఒక విగ్రహాన్ని కొలిచినప్పుడు ఏమవుతోంది? విగ్రహం దీవించదు మనను; విగ్రహంలో కొలువై ఉన్న ఈశ్వరుడు దీవిస్తున్నాడు. అలాగే జ్ఞాని శరీరమనే దేవాలయం దీవించదు మనను. అతనిలో కొలువై ఉన్న దేవుడు దీవిస్తున్నాడు.

# తృతీయ ముండకం

## ద్వితీయ ఖండం

ఇక్కడితో ముండకోపనిషత్తు ముగిసింది. శిష్యుని మొహం చూస్తే అతనికి అంతా అర్థమయినట్టు అనిపించింది గురువుకు. విద్యాబోధ చేయటంలో ఆరితేరిన గురువు శిష్యుని మొహం చూసి అతనికి అర్థమయిందా లేదా, అతను ఆస్వాదిస్తున్నాడా లేక అయోమయంగా చూస్తున్నాడా అన్న విషయం ఇట్టే పట్టేయగలడు (పరమార్థానంద స్వామి గారు అలాంటి ఆరితేరిన గురువు. ఒక విషయం విని సరిగ్గా మనం అయోమయంలో పడ్డప్పుడు తల తిరుగుతోందా అని అడిగి, దాన్ని మళ్ళీ మరికొంచెం తేలిగ్గా, మరికొంచెం విడమర్చి చెప్తారు).

శౌనక ఋషికి అర్థమయినట్టు గ్రహించటం వల్ల, అంగిరస ఋషి తన బోధని ముగిస్తున్నారు. సాధారణంగా, ముగించేటప్పుడు, గురువు తను అంతవరకూ చెప్పినదానికి ముక్తాయింపు పలకటమో, లేదా జ్ఞానఫలాన్ని చెప్పటమో, లేదా జ్ఞానాన్ని మెచ్చుకోవటమో చేస్తాడు. దాన్ని ఫలశృతి అంటారు. ఇందులో కూడా ఈ మూడూ ఉన్నాయి. ముముక్షువు ఆత్మజ్ఞుడిని పూజించటం వల్ల మోక్షాన్ని పొందగలడని మొదటి మంత్రం చెప్తోంది. మనమేది కోరితే అది లభిస్తుంది.

### మంత్రం - 1

**స వేదైతత్పరమం బ్రహ్మ ధామ యత్ర విశ్వం నిహితం భాతి శుభ్రమ్।**

**ఉపాసతే పురుషం యే హ్యకామాః తే శుక్రమేతదతివర్తన్తి ధీరాః॥**

**ప్రతిపదార్థం:-** యత్ర – ఎక్కడ; విశ్వమ్ – జగత్తు; నిహితమ్ – నెలకొని ఉందో; శుభ్రమ్ – శుద్ధ చైతన్యం; భాతి– ప్రకాశిస్తున్న; ఏతత్ – ఈ; పరమమ్ – శ్రేష్ఠమైన; ధామ – జగత్ అధిష్టానం; బ్రహ్మ – పరమాత్మను; సః – అతడు; వేద – తెలుసుకుంటాడు; యే – ఎవరు; ధీరాః – వివేకి; అకామాః – కోరికలు లేనివారు; పురుషమ్ – జ్ఞానిని; ఉపాసతే – ఆరాధిస్తున్నారో; తే – వారు; ఏతత్ – ఈ; శుక్రమ్ – పునర్జన్మను; అతివర్తన్తి – అధిగమిస్తారు.

**తాత్పర్యం:–** జగత్ అదిష్ఠానం బ్రహ్మ తానే అని జ్ఞాని తెలుసుకుంటాడు. ఎవరు ఈ జ్ఞానిని ఆరాధిస్తారో, వారు పునర్జన్మను అధిగమిస్తారు.

**వివరణ:–** ఈ మంత్రంలో మొదటి భాగం జ్ఞాని స్తుతి. అతను ఈశ్వరునితో ఎలా సమానమో వివరిస్తుంది.

**స వేదైతత్పరమం బ్రహ్మ ధామ–** సః అంటే జ్ఞాని – జ్ఞానికి తెలుసు. ఏతత్ అంటే పరంబ్రహ్మ (రెండవ ముండకంలో వర్ణించిన బ్రహ్మ). ఎటువంటి బ్రహ్మ? ధామ అంటే జగత్ అదిష్ఠానం బ్రహ్మ. బ్రహ్మ జగత్ అధిష్ఠానంగా మాత్రమే కాదు, ఆ అధిష్ఠానం బ్రహ్మను నేనే అని తెలుసు. తద్ బ్రహ్మ అహమస్మి.

**మయ్యేవ సకలం జాతం – కైవల్యోపనిషత్ 1–19**

ఇదీ అసలు జ్ఞానం. నేను బ్రహ్మను అన్నప్పుడల్లా ఆ నేను ఎవరో స్పష్టంగా గుర్తుంచుకోవాలి. శరీరం కాదు. మనసు కాదు. ఇంద్రియాలు కాదు. నేను అంటే చైతన్యం. బయటా, లోపలా అంతటా ఉన్న చైతన్యం. జ్ఞానికి ఇది స్పష్టంగా తెలుసు.

**యత్ర విశ్వం నిహితం భాతి –** ఆ బ్రహ్మలో విశ్వం నెలకొని ఉంది.

**శుభ్రమ్ –** శుద్ధచైతన్యం అహమస్మి. అందువల్ల ఈశ్వరునితో సమానం. ఈశ్వరుడు సృష్టిస్థితి, లయ కారణం. జ్ఞానీ సృష్టి, స్థితి లయకారణం. ఇద్దరూ సత్యకాములు, సత్య సంకల్పులు.

ఒక అద్భుతమైన శ్లోకంలో –

**ద్వేరూపే వాసుదేవస్య** – నారాయణకి రెండు రూపాలు
**చరం చ అచరమేవ చ** – కదిలే రూపం, కదలని రూపం
**చరం సన్యాసినాం రూపం** – కదిలే సన్యాసి
**అచరం ప్రతిమాసు చ** – కదలని విగ్రహం

అందుకే జ్ఞానిని కొలుస్తాము.

**యే అకామాః–** అతను లౌకిక ఫలం కోరడు. అంటే వైరాగ్యం కలిగినవాడు.

**ధీరా–** వివేకి. సాధన చతుష్టయ సంపన్నుడవుతాడు.

**పురుషం ఉపాసతే –** ఈ జ్ఞానీ పురుషులను పూజిస్తే వారు పునర్జన్మ పొందరు.

**శుక్రమేతదతివర్తన్తి –** శుక్రం అంటే ఇక్కడ పునర్జన్మ. వాచ్యార్థం తీసుకుంటే

పురుష బీజం. అదే తర్వాత స్థూలశరీరం ఏర్పడటానికి కారణమవుతుంది. అందుకని దాని లక్ష్యార్థాన్ని తీసుకుంటే పునర్జన్మ దాటతారు. గురువు ఉన్న అతనికి తెలుస్తుంది. గురువుకి అంటే జ్ఞానికి అన్నీ తెలుసు. అందుకని జ్ఞానికి పూజ చేస్తే మోక్షం కలుగుతుంది. శరీర ప్రాప్తి దాటుతారు. అంటే విదేహ ముక్తి కలుగుతుంది.

వెంటనే ఒక ప్రశ్న వస్తుంది. జ్ఞానిని పూజిస్తేనే విదేహముక్తి వస్తుందా? అలా అయితే జ్ఞానులందర్నీ ప్రోగేసి వారిని పూజిస్తే అయిపోతుందిగా! అంటే దాని అర్థం జ్ఞాని సాంగత్యం వల్ల, జ్ఞాని దీవెన వల్ల చిత్తశుద్ధి ఏర్పడుతుంది. తర్వాత నా క్లాసుకి రా నీకు బోధ చేస్తానంటాడు. పూజ వల్ల చిత్తశుద్ధి ఏర్పడుతుంది. బోధ వల్ల ఆత్మజ్ఞానం కలుగుతుంది. అందువల్ల జ్ఞాని ఉపాసన కూడా ఒక సాధన. మోక్షం అనుకోకుండా వచ్చేయదు. మోక్షం కావాలంటే ముందు జిజ్ఞాస ఉండాలి. ఆ జిజ్ఞాసని కలిగిస్తాడు జ్ఞాని.

## మంత్రం - 2

**కామాన్యః కామయతే మన్యమానః**
**స కామభిర్జాయతే తత్ర తత్ర।**
**పర్యాప్తకామస్య కృతాత్మనస్తు**
**ఇహైవ సర్వే ప్రవిలీయన్తి కామాః॥**

**ప్రతిపదార్థం:–** యః – ఎవరు; కామాన్ – కోర్కెలను; కామయతే – వాంఛిస్తారో; మన్యమానః – తీవ్ర తపనతో; సః – అతడు; కామాభి – కోర్కెల కారణం చేత; తత్ర తత్ర – ఆయా ఆయా పరిసరాలలో; జాయతే – పుడతాడు; పర్యాప్త కామస్య – కోరికలు నెరవేరిన; కృతాత్మనః తు – ఆత్మజ్ఞానికే; సర్వే కామాః – అన్ని కోర్కెలూ; ఇహ ఏవ – ఇక్కడే; ప్రవిలీయన్తి – కరిగిపోతాయి.

**తాత్పర్యం:–** ఎప్పుడూ కోరికల మీద తీవ్రమైన తపన ఉన్న అజ్ఞాని తిరిగి ఆ కోరికలకు చెందిన పరిసరాల్లో పుడతాడు. కోరికలు ఇక్కడే నెరవేరిన జ్ఞానికి, అన్ని కోరికలూ ఇక్కడే కరిగిపోతాయి (అతను జీవన్ముక్తి పొందుతాడు)

**వివరణ:–** ముందు మంత్రంలో జ్ఞానిని పూజించే వారికి చిత్తశుద్ధి,జ్ఞానం, విదేహముక్తి, (జీవన్ముక్తి మనం కలుపుకోవాలి) కలుగుతుందని చూసాము. వెంటనే మనకో అనుమానం కలుగుతుంది. జ్ఞానులకు ఎందుకు పునర్జన్మ లేదు? (2. 2. 8లో వివరంగా చూసాము) దానికి ఏమిటి కారణం? ఒక్కటే కారణం–

అతనికి కోరికలు లేవు. అతని విషయం చూసేముందు అజ్ఞాని పరిస్థితి చూద్దాం.

కామః అంటే తీవ్రమైన కోరిక. అది అనాత్మకి సంబంధించినది. ఇంటి బయటికి వచ్చాక ఎటు వెళతాము? మనకున్న కోరికను బట్టి సినిమాకో, షికారుకో వెళతాము. అందువల్ల మన గమ్యాన్ని ఏది నిర్ణయిస్తోంది? మనకున్న కోరిక. ఎలా తెలుసుకోవటం? మనం మరణశయ్య మీద ఉన్నప్పుడు భగవంతుడు ప్రత్యక్షమయి, నీకు ఒకటే కోరిక తీరుస్తాను. ఏం కోరుకుంటావు అని అడిగాడనుకోండి. మనం అప్పుడు ఏది కోరితే అదే మన తీవ్రమైన కోరిక అన్నమాట. అదే మన పునర్జన్మని నిర్ణయిస్తుంది. అది మన మార్గాన్ని + గమ్యాన్ని నిశ్చయిస్తుంది.

అజ్ఞానుల్లో కోరికలు రకరకాలు. అహంకార, మమకారాల వల్ల సంసారంలో కొట్టుమిట్టాడుతుంటారు. అందువల్ల ఏదో ఒక కోరికో, ఏదో ఒక వెలితో వెంటాడుతూనే ఉంటుంది. ఒక ఇల్లు ఉంటే రెండు ఇళ్ళు కావాలనుకుంటాడు. ఒక కారు ఉంటే ఎదుటివాడిది పెద్ద కారు అనుకుంటాడు. డబ్బుతో దేన్నైనా కొనవచ్చనుకుంటాడు.స్వర్గానికి వెళితే స్వేచ్ఛగా ఉండవచ్చనుకుంటాడు. అలా ప్రతి కోరిక వెనకా ఒక కారణం ఉంటుంది.

యవ్వనంలో ఊర్లు తిరగటానికి, చేతినిండా డబ్బు ఉండదు. కావాల్సినంత తీరిక ఉండదు. వయసుడిగాక చేతినిండా డబ్బు ఉంటుంది. సమయం పుష్కలంగా ఉంటుంది. కాని శరీరమే మొరాయిస్తుంది. ఇది **అన్నమయకోశం** సమస్య.

**ప్రాణమయకోశం** విషయానికి వస్తే, చిన్న వయసులో తినటానికి తిండి ఉండదు. ఉన్నా తీరిక ఉండదు. పెద్దయ్యాక ఆరోగ్యం సహకరించదు.

**మనోమయకోశం** విషయానికొస్తే చిన్నప్పుడు నలుగురు చుట్టూ ఉంటే, వారినుంచి పారిపోవాలని చూస్తాము. పెద్దయ్యాక నోరారా పలకరించే నాథుడే లేడని వాపోతాము. అబ్బాయి పెళ్ళయ్యేదాకా ఒక బెంగ, పెళ్ళయ్యాక ఇంకో బెంగ. పెళ్ళయ్యాక బొత్తిగా భార్యావిధేయుడైపోయాడు, ఒక్క ఫోనన్నా చేయడని వాపోతాము. పోనీలే కుర్రజంట ఆనందంగా గడపనీ అనుకోము. తల్లి అల్లం, పెళ్ళాం బెల్లం అయిపోయింది అని వాపోతాము.

**విజ్ఞానమయకోశం** విషయానికొస్తే వయసు పెరిగేకొద్దీ ఏదీ గుర్తుండదు.

**ఆనందమయకోశం** విషయానికి వస్తే అందులో ఆనందం ఏ కోశానా ఉండదు. ఇన్ని సమస్యలు ఊహించుకుంటుంటే ఆనందం ఎక్కడిది? కొందరికి నాకు ఏ సమస్యా లేదే అన్నది పెద్ద సమస్య. కొందరిని స్వర్గంలో తీసుకెళ్ళి పడేసినా ఇంద్రుడు ఐరావతం మీద తిరుగుతున్నాడు నాకేదీ అనే రకం.

పైన వివరించిన సమస్యలన్నింటినీ క్రోఢీకరించి ఉపనిషత్తు ఒక్కమాటలో తేల్చేసింది. అది కామః అంది.

**కామాన్యః కామయతే మన్యమానః –** అజ్ఞాని అనేక కోరికలను కోరుకుంటాడు. కామాన్ అంటే విషయ వస్తువులు, కామయతే అంటే కోరికలు, మన్యమాన అంటే వాటిమీద తీవ్రమైన తపన ఉంటుంది.

**స కామభిర్జాయతే తత్ర తత్ర –** ఆ అజ్ఞాని, తనకి తీవ్రమైన కోరిక దేనిమీద ఉంటే ఆ వాతావరణంలో పుడతాడు. ఉదాహరణకు గేదెలు రోడ్డుమీద స్వైరవిహారం చేస్తాయి. వాటిని ముద్దుగా బ్రేక్ ఇన్‌స్పెక్టర్లంటారు. వాటిని చూసి మనం ఈర్ష్యపడితే వచ్చే జన్మలో మనం గేదెగా పుట్టి, తక్కిన గేదెల మధ్య, అవి తిరిగే పరిస్థితులలో పుడతాము. స్వర్గానికి వెళ్ళాలని కోరేది ఊరికే అక్కడ ఉండిపోవడటానికి కాదు, స్వర్గభోగాలను అనుభవించటానికి. తత్ర తత్ర అంటే అదీ అర్థం. కామభి అంటే ఆయా కోరికలకు సంబంధించిన వస్తువులతో. ఇదీ అజ్ఞాని పరిస్థితి. అక్కడ మళ్ళీ ఏవో కోరికలు కోరి, మళ్ళీ పనులు చేస్తాడు. దానివల్ల మళ్ళీ మళ్ళీ పుడుతూ ఉంటాడు.

ఇప్పుడు జ్ఞాని పరిస్థితి చూద్దాము. జ్ఞానికి కోరికలు ఉండవు. నేనే సృష్టి స్థితి, లయ కారకుడిని అనుకునే జ్ఞానికి కోరిక ఏం ఉంటుంది?

అందువల్ల పూర్ణత్వం సిద్ధిస్తుంది. కామం అనే ఇంధనం లేకపోవటం వల్ల అతని సూక్ష్మశరీరం ఎక్కడికీ ప్రయాణం చేయాల్సిన పనిలేదు.

**పర్యాప్త కామస్య కృతాత్మనస్తు–** కృతాత్మ అంటే మార్పును సాధించాడు. ఒక మతం నుంచి ఇంకో మతానికి మారలేదు.

**నేను అసంపూర్ణ జీవిని కాదు. నేను పరిపూర్ణ బ్రహ్మను.**
**నేను శరీరం కాదు, చిదాభాస కాదు. నేను చిత్‌ను.**
**నేను మనోబుద్ధులు కాదు, నేను చైతన్యాన్ని.**

ఈ విషయం గ్రహించటం వల్ల శరీరం పోతే, నేను పోయినట్టు కాదు. సుషుప్తి దానికి ఉదాహరణ. కృతాత్మ, పర్యాప్త – రెండు పేర్లు జ్ఞానికి. గీతలో మూడవ అధ్యాయంలో లోక సంగ్రహః అని వస్తుంది. జ్ఞాని సంఘసేవ చేస్తాడు. కాని అది కోరికతో కాదు. కోరిక తీరి చేస్తాడు. ఇవ్వాలన్న కోరిక ఉంటే అది పూర్ణత్వం. పొందాలన్న కోరిక ఉంటే అది అపూర్ణత్వం. ఋషులు, శంకరాచార్యులు మనకు ఈ ఉపనిషత్తులు పూర్ణత్వం వల్ల ఇచ్చారు.

**ఇహైవ సర్వే ప్రవిలీయన్తి కామాః–** అటువంటి జ్ఞానికి ఇక్కడే, ఈ జన్మలోనే అతన్ని కట్టిపడేసే కోరికలన్నీ కరిగిపోతాయి. దీన్ని జీవన్ముక్తి అంటారు. అందువల్ల జ్ఞానికి పునర్జన్మ లేదు. అతని సూక్ష్మశరీరం సమష్టి సూక్ష్మప్రపంచంలో, కారణశరీరం సమష్టి కారణప్రపంచంలో కలిసిపోతాయి.

**ప్రత్యేక విశ్లేషణ:– పర్యాప్త కామస్య కృతాత్మనస్తు –** దీని గురించి దయానంద సరస్వతి స్వామి బాగా విశ్లేషించారు – మామూలుగా చూస్తే ఒక కోరిక తీరినంత మాత్రాన సమస్యలన్నీ తీరవు. అలాగని ఒక కోరిక తర్వాత ఇంకో కోరిక కూడా తీర్చుకుంటూ రాలేము. ఎందుకంటే కోరికలు అనంతం. మనకే కొత్తకోరిక పుడుతుందో ఇప్పుడు చెప్పలేము. కొత్త వస్తువులు బజారులోకి వచ్చినకొద్దీ కొత్త కోరికలు పుట్టుకువస్తాయి.

ఉన్నదంతా ఒకటే, మనకు భిన్నంగా ఏదీ లేదని తెలిసాక, అన్ని కోరికలూ సమసిపోతాయి. మనం సిద్ధపురుషులమని తెలిసాక, మోక్షం కూడా కోరము. ఉదాహరణకు ముక్కు కావాలని కోరతామా?ముక్కు ఉందని తెలుసు. అలాగే జగత్తు అంతా నా నుంచే వచ్చింది. నాలోనే లయమవుతుంది అని తెలిసాక ఏ వస్తువుని కోరతాము? ఒకవేళ ఏదైనా కోరినా అది మనను కట్టిపడేసే కోరిక కాదు.

**ధర్మావిరుద్ధో భూతేషు కామోఽస్మి భరతర్షభ।। – గీత 7-11**

ఓ అర్జునా, మనుష్యుల్లో నేను కోరికను.

మోక్షం కోసం కోరే కోరిక కూడా ఒక కోరికే. కాని అది అన్ని కోరికలనీ మటుమాయం చేస్తుంది. ఆ ఒక్క కోరికని తీర్చుకోవటం వల్ల పర్యాప్తకాములం అవుతాము. సరియైన మార్గంలో వెళ్ళి, సరియైన గురువు దొరికితే, కోరే వ్యక్తినీ నేనే, కోరబడే వస్తువూ నేనే, అని గ్రహిస్తాము.

అటువంటి వ్యక్తిని కృతాత్ముడు అంటారు. అతను అజ్ఞానం నుంచి విముక్తి పొందుతాడు. అజ్ఞానం పోనిదే పర్యాప్తకాముడు అనలేము. రాగద్వేషాలకు బందీకాని మనసున్నవాడు కృతాత్ముడు అని అర్థం చేసుకుంటే, పర్యాప్త కామస్య కృతాత్మనస్తు అంటే, కృతాత్ముడు కాబట్టి, పర్యాప్తకాముడు' అయ్యాడు అని అర్థం వస్తుంది. అటువంటి వ్యక్తికి కోరికలన్నీ ఇక్కడే సమసిపోతాయి.

కామం లేదా కోరికను మనం ఎన్నుకునే అవకాశం ఉంది. మన ప్రమేయం లేకుండా మనలో కోరికలు రేగవచ్చు. కాని మనం అలా రేగిన ప్రతి కోరికనూ తీర్చుకుంటూ పోవాలన్న నియమమేమీ లేదు. అది తీర్చాలా వద్దా అన్నది మన చేతిలో ఉంది. మోక్షం ఎన్నుకోవాలా మరేదైనా ఎన్నుకోవాలా అన్నది మన ఇష్టం. మోక్షం కోరినా కూడా ఆ కోరిక తీరటానికి మరి కొన్ని విషయాలు కూడా తీర్చాల్సి ఉంటుంది. అంతకుముందు, సాక్షాత్ సాధన, సహకారీ సాధనలు చూసాము.

ఉదాహరణకు శాస్త్రంతో పాటు కొంత వ్యాకరణం కూడా నేర్చుకోవాలి. కేవలం వ్యాకరణం నేర్చుకుంటే మోక్షం వచ్చేయదు. కాని వ్యాకరణం నేర్చుకోవటం అనవసరం కాదు. ఇక్కడే పొరపాటు పడతాము.

వంట చేయాలంటే పొయ్యి గట్టు తుడుచుకోవాలి. గిన్నెలు కడుక్కోవాలి. కూరలు తరుక్కోవాలి. బియ్యంలో రాళ్ళు ఏరాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి, గట్టు మీద వేరే పనిచేయవచ్చు. ఇవన్నీ వంటలో భాగాలు. వంట అంటే ఇదీ అని సరిగ్గా నిర్వచించలేము. చాక్లెట్ తినాలంటే దానికున్న కాగితాన్ని విప్పాలి. కాగితం విప్పినంతమాత్రాన చాక్లెట్ తిన్నట్టు కాదు. కానీ చాక్లెట్ తినాలంటే కాగితం విప్పాలి. మనం చేసే ఏ చర్యని తీసుకున్నా అలాగే ఉంటుంది. ఏ చర్యకి ఏ ఫలితం అన్నది కూడా ఖచ్చితంగా చెప్పలేము. కొన్ని పనుల సముదాయం వల్ల ఒక ఫలితం ఏర్పడుతుంది. కాని ఒక చర్యకి ప్రతిచర్య ఉందంటాము. వంట విషయం తీసుకుంటే వంటకు అగ్ని ముఖ్య సాధన. తక్కినవన్నీ సహకారీ సాధనలు. అలాగే మోక్షం విషయంలో జ్ఞానం ముఖ్యసాధన. తక్కినవన్నీ సహకారీసాధనలు. ముందు జ్ఞానం పొందాలన్నది మనం ఎన్నుకోవాలి.

ఒక్కోసారి మన ప్రమేయం లేకుండా జ్ఞానం కలగవచ్చు. ఉదాహరణకు మనకు సరియైన ప్రమాణం ఉండి, ఆ ప్రమాణం వల్ల తెలిసే వస్తువు

అందుబాటులో ఉంటే, మనకు తెలియకుండానే జ్ఞానం ఏర్పడిపోతుంది. దానికి ఉదాహరణ వాసన. వాసన బట్టి అక్కడ తీపి వంటకం చేస్తున్నారా, వంకాయ కూర చేస్తున్నారా చెప్పేయగలము.

కాని ఆత్మజ్ఞానం పొందటం అలా అనుకోకుండా జరగదు. మోక్షం ముందే సిద్ధవస్తువు. ఆత్మ మనకు తెలిసినా, తెలియకపోయినా బ్రహ్మే. అది కొత్తగా వచ్చి మనకు పరిచయమయిపోదు. అందుకని ఇక్కడ మనమే ఆత్మజ్ఞానం కావాలని దాన్ని ఎన్నుకోవాలి. దాన్ని చూపించే సరియైన ప్రమాణాన్ని కూడా ఎన్నుకోవాలి. కర్మకాండ కావాలా, ఉపనిషత్తు కావాలా తేల్చుకోవాలి. దాని తరువాత శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువును ఎన్నుకోవాలి. అప్పుడు,తనని వరించి అంటే ఆత్మవరణం చేసిన వానికి ఆత్మ లభ్యమవుతుంది.

## మంత్రం - 3

**నాయమాత్మా ప్రవచనేన లభ్యః**
**న మేధయా న బహునా శ్రుతేన।**
**యమేవైష వృణుతే తేన లభ్యః**
**తస్యైష ఆత్మా వివృణుతే తనుం స్వామ్॥**

**ప్రతిపదార్థం:-** అయమ్ ఆత్మా- ఈ ఆత్మ; ప్రవచనేన - వేదాధ్యయనం చేత; న లభ్యః - లభించదు; న మేధయా- మేధాశక్తి చేత కాదు; బహునా శ్రుతేన- ఎంతో వినటం చేతకాదు; యమేవైష - ఎవరుదానికోసమే; వృణుతే - తీవ్ర ముముక్షత్వం పొందుతారో; తేన లభ్యః - అతనికే లభ్యమవుతాడు; తస్య - అతనికి; ఏష ఆత్మ - పరమాత్మ; తనుం స్వామ్ - తన పూర్ణ స్వరూపాన్ని; వివృణుతే - ప్రకటిస్తాడు.

**తాత్పర్యం:-** తీవ్ర ముముక్షుత్వం లేకపోతే, ఎంత వేదాధ్యయనం చేసినా, ఎంత మేధాశక్తి ఉన్నా, ఎన్ని ఉపనిషత్తులు విన్నా, లాభం లేదు. తీవ్రముముక్షత్వం ఉన్న సాధకునికే పరమాత్మ తన స్వరూపం ప్రకటిస్తాడు.

ఇదే మంత్రం కఠలో ఇలాగే (అక్షరం భేదం లేకుండా) వస్తుంది.

**నాయమాత్మా ప్రవచనేన లభ్యో**
**న మేధయా న బహునా శ్రుతేన।**
**యమేవైష వృణుతే తేన లభ్య -**
**స్తస్యైష ఆత్మా వివృణుతే తనూం స్వామ్॥ -కఠ 1-2-23**

**వివరణ:–** రెండవ మంత్రం సంసారానికి కారణం, మోక్షానికి మార్గం చెప్పింది. సంసారం అంటే నిరంతర ప్రయాణం. పునరపి జననం,పునరపి మరణం కొనసాగుతూ ఉంటుంది. దానికి కారణం కామం అని తేల్చింది ఉపనిషత్తు. తీరని కోరిక ఉంటే, ఆ ఇంధనం సూక్ష్మ శరీరాన్ని ప్రయాణించేలా చేస్తుంది. కోరికని బట్టి, పునర్జన్మ ఉపాధి ఉంటుంది.

మోక్షానికి మార్గం ఏమిటి? కామ అభావ – కోరిక లేకపోవటం. జ్ఞాని సూక్ష్మశరీరం, కారణశరీరాలు సమష్టి సూక్ష్మ, కారణ ప్రపంచాల్లో కలిసిపోతాయి. ఐస్‌బర్గ్‌కి కూడా నామ,రూపాలు ఉన్నాయి. ఒక బలమైన ఓడని కూడా ఢీకొనగలదు. కాని అది సూర్యకాంతిలో కరిగిపోతే, సముద్రంలో కలిసిపోతుంది. అలా కలవటానికి ప్రయాణం లేదు. నామ, రూపాలు పోతాయి అంతే. అలాగే జ్ఞాని జీవాత్మ ఐస్‌బర్గ్ జ్ఞానాగ్నిలో కర్మలన్నీ దగ్ధమవటం వల్ల, పరమాత్మ అనే సముద్రంలో కరిగిపోతుంది.

**కామ అభావః మోక్షస్యకారణం**

కోరికలు లేకపోతే మోక్షం కలుగుతుంది. కాని కోరికలు లేకుండా ఉండటం ఎలా? కోరికలు అపూర్ణత్వ భావన నుంచి వస్తాయి. అంతకు ముందు చూసినట్టుగా ఏదో ఒక వెలితి– శారీరకంగా, మానసికంగా, విజ్ఞానపరంగా అన్నీ కలిపి అపూర్ణత్వం. ఎందుకు అపూర్ణత్వం? నేను మనోబుద్ధి అహంకారాలనుకుంటే ఈ అపూర్ణత్వం తప్పదు. నేను ఇక్కడ ఒక పాత్రను పోషించటానికి వచ్చాను. కాని నేనే ఆ పాత్రను అనుకుంటున్నాను. నేను పాత్రనుకాను పూర్ణ పరమ ఆత్మను అనుకుంటే ఈ కోరికలు ఉండవు. పరిమితమైన వస్తువులు పరిమితమైన ఆనందాన్ని మాత్రమే ఇవ్వగలవు.

కోరికలు లేకుండా ఉండాలంటే ఒక కోరిక ఉండాలంటోంది ఉపనిషత్తు. ఏమిటది? మోక్షం కోసం కోరిక. దాన్ని సాధిస్తే ఏ కోరికా ఉండదు. పరమాత్మ మీద కోరిక, తక్కిన కోరికలన్నింటినీ పారద్రోలుతుంది.

**యావానార్థ ఉదపానే సర్వతః సంప్లుతోదకే।**
**తావాన్ సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య విజానతః॥ – గీత 2 –46**

అందుకని కోరిక లేకుండా ఉండడం కోసం పరమాత్మను కోరండి అన్న సందేశం ఇస్తోంది ఉపనిషత్తు. ఇప్పుడు మంత్రంలోకి వెళ్దాము.

**నాయమాత్మా ప్రవచనేన లభ్యః –** ప్రవచనం అంటే మామూలుగా ప్రసంగం. కాని ఇక్కడ వేదాధ్యయనం. కేవలం వేదాలు వల్లించడం వల్ల ఆత్మ లభ్యం కాదు.

**న మేధయా–** జ్ఞాపకశక్తి వల్ల లభ్యం కాదు. గురువుతో పాటు శిష్యులు వేదమంత్రాలను వల్లె వేయాలి. వాటిని గుర్తుంచుకోవాలి. మనం ఏ వేదానికి చెందిన వారమయితే ఆ వేద మంత్రాలు చదవాలి. అది నియమం. పూర్వకాలం అంతా విని గుర్తుపెట్టుకునే వారు. దాన్ని ధారణ శక్తి అంటారు. వేద పండితునికి అఖండ జ్ఞాపక శక్తి ఉంటుంది. టేప్‌రికార్డరు అయినా మధ్యలో ఆగిపోతుందేమో కాని వేద పండితుడు రోజులు, నెలల తరబడి వేదపారాయణం చేయగలడు. ఇప్పుడు మనకు గట్టిగా శాంతిపాఠాలే గుర్తుండవు.

**న బహునా శ్రుతేన –** పదే పదే విన్నా కూడా లాభం లేదు. వీటన్నింటికీ ఒక నిబంధన కలుపుకోవాలి – తీవ్ర ముముక్షుత్వం లేకపోతే అని. తీవ్ర ముముక్షుత్వం లేకపోతే ఎంత వేదాధ్యయనం చేసినా, ఎంత ధారణశక్తి ఉన్నా, ఎన్ని ఉపనిషత్తులు విన్నా ఆత్మ లభ్యం కాదు. కేవలం జ్ఞానం పెంపొందించుకున్నట్టు అవుతుంది. అంతే. సరియైన గురువు లేకపోతే ఎంత విన్నా లాభం లేదు. గురువు శాస్త్రాన్ని విడమర్చి చెప్తాడు. కాబట్టి గురువును సరిగ్గా ఎన్నుకోవాలి. గురువు, శాస్త్రాల మీద శ్రద్ధ ఉండాలి.

తీవ్ర ముముక్షుత్వం ఉందో లేదో ఎలా తెలుస్తుంది? మనం కొన్నాళ్ళు తిండి, నీరు లేకుండా, దాదాపు మృత్యుముఖంలో ఉన్నామనుకోండి. అప్పుడు ఎవరో వచ్చి నీకు ఆహారం పెడతాను, కాని నీ వంటి మీద ఉన్న ఆభరణాలన్నీ ఇవ్వాలి అంటే, మారుమాట్లాడకుండా ఇస్తామా లేదా? బ్రతికుంటే బలుసాకైనా తినవచ్చన్న సామెత ఊరికే పుట్టలేదు.

**న కర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వ మానశుః॥**

అలా అన్నీ త్యాగం చేయగలగాలి. నిజంగా త్యాగం చేయనఖ్ఖరలేదు. అవసరమైతే చేయటానికి సిద్ధంగా ఉండాలి. అలా వైరాగ్యం, ముముక్షుత్వం పెంచుకుంటే శ్రవణం బాగా తోడ్పడుతుంది.

**యమేవైష వృణుతే తేన లభ్యః –** పరమాత్మ ఆ సాధకుడికే లభ్యమవుతాడు. పరమాత్మ ఇష్టపడ్డవాడికే లభ్యమవుతాడు.

**తస్యైష ఆత్మా వివృణుతే తనుం స్వామ్** – ఆ సాధకుడికి, పరమాత్మ; తన పూర్ణస్వరూపం ప్రకటిస్తాడు. పరమాత్మ ఎవరిని ఎన్నుకుంటే వారికి లభ్యమవుతాడు. అంటే పరమాత్మ పక్షపాతం చూపించినట్టు కాదా?

కాని పరమాత్మ ఎన్నుకోవటానికి ఒక నిబంధన ఉంది. ఏమిటది? ఎవరైతే పరమాత్మను ఎన్నుకుంటారో, అలా పరమాత్మను ఎన్నుకున్న వారినే పరమాత్మ ఎన్నుకుంటాడు. అంటే చివరికి బాధ్యత ఎవరిది? మనదే! పరమాత్మను ఎన్నుకోవటం అంటే మోక్షాన్ని కోరటం. మోక్షాన్ని కోరటం అంటే తీవ్ర ముముక్షుత్వం ఉండటం.

**సమోఽహం సర్వభూతేషు న మే ద్వేష్యోఽస్తి న ప్రియః। గీత 9–29**

పరమాత్మకు అందరూ సమానం. అందరికీ ఇవ్వటానికి సిద్ధమే. కాని అడక్కుండా ఇస్తే, విలువ ఉండదు. మా ఇంట్లో నీకు స్థానం లేదు. మెట్లకింద సర్దుకో అని పూజగదిని మెట్ల కిందకి తోసేసే వారికి ఏం ఇవ్వను అనుకోవచ్చు పరమాత్మ. స్వేచ్ఛ కావాలని అందరికీ ఉంటుంది కాని అది తెలుసుకోవాలన్న కోరికకు దారి తీయదు. అందువల్ల మోక్ష ఇచ్ఛని జ్ఞాన ఇచ్ఛగా మార్చుకోగలగటమే మనం వేసే పెద్ద అడుగు. అర్జునునిలో ఈ నేర్చుకోవాలన్న తపన చూస్తాము.

**'అథాతో బ్రహ్మ జిజ్ఞాస'**

బ్రహ్మసూత్రాల్లో ఇది మొదటి సూత్రం. దాని తరువాత అందువల్ల (మోక్షం కోసం) బ్రహ్మ విచారణ చేయాలి అని అర్థం.

అందుకని, సాధకుడు పరమాత్మను ఎన్నుకుంటే, పరమాత్మ అతన్ని ఎన్నుకుంటాడు అంటుంది శాస్త్రం. స్వయంవరంలో వరుడిని ఎన్నుకున్నట్టుగా పరమాత్మవరణం అంటే ఆత్మవరణం చేయాలి.

**ప్రత్యేక విశ్లేషణ:–** ఆత్మ గురించి తెలుసుకోవాలని నిశ్చయించుకున్నాక, గురువు దగ్గరికి వెళ్ళాలి.

గురువు దగ్గరికి ఎందుకు వెళ్ళాలో వివరంగా చెప్తారు స్వామి దయానంద సరస్వతి స్వామి. తెలుసుకోవాలనుకోగానే సరిపోదు. ఉదాహరణకు ఆర్థిక శాస్త్రం గురించి నేర్చుకోవాలంటే తనంతట తాను నేర్చుకోలేదు. ఒక పాఠశాలకు వెళ్ళి, అందులో గురువు దగ్గర నేర్చుకోవాలి. అంటే కేవలం కళ్ళు, చెవులు ఉంటే చాలదు. జ్ఞానం తెలిసిన వ్యక్తి కావాలి. అప్పుడుకూడా మనం సంసిద్ధంగా

ఉంటేనే అర్థమవుతుంది. అలాగే సరియైన దృక్పథంతో గురువు దగ్గరికి వెళ్ళిన వ్యక్తికి, ఆత్మ లభ్యమవుతుంది.

అద్దంలో కన్ను చూసుకున్నట్టుగా, శాస్త్రం మనను మనం తెలుసుకునేందుకు తోడ్పడుతుంది. అద్దం మనముందు ఉన్నా కూడా మనం అందులోకి చూస్తేనే కదా మన మొహం కనబడేది. ఏష అంటే సాధకుడు,యం అంటే ఆత్మ అని ఒక అర్థం. ఆత్మను వరించిన సాధకునికే ఆత్మ లభ్యమవుతుంది. ఇంకో అర్థం కూడా వస్తుంది ఈ పదాలకు. ఏష అంటే ఆత్మ గురించి తెలిసిన గురువు,యం అంటే శిష్యుడు.

గురువు, శిష్యునికి బోధ చేస్తాడు అన్న రెండో అర్థం ఎందుకంటే, తరచు కలిగే ప్రశ్నకు ఇది జవాబు. 'గురువెందుకు కావాలి? ఎలాగో శాస్త్రమే ప్రమాణం అంటున్నారు కదా, గురువు ప్రమేయం లేకుండా, శాస్త్రం చదవలేమా?' చదవలేమంటుంది శాస్త్రం. ఇదిసంప్రదాయ పద్ధతిలో అంటే గురువు నుంచే నేర్చుకోవాలి. అందుకే ప్రతి గురువూ మా గురువు ఇలా చెప్పారు అని ఎప్పుడూ చెప్తుంటారు. (పరమార్థానంద స్వామికూడా మా గురువు దయానంద సరస్వతి స్వామి ఇలా చెప్పారు అని చెప్తూనే ఉంటారు).

బల్ల, కుర్చీ, పెద్ద, చిన్న లాంటి పదాలు కావు ఇందులో మనం నేర్చుకునే పదాలు.సత్యం, జ్ఞానం, అనంతం బ్రహ్మలాంటిపదాలకు లక్ష్యార్థాలుంటాయని చూశాము. ఈశావాస్యోపనిషత్తు చూస్తే ఏ పదానికీ నిఘంటువు అర్థం ఉండదు. దాన్ని గురువే సరిగ్గా వివరించగలడు. దానికొక ప్రక్రియ ఉంది.అందుకే సరియైన గురువు ఉండాలి అని శాస్త్రం నొక్కి చెప్తోంది.

(ఆ మాటకొస్తే ఎన్ని ఆధునిక ఆడియో విజువల్ ఎయిడ్స్ వచ్చినా, అవేవీ జీవమున్న అధ్యాపకుడిని తీసివేయలేవు అంటారు లౌకిక విద్యలో కూడా. ఎన్ని సందేహాలు ఊహించి ప్రోగ్రామ్ తయారుచేసినా అప్పటికప్పుడు శిష్యునికి కలిగే సందేహాలను గురువు అక్కడ ఉండి తీర్చాలి.)

## మంత్రం - 4

**నాయమాత్మా బలహీనేన లభ్యో**
**న చ ప్రమాదాత్ తపసో వాప్యలిఙ్గాత్।**
**ఏతైరుపాయైర్యతతే యస్తు విద్వాన్**
**తస్యైష ఆత్మా విశతే బ్రహ్మధామ॥**

**ప్రతిపదార్థం:–** అయమ్ ఆత్మ – ఈ ఆత్మ; బలహీనేన – బలహీనుడైన వానికి; **న లభ్యః –** లభించదు; ప్రమాదాత్ – జాగ్రత్త లేని వానికి; అలింగాత్– వైరాగ్యం లేనివానికి; తపసః – జ్ఞానం పొందనివానికి; వా అపి న – దొరకదు; యః తు – ఏ; విద్వాన్ – వివేకిగా; ఏతైరుపాయైర్యతతే – ఈ నాలుగు చేసేవాడు; తస్య – అతనికి; ఏషః ఆత్మ – జీవాత్మ; బ్రహ్మధామ– పరమాత్మతో; విశతే – లయ మవుతుంది.

**తాత్పర్యం:–** ఈ ఆత్మ బలహీనుడైన వానికి, జాగ్రత్త లేని వానికి, వైరాగ్యం లేనివాడికి, జ్ఞానం పొందనివాడికి దొరకదు. ఈ నాలుగు ఉన్న వివేకికి అతని జీవాత్మ పరమాత్మలో లయమవుతుంది.

**వివరణ:–** స్వయంవరణం లాగా ఆత్మవరణం చేయాలని ముందు మంత్రంలో చూసాము. దానితోపాటు చేయాల్సిన నాలుగు సాధనలు వస్తాయి ఈ మంత్రంలో.

1. బలం – ఆధ్యాత్మిక బలం
2. అప్రమత్తత – జాగరూకత
3. తపః – (ఇక్కడ) జ్ఞానం
4. లింగం – (ఇక్కడ) వైరాగ్యం

ఉపనిషత్తు రెండు వ్యతిరేక పదాలు వాడింది. ఈ నాలుగు లేకపోతే మోక్షం పొందరు అంది. అంటే ఈ నాలుగూ ఉంటే పరమాత్మను పొందుతారు అని అర్థం.

1. **బలహీనేన:–** ఆధ్యాత్మిక బలం లేనివాడికి, సాధన చతుష్టయ సంపత్తి లేనివాడికి ఆత్మ దొరకదు. ఎందుకంటే బలహీనుడికి రాగద్వేషాలు ఉంటాయి. గీత 13వ అధ్యాయంలో శ్రీకృష్ణపరమాత్ముడు 20 విలువలని ప్రస్తావిస్తాడు.దాన్ని జ్ఞానం అంటాడు. అలాగే 16వ అధ్యాయంలో 26 విలువలని పేర్కొని దాన్ని దైవీసంపత్తి అంటాడు. ఈ విలువలలో ఆరితేర లేకపోయినా నిజాయితీతో కూడిన ప్రయత్నం చేస్తేనేచాలు. జీవ, జగత్తు, ఈశ్వర అనే త్రిపుటి భావన నుంచి ఆత్మ, అనాత్మ అనే ద్విపుటికి రాగలగాలి. నేను అనాథను నీవు అనాథనాథుడవు. నేను దీనుడను. నీవు దీనబాంధవుడవు అని భజనలు కూడా చేస్తాము. ఒక బొద్దింకను చూసి తల్లి కొంగుచాటుకు చేరే చిన్నపిల్లవాడిలాగా, మనం చిన్న ఆపత్తుకే

బెంబేలెత్తిపోయి పరమాత్మను శరణు వేడతాము. నీ మీదే ఆధారపడు. నీ నుంచే శక్తిని పుంజుకో అంటోంది వేదాంతం.

నీ మీద అన్నప్పుడల్లా ఆ 'నేను' ఎవరన్నది పొరపాటున కూడా మర్చిపోకూడదు. శరీరం కాదు, ఇంద్రియాలు కాదు, మనోబుద్ధి అహంకారాలు కానేకాదు.

**స్థూలసూక్ష్మకారణశరీరాత్ వ్యతిరిక్తః।**
**పఞ్చకోశాతీతః సన్ అవస్థా త్రయ సాక్షీ।**
**సచ్చిదానన్ద స్వరూపః సన్ యస్తిష్ఠతి స ఆత్మా ॥**

ఇదీ నా అసలు స్వరూపం. ఊతకర్రలు వదిలేసి నీ కాళ్ళమీద నువ్వు నిలబడు అంటోంది శాస్త్రం. అలా చేయాలంటే వేదాంత బోధ మీద శ్రద్ధకావాలి. వేదాంతం బోధించే క్లాసులకు వెళ్లాలి. వేదాంతాన్ని క్లాసువరకే పరిమితం చేసి, ఇంట్లో త్రిపుటి భావం పాటిస్తే లాభం లేదు. ఎంతవిన్నా, నోట్సు ఎంత బాగా రాసుకున్నా, లోపల ఉన్న బలహీనత అలాగే ఉండిపోకూడదు.

**విలువలు+ శ్రవణం = ధైర్యం లేదా బలం.**

నేను అనాథ జీవుడిని కాను, నేను జగన్నాథుడిని, ఈశ్వరుడిని, నేను అధిష్ఠాన ఆత్మను అని జీర్ణించుకోగలగాలి. అవస్థాత్రయం బ్రహ్మాండంగా నేర్చుకుని లాభం లేదు. దైనందిన జీవితంలో ఈ జ్ఞానాన్ని అనుష్ఠానం చేయగలగాలి. లేకపోతే అంతకుముందు అజ్ఞానీ సంసారి ఇప్పుడు వేదాంత జ్ఞానీ సంసారి అవుతాడు. అంతే భేదం.

**2. న ప్రమాదాత్ –** అజాగ్రత్తగా ఉండకూడదు. చురుగ్గా ఉండాలి. జీవితంలో ఎదురయ్యే అనేక కష్టాలలో కూరుకుపోయి దుఃఖిస్తూ కూర్చోకుండా, వేదాంత బోధలో నేర్చుకున్న విషయాలను గుర్తుతెచ్చుకుని, వాటిని జీవితంలో అమలుపరచగలగాలి. ప్రారబ్ధకర్మ ఈడ్చితన్నినప్పుడు, పడిపోకుండా నిలబడగలగాలి. అజాగ్రతగా ఉన్నవాడికి మోక్షం రాదు.

శంకరాచార్యులు ఇంకో అర్థం కూడా ఇచ్చారు. ప్రమత్త అంటే వైరాగ్యం లేనివానికి అన్నారు. అంటే తను ఎన్నుకున్న మార్గం మీద తప్ప వేరే దేనిమీదా శ్రద్ధ లేకపోవటం వైరాగ్యం. తక్కిన కోరికలలాంటిది కాదు ఆత్మ గురించిన కోరిక. తక్కినకోరికల విషయానికి వస్తే, ఎలక్ట్రానిక్స్

నేర్చుకోవాలి, మంచి కారు కొనుక్కోవాలి అని రెండు కోరికలు ఉండవచ్చు. రెండూ అనాత్మకు చెందినవే. కాని ఆత్మ గురించి కోరితే అది సత్యం, నామరూపాలు మిథ్య అవుతాయి. కాబట్టి మిగతా వాటిని కోరకూడదు. అవి కూడా కోరితే తీవ్ర వైరాగ్యం ఉండదు.

3. **తపః** – ఇక్కడ జ్ఞానం అని చూసాము. జ్ఞానాన్ని ఐదుసూత్రాల సత్యంగా మలచుకున్నాం అంతకుముందు. కేవలం జ్ఞానం పొందితే మోక్షం రాదు. జ్ఞానం పెరుగుతుంది అంతే. బలం అప్రమత్తత లాంటి సాధనలు తోడవ్వాలి దీనికి.

4. **లింగం:–** ఇక్కడ వైరాగ్యం. సన్యాసి వేసుకునే కాషాయ దుస్తులు, కమండలం లాంటివి అతని సన్యాస జీవితానికి లింగాలు; అంటే చిహ్నాలు. సన్యాసి అవనక్ఖరలేదు. కాని అహంకార మమకారాలు వదులుకోవాలి. ఏదో కుతూహలం ఉంటే చాలదు. ఇంతకుముందు మంత్రంలో చూసాము– తీవ్రముముక్షుత్వం ఉంటేనే, పరమాత్మ తన పరిపూర్ణ స్వరూపాన్ని ప్రకటిస్తాడని.

**ఆత్మ న లభ్య–** బలహీనుడికి, అప్రమత్తత లేనివాడికి, జ్ఞానికాని వాడికి, వైరాగ్యం లేనివాడికీ ఆత్మ లభించదు. మరి ఎవరికి లభిస్తుంది?

**ఏతైరుపాయైర్యతతే యస్తు విద్వాన్ –** ఎవరికైతే వివేకం ఉందో;

ఎవరైతే ఈ నాలుగు సాధనలూ చేస్తాడో, అతనికి లభిస్తుంది.

**తస్యైష ఆత్మా విశతే బ్రహ్మధామ–** అతని జీవాత్మ పరమాత్మతో లయమవుతుంది. అంటే ఎవరికైతే వివేకం ఉందో, ఎవరైతే ఈ నాలుగు సాధనలు చేస్తాడో అతని జీవాత్మ పరమాత్మలో లయమవుతుంది. దీని వాచ్యార్థం తీసుకోకూడదు. జీవాత్మ ప్రయాణించి వెళ్ళి పరమాత్మలో లయం చెందుతుందని కాదు. దృక్పథంలో మార్పు వస్తే భిన్నత్వాన్ని వదులుతారు. ఇది వృత్తి జ్ఞానం. ఊతకర్రలు వదిలేసి, మీ కాళ్ళ మీద మీరు నిలబడాలి. పాపాయి కూడా తల్లి చేతిని వదిలేస్తేనే నిలబడి, నడిచి, పరుగెత్తగలదు. ఒకటి రెండు సార్లు పడ్డా మళ్ళీ పరుగెడుతుంది. త్రిపుటి భావం నుంచి ద్విపుటికి రావాలి. అలా చేస్తే ముందు జీవన్ముక్తి, ఈ శరీరం రాలిపోయాక విదేహముక్తి కలుగుతుంది.

## మంత్రం - 5

**సంప్రాప్యైనమృషయో జ్ఞానతృప్తాః**
**కృతాత్మానో వీతరాగాః ప్రశాన్తాః।**
**తే సర్వగం సర్వతః ప్రాప్య ధీరాః**
**యుక్తాత్మానః సర్వమేవావిశన్తి॥**

**ప్రతిపదార్థం:** ధీరాః – వివేకులు; వీతరాగాః – వైరాగ్యాన్ని కలిగినవారు; ప్రశాన్తాః – మనో నిగ్రహం;యుక్తాత్మానః – చిత్త ఏకాగ్రత;ఋషయః – జ్ఞానం ఉన్న వాళ్ళు; ఏనం సంప్రాప్య – ఈ ఆత్మజ్ఞానాన్ని పొందుతారు; కృతాత్మన – ఆత్మలో నెలకొన్నవారుగా; జ్ఞానతృప్తాః – జీవన్ముక్తి పొంది; తే – వారు; సర్వగమ్ – సర్వవ్యాపియైన; సర్వతః – సమస్తమూ అయిన; ప్రాప్య – పరమాత్మను పొంది; సర్వమ్ ఏవ – అంతటితో; ఆవిశన్తి – లయమవుతారు.

**తాత్పర్యం:–** వివేకం, వైరాగ్యం, మనోనిగ్రహం, చిత్త ఏకాగ్రత ఉన్న సాధన చతుష్టయ సంపన్నులు, ఆత్మజ్ఞానం పొంది జీవన్ముక్తి పొందుతారు. తరువాత వారి జీవాత్మ సర్వవ్యాపకమైన పరమాత్మలో లయం పొంది, వారు విదేహ ముక్తి పొందుతారు.

**వివరణ:–** 5,6 మంత్రాలు అద్భుతమైన మంత్రాలు. ఆధ్యాత్మికసాధన ఎలా చేయాలో దశలవారీగా చెప్తుంది. లౌకికవిద్యలో ఎల్‌కేజీ, యుకేజీ నుంచి డిగ్రీకి వచ్చినట్టుగా, ఆధ్యాత్మిక విద్యలో కూడా క్రమపద్ధతి ఉంటుంది. ఈ మంత్రాన్ని సరియైన క్రమపద్ధతిలో అమర్చుకుని ఆయా దశలను చూద్దాము.

1. **ధీరాః–** వివేకి. ఈ పదాన్ని ఈ ఉపనిషత్తులోనే అనేకసార్లు చూసాము. ఈ జగత్తు కార్డుబోర్డు కుర్చీ లాంటిది. దానిమీద కూర్చోలేము. శాంతి, ఆనందం, భద్రతలను జగత్తునుంచి పొందలేము. వీటిని జగత్తు తాత్కాలికంగానే ఇవ్వగలదు, శాశ్వతంగా కావాలంటే ఈశ్వరుని వైపు తిరగాలి అని తెలుసుకున్నవాడు ధీరుడు. వ్యావహారికంగా ఈశ్వరుడంటాము. పారమార్థికంగా బ్రహ్మ అంటాము. తత్త్వబోధలో నిత్యానిత్య వస్తు వివేకం గురించి వస్తుంది. అందులో అనిత్యం జగత్తు అని, నిత్యం ఈశ్వరుడనీ వివరణ వస్తుంది. చిన్నప్పుడు అమ్మచీర వెనుక దాగినప్పుడు బొద్దింక భయమైతే, ఇప్పుడు పెద్దయ్యాక ఇంకో భయం.

జగత్తును, కర్మకాండను అంటిపెట్టుకున్నన్నాళ్ళు భయం పోదు.

**ప్లవా హ్యేతే అదృఢా యజ్ఞరూపా**
**అష్టాదశోక్తమ్ అవరం యేషు కర్మ। - ముండకం 1-2-7**

ధీరుడు కర్మలు శాశ్వత ఫలాన్నివ్వవు అన్న వివేకం పెంచుకున్నవాడు.

2. **వీతరాగాః-** వైరాగ్యం. నిత్యానిత్య వస్తు వివేకం చేసినవాడికి తేలిగ్గా వైరాగ్యం వస్తుంది. అందని ద్రాక్షపళ్ళు పుల్లన అన్న సామెత లాగా వచ్చిన వైరాగ్యంకాదు. అనిత్యవస్తువులు అశాశ్వతం, అతృప్తికరత్వం, బంధకత్వం అని తెలుసుకున్న వివేకం వల్ల వచ్చిన వైరాగ్యం. చెప్పుల దుకాణానికెళ్ళి చీరెలడిగితే దొరుకుతాయా? అలాగే జగత్తు అనే దుకాణంలో శాంతి, ఆనందం, భద్రతలు దొరకవు. అవి కావాలంటే బ్రహ్మను పట్టుకోవాలి. ఈ సంసారాన్ని దాటటం వైరాగ్యం, బ్రహ్మను పట్టుకోవటం ముముక్షుత్వం.
3. **ప్రశాన్తాః-** శాంత చిత్తం. ఆలోచనలను జయించినవాడు. ఏవో ఆలోచనలు మనను పట్టి పీడిస్తూనే ఉంటాయి. బెంగ, దుఃఖం అవమానం, పశ్చాత్తాపం, నిరాశ లాంటివి వస్తూనే ఉంటాయి. వాటి రాకని ఆపలేము. మనకున్న వాసనల వల్ల అవి నిరభ్యంతరంగా అలా వస్తూనే ఉంటాయి. వాటంతట అవి మనకు ఏమీ హాని చేయవు. అది సహజం. వాటిని రానివ్వండి. కాని వచ్చాయని తెలిసాక, వాటికి సహాయసహకారాలందించకండి. అజ్ఞాని వాటికి తీవ్రంగా స్పందించి కృంగిపోతాడు. అలా కృంగిపోకూడదు. ఒక వ్యతిరేక ఆలోచనను సానుకూల ఆలోచనతో పారద్రోలాలి. ఈ సాధనని శమం లేదా మనోనిగ్రహం అంటారు.
4. **యుక్తాత్మానః-** చిత్త ఏకాగ్రత లేదా సమాధానం. మనసుని ఒక గంటసేపు ముండక ఉపనిషత్తు క్లాసుమీద తదేకంగా నిలపాలి. నెమ్మదిగా ఆ సమయాన్ని పెంచుతూపోవాలి. ఈ నాలుగూ కలిపి సాధనచతుష్టయ సంపత్తి అవుతుంది. వివేకం, వైరాగ్యం, ముముక్షుత్వం, శమాది షట్కసంపత్తులను సాధన చతుష్టయ సంపత్తి అంటారు. ఈ నాలుగింటినీ సాధన చేయటానికే చాలా ఎక్కువ సమయం పడుతుంది. పరిపూర్ణంగా సాధన చేసాక దీనికి వస్తానంటే కష్టం. కొంత సాధన చేసాక జ్ఞానయోగానికి రావాలి. ఎలా రావాలి?

5. **ఋషయః–** శారీరకంగా ఋషి అని కాదు. జ్ఞానిలాగా. ఋషతి జానాతి ఇతి ఋషి. అంటే శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేసి ఋషి అవుతాము.

అంతకుముందు వారు సాధకులు. ఇప్పుడు ఋషులు. వారు ధీరులు అంటే వివేకులు అవుతారు. ముముక్షువులుగా ఉన్నప్పుడు అంతా అశాశ్వతం అన్న విషయంలో మాత్రమే స్పష్టత ఉంటుంది కానీ, ఆత్మజ్ఞానం స్పష్టంగా కలగదు. ఇప్పుడు వారికి ఆత్మ అంటే బ్రహ్మ సత్యం, జగత్తు మిథ్య అన్న స్పష్టమైన జ్ఞానం కలుగుతుంది.

6. **ఏనం సంప్రాప్య:–** శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేసాక ఆత్మను పొందుతాము. శ్రవణం మొదటి దశలో చైతన్యం 5 లక్షణాలు నేర్చుకుంటాము. వాటిని ముందు మంత్రంలో కూడా చూశాము.

ముఖ్యంగా తెలుసుకోవాల్సింది – మొదట్లో నా శరీరంలో చైతన్యం ఉంది అని తెలుసుకుంటాం. తర్వాత ఆత్మ తత్త్వం అర్థమయ్యాక నేను చైతన్యాన్ని. తాత్కాలిక శరీరం ద్వారా నేను వ్యవహారం నడుపుతున్నాను అని గ్రహించాలి. ఈ శరీరం నేను పూర్వజన్మలో చేసిన కర్మవల్ల వచ్చింది.

**న జాయతే మ్రియతే వా కదాచిత్**

**నాయం భూత్వా భవితా వా న భూయః।** **గీత 2–20**

7. **కృతాత్మనః–** ఈ విధంగా జీవాత్మని పరమాత్మగా గ్రహిస్తాడు. జీవాత్మ నేను నుంచి పరమాత్మ నేనుకి ఎదగాలి. పుణ్యకర్మతోనా, పాపకర్మతోనా? ఏదీకాదు. జ్ఞానంతో!

**న పుణ్యం న పాపం న సౌఖ్యం న దుఃఖం**

**చిదానందరూపః శివోహం శివోహమ్** **– నిర్వాణ షట్కమ్**

8. **జ్ఞానతృప్తాః–** ఇది తరువాత దశ. ఇవన్నీ దాటితే పూర్ణత్వం పొందుతాము. అది మన అసలు స్వరూపం అని తెలుసుకుంటాము. నేను అహంకారం అనుకుంటే ఏదో వెలితి ఉంటూనే ఉంటుంది. నేను చైతన్యాన్ని అనుకుంటే నాకు వెలితి ఏదీ లేదు అనుకుంటాము.

సాధారణంగా 'చాలు, నేను తృప్తి చెందాను,' అని కేవలం ఆహార విషయంలో అంటాము. పితృదేవతలకు శ్రాద్ధకర్మలు చేసినప్పుడు ఇద్దరు

బ్రాహ్మలకు భోజనం పెడతాము. ఇద్దరూ 'తృప్తోహం, నేను తృప్తి చెందాను,' అని చెపుతారు. ఇలాంటి తృప్తి డబ్బు విషయంలో రాదు. కాని ఈ జ్ఞానం పొందిన వారికి వస్తుంది. ఎందుకంటే వారు నేర్చుకున్నది పరిపూర్ణ వస్తువు గురించి.

నేను చైతన్యాన్ని అనుకుంటే ఆత్మ పూర్ణం అవుతుందా? ఆత్మ పూర్ణం అవదు. అవనఖ్ఖరలేదు. అది ముందే సిద్ధవస్తువు. అలా కొన్ని దశలలో ఈ ఉన్నతస్థితికి ఎదుగుతూ రావాలి. దాని ముందు అహంకారం, దాని సమస్యలు సమసిపోతాయి. జీవన్ముక్తి కలుగుతుంది. ఆత్మన్యేవ సంతుష్టః. అప్పుదు ఏమవుతుంది?

**తే సర్వగం సర్వతః ప్రాప్య–** ఈ జ్ఞానం వల్ల అంటే సర్వ వ్యాపక పరమాత్మజ్ఞానం వల్ల పూర్తిగా సర్వవ్యాపక ఆత్మలో లీనమవుతాము మరణం తరువాత. ఐస్‌బర్గ్ నీటిలో కరిగినప్పుడు కలిసిపోయి, దాని ఉనికి మాయమయినట్టుగా జీవాత్మ పరమాత్మలో ఐక్యం చెందుతుంది.

**సర్వమేవాఽఽవిశన్తి–** పూర్తి జగత్తులో లయమవుతాము. ఈశ్వరుదు అవుతాము. ముందు ప్రార్థన, తరువాత విశ్వరూప ఈశ్వరుదు. అద్భుతమైన శ్లోకం!

## మంత్రం - 6

**వేదాన్తవిజ్ఞానసునిశ్చితార్థాః**
**సంన్యాసయోగాద్ యతయః శుద్ధసత్త్వాః।**
**తే బ్రహ్మలోకేషు పరాన్తకాలే**
**పరామృతాః పరిముచ్యన్తి సర్వే॥**

**ప్రతిపదార్థం:–** వేదాన్త విజ్ఞాన – వేదాంతంలో జ్ఞానాన్ని; సునిశ్చితార్థాః – క్షుణ్ణంగా తెలిసినవారు; సంన్యాస యోగాత్ – కర్మఉపాసనలు చేసి వైరాగ్యం పొందినవారు; శుద్ధ సత్త్వాః – చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత పొందినవారు; యతయః – సరియైన ప్రయత్నం చేసినవారు; తే – వారు; సర్వే – అందరూ; పరామృతాః – జీవన్ముక్తి పొంది, పరాన్తకాలే – మరణించాక; పరిముచ్యంతి – విదేహ ముక్తి చెందుతారు; బ్రహ్మలోకేషు – పరబ్రహ్మలో లయమవుతారు.

**తాత్పర్యం:–** సరియైన ప్రయత్నం చేసినవారు; కర్మఉపాసనలు చేసి వైరాగ్యం పొంది చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత పొందినవారు; వేదాంత జ్ఞానాన్ని క్షుణ్ణంగా

పొందినవారు; వారందరూ ఇక్కడ జీవన్ముక్తి పొంది, మరణించాక పరబ్రహ్మలో లయం పొంది, విదేహ ముక్తి పొందుతారు.

**వివరణ: –** ఇంకో ముఖ్యమైన మంత్రం. దాదాపు అదే భావం కొనసాగుతోంది. ఆధ్యాత్మ జీవనంలోని దశలన్నీ సూచిస్తోంది.

సన్యాసి ఇంటికి వచ్చినప్పుడు చదివే నాలుగు మంత్రాలలో ఇది ఒకటి. సన్యాసి చేసిన ప్రయాణాన్ని గృహస్థు గుర్తుంచుకుని తానుకూడా చేస్తానని అనుకుంటాడు.

1. **యతయః –** యత్ నుంచి వచ్చింది. యత్నం, ప్రయత్నం అని అర్థం. ఏదైనా పని చేయాలంటే సరియైన దిశలో ప్రయత్నం చేయాలి, సరియైన మేరకు ప్రయత్నం చేయాలి. ఉదాహరణకు మనం ఢిల్లీ వెళ్ళాలనుకోండి. దక్షిణ దిశగా వెళ్ళగలమా? సరియైన దిశలో వెళ్ళాలి. అంటే ఉత్తరం వైపు వెళ్ళాలి. ఉత్తరం వైపే వెళతాం గాని నాగపూర్‌లో ఆగిపోయినా కుదరదు. సరియైన మేరకు ప్రయత్నం చేయాలి. రెండూ ముఖ్యమే.

| | |
|---|---|
| **కర్మయోగం** | **– చిత్తశుద్ధి** |
| **ఉపాసనాయోగం** | **– చిత్త ఏకాగ్రత** |
| **జ్ఞానయోగం** | **– ఆత్మజ్ఞానం** |

కర్మ, ఉపాసనలు చేసి, జ్ఞానమార్గానికి రావటం సరియైన మార్గం తెలియటం. జ్ఞానమార్గానికి వస్తే చాలదు. దాన్ని సరిగ్గా అర్థం చేసుకుని, జీర్ణించుకోవాలి.

2. **శుద్ధసత్వాః –** కర్మ, ఉపాసన యోగాలు చేసి చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత పొందుతాము. గీతలో 3వ అధ్యాయంలో వివరంగా వస్తుంది. చిత్తశుద్ధి అంటే రాగద్వేషాలను తగ్గించుకోవటం. కర్మసిద్ధాంతం అర్థం చేసుకుంటే జరిగేది జరగనీ అనుకుంటాం. సత్వ అంటే ఇక్కడ మనసు. ఉపాసనలో ఈశ్వర ధ్యానం చేయటం వల్ల చిత్త ఏకాగ్రత ఏర్పడుతుంది.
3. **సన్యాసయోగాత్ –** కర్మ, ఉపాసనలు కొంతవరకే ముఖ్యం. అవయ్యాక జ్ఞానయోగంలోనికి అడుగుపెట్టాలి. జ్ఞానంలోకి వచ్చాక క్రమేపీ కర్మ, ఉపాసనలు తగ్గించాలి.
   కర్మయోగి కూడా రాగద్వేషాలు తగ్గించుకుంటాడు. స్వర్గఫలాలను ఆశించడు. మరి సన్యాసికి, కర్మయోగికి మధ్య భేదం ఏమిటి? ఇద్దరూ

త్యజిస్తారు. సన్యాసి కర్మలనే త్యజిస్తే, కర్మయోగి కర్మఫలాలను త్యజిస్తాడు. అందువల్ల సన్యాసయోగం అంటే సన్యాసం, కర్మయోగం రెండూ వస్తాయి. లేదా కర్మయోగం చేసి, కర్మలను త్యజించి సన్యాసం స్వీకరించటం అని కూడా వస్తుంది. కర్మలను త్యజించటం వాటి మీద మోహం తీరి కాదు, వాటి స్వరూపం తెలియటం వల్ల.

పోర్ట్ రిడక్షన్ చేయాలి. పోర్ట్‌లో పి అంటే పొసెషన్స్, ఓ అంటే ఆబ్లిగేషన్స్, ఆర్ అంటే రిలేషన్స్, టి అంటే ట్రాన్సాక్షన్స్ – వీటిని తెలుగులో చూస్తే అవి వరుసగా ఆస్తిపాస్తులు, మొహమాటాలు, బంధుత్వాలు, వ్యవహారాలు. మనం ఈ జగత్తు అనే నాటకంలో చిన్నపాత్రధారులం మాత్రమే. జగన్నాటక సూత్రధారి మనను నడిపిస్తాడు. ఆ పాత్ర మేరకు నటించాలి కాని నేనే ఆ పాత్రను అనుకోకూడదు. నాటకం అవగానే పాత్ర అయిపోతుంది. పాత్రలోంచి బయటకి వచ్చేస్తాము. అలాగే జీవితంలో మనం చేసి తీరాల్సిన వ్యవహారాలు చేయాలి కాని అన్నీ నెత్తిన వేసుకోకూడదు. ఎక్కువ పరిచయం లేని పెళ్ళిళ్ళకి వెళ్ళటం, మనకు సంబంధం లేని వ్యవహారాల్లో తల దూర్చటం, లేనిపోని ఊక దంపుడు కబుర్లతో కాలం గడపడం లాంటివి తగ్గించుకోవాలి. సెల్‌ఫోన్ ఒక్కరోజు పక్కన పెడితేనే బోలెడు సమయం దొరికినట్టు ఉంటుంది.

ఇవి తగ్గిస్తే కాని మనకు శ్రవణ, మనన, నిదిధ్యాసనలకు సమయం దొరకదు. సన్యాసయోగాత్ అంటే సన్యాసిలాగా మనం కాషాయవస్త్రాలు ధరించనవసరము లేదు. వ్యాపకాలు తగ్గించుకుంటే చాలు.

**న మృత్యుః న శంక న మే జాతి భేదః – నిర్వాణషట్కం**

మనం వేసే పాత్రలో మనం జీవిస్తే ఈ జీవితాన్ని మనకు దేవుడు అపాత్ర దానం చేసినట్టయి, అనేక యాత్రలు (జన్మలు పొందుతూ) చేస్తూ భిన్న భిన్న పాత్రలు ధరిస్తూ ఉండాల్సి ఉంటుంది.

4. **వేదాంతవిజ్ఞానసునిశ్చితార్థాః–** వేదాంత విజ్ఞానాన్ని నిశ్చయాత్మకంగా పొందాలి. ఈ జ్ఞానాన్ని శాస్త్రం నుంచి పొందాలి.

**బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా, జీవో బ్రహ్మైవ నాపరః**

ఆత్మవిచారణ చేయాల్సిన అవసరం ఉంది. కాని అది నిబంధన కాదు. నిబంధన అంటే చేసి తీరాల్సినది. జ్ఞానం పొందాలంటే ప్రమాణం

ఉండాలి. ఆత్మజ్ఞానం పొందాలంటే, శబ్దప్రమాణం ఉండాలి. ఇవి నిబంధనలు. ఆత్మ గురించి తెలుసుకోవటానికి విచారణ చేయాలన్న నిబంధన లేదు. విచారణ ప్రమాణం కాదు. మనలో కలిగే సందేహాలను పారద్రోలటానికి విచారణ చేయాలంటుంది శాస్త్రం. అజ్ఞానం ఒకటే. సందేహాలు అనేకం. వేదాంతానికి రాకముందు ఒకటే సందేహం. ఏం చేయాలి అని. వేదాంతానికి వచ్చాక అన్నీ సందేహాలే. వేరే సందేహాలు లేకపోయినా, ఆత్మ బ్రహ్మ ఎలా అవుతుంది అన్నది పెద్ద ప్రశ్న. అది విచారణ చేస్తేనే పోతుంది. కాబట్టి విచారణ నిబంధన కాదు. అవసరం. అలా సందేహాలు లేని నిశ్చయజ్ఞానాన్ని వేదాంతవిజ్ఞానసునిశ్చితార్థాః అంటారు. అంతకుముందు కర్మలు మూడు గంటలు చేస్తే దాన్ని ఒక గంట తగ్గించి వేదాంత విచారణకి వినియోగించాలి.

ఇంతవరకూ సాధన గురించి చెప్పింది. ఇప్పుడు ఆ సాధన చేసిన వారి పరిస్థితి ఏమిటి?

**తే బ్రహ్మలోకేషు పరాన్తకాలే–** అంతకాలం అంటే మరణం– జీవికి మరణం అంతిమకాలం కాదు. మళ్ళీ పునర్జన్మ ఉంటుంది. అంతకాలం అన్నది అజ్ఞానికి వాడతారు. జ్ఞానికి పరాన్తకాలం అన్నది శాస్త్రం. ఎందుకు? అతనికి పునర్జన్మ ఉండదు. ఎందుకు పునర్జన్మ ఉండదు? (2.2.8లో వివరంగా చూసాము)

**భిద్యతే హృదయగ్రన్థిః ఛిద్యన్తే సర్వ సంశయాః।**

**క్షీయన్తే చాస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరావరే॥ – ముండకం 2–2–8**

టూకీగా మళ్ళీ చూడాలంటే జ్ఞాని అహం బ్రహ్మ అస్మి జ్ఞానం వల్ల తను పరిపూర్ణుడిని అనుకుంటాడు. దానివల్ల కోరికలు ఉండవు. కోరికలు ఉండకపోవటం వల్ల కర్తృత్వ, భోక్తృత్వ భావనలు అంటవు. అందువల్ల అతను ఏదైనా కర్మచేసినా కొత్తగా ఆగామికర్మలు వచ్చి చేరవు. జ్ఞానాగ్నిలో సంచితకర్మలు దహించుకుపోతాయి. ప్రారబ్దకర్మలు అనుభవించకతప్పదు. ప్రారబ్ధకర్మకు ఉదాహరణ ఫ్యాను. ఫ్యాను ఆపాక కూడా కొంతసేపు అది తిరుగుతూ ఉంటుంది. అలాగే జ్ఞానికి జ్ఞానం వచ్చాక కూడా ప్రారబ్ధకర్మ వల్ల పడే అవస్థలు తప్పవు. కాని వాటి విషయంలో అతని దృక్పథం మారుతుంది. ఉపాధిపరంగా చూస్తే జ్ఞాని అడవిలో చెట్టులాంటివాడు. ఈశ్వరుడు అడవి. ఈశ్వరుని ఉపాధి సమష్టి, జ్ఞాని ఉపాధి వ్యష్టి. కాని ఉపాధుల మధ్య ఉన్న వ్యత్యాసం మిథ్య.

జ్ఞాని జీవన్ముక్తి పొందుతాడు అంటే అతను ఏడవడని కాదు. కాని జీవితం ఒక నాటకం. ఇది మిథ్యావేషం అని అతనికి తెలుసు. పాత్ర ధరిస్తాడు కాని పాత్ర ముగియగానే గ్రీన్‌రూమ్‌కి వెళతాడని తెలుసు.

**పరామృతా పరిముచ్యంతి సర్వే–** అలా జీవన్ముక్తి పొందిన జ్ఞానులు; బ్రహ్మలో ఐక్యం చెందుతారు. బ్రహ్మలోకేషు అంటే నిజంగా బ్రహ్మలోకం కాదు. సర్వవ్యాపకమైన బ్రహ్మ. మరణం తరువాత వారి జీవాత్మ పరమాత్మలో ఐక్యం చెందుతుంది. ఇంతకుముందు రెండుసార్లు ఆ ఐక్యానికి ఐస్‌బెర్గ్ ఉదాహరణ చూసాము.

ఇప్పుడు శంకరాచార్యులు ఇంకో ఉదాహరణ ఇస్తున్నారు. కుండ విరిగితే ఏమవుతుంది? ఘటాకాశం మఠాకాశంలో లయమవుతుంది. ఇక్కడ ప్రయాణం లేదు. అలాగే శరీరమనే కుండ ఉంటే జీవాత్మ, శరీరమనే కుండ రాలిపోతే పరమాత్మలో ఐక్యం చెందుతుంది. ఈ ప్రయాణం లేని ఐక్యాన్నే విదేహ ముక్తి అంటారు. విదేహముక్తి వివరంగా రాబోయే రెండు మంత్రాల్లో వస్తుంది.

**ప్రత్యేక విశ్లేషణ:–** పరాంతకాలే – ఒక వ్యక్తి స్వప్నావస్థలో తన స్థూల శరీరాన్ని వదిలి, స్వప్నశరీరాన్ని ధరించి, అనేక అనుభవాలను పొంది, తన స్థూల శరీరానికి తిరిగివస్తాడు. అతనిలో ప్రాణం ఉన్నంతసేపూ, వెనక్కి తిరిగివస్తాడు. వచ్చాక, దాన్ని నిద్ర లేవటం అంటారు. ప్రాణం ఆగిపోయినప్పుడు, మరణం సంభవిస్తుంది. దాన్ని అంతకాలం అంటారు. స్థూలశరీరం పడిపోయాక, అజ్ఞాని, కర్మఫలాలను అనుభవించటానికి ప్రయాణం చేసి, మళ్ళీ జన్మలు పొందుతాడు. కాని జ్ఞాని అతని కర్మలు దగ్ధమవటం వల్ల మళ్ళీ జన్మలు పొందడు. అందుకని అతని మరణాన్ని పరాంతకాలం అంటాము.

**పరామృతాః –** శాశ్వతం అయిన బ్రహ్మను తెలుసుకున్నాడు జ్ఞాని. అది వేదాంత విజ్ఞానం వల్ల జరిగింది. అందువల్ల పరాంతకాలం అయింది. అంటే విదేహముక్తి పొందుతాడు. విదేహముక్తి గురించి చెప్పకపోతే శాస్త్రం చేసే బోధ పూర్తి అవదు. ఎక్కడ ముక్తి పొందుతాడు? బ్రహ్మలోకంలో. ఇక్కడ బ్రహ్మలోకం అంటే నిజంగా బ్రహ్మలోకం కాదని చూసాము. ఆత్మస్వరూపం అనుభవంలోకి వచ్చేది కాదు. అందుకే ఆత్మను– కన్నుకి కన్ను, చెవికి చెవి అన్నాము. అందుకని ఇది వృత్తిలో (ఆలోచనలో) జరిగే మార్పు. బ్రహ్మలోకాలు అన్న బహువచనం వాడింది ఉపనిషత్తు. బ్రహ్మలోకాలు ఎన్నో లేవు. కాని జ్ఞానులు ఎందరో

ఉన్నారు అని అర్థం. అందువల్ల ఒక్కళ్ళే పొందగలరు, నాకు రాదు అనుకోనక్ఖరలేదు. దీనికి కావాల్సిందల్లా సత్త్వగుణం ఉన్న మనసు, గురు శాస్త్ర ఉపదేశం.

ఈ జ్ఞానాన్ని ప్రతి ఒక్కళ్ళూ పొందాలి. ఒక్కరు ముక్తి పొందితే, అందరూ పొందుతారనుకోవటం భ్రమ. 'జీవులందరూ ఒకటే. బ్రహ్మ తప్ప రెండోది లేదు. కాబట్టి ఒక జీవికి మోక్షం కలిగితే అందరికీ కలగాలి,' అన్నది కొందరి వాదన. అది ఎప్పుడు సాధ్యం? జీవులందరినీ ఒక తాడుతో నిజంగా ముడివేస్తే, ఒకరి దగ్గర ముడివిప్పితే అందరూ బంధవిముక్తులవుతారు. అందువల్ల ఈ బంధకత్వం వేరు. ఇది మనకు మనం వేసుకున్న ముడి. దీన్ని ఎవరికి వారే విప్పుకోవాలి.

ఆమాటకొస్తే మనకు మోక్షం కొత్తగా రాదు. జ్ఞానీ, అజ్ఞానీ ఇద్దరూ ముక్త పురుషులే. జ్ఞాని అది గ్రహించి బంధం నుంచి విడివడతాడు. అజ్ఞాని ఇంకా బంధంలో కూరుకుపోతాడు. అందుకని ఎవరికి వారే ఈ విషయాన్ని గ్రహించి విముక్తులవ్వాలి.

## మంత్రం - 7

**గతాః కలాః పంచదశ ప్రతిష్ఠా**
**దేవాశ్చ సర్వే ప్రతిదేవతాసు ।**
**కర్మాణి విజ్ఞానమయశ్చ ఆత్మా**
**పరేఽవ్యయే సర్వ ఏకీభవన్తి ॥**

**ప్రతిపదార్థం:-**పంచదశ – పదిహేను; కలాః – కళలు; ప్రతిష్ఠా – స్థావరాలకు; గతాః – చేరుకొంటున్నాయి; దేవాశ్చ సర్వే – అన్ని అధిష్ఠాన దేవతలూ, ప్రతిదేవతాసు – తమ దేవతలను; కర్మాణి – కర్మలు; విజ్ఞానమయశ్చ ఆత్మ – జీవాత్మ; పరేఽవ్యయే – పరమాత్మలో; సర్వ – అన్నీ; ఏకీభవన్తి – ఐక్యమవుతాయి.

**తాత్పర్యం:-** పదిహేను కళలూ వాటి స్థావరాలకు చేరుకొంటాయి. అధిష్ఠాన దేవతలు తమ దేవతలతో లీనమవుతాయి. విశ్వ, తైజస, ప్రాజ్ఞలతో కూడిన జీవాత్మ విరాట్‌లో, హిరణ్యగర్భలో, ఈశ్వరునితో కూడిన పరమాత్మతో అదే క్రమంలో లయమవుతాయి.

**వివరణ:-** జ్ఞాని మరణకాలంలో ఏమవుతాడు? ముందు సమష్టిపరంగా, వ్యష్టిపరంగా ఉన్న ఆరు ప్రతిబింబాలను ఒకసారి చూద్దాము. (అద్వైత వేదాంత పరిచయంలో వివరంగా వస్తుంది)

| | | | |
|---|---|---|---|
| విశ్వ | – స్థూలశరీరం | విరాట్ | – స్థూలప్రపంచం |
| తైజస | – సూక్ష్మశరీరం | హిరణ్యగర్భ | – సూక్ష్మప్రపంచం |
| ప్రాజ్ఞ | – కారణశరీరం | మాయ/ఈశ్వరుడు | – కారణప్రపంచం |

ఇవన్నీ ప్రతిబింబ చైతన్యాలు. బింబ చైతన్యం ఏమవుతుంది? ఏమీ అవదు. అది సర్వవ్యాపకం కాబట్టి దానికి ఏమీ మార్పులేదు. వ్యష్టి ప్రతిబింబ చైతన్యాలు ఆయా సమష్టి ప్రతిబింబ చైతన్యాల్లో లయమవుతాయి. జ్ఞాని నేను బింబ చైతన్యాన్ని, నాకేమవలేదు, నాలో అన్నీ జరిగాయి అనుకుంటాడు.

**పంచదశ కలాః ప్రతిష్ఠా –** ప్రశ్నోపనిషత్తులో షోడశకలా పురుషుడు అని జీవిని శాస్త్రం వ్యవహరించింది.ఆ కళలు ప్రాణము, శ్రద్ధ, ఆకాశము, వాయువు, అగ్ని, నీరు, పృథివీ, ఇంద్రియాలు, మనస్సు, అన్నం, వీర్యం, తపస్సు, మంత్రాలు, కర్మలు, లోకాలు, నామం ఉన్న పురుషుడు అంది.

జీవిలో ఉన్న పదహారు కళలలో ప్రాణము, శ్రద్ధ లాంటివి పదిహేను, వాటి వాటి కారణాలతో కలిసి పోతాయి. జ్ఞానికి ఈ పదిహేను కళల్లో ఏ సంస్కారమూ అతనితో వెళ్ళదు. అతను చేసిన మంత్రాలు, అతను చేసిన కర్మలు, అతను వేటిమీదైనా చూపిన శ్రద్ధ– అన్నీ లయమయిపోతాయి. పదహారవ కళ అయిన నామం మాత్రం మిగులుతుంది.

అందుకే పంచదశ కలా అంటోంది. జ్ఞాని మరణం తరువాత, జ్ఞాని పేరు మాత్రం మిగులుతుంది, అతను మరణించిన రోజును ఆరాధన అంటారు. అలా వచ్చినవే త్యాగరాజ ఆరాధనలు. త్యాగరాజు జ్ఞాని+సన్యాసి.

**దేవాశ్చ సర్వే ప్రతిదేవతాసు –** మన అంగాలకు అనేక దేవతలు అధిష్టాన దేవతలుగా ఉన్నారు. ఉదాహరణకు– కన్నుకి సూర్యుడు; మనసుకి చంద్రుడు; అహంకారానికి రుద్రుడు; చిత్తానికి విష్ణువు; బుద్ధికి బ్రహ్మ. అలా వ్యష్టిలో ఉన్న దేవతలన్నీ సమష్టిలోని దేవతలతో లయం చెందుతాయి. కాని అతను మళ్ళీపుడితే, మళ్ళీ వ్యష్టిలో వాటి స్థానాల్లోకి వస్తాయి.

కర్మాణి **విజ్ఞానమయశ్చ ఆత్మా –** విశ్వ, తైజస, ప్రాజ్ఞులుగా శరీరత్రయంలో చిదాభాస తత్త్వం ఉంది. ఈ మూడింటినీ కలిపి జీవాత్మ అంటారు. అది అన్ని కర్మలతో పాటు లయం చెందుతుంది. ఎందులో?

**పరేఽవ్యయే సర్వ ఏకీభవన్తి–** పరమాత్మలో లయం పొందుతుంది. విశ్వ, తైజస, ప్రాజ్ఞలు విరాట్, హిరణ్యగర్భ, ఈశ్వరునిలో అదే క్రమంలో లయం పొందుతాయి. జ్ఞాని నేను బింబ చైతన్యాన్ని. ఈశ్వరుడు కూడా నాలాగా ఉన్నాడు అంటాడు. ఏకీభవన్తి అంటే జీవాత్మ వెళ్ళి పరమాత్మలో కూర్చుంటుందని కాదు. ఇంక వాటి మధ్య భేదం లేదని. ముందే వాటి మధ్య భేదం లేదు. ఇప్పుడు శరీరం కూడా లేదు కాబట్టి మళ్ళీ వెనక్కి వచ్చే అవకాశం లేదు.

## మంత్రం – 8

**యథా నద్యః స్యన్దమానాః సముద్రే**
**అస్తం గచ్ఛన్తి నామరూపే విహాయ।**
**తథా విద్వాన్ నామరూపాద్విముక్తః**
**పరాత్పరం పురుషముపైతి దివ్యమ్॥**

**ప్రతిపదార్థం: –** స్యన్దమానాః – పొంగి ప్రవహించే; నద్యః – నదులు; యథా – ఏ విధంగా; నామరూపే విహాయ – నామరూపాలు వదిలిపెట్టి; సముద్రే – సముద్రంలో; అస్తం గచ్ఛన్తి – కలిసిపోతాయో; తథా – ఆ విధంగా; విద్వాన్ – జ్ఞాని; నామరూపాద్విముక్తః – నామరూపాలనుంచి విడివడి; పరాత్పరమ్ – శ్రేష్ఠమైన; దివ్యమ్ – జ్యోతిర్మయమైన; పురుషమ్ – పరమాత్మలో; ఉపైతి – కలుస్తాడు.

**తాత్పర్యం: –** పొంగి ప్రవహించే నదులన్నీ ఏ విధంగా నామరూపాలు వదిలిపెట్టి, సముద్రంలో కలిసిపోతాయో ఆ విధంగా జ్ఞాని నామరూపాల నుంచి విడివడి, శ్రేష్ఠమైన జ్యోతిర్మయమైన పరమాత్మలో కలుస్తాడు.

**వివరణ: –** విదేహ ముక్తికి ఇంకో ఉదాహరణ. అనేక నదులు సముద్రంలో కలిసే ఉదాహరణ. నదులుగా తీసుకుంటే వాటికి అనేక నామరూపాలు. అవన్నీ సముద్రంలో కలిసేవరకే. సముద్రంలో కలిసాక నామరూపాలు లేవు.

**నద్యః స్యన్దమానాః ; సముద్రే అస్తం గచ్ఛన్తి –** నిరంతరం ప్రవహించే అన్ని నదులూ సముద్రంలో లయం పొందుతాయి. నదులు సముద్రం నుంచే వచ్చాయి.

ఎలా అన్నది మనకు తెలిసిందే. సముద్రం నుంచి మేఘాలు ఏర్పడి, మేఘాల నుంచి కురిసిన వాన నీరు కొండలమీదనుంచి ప్రవహించి నదులుగా పారతాయి. మళ్ళీ అవే సముద్రంలోకి వెళ్ళి కలుస్తాయి. అంటే సృష్టికారణమే లయకారణం కూడా. అలా జీవాత్మ పరమాత్మలో ఐక్యం చెందుతుంది.

అజ్ఞాని జీవాత్మ కూడా ఈశ్వరునిలో లయం పొందుతుంది కాని జ్ఞానికీ, అజ్ఞానికీ చిన్న భేదం ఉంది. అజ్ఞానికి ప్రారబ్ధకర్మ క్షయమైనా సంచిత కర్మ, ఆగామి కర్మలు ఉంటాయి.

**నామరూపే విహాయ–** నదులకు నామరూపాలు పోతాయి.

**తథా విద్వాన్ నామరూపాద్విముక్తః –** అలాగే జ్ఞాని నామరూపాలు, కర్మనుంచి విముక్తి పొందుతాడు.

**పురుషముపైతి –** వ్యావహారికంగా చూస్తే, అంతకుముందు చెప్పినట్టుగా, వ్యష్టిలోని మూడు ప్రతిబింబాలూ – విశ్వ, తైజస, ప్రాజ్ఞలు– సమష్టిలోని మూడు ప్రతిబింబాలలో – విరాట్, హిరణ్యగర్భ, ఈశ్వరలలో – అదే క్రమంలో లయం పొందుతాయి. పారమార్థికంగా చూస్తే అధిష్టానంలో కలుస్తాయి. అలా విదేహ ముక్తి పొందుతాడు. జ్ఞాని మోక్షం కూడా కోరడు.

**న ధర్మో న చార్థో న కామో న మోక్షః**
**చిదానంద రూపః శివోహం శివోహమ్ – నిర్వాణ షట్కమ్**

**పురుషమ్ ఉపైతి–** పరమాత్మలో కలుస్తాడు. ఎటువంటి పరమాత్మ?

**పరాత్పరమ్ –** పరం అంటే మాయ. మాయకన్నా శ్రేష్ఠమైన పరమాత్మ.

**దివ్యమ్ –** పరమాత్మ స్వభావం ఏమిటి? దివ్యమ్ – చైతన్యస్వరూపం. ఒక్కముక్కలో చెప్పాలంటే ఈ మంత్రం వ్యావహారికంగా విదేహముక్తి గురించిన వర్ణన.

**మంత్రం – 9**

**స యో హ వై తత్పరమం బ్రహ్మ వేద**
**బ్రహ్మైవ భవతి నాస్య అబ్రహ్మవిత్కులే భవతి ।**
**తరతి శోకం తరతి పాప్మానం**
**గుహాగ్రన్థిభ్యో విముక్తో ఽమృతో భవతి ॥**

**ప్రతిపదార్థం:–** యః హవై – ఎవరు; తత్పరమం బ్రహ్మ – ఆ పరబ్రహ్మని; వేద– తెలుసుకుంటాడో; సః – అతడు; బ్రహ్మైవ భవతి – బ్రహ్మ అవుతాడు. అస్యకులే– అతని కులంలో; అబ్రహ్మవిత్ – బ్రహ్మజ్ఞాని కానివాడు; న భవతి– జన్మించడు; శోకమ్– దుఃఖం; పాప్మానమ్ – పాపం; తరతి– దాటుతాడు; గుహాగ్రన్థిభ్యః – హృదయ గ్రంథుల నుండి; విముక్తః– విడివడతాడు. అమృతః భవతి – పునర్జన్మ ఉండదు.

**తాత్పర్యం:–** ఎవరు పరబ్రహ్మ గురించి తెలుసుకుంటాడో, అతడు బ్రహ్మ అవుతాడు. అతని కులంలో బ్రహ్మజ్ఞాని కాని వాడు జన్మించడు. దుఃఖాలను, పాపాలను దాటుతాడు. హృదయ గ్రంథులనుంచి విముక్తి పొందుతాడు. అందువల్ల పునర్జన్మ ఉండదు.

**వివరణ:–** ఈ మంత్రంతో తన బోధ ముగిస్తున్నాడు గురువు. చెప్పాల్సినవన్నీ చెప్పేసాడు. వ్యావహారికంగా, పారమార్థికంగా పొందే లాభం చెప్పేసాడు. దీనంతటికీ ముఖ్యసాధన ఏమిటి? జ్ఞానం పొందటం. ఏ ఆశ్రమంలో ఉన్నా ఫర్వాలేదు.జ్ఞానం పొందితే చాలు. వయసు పరిమితి, స్త్రీ పురుష భేదాలు కర్మకాండలో ఉన్నాయి. జ్ఞానకాండలో లేవు. పరబ్రహ్మను పొందటం ముఖ్యం. ఎలా?

అహం బ్రహ్మ అస్మి, నేనే ఆ బ్రహ్మను. నేను అన్నప్పుడల్లా ఆ నేను ఎవరన్నది మర్చిపోకూడదు. కీళ్ళ నొప్పితో బాధపడే శరీరంకాదు. విషయవాంఛలతో నిండిన ఇంద్రియాలు కాదు. రాగద్వేషాలకు పుట్టినిల్లయిన మనసు కాదు. నేను అంతా చేస్తున్నాననే అహంకారం కాదు. వీటన్నింటినీ తెలుసుకునే శుద్ధ సాక్షిచైతన్యం. **స యో హ వై తత్పరమం బ్రహ్మవేద బ్రహ్మైవ భవతి –** ఎవరు పరబ్రహ్మను తెలుసుకుంటే అతను బ్రహ్మ అవుతాడు. ఈ వాక్యం చాలా లోతైన వాక్యం. పశువుల వైద్యుడు పశువుల గురించి తెలుసుకుంటే కుక్క అవుతాడా? సూక్ష్మక్రిముల గురించి తెలుసుకున్న వ్యక్తి సూక్ష్మక్రిమిగా మారతాడా? సన్నగా అయ్యే చిట్కాల గురించి తెలుసుకుంటే మెరుపుతీగలాగా అయిపోతామా?

మామూలుగా అయితే ఇవేవీ జరగవు. కాని దానికి ప్రత్యేక సందర్భం ఉందంటోంది శాస్త్రం. ఉదాహరణకు కర్ణుడు. తాను రాధేయ కాదు కౌంతేయ అని తెలుసుకున్నాడు. ఆ జ్ఞానం ఏం చేసింది? అతనికి కొత్తగా కౌంతేయ హోదా రాలేదు. అజ్ఞానం వల్ల తన మీద రాధేయ హోదాని వేసుకున్నాడు. దీన్ని అధ్యాస అంటారు. జ్ఞానం దీన్ని తొలగించింది. రాధేయత్వ అధ్యాస నివృత్తి చేసింది.

అలాగే వేదాంతం నువ్వు భార్యవి కాదు, తల్లివి కాదు, కర్తా, భోక్తా కాదు, జీవుడు కూడా కాదు, ఇవన్నీ నువ్వు అజ్ఞానం వల్ల వేసుకున్నవి అంటోంది. దానివల్ల జీవత్వ అధ్యాస నివృత్తి జరిగి, బ్రహ్మత్వ స్వరూపం తెలుసుకుంటాము. అంటే నేను బ్రహ్మను అని తెలుసుకోగానే నేను బ్రహ్మను అయిపోతానా? అంత తేలిగ్గా నమ్మలేము. కర్ణుడు కూడా అంత తేలిగ్గా నమ్మలేదు. అందుకే శ్రవణం చేస్తూనే ఉండాలి. శ్రవణం అంటే కేవలం వినటం కాదు. శ్రవణం నిర్వచనం ఇది– మధ్యలో విడిచిపెట్టకుండా, ఒక క్రమపద్ధతిలో, కొన్ని సంవత్సరాలపాటు ఒక తెలివైన గురువు వద్ద అభ్యాసం చేయటం.

ముందు నేనేంటి బ్రహ్మ ఏమిటి అనుకుంటాము. కొన్నాళ్ళు పోయాక నేను కాదు కాని స్వామీజీ అవచ్చేమో అనుకుంటాము. తరువాత వినగావినగా బహుశ బ్రహ్మను ఏమో అనీ, బ్రహ్మను అయ్యే అవకాశం ఉందనీ నెమ్మదిగా నమ్ముతూ వస్తాము. చివరికి ఒక శుభముహూర్తాన అవును నేను బ్రహ్మను–

**అహం బ్రహ్మ అస్మి** అని వినయంగా (గర్వంగా కాదు) అంటాము. అజ్ఞానం వల్ల కాదనుకున్న బ్రహ్మ హోదా జ్ఞానం వల్ల ఒప్పుకుంటాము. అంత నిశ్చయజ్ఞానం కలగాలి అనటానికి 'హ', 'వై' అన్నపదాలను వాడింది ఉపనిషత్తు. **నాస్య అబ్రహ్మవిత్కులే భవతి–** జ్ఞాని ప్రభావం తక్కిన వారిమీద ఉంటుంది. అందువల్ల అతని కులంలో బ్రహ్మ కాని వారు ఉండరు అంటోంది శాస్త్రం. అంటే వద్దనుకున్నా తక్కినవారు అతని ప్రభావంలో పడతారు. జ్ఞాని గృహస్థ అయితే అతని కుటుంబంలో అందరూ బ్రహ్మలవుతారు. బ్రహ్మవిదుడు ఉన్న కుటుంబంలో ఒక వ్యక్తి పుట్టాడంటేనే అతను చాలా పుణ్యం చేసుకున్నట్టు లెఖ్ఖ.

**అథవా యోగినామేవ కులే భవతి ధీమతామ్।  –గీత: 6 – 42**

సన్యాసి అయితే అతని గురుకులంలో అందరూ బ్రహ్మలవుతారు.

**తరతి శోకం–** ఈ జ్ఞానం వల్ల ఏమవుతుంది? దుఃఖం దాటిపోతాడు. అహంకార మమకారాలు ఉండవు. దుర్వార్త వింటే అతను కూడా బాధపడతాడు. కాని ఆ బాధలోనే కూరుకుపోడు. శాస్త్రం ఇచ్చే విలువైన సందేశం– ఏ సంఘటనా దుర్వార్త కాదు. దానిమీద మన అభిమానం దాన్ని దుర్వార్త చేస్తుంది. ఎక్కడైనా భూకంపం గురించి వింటే, ప్రపంచ జనాభాలో కొందరు తగ్గారులే అనుకోవచ్చు. అదే అక్కడ మనకు బాగా కావాల్సిన వారు ఉన్నారంటే ఒకటే బాధపడిపోతాము.

**సన్న్యాస సహిత జ్ఞానాదేవ మోక్షః॥**

సన్న్యాస సహిత అంటే సన్న్యాసి అవమని కాదు అర్థం. అభిమాన త్యాగం చేయమని. అభిమానం వదులుకుంటే ఏమవుతుంది? ఈశ్వరార్పణ భావంతో చేస్తాం. ఈశ్వర ప్రసాదంగా స్వీకరిస్తాం. కర్మఫలం అనుభవించక తప్పదు. ఏదీ మన చేతిలో లేదు. ఇలా ఎప్పుడు స్వీకరించగలము? అహంకారం, మమకారం వదులుకున్నప్పుడు.

**తరతి పాప్మానం–** పాపాలను దాటుతాడు. ఇవన్నీ అనాత్మకు. ఆత్మ అకర్త.

**ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః।**

**అహంకార విమూఢాత్మా కర్తాహ౾మితి మన్యతే॥ – గీత: 3 – 27**

**గుహాగ్రన్థిభ్యో విముక్తః –** అహంకార మమకారంతో హృదయమనే గుహలో వేసుకున్న ముడులు విడివడతాయి. పెళ్ళిలో మూడు ముళ్ళు వేయటంలో అర్థం నేను నీవాడిని అని చెప్పటం. నిజజీవితంలో మనం మన శరీరత్రయంతో మూడు ముళ్ళు వేసుకుని బందీ అయిపోయాము. చిన్మయానంద స్వామి స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలకు– మూడుసార్లు తలాక్ చెప్పమంటారు. ఇంకో విధంగా చూస్తే ఆ మూడు ముళ్ళు అజ్ఞానం, కోరిక, కర్మ. అజ్ఞానం తొలగిపోతే దానివల్ల పుట్టిన తక్కిన రెండూ వాటికవే పోతాయి. జ్ఞానికి గ్రంధులు విడివడతాయని ముండకంలోనే రెండుసార్లు వచ్చింది.

**అమృతోభవతి –** అందువల్ల జ్ఞానికి పునర్జన్మ ఉండదు.

**అవిద్యాగ్రంథిం వికిరితీహ సౌమ్యః – ముండకం 2-1-10**

**భిద్యతే హృదయగ్రన్థిః – ముండకం 2-2-9**

## మంత్రం – 10

**తదేతదృచాభ్యుక్తం–**

**క్రియావన్తః శ్రోత్రియా బ్రహ్మనిష్ఠాః**

**స్వయం జుహ్వత ఏకర్షిం శ్రద్ధయన్తః।**

**తేషామేవైతాం బ్రహ్మవిద్యాం వదేత**

**శిరోవ్రతం విధివద్యైస్తు చీర్ణమ్ ॥**

**ప్రతిపదార్థం:–** తదేతత్ – ఇది; ఋచా – ఋగ్వేదంలో; అభ్యుక్తం – చెప్పబడింది; క్రియావన్తః – కర్మ, ఉపాసనలు చేసినవాడు; శ్రోత్రియాః – ఉపనిషత్తులను విన్నవాడు; బ్రహ్మనిష్ఠాః – సగుణ బ్రహ్మ ఈశ్వరఉపాసన చేసినవాడు; ఏకర్షిం స్వయం జుహ్వత – శాస్త్రాలు చెప్పిన ధర్మాలు చేసినవాడు; శ్రద్ధయన్తః – శ్రద్ధాభక్తులతో చేసినవాడు; శిరోవ్రతం విధివద్యైస్తు చీర్ణమ్ – శిరోవ్రతంవిధివిధానంగా చేసినవాడు; తేషాం ఏతామ్– అలా అన్ని లక్షణాలు ఉన్న అతనికి మాత్రమే; బ్రహ్మవిద్యాం – బ్రహ్మ విద్యను; వదేత్ – చెప్పాలి.

**తాత్పర్యం:–** ఇది ఋగ్వేదంలో చెప్పబడింది. కర్మ, ఉపాసనలు చేసినవాడు, ఉపనిషత్తులను విన్నవాడు; సగుణ బ్రహ్మ ఈశ్వర ఉపాసన చేసినవాడు; శాస్త్రాలు చెప్పిన ధర్మాలు చేసినవాడు, అది కూడా శ్రద్ధాభక్తులతో చేసినవాడు, శిరోవ్రతం విధివిధానంగా చేసినవాడు; ఇలా అన్ని లక్షణాలు ఉన్న అతనికి మాత్రమే బ్రహ్మవిద్యను గురువు బోధించాలి.

**వివరణ:–** అంగిరసుడు జ్ఞానులందరికీ సూచనలిస్తున్నాడు. మోక్షం పొందటానికి జ్ఞానం కలిగితే చాలు. (బోధ చేసినా చేయకపోయినా ఫరవాలేదు) బోధ చేయటానికి కూడా ప్రారబ్ధ కర్మ తోడవుతుంది. అతను చెప్పాలనుకున్నా, వినటానికి శిష్యులు దొరకాలి.

గురువు అవుదామనుకుంటున్న జ్ఞానికి ఈ మంత్రం – శిష్యుడు కర్మయోగం, ఉపాసనాయోగం చేసి ఉండాలి. ఇప్పుడో, అంతకుముందో, ఈశ్వర భక్తి చాలా ముఖ్యం. ఈశ్వర భక్తి లేకుండా జ్ఞానం కలుగదు. అందుకే ఎన్నో స్తోత్రాలున్నాయి. అదే అర్థం ఇక్కడ.

**తదేతదృచా భ్యుక్తం –** ఈ క్రింది సూచన ఋగ్వేదం నుంచి గురువుకి ఇవ్వబడింది. (ముండక అథర్వణ వేదానికి చెందింది) శిష్యుని లక్షణాలు –

1. **క్రియావన్తః** – కర్మయోగం, ఉపాసన యోగం చేసి ఉండాలి. వీళ్ళు కర్మయోగులై మోక్షం కోసం కర్మలు చేసి ఉండాలి.
2. **శ్రోత్రియా** – శ్రుతిని (ఉపనిషత్తులను) క్రమం తప్పకుండా విని ఉండాలి.

3. **బ్రహ్మనిష్ఠాః** – సగుణ బ్రహ్మ ఉపాసన చేసి ఉండాలి. (వేదాంత విద్యార్థులకు ఏదో ఒక జపం ఉండాలి)
4. **ఏకర్షిం స్వయం జుహ్వత** – శాస్త్రం చెప్పిన ధర్మాలు చేసి ఉండాలి. తన వర్ణానికి, తన ఆశ్రమానికి తగ్గ ధర్మాలు. వేదాంతం వల్ల ధర్మాలు మానకూడదు.

**స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః – గీత 3-35**

బ్రహ్మచారి గురుకులంలో చేరి, అధ్యయనం చేయాలంటే ఏకర్షియజ్ఞం చేయాలి. మనకు వర్తించదు అది. మనం పంచమహాయజ్ఞాలు చేయాలి. (దైవయజ్ఞం, ఋషియజ్ఞం, పితృయజ్ఞం, మనుష్యయజ్ఞం, భూతయజ్ఞం)

5. **శ్రద్ధయన్తః** – ఎలా చేయాలి? శ్రద్ధాభక్తులతో అన్ని ధర్మాలూ నిర్వర్తించాలి. క్లాసులకు వెళ్ళటం మానకూడదు. జ్ఞానం ప్రాధమిక సాధన.
6. **శిరోవ్రతం విధివద్యైస్తు చీర్ణమ్** – శిరోవ్రతం ఏకర్షియజ్ఞంలో ఒక భాగం. అది విధివిధానంగా చేయాలి.

శిరోవ్రతం అంటే మండుతున్న అగ్నిని కుండలో పెట్టుకుని, అగ్నిచుట్టూ తిరగాలి. అగ్ని అంటే కాంతి. తనకి జ్ఞానమనే కాంతి కావాలన్న కోరికని వెలిబుచ్చుతున్నట్టు అర్థం.అథర్వణ వేదంలో ఉంది ఈ వ్రతం. ఈ ముండక ఉపనిషత్తు దానికి చెందింది.

**తేషామేవైతాం** – అలా అన్ని లక్షణాలూ ఉండి, ఇష్టం ఉండి వచ్చిన అతనికి చెబితేనే అతని మనసు దాన్ని స్వీకరిస్తుంది. లేకపోతే వెనక్కి వస్తుంది.

**బ్రహ్మవిద్యాం వదేత**– ఈ ఆరు లక్షణాలు ఉన్న శిష్యునికే చెప్పాలి. అంటే సత్త్వగుణ ప్రధానం ఉన్న మనసు ఉండి, జ్ఞానం పొందాలన్న శ్రద్ధ ఉన్నవారికే చెప్పాలి. ఇవి లేనివానికి చెప్పినా అతనికి అర్థం కాదు.

## మంత్రం - 11

**తదేతత్ సత్యమృషిరంగిరాః పురోవాచ నైతదచీర్ణవ్రతోఽధీతే।**
**నమః పరమఋషిభ్యో నమః పరమఋషిభ్యః॥**

**ప్రతిపదార్థం:**– తదేతత్ – ఈ; సత్యమ్– సత్యాన్ని; అంగిరాః – అంగిరసుడు; ఋషిః – ఋషి; పురా –పూర్వం; ఉవాచ– చెప్పాడు; అచీర్ణవ్రతః– వేదాంతం

సరిగ్గా అర్థం కానివాడు; ఏతత్– దీనిని; న అధీతే – అధ్యయనం చేయకూడదు; పరమ ఋషిభ్యః– పరమ ఋషులకు; నమః – నమస్కారాలు.

**తాత్పర్యం:–** ఈ సత్యాన్ని పూర్వం అంగిరసుడనే ఋషి చెప్పాడు. వేదాంతం సరిగ్గా అర్థం కాకపోతే దీనిని అధ్యయనం చేయకూడదు. పరమ ఋషులందరికీ నమస్కారాలు.

**వివరణ:–** ముందు మంత్రంతో గురుశిష్యుల సంవాదం అయిపోయింది. శౌనక ఋషికి అంగిరసుడు బోధ చేశాడు. వీరిని వేదమాత మనకు పరిచయం చేసింది. అందుకని వేదమాతే ఇప్పుడు ముగిస్తోంది.

**తదేతత్ సత్యమృషిరంగిరాః పురోవాచ–** ఈ సత్యాన్ని అంగిరస ఋషి ఎప్పుడో చెప్పాడు. వేదాంత బోధ గురుపరంపరగా వస్తోంది అని దీని అర్థం. మళ్ళీ ఒక సూచన ఇస్తోంది శాస్త్రం.

**అనైతద చీర్ణ వతోఽ ధీతే–** వేదాంతం సరిగ్గా అర్థం కాకపోతే, అధర్మం చేసే ప్రమాదం ఉంది. అకర్తా, అభోక్తాగా అక్రమాలు చేయవచ్చు.అందుకే సంసిద్ధత పొందని వ్యక్తికి ఈ విద్యని గురువు చెప్పకూడదు.పాలు సరియైన గిన్నెలో పోయకపోతే విరిగిపోయినట్టుగా, సాధన చతుష్టయ సంపన్నుడు కాని అనధికారికి చెపితే ప్రమాదం.

**నమః పరమ ఋషిభ్యః–** తర్వాత వేదమాతే ఋషులందరికీ నమస్కారం చేస్తోంది. మొదటి మంత్రాల్లోకి ఒక్కసారి వెళితే –

**ఓం బ్రహ్మా దేవానాం ప్రథమః సంబభూవ**
**విశ్వస్య కర్తా భువనస్య గోప్తా।**
**స బ్రహ్మవిద్యాం సర్వవిద్యాప్రతిష్ఠామ్**
**అథర్వాయ జ్యేష్ఠపుత్రాయ ప్రాహ॥** **1–1–1**
**అథర్వణే యాం ప్రవదేత బ్రహ్మా**
**అథర్వా తాం పురోవాచాంగిరే బ్రహ్మవిద్యామ్।**
**స భారద్వాజాయ సత్యవహాయ ప్రాహ**
**భారద్వాజోంగిరసే పరావరామ్॥** **1–1–2**

**శౌనకో హ వై మహాశాలోంగిరసం విధివదుపసన్నః పప్రచ్ఛ।**

గురుపరంపరని చూస్తే విష్ణుమూర్తి బ్రహ్మకు, బ్రహ్మ అథర్వణ ఋషికి, అథర్వణ ఋషి అంగిరునికి, అంగిరుడు భారద్వాజునికి, భారద్వాజుడు అంగిరసునికి, అంగిరసుడు శౌనకునికి చెప్పాడు.

**కస్మిన్ను భగవో విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతీతి॥ 1-1-3**

శౌనకుడు ఏ ఒక్క విషయం తెలుసుకుంటే అన్ని విషయాలు తెలిసినట్టు అవుతుందో ఆ విద్యను బోధించమని అడిగాడు. దానికి అంగిరసుని జవాబే ఈ ఉపనిషత్.

వేదమాద ఈ ఋషులందరికీ నమస్కారం చేస్తోంది. ఈ ఆచార్యులు వేదానికి నమస్కారం చేస్తారు. ఇక్కడ ఆచార్యులకు వేదమాత నమస్కారం చేస్తోంది. **నమః పరమ ఋషిభ్యో నమః పరమ ఋషిభ్యః** అని రెండు సార్లు చెప్పటంలోని అర్థం ఇక్కడితో ముండక ఉపనిషత్తు ముగిసింది అని.

శాంతి పాఠం మళ్ళీ పఠించాలి.

**ఓం భద్రం కర్ణేభిఃశృణుయామ దేవాః భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః।**
**స్థిరైరంగైస్తుష్టువాగ్ం సస్తనూభిర్వ్యశేమ దేవహితం యదాయుః।**
**స్వస్తి న ఇన్ద్రో వృద్ధశ్రవాః। స్వస్తి నః పూషా విశ్వవేదాః।**
**స్వస్తి నస్తార్క్ష్యో అరిష్టనేమిః। స్వస్తి నో బృహస్పతిర్దధాతు॥**
**ఓం శాంతిః శాంతిః శాంతిః॥**

అంతకుముందు విఘ్నాలు తొలగించమని ప్రార్థిస్తే, ఇప్పుడు విఘ్నాలు తొలగి, నిర్విఘ్నంగా ముండకోపనిషత్తుని పూర్తిచేసినందుకు కృతజ్ఞతలు తెలుపుకుంటూ పఠిస్తున్నాము.